

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 27

శనివారం 19-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

LAUNCHING
CASAGRAND EVON

3&4 BHK అపార్ట్‌మెంట్స్ కొంపల్లి వద్ద

సుచిత్రా జంక్షన్ నుంచి 5 నిమిషాలు | బోయిన్‌పల్లి నుంచి 15 నిమిషాలు

₹1.6Cr* Onwards

INCREDIBLY PRICED - PHASE 1				
Type	Size (Sft.)	Total units (Phase-1)	Sold Units	Launch Price (For the next 30 bookings)
3 BHK	2013 - 2080	346	95	₹1.6Cr - ₹1.7Cr
4 BHK	2850	20	10	₹2.3Cr

Total Units: **579** | Phase 1 Units: **366** | Available Units: **261** | Handover in 36 months









జీవిత వైభవం ఎందుకు?

విలాసవంతమైన మరియు ప్రణాళికతో రూపొందిన కమ్యూనిటి:

- 6.8 ఎకరాలలో విస్తరించిన 579 సిగ్నేచర్ 3&4 BHK గృహాలు (2B+G+11)తో కూడిన అత్యంత అగ్రశ్రేణి నివాస సముదాయం.
- 2 ఎకరాల చక్కని పచ్చదనం మరియు జపనీస్ థీమ్డ్ లాండ్ స్కేప్స్‌తో 4.7 ఎకరాల ఖాళీ స్థలం.
- ఆధునిక సౌందర్యం ఉట్టిపడేలా సమకాలీన గ్లాస్ ఫసాడ్ ఎలివేషన్.
- పిల్లలు మరియు పెద్దల సంరక్షణ కోసం వెహికల్ ఫ్రీ జోన్‌తో బేస్‌మెంట్ పార్కింగ్.
- వెలుగు, గాలి ప్రసరణ, ప్రైవసీ, అందమైన ప్రకృతి మరియు వాస్తుకు అనుగుణంగా సమర్థమైన మాస్టర్ ప్లాన్.

అచ్చెరువొందించే ప్రకృతి రమణీయతతో విశాలమైన గృహాలు:

- ఏ అడ్డంకి లేకుండా 2 వైపులా ప్రకృతి రమణీయతను చూసేందుకు, ఎక్కువ సహజ గాలి ప్రసరణ కోసం, ప్రత్యేక ప్రణాళికతో రూపొందించిన విభిన్న గృహాలు.
- గరిష్ట వాడకం మరియు జీరో స్పేస్ వేస్టేజితో రూపొందించిన వాస్తు అనుకూల గృహాలు.
- ఏ అడ్డంకి లేకుండా ఇంటిబైట చూసేందుకు రూపొందించిన అపార్ట్‌మెంట్లు.
- కన్వర్టబుల్ బాల్కనీతో విశాలమైన పడక గదులు (12 అడుగులు) 3 రెట్లు ఎక్కువ గాలి ప్రసరణ మరియు అత్యుత్తమ బాహ్య దర్శన.
- ప్రతి చదరపు అడుగు నిర్మాణం కూడా పరిపూర్ణంగా ఉండేలా దోహదం చేసే 2023 బహుళ స్థాయి తనిఖీలతో అత్యుత్తమ నాణ్యత గల సామాగ్రి, శ్రేష్టమైన పనితనం, కఠిన నాణ్యతా నియంత్రణ విధానాలు.

ప్రపంచ స్థాయి సౌకర్యాలు:

- 100+ ప్రపంచ స్థాయి సౌకర్యాలు - మార్కెట్లోనే అత్యధికం.
- విలాసవంతమైన ఇంటీరియర్ విశిష్టతలు మరియు ఇండోర్ సదుపాయాలతో 35,000 చ.అడుగుల క్లబ్ హౌస్.
- రూఫ్ టాప్ స్విమ్మింగ్ పూల్, స్పా, ఆంఫిథియేటర్, స్క్వాష్ కోర్ట్, స్కై సినిమా.
- కార్ వాష్ మరియు ఛార్జింగ్ పాయింట్, ఎయిర్ ఫిల్లింగ్ స్టేషన్, మల్టిపర్పస్ కోర్ట్ వంటి ఉపయోగపడే సదుపాయాలతో, అంబరాన్నంటే సౌకర్యం.
- థీమ్డ్ గార్డెన్స్, లిల్లి మరియు లోటస్ పాండ్స్, ఆక్సిజన్ ఇన్‌ఫ్యూజ్డ్ జిమ్, ధ్యాన మందిరం, ఇంకా మరెన్నో ఆరోగ్యవంతమైన జీవన విధానానికి తోడ్పడే వెల్‌నెస్ సౌకర్యాల శ్రేణి.

అత్యుత్తమ లక్షణాలు మరియు ఆధునిక సదుపాయాలు

- డిజిటల్ డోర్ లాక్‌తో 8 అడుగుల భారీ మెయిన్ డోర్.
- పెద్ద విట్రిఫైడ్ ఫ్లోరింగ్ (6' x 4').
- పైప్డ్ గ్యాస్, మస్కిటో మెష్‌తో స్లైడింగ్ డోర్స్, ప్రీమియం ఎలక్ట్రికల్ ఫిక్చర్స్.
- అత్యున్నత స్థాయి CP & శానిటరీ ఫిటింగ్స్.

Know more about Casagrand

Scan to experience the opulent lifestyle



WHY CASAGRAND

20 years of real estate excellence	**160+** landmark projects	**55,000+** happy families	**2023** rigorous quality checks	**87%** on-time delivery	**7 cities** Chennai, Bengaluru, Hyderabad, Coimbatore, Pune, Delhi & Dubai
2 months of rental assurance	**6 months** of resale support	**8 Year** warranty & 10 year community maintenance	**75%** open area for 2x more light & ventilation	**0%** space wastage for carpet area efficiency	**23** global brands used in fittings and finishing materials

TS RERA: P02200009350 | www.rera.telangana.gov.in | *T & C Apply.

CREDAI

FOR BOOKING CALL: **90475 40000** | Exclusive site visit available. Visit model house at site.

CASAGRAND building aspirations



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 27

శనివారం 19-4-2025



చాలెంజర్స్‌పై పంజా
పంజాబ్‌కింగ్స్ జయభేరి.. సొంతగడ్డపై కుదేలైన బెంగళూరు -17లో



క్రాష్ టు జోష్!
పరిస్థితులు సద్దుమణిగితే మళ్లీ ర్యాలీ ఖాయమంటున్న నిపుణులు -17లో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మస్క్‌కు ప్రధాని మోదీ ఫోన్
ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. వీరు పలు కీలక అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం.
వివరాలు 6లో ▸



విద్యార్థుల వీసాలపై పిడుగు
ట్రంప్ ప్రభుత్వం నెల రోజుల వ్యవధిలోనే ఏకంగా 1,024 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసింది.
వివరాలు 6లో ▸



భారత్‌కు షింకన్సెన్ రైళ్లు
హైస్పీడ్ రైలు ప్రాజెక్టు ఊపందుకుంటోంది. ట్రయల్ రన్ నిమిత్తం 2 ఐకానిక్ షింకన్సెన్ రైళ్లను భారత్‌కు జపాన్ కానుకగా ఇవ్వనుంది.
వివరాలు 6లో ▸



విశ్వమూ భ్రమిస్తోంది
విశ్వం కూడా తనచుట్టూ తాను తిరుగుతుందని ఓ పరిశోధన పేర్కొంది. ఒక భ్రమణానికి 50 వేల కోట్ల ఏళ్లు పడుతుందని తేల్చింది!
వివరాలు 6లో ▸



భగవద్గీత, నాట్యశాస్త్రానికి యునెస్కో గుర్తింపు

- ఈ రెండింటికీ మెమరీ ఆఫ్ ద వరల్డ్ రిజిస్టర్‌లో చోటు 6లో

జేఈఈ మెయిన్‌లో తెలుగు తేజాలు..

- 100 పర్సంటైల్ సాధించిన టాప్-24లో నలుగురు మనోళ్లే... 2లో

పెట్టుబడులు రూ. 11,062 కోట్లు

హైదరాబాద్‌లో రూ. 10,500 కోట్లతో 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్

సంయుక్తంగా ఏర్పాటుకు ముందుకొచ్చిన దిగ్గజ సంస్థ ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్

టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రభుత్వంతో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం

రుద్రారంలో తోషిబా అనుబంధ సంస్థ టీటీడీఐ ట్రాన్స్‌ఫార్మర్ల పరిశ్రమ విస్తరణ బాట

రూ. 562 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం.. ప్రభుత్వంతో ఎంఓయూ



శుక్రవారం టోక్యోలో ఎన్‌టీటీ డేటా సంస్థ ప్రతినిధులతో కలసి ఒప్పందపత్రాలను చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: జపాన్ పర్యటనలో తెలంగాణ బృందం శుక్రవారం రూ. 11,062 కోట్ల భారీ పెట్టుబడులు సాధించింది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థ ఎన్‌టీటీ డేటాతోపాటు ఏఐ-ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో రూ. 10,500 కోట్లతో 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. శుక్రవారం టోక్యోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, ఆయా సంస్థల ప్రతినిధుల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బాజ్‌పాయ్, నెయిసా సీఈవో, ఎన్‌టీటీ గ్లోబల్ డేటా చైర్మన్ శరద్ సంఘీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టోక్యో హెడ్‌క్వార్టర్స్‌గా కార్యకలాపాలు సాగిస్తున్న ఎన్‌టీటీ డేటా.. 50కిపైగా దేశాల్లో 1,93,000 మంది ఉద్యోగులతో
మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్ర పారిశ్రామిక విధానాలతోనే భారీ పెట్టుబడులు

తెలంగాణ భారీ పెట్టుబడులను సాధించడంపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. ఏడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని వ్యాఖ్యానించారు.

డయాగ్నొస్టిక్స్ డల్!

పేదలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడని ప్రభుత్వ వైద్య పరీక్షల కేంద్రాలు

- సిబ్బంది కొరతతో చాలా కేంద్రాల్లో నిరుపయోగంగా పరికరాలు
- మరికొన్ని హబ్‌లలో అందుబాటులో లేని రీ ఏజెంట్లు
- 134 పరీక్షలకుగాను 30–40 టెస్ట్‌లకే పరిమితమవుతున్న వైనం
- పరీక్షల ఫలితాల కోసం రోగులు 2 రోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి
- పేదలు అనివార్యంగా ప్రైవేటు డయాగ్నొస్టిక్ కేంద్రాలను ఆశ్రయించాల్సిన దుస్థితి



ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌లో నిరుపయోగంగా ఇమ్యునో ఎనలైజర్ మిషన్

సాక్షి, హైదరాబాద్: పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలను అందించేందుకు 2018లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'తెలంగాణ డయాగ్నొస్టిక్స్' ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. రూ. కోట్లు వెచ్చించి అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది లేకపోవడంతో చాలా కేంద్రాల్లో పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. మరికొన్ని చోట్ల వైద్య పరీక్షలకు అవసరమైన రసాయనాల కొరత కూడా నెలకొంది. దీంతో చాలా
మిగతా 14వ పేజీలో ▶

ఎంఎంటీఎస్‌లో అత్యాచారయత్నం అబద్ధం

అబద్ధం చెప్పి తప్పుదోవ పట్టించిన యువతి

రైల్లో రీల్స్ చేస్తూ కాలుజారి పడినట్లు పోలీసులకు వెల్లడి

ఇంట్లో తిడతారనే భయంతో నాటకం ఆడినట్లు ఒప్పుకోలు 7లో

క్లుప్తంగా...

నాక్‌లో డిజైన్ ఫీల్డ్‌లో కొత్త కోర్సులు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)లో డిజైన్ ఫీల్డ్‌లో కొత్తగా కోర్సులను ఇంటర్న్‌షిప్‌తో ప్రవేశపెడుతున్నట్లు నాక్ డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటీరియర్ డిజైనర్ కోర్సుల్లో 3 నెలల సర్టిఫికేషన్, 6 నెలల ఇంటర్న్‌షిప్‌తో, ల్యాండ్‌స్కేప్ డిజైనింగ్‌లో 45 రోజుల సర్టిఫికేషన్‌తో ప్లేస్‌మెంట్‌లతో కొత్త కోర్సులు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఏదైనా డిప్లొమా / గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యా ర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కోర్సు ఫీజు రూ.30 వేలు, కోర్సు కాలపరిమితి మూడు నెలలని తెలిపారు. పరిమిత సీట్లు ఉంటాయని, ప్రవేశం, ఇతర వివరాలకు 9063208703 ఫోన్‌నంబర్‌లో లేదా www.nac.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గ్రూప్ నియామకాలపై న్యాయ విచారణ జరపాలి

బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 నియామకాలను నిలిపివేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి, టీజీపీఎస్సీకి చెంపపెట్టని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. నియామకాల్లో అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కోర్టులో కేసులు వేస్తున్న అభ్యర్థులను కోర్టు ముందే బెదిరి స్తున్నారని విమర్శించారు. 6.5 శాతం పక్క, పక్క గదుల నంబర్ల అభ్యర్థులకు సమానంగా మార్కులు వచ్చాయన్నారు. ఒక మహిళా అభ్యర్థికి 480 మార్కులు వస్తే.. రీ కౌంటింగ్‌లో 420 మార్కులు వేశారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరుగా హాల్ టికెట్ నంబర్లు ఇచ్చారని రాకేశ్‌రెడ్డి విమర్శించారు.

బడుల పరిశుభ్రతకు నిధులివ్వండి

ప్రధానోపాధ్యాయుల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: పాఠశాలల పరిశుభ్రత నిర్వహణ కోసం తక్షణమే నిధులు విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రేకులపల్లి రాజ గంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా నిర్వహణ చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అవసరమైన వర్కర్లను నియమించుకునే అధికారం ఇచ్చిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఖాతాల్లో పది నెలల కాలానికి ఈ డబ్బు జమ చేయాల్సి ఉంది. కానీ చాలా జిల్లాల్లో ఈ డబ్బు జమ కాలేదని, ఇప్పటికే వర్కర్లను నియమించుకోవడం వల్ల వేతనాలు అందించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. తక్షణమే నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇదండీ సంగతి



అయ్యో! ఆగండయ్యా! అది అప్పుడు ఇప్పుడు మనం వాళ్ల కూటమిలో ఉన్నాం!

గుర్తింపే ఇవ్వలేదు.. చేరికలపై గురి

అడ్మిషన్లు మొదలుపెట్టిన ప్రైవేట్ జూనియర్ కాలేజీలు

- ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాలు బేఖాతరు
- అనుబంధ గుర్తింపు ఇచ్చే వరకు విద్యార్థులను చేర్చుకోవద్దన్న బోర్డు
- కానీ అన్ని జిల్లాల్లో జోరుగా అడ్మిషన్ల ప్రక్రియ
- అఫ్లియేషన్ కోసం దరఖాస్తు చేసుకోకుండానే విద్యార్థుల కోసం గాలం
- కాలేజీల ముందు బోర్డులు పెట్టి మరీ చేర్చుకుంటున్నా పట్టించుకోని అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. అనుబంధ గుర్తింపు ఇచ్చేంత వరకూ కొత్తగా అడ్మిషన్లు చేపట్టవద్దని ఇంటర్మీడియెట్ బోర్డు స్పష్టం చేసింది. ఆదేశాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇలాంటి కార్యకలాపాలపై నిఘా పెట్టాలని జిల్లా అధికారులను ఆదేశించింది. అవసరమైతే పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టాలని సూచించింది. కానీ రాష్ట్రంలోని దాదాపుగా అన్ని జూనియర్ కాలేజీలూ బోర్డు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. ఎప్పుడో జూన్‌లో మొదలయ్యే తరగతుల కోసం అన్ని జిల్లాల్లోనూ పోటాపోటీగా విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకర్షించేందుకు యాజమాన్యాలు ప్రత్యేకంగా ఏజెంట్లను, పూర్వ విద్యార్థులు, కాలేజీ సిబ్బందిని రంగంలోకి దింపాయి. వారికి టార్గెట్లు పెడుతున్నాయి. తాయిలాల ఎర వేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా జిల్లాల్లో అధికారులు ప్రవేశాలను అడ్డుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కళ్లెదుటే కాలేజీలు బోర్డులు పెట్టి మరీ విద్యార్థులను చేర్చుకుంటున్నా, పట్టించుకోవడం లేదని అంటున్నారు. అయితే ఇలాంటివి ఇంతవరకు తమ దృష్టికి రాలేదని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

అనుమతికి అవకాశం లేకున్నా అడ్మిషన్లు!

వాస్తవానికి జూనియర్ కాలేజీల అనుబంధ గుర్తింపు జారీ చేసేందుకు బోర్డు ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నెల 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంటామని తెలిపింది. అయితే ఇంతవరకూ ఏ కాలేజీ దరఖాస్తు చేయలేదు. మే 5 వరకూ గడువు ఉండటమే ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో 1,200కు పైగా ప్రైవేటు జూనియర్ కాలేజీలున్నాయి. వీటిల్లో 350 కాలేజీలు గృహ, వాణిజ్య సముదాయాల్లో నడుస్తున్నాయి. ఈ కాలేజీలపై రెండేళ్ళ క్రితమే అగ్నిమాపక శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. వీటికి అనుమతి ఇవ్వలేమని పేర్కొంది. ఈ కాలేజీల్లో దాదాపు 80 వేల మంది చదువుతున్నారు. వీటిల్లో ఏ ఒక్కటీ ఇప్పటివరకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోలేదు. కానీ విద్యార్థుల నుంచి యథావిధిగా అడ్మిషన్లు మొదలు పెట్టాయి. నిబంధనలన్నీ కాగితాల్లోనే ఉంటాయని, తమకు అనుమతి వచ్చి తీరుతుందని ఆ కాలేజీలు నమ్మబలుకుతున్నాయి. వాస్తవానికి ఎప్పటికప్పుడు కాలేజీల్లో చేరిన విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటుందని చెబుతూ బోర్డును వేడుకుంటున్నాయి. మరోవైపు రాజకీయంగానూ ఒత్తిడి తెస్తున్నాయి. ఇప్పుడు కూడా అదే బాటను నమ్ముకుని అడ్మిషన్లు చేపడుతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.



భారీగా పెరిగిన ఫీజులు

మరోవైపు ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఈసారి భారీ యెత్తున ఫీజులు డిమాండ్ చేస్తున్నాయి. జేఈఈ, రాష్ట్ర ఇంజనీరింగ్ సెట్‌కు కలిపి కోచింగ్ ఇస్తామంటున్నాయి. వేసవి ముగిసే నాటికే సిలబస్ పూర్తి చేస్తామని, మిగిలిన రోజులంతా కోచింగ్‌పై దృష్టి పెడతామని చెబుతున్నాయి. ఇందుకోసం గత ఏడాది రూ.70 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఫీజు వసూలు చేశాయి. ఈసారి ఇది రూ.లక్ష నుంచి రూ.4.20 లక్షలకు పెంచేశాయి. ఈ క్రమంలో కార్పొరేట్ కాలేజీలు రకరకాల ఆశలు కల్పిస్తున్నాయి. కొన్నేళ్ళుగా జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలతో ప్రచారం చేసుకుంటున్నాయి. ఏజెంట్లు, సిబ్బంది కూడా దీన్నే ఆయుధంగా వాడుకుంటున్నారు. ముందే అడ్మిషన్ తీసుకుంటే 15 శాతం వరకు రాయితీ ఉంటుందని చెబుతున్నారు. ఒకసారి టెన్త్ పరీక్ష ఫలితాలు వెల్లడైతే ఎలాంటి రాయితీ ఉండదంటూ ఒత్తిడి పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ పిల్లల్ని చేర్చే క్రమంలో వాకబు చేయడానికి వచ్చే తల్లిదండ్రులను గంటల కొద్దీ కౌన్సెలింగ్ చేసి సీట్లు అంటగడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఇంటర్ బోర్డు అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పెట్టుబడులు రూ.11,062 కోట్లు



తోషిబా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



సుమిదా రివర్ ఫ్రంట్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జయేశ్‌రంజన్ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రపంచంలోని టాప్–3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఒకటిగా ఉంది.

దేశంలోనే అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం

హైదరాబాద్‌లో నిర్మించబోయే 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్ 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూర్చనుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దేశంలో తెలంగాణను ఏఐ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుందని పేర్కొంది. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్ (ఈఎస్‌జీ) ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు సీఎంవో వర్గాలు తెలిపాయి. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందించనుందని.. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదపడుతుందని వివరించాయి.

మూడో పరిశ్రమకు తోషిబా అనుబంధ సంస్థ ఓకే..

హైదరాబాద్ శివార్లలోని రుద్రారంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పరిశ్రమను విస్తరించేందుకు తోషిబా అనుబంధ సంస్థ ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా (టీటీడీఐ) ముందుకొచ్చింది. రూ. 562 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు సీఎం సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకుంది. రుద్రారంలో సర్జ్ అరెస్టర్స్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్ గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించనున్నట్లు టీటీడీఐ సీఎండీ హిరోషి పురుటా సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. ఇప్పటికే రెండు పరిశ్రమలకు తోడుగా అదనంగా ఇది మూడో పరిశ్రమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీటీడీఐ సీఎండీ హిరోషి పురుటా పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడి పెట్టండి..

తెలంగాణ కొత్త రాష్ట్రమైనా వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని.. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మరింత ఎదగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన టోక్యోలో జరిగిన 'ఇండియా–జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్ షో'లో 150 మంది పారిశ్రామికవేత్తలతో మాట్లాడారు. 'టోక్యో గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణగల వారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నా'అని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులైన నిపుణులు, స్థిరమైన విధానాలను తమ ప్రజాప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు మాటిచ్చారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు, టెక్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న సానుకూలతలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పారిశ్రామికవేత్తలకు వివరించారు. సమావేశంలో భారత రాయబారి సిబి జార్జ్, జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఆ తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైంది.

సుమిదా రివర్‌ఫ్రంట్ పరిశీలన..: మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాల పరిశీలనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి బృందం టోక్యోలో ఆధునీకరించిన సుమిదా రివర్‌ఫ్రంట్‌ను తిలకించింది. బోటులో కలియతిరుగుతూ అక్కడి ల్యాండ్‌స్కేపింగ్‌ను పరిశీలించింది. అందుకు సంబంధించిన వివరాలను జపాన్ అధికారులను సీఎం రేవంత్ అడిగి తెలుసుకున్నారు.

మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టుపై టీ–సాట్‌లో ప్రత్యేక పాఠాలు

టీ–శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (జీ–మ్యాట్)పై టీ–సాట్‌లో ప్రత్యేక పాఠాలు ప్రచారం చేయనున్నామని టీ–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శనివారం నుంచి వచ్చే నెల 18 వరకు ప్రతి రోజు ఉదయం అరగంటపాటు ప్రసారం ఉంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వాంటిటేటివ్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, డేటా ఇన్‌సైట్స్ సిలబస్‌ను ఉద్దేశించి ఆల్‌జీబ్రా, అర్థమెటిక్, రీడింగ్ కాంప్రహెన్షన్–క్రిటికల్ రీజనింగ్, డేటా సఫిషియెన్సీ, మల్టీసోర్స్ రీజనింగ్ అంశాల ఆధారంగా ప్రశ్నావళి సిద్ధం చేసి ప్రసారం చేస్తామని చెప్పారు. బిజినెస్ స్కూళ్లలో విద్యనభ్యసించి యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, ఇటలీ వంటి దేశాల్లో ఉద్యోగం పొందాలనుకునే వారు ఈ ప్రసారాలను వినియోగించుకోవాలన్నారు. 'వరల్డ్ ఎర్త్ డే'పై ఈనెల 22 ఉదయం 11 గంటల నుంచి స్పెషల్ లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నామని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్, సామాజిక వేత్తలు ప్రత్యేక ప్రసార కార్యక్రమంలో పాల్గొని ఎర్త్ డే ప్రాధాన్యాన్ని వివరిస్తారని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఎస్జీటీ పదోన్నతులు విధాన నిర్ణయం

జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం ప్రభుత్వ విధాన నిర్ణయమని, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. పదోన్నతులు కల్పించడం ద్వారా చేపట్టే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియలో జోక్యం చేసుకోమని స్పష్టం చేసింది. ఎస్జీటీలకు పదోన్నతులతో.. ఎంత నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలనేది ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయమని పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో 1999 నాటి జీవో 108ని అమలు చేయాలనే నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. కిరణ్‌కుమార్ సహా 20 మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ పి.శ్యాంకోశీ, జస్టిస్ ఎన్.నర్సింగ్‌రావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్లు తమ అభ్యర్థనను వినతిపత్రం ద్వారా ప్రభుత్వానికి తెలుపుకోవచ్చునని సూచించింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో పదోన్నతుల ద్వారా ఎస్జీటీలకు 20 శాతం, ప్రత్యక్ష నియామకాల ద్వారా 80 శాతం ఉండాలన్నది పిటిషనర్ల వాదన. దీనిపై హైకోర్టు స్పందిస్తూ.. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా 33.33 శాతం, ఎస్జీటీలకు పదోన్నతులు, బదిలీల ద్వారా 66.66 శాతం భర్తీ చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయం కాబట్టి.. జోక్యం చేసుకోబోమని వెల్లడించింది.

నేటి నుంచి ఈఏపీ సెట్ హాల్‌టికెట్లు

అగ్రి, ఫార్మా హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

- 22 నుంచి ఇంజనీరింగ్ సెట్ హాల్ టికెట్లు
- ఈనెల 29 నుంచి మే 4 వరకు ఆన్‌లైన్ పరీక్ష
- కీపై అభ్యంతరం లేవనెత్తాలంటే ఒక్కో ప్రశ్నకు రూ.500
- సెట్ కన్వీనర్, కో కన్వీనర్ దీన్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీ సెట్)కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దీన్‌కుమార్, కో–కన్వీనర్ డాక్టర్ కె విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అగ్రి, ఫార్మా సెట్ హాల్ టికెట్లను శనివారం (19వ తేదీ) నుంచి, ఇంజనీరింగ్ సెట్ హాల్ టికెట్లను ఈ నెల 22 నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ఈ నెల 29 నుంచి మే 4వ తేదీ వరకు ఈఏపీ సెట్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షల ఏర్పాట్లను జేఎన్‌టీయూహెచ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో దీన్‌కుమార్ వివరించారు.

ఒక్క నిమిషం నిబంధన అమలు

హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దీని ద్వారా పరీక్ష కేంద్రాన్ని తేలికగా తెలుసుకోవచ్చని దీన్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి తెలిపారు. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. మొత్తం 16 జోన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) జరుగుతుందని, ఇందులో నాలుగు జోన్లు హైదరాబాద్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. అగ్రి, ఫార్మాకు 112, ఇంజనీరింగ్‌కు 124 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రం లోపలికి 90 నిమిషాల ముందే అనుమతిస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 2,19,420.. అగ్రి, ఫార్మాకు 86,101, రెండు విభాగాలకు కలిపి 253 దరఖాస్తులు వచ్చాయని విజయకుమార్ రెడ్డి వెల్లడించారు. మీడియా సమావేశంలో జెఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి కిషన్‌కుమార్‌రెడ్డి, ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీటిని మరిచిపోవద్దు

- పరీక్ష కేంద్రం లొకేషన్‌ను హాల్ టికెట్‌పై ముద్రించిన క్యూఆర్ కోడ్ ద్వారా ముందే గుర్తించవచ్చు. ఉదయం సెషన్‌కు 7.30 గంటలకు, సాయంత్రం సెషన్‌కు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. బయోమెట్రిక్ హాజరు తీసుకుంటారు కాబట్టి విద్యార్థులు చేతులకు మెహందీ, టాటూలు, ఇంకు వేసుకోకూడదు.
- పరీక్ష కేంద్రంలోకి బాల్ పాయింట్ పెన్, పెన్సిల్, హాల్ టిక్కెట్, ఐడీ ప్రూఫ్ మాత్రమే అనుమతిస్తారు. క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్, రిస్ట్‌వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. ద్విభాషలో ఉండే ప్రశ్నలు ట్రాన్స్‌లేషన్‌లో తేడా వస్తే, ఇంగ్లిష్‌లోని ప్రశ్ననే ప్రామాణికంగా తీసుకుంటారు.
- పరీక్ష తర్వాత విడుదల చేసే ప్రాథమిక కీపై అభ్యంతరాలు లేవనెత్తాలంటే ప్రతి ప్రశ్నకు రూ.500 చెల్లించాలి. ఆ ప్రశ్నలో తప్పులుంటే ఈ మొత్తాన్ని ఏడు రోజుల్లో తిరిగి ఇచ్చేస్తారు. లేని పక్షంలో ఆ డబ్బు తిరిగి రాదు. నిరాధార అభ్యంతరాలను అదుపు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

సెట్ పరీక్ష తేదీలు, సమయం ఇలా..

(పరీక్ష రెండు సెషన్లుగా జరుగుతుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు)

పరీక్ష	పరీక్ష తేదీలు	హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్
అగ్రి, ఫార్మా	ఏప్రిల్ 29 - 30	19-4-25 (సాయంత్రం 3 నుంచి)
ఇంజనీరింగ్	మే 2 - 4	22-4-25 (సాయంత్రం 3 నుంచి)

పరీక్ష జోన్లు - పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య
సాక్షి ప్లస్ ఈ–పేపర్‌లో..

జేఈఈ మెయిన్‌లో తెలుగు తేజాలు

100 పర్సంటైల్ సాధించిన టాప్ 24లో నలుగురు మనోళ్లే

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్)లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 24 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా వారిలో నలుగురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. తెలంగాణకు చెందిన హర్ష్ ఎ. గుప్తా, వంగల అజయ్‌రెడ్డి, బనిబ్రత మజీతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి మనోజ్ఞ గుత్తికొండ 100 పర్సంటైల్ సాధించారు. అలాగే టాప్–100 ర్యాంకుల్లో 15 మంది తెలుగు విద్యార్థులు ఉన్నారు. 99 పర్సంటైల్‌లో వంద మందికిపైగా చోటు సాధించారు. జేఈఈ మెయిన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం అర్ధరాత్రి విడుదల చేసింది. రాజస్తాన్‌కు చెందిన ఎండీ అనాస్, ఆయుష్ సింగల్ తొలి రెండు ర్యాంకులు సాధించారు. జేఈఈ మొదటి విడత పరీక్ష జనవరిలో జరిగింది. రెండో సెషన్‌ను ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో నిర్వహించారు. దేశవ్యాప్తంగా 10,61,849 మంది ఈ పరీక్షకు రిజిస్టర్ చేసుకున్నారు. వారిలో 9,92,350 మంది పరీక్ష రాశారు. తెలుగు రాష్ట్రాల నుంచి 2 లక్షల మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. జేఈఈ మొదటి, రెండో విడత పరీక్ష ఫలితాలను ఆధారంగా చేసుకొని ర్యాంకులు ప్రకటించారు. వాటి ల్లో 2.50 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేశారు. ఈ పరీక్షకు ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 2న పరీక్ష ఉంటుంది.

అడ్వాన్స్‌డ్‌కు కేటగిరీలవారీగా కటాఫ్ ఇలా...

కేటగిరీ	పర్సంటైల్	అభ్యర్థులు మొత్తం
ఓపెన్	100-93.102	97,321
పీడబ్ల్యూబీడీ	93-0.007	3,950
ఈడబ్ల్యూఎస్	93.09-80	25,009
ఓబీసీ	93.09-79	67,614
ఎస్సీ	93.09-61.15	37,519
ఎస్టీ	93.09-47.90	18,823

గ్రూప్–1 పరీక్ష రద్దు చేసి తిరిగి నిర్వహించాలి


ఫలితాల వెల్లడిపై అభ్యర్థుల్లో అనేక సందేహాలు ఉన్నాయి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. గ్రూప్–1 పరీక్ష నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది నిరుద్యోగుల జీవితాలు అగాధంలో పడిపోయాయని ఆమె ఆరోపించారు. పరీక్ష నిర్వహించిన తీరు, ఫలితాల వెల్లడిలో అనేక లోపాలు, అవకతవకలు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. 'తెలంగాణ యువతకు, ముఖ్యంగా నిరుద్యోగులకు అనేక ఆశలు చూపి, అధికారంలోకి వచ్చిన మీరు వారి జీవితాలతో చెలగాటమాడుతున్న తీరు ఆక్షేపణీయం. గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షలకు ఒక హాల్ టికెట్ జారీ చేసిన టీజీపీఎస్సీ అధికారులు, మెయిన్స్ పరీక్షకు వేరే హాల్ టికెట్ జారీ చేశారు. కొత్తగా జారీ చేసిన హాల్ టికెట్లతో మెయిన్స్ నిర్వహించడంపై మొదటి నుంచే అనేక సందేహాలు నెలకొన్నాయి. వాటిని నివృత్తి చేయకుండానే మెయిన్స్ పరీక్షల తంతు ముగించారు. బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేసినా కూడా అభ్యర్థుల హాజరు విషయంలో ఎందుకు వ్యత్యాసాలు ఏర్పడ్డాయి ? కొందరు అభ్యర్థులు నిజంగానే మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారా? లేదంటే తర్వాత వారిని మధ్యలో చేర్చారా అనే సందేహం మిగతా అభ్యర్థుల్లో నెలకొన్నది. జవాబు పత్రాల మూల్యాంకనంపైనా అనేక సందేహాలు లేవనెత్తుతున్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించడంపైనా అభ్యర్థుల్లో అనుమానాలున్నాయి. కేవలం రెండు పరీక్ష కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలకు హాజరైన రెండు కోచింగ్ సెంటర్లకు చెందిన 71 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించడం వెనుక ఏదో జరిగి ఉంటుందని అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ రెండు పరీక్ష కేంద్రాల్లో 71 మంది ఉద్యోగాలకు ఎంపికైన విషయం నిజమేనని టీజీపీఎస్సీ కూడా అంగీకరించింది. అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళన ధర్మబద్ధమని హైకోర్టు కూడా గుర్తించి నియామకాల ప్రక్రియకు బ్రేకులు వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్ –1 నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేసి, తిరిగి నోటిఫికేషన్ ఇచ్చి ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం సహృదయంతో అర్థం చేసుకోవాలని కోరుతున్నాను'అని కవిత తన లేఖలో పేర్కొన్నారు.

గ్రూప్–1 పరీక్షలపై కవిత లేఖ రాయడం హాస్యాస్పదం: బల్మూరి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తుంటే బీఆర్‌ఎస్ నేతలకు కడుపు మంటగా ఉందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌రావు వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో వెంకట్ విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షల గురించి సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసలు ఏ మాత్రం అవగాహన లేకుండా ఆమె మాట్లాడుతున్నారని, పరీక్షా కేంద్రాలను టీజీపీఎస్సీ ఏర్పాటు చేయదని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా, విద్యార్థుల సంఖ్యను బట్టి జిల్లాల కలెక్టర్లు ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటారన్న విషయం తెలియకపోవడం ఆమె అవగాహనలేమికి నిదర్శనమన్నారు. ఒక విద్యార్థిని సోషల్‌మీడియాలో పెట్టిన తప్పుడు సమాచారం ఆధారంగా కోర్టులో కేసు వేసి, అటు కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని తెలిపారు. గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో తప్పులు జరిగి ఉంటే ఆధారాలతో సహా తన వద్దకు వస్తే తానే కవితను సీఎం వద్దకు తీసుకెళ్లి మాట్లాడుతానన్నారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇచ్చారని ఇలానే మాట్లాడితే ఈసారి ప్రజలు రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందని వెంకట్ హెచ్చరించారు.



కాల్పుల విరమణ కోరుతున్నాం

- మావోయిస్టు పార్టీ నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో రూపేష్

చర్ల: మావోయిస్టు పార్టీ నుంచి, పోలీసుల నుంచి నెల పాటు కాల్పుల విరమణ కోరుతున్నట్లు మావోయిస్టు నార్టీ నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో రూపేష్ తెలిపారు. శాశ్వత పరిష్కారం కోసం విధిగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పేరిట మావోయిస్టు పార్టీ ఒక లేఖ విడుదల చేసింది. శాంతి చర్చలకు సంబంధించి ఈనెల 8న తాము ఇచ్చిన మొదటి ప్రకటనపై స్పందించిన ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్‌శర్మకు ధన్యవాదాలు తెలిపారు. కగార్ పేరుతో జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలని, అదే శాంతి చర్చల ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. శాంతి చర్చలు ఆరంభమయ్యే వరకు.. కనీసం తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటించడం ఇరుపక్షాలకు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. శాంతి చర్చల సమయంలో ప్రభుత్వ సాయుధ బలగాలపై కాల్పులు జరపవద్దని తమ సహచరులకు విజ్ఞప్తి చేయగా, వారంతా అంగీకరించారని తెలిపారు. నెలరోజుల పాటు కాల్పులు జరపకుండా ఛత్తీస్‌గఢ్‌లోని కేంద్ర, రాష్ట్ర బలగాలకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.



ధాన్యం ఆరబెడుతూ కుప్పకూలిన రైతు

నూతనకల్: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు కుప్పకూలి పోయాడు. మద్దిరాల మండల పరిధిలోని చందుపట్లకు చెందిన ఈదు లకంటి భిక్షంరెడ్డి (65) తాను పండించిన ధాన్యాన్ని ఎర్రపహాడ్‌లోని కొనుగోలు కేంద్రానికి తరలించాడు. అక్కడ ధాన్యాన్ని ఆరబెడుతున్న క్రమంలో ఒక్కసారిగా స్పృహతప్పి కిందపడి పోయాడు. గమనించిన పక్క రైతులు 108 వాహనంలో సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.


భిక్షంరెడ్డి

కోతుల దాడిలో వృద్ధురాలి మృతి

రాయపర్తి: కోతుల దాడిలో ఓ వృద్ధురాలు గాయపడి చికిత్స పొందుతూ చనిపోయింది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్క వేడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన దురిశెట్టి మల్లమ్మ (76) మూడు రోజుల కిందట స్నానం చేసేందుకు వేడినీళ్ల తీసుకెళ్తుండగా.. కోతుల గుంపు మీద కొచ్చింది. దీంతో వృద్ధురాలు భయంతో కిందపడి పోయింది. ఆ తరువాత కోతులగుంపు ఆమెపై దాడి చేసింది. దీనికితోడు వేడినీళ్ల మీద పడడంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. తొర్రూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది.


మల్లమ్మ





తాబేలు ఏ విధంగా తన అవయవములను ముడుచుకొనుచున్నదో.
ఆ విధముగా మనస్సును ఇంద్రియముల నుండి మరలింపవలెను.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 19 ఏప్రిల్ 2025

కత్తులతోనే పొత్తు పొడుపు!

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉండగానే తమిళనాడులో ప్రత్యర్థి పార్టీల మధ్య చిటపటలు మొదలైపోయాయి. ఈసారి ఎలాగైనా నిలదొక్కుకుని పార్టీ జెండా రెపరెపలాడించాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉన్నట్టు కనబడుతోంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై విమర్శల జోరుపెంచారు. స్టాలిన్ కూడా అంతే దీటుగా బదులిస్తున్నారు. రెండేళ్ల క్రితం తమను వీడివెళ్లిన అన్నా డీఎంకేతో బీజేపీ చెలిమిని ఖరారు చేసుకుంది. అందుకోసం అమిత్ షా చెన్నై రావటాన్ని చూస్తే రాబోయే పోరులో తమది కీలకమైన పాత్రని ఆ పార్టీ చెప్పదల్చుకున్నట్టు అర్థమవుతుంది. అయితే ఈ సాన్నిహిత్యం ఏమంత సజావుగా లేదని జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి. కేవలం ఈ చెలిమి కోసం బీజేపీ అన్నామలైని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించి ఆ స్థానంలో నయనార్ నాగేంద్రన్‌ను నియమించింది. అన్నామలై గత రెండేళ్లుగా డీఎంకే సర్కారుపైకి దూకుడుగా పోతున్నారు. నిరుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఆధిపత్య కులాల వోట్లు రాబట్టడంలో, యువతను సమీకరించటంలో ఆయన విజయం సాధించారు. సీట్లయితే రాలేదుగానీ... బీజేపీ వోటు శాతం 11.24 శాతానికి చేరుకుంది. కానీ ఆ దూకుడు పొత్తు రాజకీయాల్లో చిచ్చు పెడుతుందన్న భయం బీజేపీ అధిష్ఠానంలో వుంది. ఎందుకంటే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం పళనిస్వామిపై అన్నామలై తీవ్ర విమర్శలు చేశారు. అవి వ్యక్తిగత స్థాయికి వెళ్లి పోయాయి. అందుకే ఎన్నికల వరకూ పొత్తు సజావుగా వుండాలంటే అన్నామలైని తప్పించటమే మంచిదని కేంద్ర నాయకత్వం భావించింది. నాగేంద్రన్ అన్నాడీఎంకే నుంచి వచ్చినవారే. జయ సర్కారులో పళనిస్వామి, ఆయనా సహచరులు కూడా. 2016లో జయ మరణం తర్వాత నాగేంద్రన్ బీజేపీ కండువా కప్పుకున్నారు. ఆ మాటెలావున్నా రెండు పార్టీలకూ ఇది ఇష్టం లేని పొత్తే. కొన్ని సీట్లయినా సాధించుకోగలిగితే ద్రవిడ కోటలో పాగా వేశామన్న అభిప్రాయం కలిగించ వచ్చని బీజేపీ ఆశిస్తోంది. అటు అన్నాడీఎంకే పరిస్థితీ ఏమంత బాగోలేదు. జయ మరణంతో అది అనాథగా మారింది. అంతర్గత కీచులాటల మధ్య 2021 వరకూ ప్రభుత్వం మనుగడ సాగించినా తర్వాత అది మూడు ముక్కలైంది. పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకేకు అసెంబ్లీ ఎన్నికల్లో 66 స్థానాలొచ్చాయి. కానీ గత లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మొత్తం 39 స్థానాలనూ డీఎంకే కూటమి గెల్చుకుంది. అందుకే అటు బీజేపీకి, ఇటు అన్నాడీఎంకేకు ప్రస్తుత పొత్తు ప్రాణావసరమైంది.

సమస్యేమంటే రెండు పార్టీల మధ్యా పొత్తు ఏర్పడినా, అది ఎన్డీయే కూటమిగా ఉంటుందని అమిత్ షా చెప్పినా ఈ చెలిమితో ఇరుపక్షాలూ ఇబ్బంది పడుతున్న వైనం కనబడుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే లేకుండానే తాము 11.24 శాతం వోట్లు రాబట్టుకోగలిగామని బీజేపీ ధీమాగా వుంది. కానీ ఆ పరిస్థితి అన్నాడీఎంకేలో లేదు. అధికారంలో పాలుపంచుకుంటామో, లేదో ఎన్నికల తర్వాతే చెబుతామని షా అంటే... ఎన్నికల్లో పోటీవరకే పొత్తులని పళనిస్వామి ప్రకటించారు. తమిళనాడు రాజకీయ ధోరణులు గమనిస్తే అక్కడ కూటమి ప్రభుత్వాలు ఎప్పుడూ లేవు. పొత్తులున్నా రాష్ట్ర మంత్రివర్గంలో ఏనాడూ జాతీయ పార్టీలకు చోటీయలేదు. ఇప్పుడు కూడా అదే కొనసాగుతుందనుకుంటే తప్ప తమిళ వోటర్లు కనికరించరని పళనిస్వామి, అమిత్ షాలు అనుకుని వుండొచ్చు. అయితే డీఎంకేపై విరుచుకుపడటానికి తగిన ఆయుధాలు లేకపోవటం ఎన్డీయే కూటమికున్న ప్రధాన సమస్య. కాశీకి ప్రత్యేక రైలు నడపటం, కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్, వీణ పెట్టడం ద్రవిడ రాజకీయ ప్రాబల్యంగల తమిళనాడును అంతగా ఆకర్షించినట్టు లేదు.

స్టాలిన్ అమ్ములపొదిలో చాలా అస్త్రాలున్నాయి. ముఖ్యంగా ఆయన తమిళుల ఆత్మగౌరవం అంశాన్ని ముందుకు తెచ్చారు. తమిళులు అనాగరికులని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించటం, అనంతరం క్షమాపణ చెప్పటం ప్రస్తావిస్తున్నారు. బలవంతంగా హిందీ రుద్దాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం నవీన్ పట్నాయక్‌కు సన్నిహితుడైన తమిళ ఐఏఎస్ అధికారి వీకే పాండ్యన్‌పై బీజేపీ రేపిన దుమారాన్ని గుర్తుచేస్తున్నారు. ఒడిశా ప్రజలపై తమిళులు పెత్తనం ఎలా చేస్తారని ప్రశ్నించటాన్ని ఎత్తిచూపుతున్నారు. గత పదేళ్లలో తమిళనాడుకు కేంద్ర నిధులు మూడు రెట్లు పెరిగినా కొందరికి ఏడవటం అలవాటైపోయిందన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలనూ ఆయన తనకు అనుకూలంగా మలుచుకున్నారు. తమ వంతు వాటా అడగటం తమ హక్కని, అందుకు ఏడవటం లేదా బానిసత్వం చేయటం చేతకాదని స్టాలిన్ జవాబిచ్చారు. 234 స్థానాలుగల అసెంబ్లీలో గత ఎన్నికల్లో డీఎంకే సొంతంగా 133, మిత్రులతో కలిసి 159 గెల్చుకుంది. 46 శాతం వోట్లు రాబట్టింది.

ఇప్పటికైతే తమిళనాట సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులు, ఆత్మగౌరవం ప్రధానాంశాలు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి అసెంబ్లీ ఆమోదించిన పది బిల్లుల్ని దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచటం, సుప్రీంకోర్టు ఆయన్ను మందలించటంతోపాటు వాటిని ఆమోదించినట్టుగా భావించాలని చెప్పటం స్టాలిన్‌కు మరింత శక్తినిచ్చింది. అవినీతి పెరిగిందని, వేలకోట్ల ప్రజాధనాన్ని డీఎంకే నేతలు దోచుకుంటున్నారని, శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని బీజేపీ చేస్తున్న ఆరోపణలు ప్రజల్ని ఎంతవరకూ కదలించగలవో చూడాలి. అంతకన్నా ముందు అసెంబ్లీ ఎన్నికలు జరిగే వచ్చే ఏప్రిల్‌నాటికైనా తమ పొత్తు విషయంలో ఆత్మవిశ్వాసాన్ని కనబర్చటం అవసరమని ఎన్డీయే గుర్తించాలి.

పటేల్‌కూ, నెహ్రూకూ పడదంటారా?

విశ్లేషణ



రాజ్‌మోహన్ గాంధీ

ఇండియా ఈ ఏడాది అక్టోబర్ 31న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంత్యుత్సవం జరుపుకోబోతోంది. జనం మర్చిపోయిన పటేల్ గుణగణాలు కొన్ని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తాను. తన సహోదరులను ఆయన ఎంతో జాగ్రత్తగా చూసుకున్నాడు. వల్లభ్‌కు నలుగురు సోదరులు. వారిలో ముగ్గురు తన కంటే పెద్ద వారు. ఆయన ఏకైక సోదరి దహిబా అందరికంటే చిన్నది. సంతానంలో మధ్యవాడు కాబట్టి వల్లభాయికి చిన్నతనంలో తగినంత మన్నన, ఆప్యాయత లభించలేదు. ఈ అనాదరణే ఆయనను ఒక వాస్తవవాదిగా, యోధుడిగా మార్చింది. తండ్రి ఝవేర్ భాయ్ ఎప్పుడూ ధనికుడు కాదు. పైగా కాలక్రమంలో ఉన్నది కూడా కరిగిపోయింది. వల్లభ్ తెలివైన వాడు, విశాల హృదయుడు. కాబట్టే, తోడబుట్టిన అయిదుగురి బాగోగులు, డబ్బు అవసరాలు తనే చూసుకున్నాడు.

వల్లభ్ దయాగుణం నుంచి ఆయన చిన్నన్న విఠల్ భాయ్ అత్యధికంగా ప్రయోజనం పొందాడు. మన స్వాతంత్ర్యోద్యమ హీరో కూడా అయిన విఠల్ 1933లో యూరప్‌లో అనారోగ్యంతో చనిపోయాడు. ఆ సమయంలో సుభాష్ చంద్రబోస్ ఆయనకు సుశ్రూషలు చేశాడు. విఠల్ భాయ్ 1925–30 కాలంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రెసిడెంట్‌గా వ్యవహరించాడు. ఈ ఇద్దరు సోదరులూ బొర్సాద్ (గుజరాత్) టౌనులో లాయర్లు. ఆ సమయంలో, వల్లభ్ లండన్ వెళ్లి బారిష్టర్ అవ్వాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అవసరమైన డబ్బు పొదుపు చేసుకుని పాస్‌పోర్టు, టికెట్ సంపాదించాడు. అయితే వీజే పటేల్, ప్లీడర్, బొర్సాద్ పేరిట ఆయనకు వచ్చిన కవరును పోస్ట్‌మన్ అదే పేరుతో నమోదై ఉన్న సోదరుడు విఠల్ ఇంటికి బట్వాడా చేస్తాడు. దీంతో విఠల్‌కు తానూ ఇంగ్లాండు వెళ్లి బారిష్టరు కావాలన్న ఆలోచన వచ్చింది. ముందు నువ్వు వెళ్తే నీకంటే పెద్దవాడినైన నేను ఆ తర్వాత వెళ్లలేను. నీ పాస్ పోర్టు, టికెట్‌తో నేను లండన్ వెళ్తాను అని తమ్ముడిని కోరతాడు. వల్లభ్ సరే అనడమే కాకుండా విఠల్ లండన్ చదువుకు డబ్బు కూడా సమకూర్చాడు. ఆయన కుటుంబ భారాన్నీ మోశాడు. నాలుగేళ్ల తర్వాత 1910లో తనూ లండన్ వెళ్లి అద్భుత ప్రతిభ కనబరచి, 1912లో బారిష్టర్ పట్టాతో ఇండియా తిరిగి వస్తాడు.

జైల్లో ఉండి కూడా సర్దార్ సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ తన సాటి సమర యోధులను ఎందరినో ఆర్థికంగా ఆదుకునేవాడని, వారి వైద్య ఖర్చులకు సాయం చేసేవాడని... పటేల్ జీవిత చరిత్ర కోసం 1987 ఏప్రిల్లో నేను ముంబాయిలో ఇంటర్వ్యూ చేసినప్పుడు మురార్జీ దేశాయ్ చెప్పారు. సాటి సమర యోధుల ఇక్కట్లను చూసి మన ఉక్కుమనిషి హృదయం ఇట్టే కరిగిపోయేది.

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జీవితంలో ఆయన ఔన్నత్యాన్ని చాటిచెప్పే గొప్ప సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అవి నేడు ఎంతమందికి తెలుసు? 1927 జులైలో పెను తుపాను రావడంతో గుజరాత్ విలవిల్లాడి పోయింది. ఆ సమయంలో బాధితులను ఆదుకునేందుకు అహ్మదా బాద్, పరిసర ప్రాంతాల్లోని ఎందరో ఆయన స్ఫూర్తితో ముందు కొచ్చారు. అప్పట్లో పటేల్ గుజరాత్ కాంగ్రెస్ కమిటీ, అహ్మదాబాద్ మునిసిపల్ కౌన్సిల్ రెంటికీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. సహాయక చర్యలు చేపట్టడంలో కనబరచిన దక్షతను గుర్తించి బ్రిటిష్ రాజ్ అధికారులు ఆయనకు తగిన బిరుదు ఇవ్వజూపారు. సమాధానంగా ఆయన బిగ్గరగా ఒక నవ్వు నవ్వారు. 'సర్ వల్లభ్ భాయ్' అని పిలిపించుకుంటే చాలామందికి అప్పుడు ఇప్పుడు సంబరంగా ఉండేదేమో. కాని, ఖేదా జిల్లా వాసులైన ఝవేరీభాయ్, లద్బా దంపతుల ఈ బిడ్డ ఎంతో గట్టి మనిషిగా, ఎన్నో కీలక పర్యవసానాలకు కారకుడిగా భారత దేశ భావితరాలకు తన ముద్రను మిగిల్చి వెళ్లేవాడా?

దాదాపు ఒక శతాబ్దం క్రితం 1920లలో మునిసిపల్ కౌన్సిల్ సారథిగా పటేల్ అహ్మదాబాద్‌ను 'నడిపించాడు'. అలాగే జవహర్‌లాల్ నెహ్రూ అలహాబాద్ ను 'నడిపిస్తున్నాడు'. 1920–22 సహాయ నిరాకరణ ఉద్యమానికి 1930–33 శాసనోల్లంఘన ఉద్యమానికి మధ్య కాలమది. దేశం ఇతర ప్రాంతాల్లో, కోల్‌కతా మునిసిపాలిటీకి చిత్తరంజన్ దాస్, పాట్నా టౌన్ కౌన్సిల్‌కు రాజేంద్ర ప్రసాద్, ముంబాయి మునిసిపాలిటీకి విఠల్ భాయ్ పటేల్ సారథులుగా ఉన్నారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అప్పుడు నేర్చుకున్న పాఠాలు ఎంతగానో ఉపకరించాయి.



1948లో, వల్లభ్ భాయ్ పటేల్ నగర పాలక పాత్రకు ముగింపు పలికి రెండు దశాబ్దాలు ముగిసిన సందర్భంగా, ముంబాయిలో ఆయనకు పుర ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. స్వతంత్ర భారత ఉప ప్రధాని ఆ సభలో మాట్లాడుతూ, " మీరు ఎన్నో విజయాలు ప్రస్తావించారు. వాటిలో కొన్ని నేను సాధించినవి. కొన్ని నేను సాధించనివి. కాని అభ్యంతరం లేకుండా నేను అంగీకరించే ఒక విషయం: అహ్మదాబాద్ మునిసిపాలిటీకి నా శక్తి వంచన లేకుండా సేవ చేశాను. స్వచ్ఛమైన ఆనందం పొందాను... నగరంలోని మురికిపై పోరాడితే మీకు రాత్రి చక్కగా నిద్ర పడుతుంది. రాజకీయాలతో వ్యవహరించేటప్పుడు మీకు రాత్రి కూడా ప్రశాంతత ఉండదు" అని వ్యాఖ్యానించారు.

నగర బాధ్యతల నుంచి వైదొలగిన తర్వాత పటేల్ అసాధారణ నాయకత్వ ప్రతిభ వెలుగులోకి వచ్చింది. 1928లో గుజరాత్‌లోని బార్డోలీ ప్రాంత రైతాంగం మీద బ్రిటిష్ పాలకులు విధించిన పన్నులకు వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమాన్ని ఆయన విజయవంతంగా నిర్వహించారు. అప్పుడే అక్కడి ప్రజలు పటేల్‌కు 'సర్దార్' బిరుదు ఇచ్చారు.

1916 నుంచీ వల్లభ్ భాయ్ పటేల్– నెహ్రూలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఉన్నారు. అయితే, 1937లో ఇద్దరూ కలిసి గుజరాత్‌లో ఒక వారం రోజులు పర్యటించినప్పుడు వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఇద్దరూ జట్టుగా పనిచేశారు. పటేల్‌కు మహాత్మా గాంధీ ఒక లేఖ రాస్తూ, " మీరిద్దరూ కలిసినప్పుడు, మీలో ఎవరు గట్టివారో చెప్పడం కష్టం" అని వ్యాఖ్యానించారు. తర్వాతి సంవత్సరాల్లో పటేల్– నెహ్రూల నడుమ ఉద్రిక్తతలు, అపోహలు, అప్పుడప్పుడు పరుష భాషణలు తలెత్తాయి. ఏమైనప్పటికీ, స్నేహం, ఒకరి మీద మరొకరికి ప్రశంసా భావన, పరస్పర విధేయత, గాంధీ పట్ల ఉభయుల విధేయత, స్వాతంత్ర్య పోరాటం పెంచిన బంధం... వాటికంటే బలమైనవి.

ఆ తర్వాత స్వాతంత్ర్యం వచ్చింది. సంబరాలు తెచ్చింది. వాటితో పాటే విభజన విషాదాలు ప్రజలు చవిచూశారు. తాము ఉభయులం ఒకరికొకరుగా ఉండటం ఎంత అదృష్టమో వల్లభ్ భాయ్ పటేల్– నెహ్రూలు గుర్తించారు. 1950 జనవరిలో గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి స్వతంత్ర భారత తొలి దేశాధిపతి పదవీకాలం ముగిసిన అనంతరం దేశానికి తొలి రాష్ట్రపతి అయిన రాజేంద్ర ప్రసాద్ వీరిరువురినీ ప్రస్తావిస్తూ, "ప్రధాన మంత్రి, ఆయన తొలి సహచరుడైన ఉప ప్రధాన మంత్రి కలిసి దేశాన్ని అన్ని విధాలా సుసంపన్నం చేసే గొప్ప ఆస్తి అయ్యారు. మొదటి వారు సార్వజనీన ప్రేమను, రెండో వారు సార్వజనీన విశ్వాసాన్ని చూరగొన్నారు" అని చెప్పారు.

కాలం మారుతుంది. గడచిన దశాబ్దాలు మర్చిపోతారు.

◆ పటేల్, నెహ్రూల మధ్య స్నేహం, సాన్నిహిత్యం ఉన్నాయి. 1937లో ఇద్దరూ కలిసి ఒక వారం పాటు గుజరాత్‌లో పర్యటించినప్పటి నుంచి అది పెరిగింది.

◆ నెహ్రూ, పటేల్‌ల మధ్య అపోహలు, అప్పుడప్పుడు పరుష భాషణలు తలెత్తక పోలేదు. కానీ, వారి స్నేహం, పరస్పర ప్రశంసాభావన, విధేయత, గాంధీ పట్ల ఇరువురి విధేయత, స్వాతంత్ర్య పోరాట బంధం అంతకన్నా బలమైనవి.

◆ ఇవాళ తప్పుడు ప్రచారం జరుగుతోంది. నెహ్రూను అవమానిస్తున్నారు. పటేల్‌ను ఆకాశానికి ఎత్తుతున్నారు. పటేల్ ఆలోచన, వాస్తవాలనేమో పాతాళంలోకి తొక్కేస్తున్నారు.

ఎడతెగని తప్పుడు ప్రచారం జరుగుతుంది. అది ఎంత హాని చెయ్యాలో అంత హాని చేస్తుంది. నెహ్రూ అవమానం పాలయ్యాడు. పటేల్ విగ్రహం ఆకాశాన్ని తాకుతోంది... కానీ, ఆయన జీవితానికి, ఆలోచనకు, ఆయన చేసిన కృషికి సంబంధించిన వాస్తవాలు పాతాళంలోకి వెళుతున్నాయి. ఈ పరిస్థితుల్లో 1940లు, 1950లు ఇంకా గుర్తున్న, పటేల్– నెహ్రూలు ఉభయులనూ కలిసిన, పటేల్ జీవితాన్ని పరిశోధించి ఆయన జీవిత చరిత్ర రాసిన నాలాంటి వాడు తనకు తెలిసిన వాస్తవాలు ఏమిటో చెప్పితీరాలి.

కాబట్టి, వారిద్దరి మధ్య నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాల నుంచి కొన్ని వాక్యాలు ఉటంకించి ఈ వ్యాసం ముగిస్తాను. 1948 ఫిబ్రవరి 3న సర్దార్ పటేల్‌కు నెహ్రూ రాసిన లేఖ నుంచి: "మనం ఒకరికొకరం సన్నిహితంగా ఉంటూ, ఎన్నో తుపానులనూ, ఇక్కట్లనూ కలసికట్టుగా ఎదుర్కొని పావు శతాబ్దం గడచిపోయింది. ఈ కాలంలో మీ పట్ల నా గౌరవాభిమానాలు పెరిగాయని పూర్తి నిజాయితీతో చెప్పగలను..."

1948 ఫిబ్రవరి 5న నెహ్రూకు సర్దార్ పటేల్ రాసిన లేఖ నుంచి: "మనం ఇద్దరం ఒక ఉమ్మడి లక్ష్య సాధనలో జీవితకాల మిత్రులు (కామ్రేడ్స్)గా ఉంటున్నాం. దృక్పథాలు స్వభావాలు విభేదించినా, మన దేశ అత్యున్నత ప్రయోజనాలు, మనకు ఒకరి పట్ల మరొకరికి ఉన్న ప్రేమాభిమానాలు వాటిని అధిగమించేలా చేస్తూ మనల్ని కలిపి ఉంచుతున్నాయి."

వ్యాసకర్త సంపాదకుడు, ప్రముఖ రచయిత,
'పటేల్ – ఎ లైఫ్' గ్రంథకర్త

ఆర్యభట్ట స్ఫూర్తితో...

విఖ్యాత భారతీయ శాస్త్రవేత్త సతీష్ ధావన్ నాయకత్వంలో 1975 ఏప్రిల్ 19న రష్యాలో కపుస్టిన్ యార్ కేంద్రం నుండి సోవియట్ కాస్మోస్–3 రాకెట్ ద్వారా ప్రసిద్ధ భారతీయ ఖగోళ – గణిత శాస్త్రవేత్త పేరుతో తయారుచేసిన తొలి ఉపగ్రహం 'ఆర్యభట్ట'ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపింది మన అంతరిక్ష సంస్థ ఇస్రో. 'ఇండియా ఎంటర్స్ స్పేస్ ఏజ్' అంటూ ప్రపంచ మీడియా మన ప్రయత్నాన్ని పెద్ద అక్షరాలతో కీర్తించింది. ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతం అయ్యి 50 వసంతాలైన సందర్భంగా నేడు దేశవ్యాప్తంగా ఆర్యభట్ట గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఇస్రో, ఇండియా స్పేస్ ల్యాబ్ వంటి కొన్ని సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది.

360 కిలోగ్రాముల బరువు వుండి సౌర ఫలకాల ఆధారంగా పనిచేసే ఆర్యభట్ట ఉపగ్రహాన్ని 96.46 నిమిషాల ప్రదక్షిణ కాలం పట్టే కక్ష్యలో, 611 కిలోమీటర్ల అపోజీ, 568 కిలోమీటర్ల పెరిజీ ఎత్తులో, 50.6 డిగ్రీల ఏటవాలులో ఉండే కక్ష్యలో ప్రవేశ పెట్టారు. ఎక్స్–రే ఖగోళ శాస్త్రం, వ్యవసాయశాస్త్రం, సోలార్ ఫిజిక్స్‌లో ప్రయోగాలు చేయడానికి, సూర్యుడి నుంచి వచ్చే న్యూట్రాన్లు, గామా కిరణాలను కొలవడానికి, భూమి ఐనోస్పియర్‌లోని పరిస్థితులను అన్వేషించడం తదితర లక్ష్యాలతో ఈ ప్రయోగాన్ని ఇస్రో సోవియట్ యూనియన్ సహకారంతో చేపట్టింది.



ఆర్యభట్ట ఉపగ్రహం

50 ఏళ్ల సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణంలో ఎన్నో సమస్యలను సవాళ్లను అధిగమించాం. కొన్ని ఎగతాళి శబ్దాల మధ్య మౌనంగానే శత కోటి గుండెల సాక్షిగా చంద్రుని దక్షిణ ధ్రువపు ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ సాయంతో గర్వంగా మన జాతీయ జెండాను నిలిపాం. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అంగారకుడిపై పరిశోధనల కోసం అన్వేషణ ఆరంభించి నవ చరిత్ర సృష్టించాం. సూర్యుని ఉపరితల వాతావరణాన్ని అధ్యయనం కోసం ఆదిత్య–ఎల్1 మిషన్‌ను ప్రయోగించాం. నేడు ఆసియా – పసిఫిక్‌ప్రాంతంలోనే అతిపెద్ద ఉపగ్రహ సమాచార వ్యవస్థను కలిగి ఉన్నాం. డాకింగ్, అన్‌డాకింగ్ వంటి శాస్త్రీయ సామర్థ్యాలు కలిగిన నాలుగో దేశంగా అద్భుతాలు సాధించాం. గగన్‌యాన్ వంటి మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలతో పాటు 2030 నాటికి సొంతంగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాం. కేవలం ఐదు దశాబ్దాల కాలంలో ఒకే ప్రయోగంలో 100కు పైగా ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టగలిగే స్థాయికి ఎదిగాం. ముందు ముందు మరిన్ని అద్భుత విజయాలు మన పరం అవుతాయనడంలో సందేహం లేదు.

– పి. అరుణ్ కుమార్, ఫిజిక్స్ రీసెర్చ్ స్కాలర్, పాలమూరు యూనివర్సిటీ
(నేడు ఆర్యభట్ట ఉపగ్రహానికి గోల్డెన్ జూబ్లీ వేడుకలు)

వీళ్లే ఇలా రాస్తే ఎలా?!

అంబేడ్కర్ జయంతికి కేంద్ర మంత్రులు అంబేడ్కర్‌పై పత్రికల్లో వ్యాసాలు రాశారు. ఒకరు దీన్ని కాంగ్రెస్ విమర్శకు వాడుకుంటే, మరొకరు అంబేడ్కర్ నోట అబద్ధాలు కుక్కారు. వీటిని ఆదర్శాల పేరుతో భావితరాలకు బోధిస్తారట. ఆర్య దండయాత్ర సిద్ధాంతాన్ని అంబేడ్కర్ తప్పు పట్టారనీ, సంస్కృతాన్ని అధికార భాషగా ఆమోదించడానికి మద్దతుగా రాజ్యాంగ సభలో సవరణను ప్రవేశ పెట్టారనీ, హిందీని తమ భాషగా స్వీకరించడం భారతీయులందరి విధి అని ప్రకటించారనీ ఇలా ఎన్నో అవాస్తవాలను రాశారు వారు.



"ఇండో–ఆర్యులు ఇండియాకు వలస వచ్చి స్వదేశీయులను తరిమేశారు. వలస వాద, బ్రాహ్మణవాద కథనాలు కులాధిపత్య సమర్థనలు. ఆర్యులు సాంస్కృతిక భాషా సమూహం, ప్రత్యేక జాతి కాదు. రుగ్వేదం వంటి ప్రాచీన గ్రంథాల్లోని విభేదాలు సామాజిక అంతర్గత పోరాటాల ప్రతిబింబాలు. ఆర్య దండయాత్ర సూత్రం ఆర్యేతర శూద్రుల, దళితుల అణచివేత సాధనం." అని రాశారు అంబేడ్కర్. ఆర్య సూత్ర జాతి సంస్కృతుల ఊహలను సవాలు చేశారు.

యజుర్, అధర్వణ వేదాల రుషులు శూద్రులకు తగిన ప్రాధాన్యమిచ్చినట్లు అంబేడ్కర్ అనలేదు. "శూద్రులు ముందు ఆర్య క్షత్రియుల్లో భాగం. జనశ్రుతి (శూద్రుడు) వైదికజ్ఞాన అభ్యాసం, కవశ ఐలూశ (శూద్రుడు) శ్లోకాల రచన సంగతులు ఈ వేదాల్లో ఉన్నాయి. వేదాలు శూద్రుల జాతి, సామాజిక హీనతను సమర్థించలేదు. మనుస్మృతి ఆ పని చేసింది. బ్రాహ్మణ, ప్రత్యేకించి ఉపనయన, ఆచారాల విభేదాలతో వారిని నాల్గవ వర్ణానికి దిగజార్చారు. శూద్రుల ఉన్నత స్థాయి తగ్గింపునకు వేదకాలం తర్వాతి బ్రాహ్మణ నీతి ఇది" అని అన్నారు. అంబేడ్కర్ శూద్రులతో పోల్చి ఆర్యులను పొగడలేదు. ఆర్య ఉన్నత జాతి సూత్రీ కరణను తిరస్కరించారు. ద్రవిడ, నాగ, దాస తెగలు అనార్యుల్లో భాగమని, వారు ఆర్యులకు ఏ విధంగానూ తక్కువ కారని అంబేడ్కర్ అభిప్రాయం.

అంబేడ్కర్ అధికార భాషగా సంస్కృతానికి మద్దతివ్వలేదు. సంస్కృతాన్ని ప్రజలు అతి తక్కువగా వాడుతారని, పాలనకు, ప్రజలు ఒకరితోనొకరు మాట్లాడుకోవడానికి సంస్కృతం ఆచరణీయం కాదనేది ఆయన అభిప్రాయం. హిందీని రుద్దడం హిందీయేతర భాషా ప్రాంతాల అణచివేతకు దారి తీయగల అపాయాన్ని జాగ్రత్తగా పరిగణించాలన్నారు. ఆంగ్లంతో పాటు హిందీ భారత ప్రజల లంకె భాషగా ఉండాలని అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణ సభలో వాదించారు. మరి అంబేడ్కర్ ఆదర్శాలను సంఘ్ సర్కారు ఆచరిస్తుందా?

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

సంఘీభావం తెలుపవలసిందే...

ఈమధ్య కొందరు పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ ప్రభుత్వ వైఖరి గురించి తెగ రాస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రవర్తించే తీరు గర్హనీయమైనదే! మానవీయ కోణంలో పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించవలసిందే. అయితే ఈ మారణహోమానికి నాందీ ప్రస్థానంగా నిలిచిన 'హమాస్ ఉగ్రవాదులు 2023 అక్టోబర్ 7వ తేదీన యూదులపై దాడి చేసి 1200 మందిని అతి దారుణంగా చంపడం, 250 మందిని బందీలుగా పట్టుకోవడం, బందీలను దశల వారీగా చంపడం లాంటి చర్యలన్నీ మానవీయ కోణంలోకి రాకూడదా? మతం కోణంలో పాలస్తీనియన్లకు సంఘీ భావం తెలియజేస్తే – ఈ దేశంలోని ముస్లింల మద్దతు తమకు ఉంటుందనేది కుహనా లౌకిక రాజకీయ నాయకుల ఆలోచన. 'పాలస్తీనా' పాలస్తీనియన్లదే అని 1938లో గాంధీజీ ఒక వ్యాసం రాశారన్న మాట నిజమేనా?



మోదీకి దేశ భద్రత విషయాలు ముఖ్యమనీ, సంతుష్టీకరణ రాజకీయాలకు ఆయన వ్యతిరేకమనీ జాతి హితైషులందరికీ ఎరుకే. అందుకే మోదీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో రక్షణ సంబంధాలను నెలకొల్పుకుంటోంది. అయితే ఈ చర్య మనదేశంలోని కమ్యూనిస్టులకు, కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడటం లేదు. పాలస్తీనియన్లకు సంఘీభావం తెలిపిన వారిపై అక్రమ కేసులు బనాయి స్తున్నారని వాపోవడంలో అర్థం లేదు. ఈ దేశంలో ఉంటూ, ఈ దేశం తిండి తింటూ ఈ దేశ ప్రధానిని ముక్కలు ముక్కలుగా నరుకుతామని వీడియోలు చేసి పెట్టినవారూ, ప్రధానిని పబ్లిక్‌గా నిలబెట్టి కాల్చాలని పొగరుబోతు మాటలు మాట్లాడిన నాయకులు, పోలీసులను 15 నిమిషాలు పక్కన పెడితే, ఈ దేశంలో హిందువులందరినీ మట్టు పెడతామని భీషణ ప్రతిజ్ఞలు చేసిన నాయకుల స్వేచ్ఛకు ఇక్కడ ఏమైనా ఇబ్బంది కలిగిందా?

ఇక మానవత్వంతో కన్నీరు కార్చడం అనే విషయానికి వస్తే – సిరియా, ఇరాన్, ఇరాక్, కువైట్, అఫ్గానిస్తాన్‌లలో కొన్ని లక్షల మంది ముస్లింలు యుద్ధం, అంతర్యుద్ధాల వల్ల అసు వులు బాసిన సందర్భంలో వీళ్లకు కన్నీరు ఎందుకు రాలేదు? అంటే ముస్లింలు ముస్లింలను చంపితే ఫరవాలేదనా? బంగ్లాదేశ్‌లో రెండు ముస్లిం వర్గాలు ఘర్షణ పడిన నేపథ్యంలో హిందువులపై జరిపిన దాడుల గురించి వీరు కన్నీరు కార్చారా?

ఇక చివరగా మత పిచ్చితో, కులం పిచ్చితో, భాషా పిచ్చితో, ప్రాంతీయ పిచ్చితో మానవత్వ విషయాలు నిర్ణయమైతే మనం మానవులం అని చెప్పుకోవడానికి మనకు అర్హత ఉండదు.

– ఉల్లి బాలరంగయ్య
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.57 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మూల ఉ.6.33 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.4.34 నుండి 6.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.14 నుండి 7.25 వరకు, **అమృతఘడియలు:** రా.2.35 నుండి 4.15 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.12.

విద్యార్థుల వీసాలపై పిడుగు

నెలలో 1,024 వీసాలు రద్దు

- లీగల్ రెసిడెన్సీ స్టేటస్ సైతం
- విదేశీయులపై అమెరికా కఠిన వైఖరి
- డిపోర్టేషన్ ముప్పు, కోర్టుకెక్కుతున్న బాధితులు
- అరెస్టు భయంతో స్వదేశాలకు వెళ్లిపోతున్న వైనం


ట్రంప్

విదేశీ విద్యార్థులపై అమెరికా కక్షగట్టినట్లుగా వ్యవహరిస్తోంది. గత నెల రోజుల వ్యవధిలోనే ఏకంగా 1,024 మంది విదేశీ విద్యార్థుల వీసాలనో, వారి లీగల్ రెసిడెన్సీ స్టేటస్‌నో రద్దు చేసింది. వారంతా అమెరికాలోని 160 కాలేజీలు, యూనివర్సిటీల్లో చదువుకుంటున్నవారే. వారంతా ఆందోళనకు లోనవుతున్నారు. ఇలా ఉన్నపళంగా వెళ్లగొట్టడం ఏమిటంటూ మండిపడుతున్నారు. ''చట్టప్రకారం అన్ని అనుమతులూ ఇచ్చిన ప్రభుత్వమే ఆ చట్టాలను ఉల్లంఘిస్తోంది. ఈ చర్యలను ఎలా సమర్థించుకుంటుంది?'' అని ప్రశ్నిస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వ చర్యపై పలువురు కోర్టుకెక్కారు. కొందరు అరెస్టు భయంతో చదువులు మధ్యలోనే వదిలేసి స్వదేశాలకు వెళ్లిపోయారు.

పునరాలోచించాలి

లీగల్ స్టేటస్ రద్దుతో వందలాది మంది విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు అమెరికా వీడాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే ప్రభుత్వమే నిర్బంధించి బలవంతంగా వెళ్లగొట్టే పరిస్థితి నెలకొంది. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మేరీలాండ్, ఒహాయో స్టేట్ వర్సిటీల్లోని పలువురు విద్యార్థుల లీగల్ స్టేటస్‌లు రద్దయ్యాయి. పలు కాలేజీల్లోని విద్యార్థులు వీసాలు కూడా రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీపై కోర్టుల్లో కేసులు దాఖలవుతున్నాయి. విదేశీ విద్యార్థులు ఇలా వెళ్లిపోతే అమెరికా వర్సిటీలు, కాలేజీల మనుగడ కష్టమవుతుందని అక్కడి నిపుణులు చెబుతున్నారు. దీనిపై పునరాలోచించాలని ట్రంప్ సర్కారుకు సూచిస్తున్నారు. కాలేజీలు, వర్సిటీల నుంచి కూడా ఈ మేరకు విజ్ఞాపనలు వెళ్తున్నాయి.

తీవ్ర పరిణామాలే

అమెరికాలో చట్టాల అమలు కఠినంగా ఉంటుంది. వాటిని పాటించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ''విద్యార్థులు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. చట్టాలను ధిక్కరిస్తామంటే ప్రభుత్వం సహించదు. ఇష్టానుసారం వ్యవహరిస్తే వీసాలు రద్దు చేసి వెనక్కు పంపుతారు. నిజాయితీగా ఉండేవారికి అమెరికాలో అద్భుత అవకాశాలున్నాయి'' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మార్గరెట్ మెక్‌లియోడ్ అన్నారు. ఈ విషయంలో కేంద్రం ఇకనైనా మొద్దునిద్ర వీడి అమెరికాలోని మన విద్యార్థుల భవితవ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ సూచించింది.

రద్దయితే ఇంటికేనా?

ఎఫ్–1 విద్యార్థి వీసాలను అమెరికా విదేశాంగ శాఖ పర్యవేక్షిస్తుంది. అమెరికాలోకి అడుగుపెట్టాక వారి లీగల్ రెసిడెన్సీ స్టేటస్‌ను పర్యవేక్షించే బాధ్యత డీఓహెచ్‌దే. విద్యార్థుల డేటాబేస్ దానివద్ద ఉంటుంది. విద్యాభ్యాసం పూర్తయ్యి వారు స్వదేశాలకు వెళ్లాక వర్సిటీ సూచనతో లీగల్ స్టేటస్‌ను తొలగించేవారు. ఇప్పుడు వర్సిటీలతో సంబంధమే లేకుండా విదేశీ విద్యార్థుల లీగల్ రెసిడెన్సీ స్టేటస్ ఉన్నపళంగా రద్దయిపోతోంది. పైగా ఆ మేరకు సమాచారం కూడా ఇవ్వడం లేదు. డేటాబేస్‌ను వర్సిటీ వర్గాలు తనిఖీ చేసినప్పుడు మాత్రమే ఆ విషయం తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో వీసా రద్దయినా లీగల్ రెసిడెన్సీ స్టేటస్ అలాగే ఉంటుంది. అలాంటప్పుడు విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. స్వదేశాలకు వెళ్లి మళ్లీ వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. స్టేటస్ రద్దయితే మాత్రం అమెరికాలో ఉండడానికి అనుమతించరు. స్వదేశాలకు వెళ్లిపోవాలని సూచిస్తారు. లేదంటే బలవంతంగా పంపిస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎందుకీ వీసాల రద్దు?

- విద్యార్థుల వీసాల రద్దుకు నిబంధనల ఉల్లంఘన ముఖ్య కారణమని వర్సిటీలు చెబుతున్నాయి.
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా వీసా రద్దవుతోంది. గత ఉల్లంఘనలకు కూడా ఇప్పుడు వీసా రద్దు చేస్తున్నారు.
- చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడినా వీసా రద్దు తప్పదు.
- పాలస్తీనా సానుభూతిపరుడంటూ కొలంబియా వర్సిటీ విద్యార్థి మహమ్మద్ ఖలీల్ వీసా రద్దు చేశారు. కానీ వీసాలు, లీగల్ స్టేటస్‌లు రద్దవుతున్న పలువురు విద్యార్థులకు ఉద్యమాలతో, తీవ్రవాద/ఉగ్రవాద సంస్థలతో ఏ సంబంధమూ లేదని ఆయా వర్సిటీలే చెబుతున్నాయి. కారణాలేమిటో ప్రభుత్వాన్నే అడగాలంటున్నాయి.
- ''విదేశీ విద్యార్థులను బయటకు వెళ్లగొట్టడమే డీఓహెచ్‌కు పనిగా మారింది. ఈ మేరకు అనధికారింగా జాతీయ పాలసీ తెచ్చినట్టు కనిపిస్తోంది'' అని వేన్ స్టేట్ వర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్ ప్రతినిధులు విద్యార్థుల తరఫున కోర్టుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. బలవంతపు డిపోర్టేషన్లు ఆపాలని కోరారు.
- డార్ట్‌మౌత్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న చైనాకు చెందిన షియాంటియాన్ లియూ తన లీగల్ స్టేటస్ రద్దుపై కోర్టును ఆశ్రయించాడు. ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ విద్యార్థికి అనుకూలంగా న్యూ హ్యాంప్‌షైర్ ఫెడరల్ జడ్జి తీర్పు ఇచ్చారు.
- ''అమెరికాలోకి వచ్చిపడుతున్న విదేశీయుల పట్ల ట్రంప్ గుర్రుగా ఉన్నారు. వారందరినీ వెనక్కు పంపేయాలని పట్టుదలగా ఉన్నారు. అందుకే విదేశీ విద్యార్థులను లక్ష్యం చేసుకుంటున్నారు'' అని మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్‌లో పబ్లిక్ అఫైర్స్ డైరెక్టర్ మిషెల్ మిటెల్‌స్టాడ్ అన్నారు.



విశ్వమూ భ్రమిస్తోంది

అతి నెమ్మదిగా తిరుగుతోంది ● 50 వేల కోట్ల ఏళ్లు పడుతుందట

భ్రమణం జీవలక్షణం. భూమి తన చుట్టూ తాను తిరుగుతుంది గనుకే రాత్రింబవళ్లు ఏర్పడతాయి. జీవకోటి యాత్ర సజావుగా సాగుతుంది. ఆ మాటకొస్తే చంద్రుని వంటి ఉపగ్రహాలు మొదలుకుని గ్రహాలన్నీ తమ చుట్టూ తాము నిత్యం తిరుగుతూనే ఉంటాయన్నది తెలిసిందే. చివరికి సూర్యుడు కూడా ఇందుకు అతీతుడు కాదు. ఆ మాటకొస్తే పాలపుంత కూడా తనచుట్టూ తాను తిరుగుతూ ఉంటుంది. మరి విశ్వం? విశ్వానికి భ్రమణమనేది లేదన్నది ఇప్పటిదాకా నమ్ముతూ వచ్చిన సిద్ధాంతం. అది నిత్యమూ అన్ని దిశలకూ సమానంగా విస్తరిస్తూ ఉంటుందన్నది సైంటిస్టుల భావన. కనుక విశ్వం తనచుట్టూ తాను తిరగదని సూత్రీకరించారు. కానీ అది నిజం కాదంటోంది తాజా పరిశోధన ఒకటి. విశ్వం కూడా తనచుట్టూ తాను తిరుగుతుందని పేర్కొంది. అయితే అది అత్యంత నెమ్మదిగా జరుగుతోందట. ఎంత మెల్లిగా అంటే, విశ్వం ఒక భ్రమణం పూర్తి చేయడానికి ఏకంగా 50 వేల కోట్ల ఏళ్లు పడుతుందని ఆ పరిశోధన తేల్చింది! దాని అధ్యయన వివరాలను రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ జర్నల్‌లో ప్రచురించారు.

'హబుల్'ముడి వీడినట్టే!

తాజా పరిశోధనకు హవాయి యూనివర్సిటీలోని ఆస్ట్రానమీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ ఇస్త్వాన్ జపుదీ సారథ్యం వహించారు. అంతరిక్ష శాస్త్రానికి సంబంధించి ఇప్పటిదాకా అతి పెద్ద ప్రహేళికల్లో ఒకటిగా మిగిలిపోయిన 'హబుల్ టెన్షన్'ను పరిష్కరించేందుకు కూడా ఇది దోహదపడుతుందని సైంటిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే విశ్వం తన చుట్టూ తాను తిరగడం లేదంటూ ఇప్పటిదాకా విశ్వసిస్తూ రావడం తెలిసిందే. విశ్వ విస్తరణ వేగానికి సంబంధించిన రెండు పరస్పర విరుద్ధ సమీకరణాలను వివరించడంలో ఈ సిద్ధాంతం విఫలమవుతోంది. వాటిలో ఒకటి సుదూరాల్లోని సూపర్‌నోవాలు, నక్షత్ర మండలాల దూరాల ఆధారంగా రూపొందించినది. మరొకటి దాదాపు 1,300 ఏళ్ల కింద విశ్వం ఆవిర్భవించిన నాటి కాస్మిక్ రేడియేషన్ నేపథ్యం ఆధారంగా సూత్రీకరించినది. రెండింట్లో ప్రతిపాదించిన విశ్వ విస్తరణ రేటులో తేడా ఉంది. దీన్ని అంతరిక్ష శాస్త్ర పరిభాషలో 'హబుల్ టెన్షన్'గా పిలుస్తారు. జపుదీ బృందం అభివృద్ధి చేసిన గణిత సిద్ధాంతం ఈ సమస్యకు పరిష్కారం చూపడం విశేషం! అందులో భాగంగా విశ్వ విస్తరణ సిద్ధాంతానికి కొద్దిపాటి భ్రమణ సూత్రాన్ని జోడించారు. తద్వారా రెండు సమీకరణాలూ సరైనవేనని తేలినట్టు సైంటిస్టులు వివరించారు. ''ప్రతిదీ విధిగా తనచుట్టూ తాను తిరుగుతుందన్న గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ సూత్రాన్ని నమ్మి రంగంలోకి దిగాం. ఇంతవరకూ వచ్చాం. విశ్వం ఒక భ్రమణానికి 500 బిలియన్ ఏళ్లు తీసుకుంటుందన్న మా సూత్రీకరణ చాలా హేతుబద్ధంగా ఉంది. పైగా ప్రస్తుత భౌతికశాస్త్ర సూత్రాలు వేటినీ ఉల్లంఘించడం లేదు. కనుక రెట్టించిన ఉత్సాహంతో తర్వాతి దశకు పరిశోధనకు సిద్ధమవుతున్నాం. విశ్వ భ్రమణ సిద్ధాంతాన్ని మరింతగా పరిశోధించేందుకు సమగ్ర కంప్యూటర్ సిమ్యులేషన్ ప్రయోగాలు చేపట్టనున్నాం''అని జపుదీ వివరించారు. ఈ సిద్ధాంతం పూర్తిస్థాయిలో నిరూపణ అయితే విశ్వం తాలూకు మన అవగాహన మరింత విస్తరిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికా పౌరుడినని చెప్పినా వదలని ఐసీఈ

మయామి: దేశంలో అక్రమంగా ఉంటున్నాడంటూ అమెరికా పౌరుడొకరిని యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత పత్రాలన్నిటినీ అతడి తల్లి చూపినా వదల్లేదు. చివరికి కోర్టు జోక్యంతో అతడికి విముక్తి లభించింది. బుధవారం కారులో వెళ్తున్న జువాన్ కార్లోస్ లోపెజ్ గోమెజ్ (20) అనే వ్యక్తిని ఫ్లోరిడా హైవే పెట్రోల్ అధికారులు జార్జియా రాష్ట్ర సరిహద్దుల్లో అడ్డుకున్నారు. దేశంలో అక్రమంగా ఉండే వారికి జార్జియాలోకి ప్రవేశం నిషిద్ధం. ఆ నిబంధనను సాకుగా చూపుతూ గోమెజ్‌తోపాటు ఆ కారులో ఉన్న వారందరినీ అధికారులు అరెస్ట్ చేశారు. అతడి తల్లి వచ్చి పౌరసత్వ కార్డు సహా ఆధారాలన్నీ చూపినా ససేమిరా అంటూ లియోన్ కౌంటీ జైలుకు వారిని తరలించారు. కేసు విచారణ సమయంలో గోమెజ్ తల్లి స్టేట్ ఐడెంటిటీ కార్డు, బర్త్ సర్టిఫికెట్, సోషల్ సెక్యూరిటీ కార్డు చూపారు. దీంతో, ఇమిగ్రేషన్ అధికారుల చర్యకు ఎటువంటి ఆధారాలు లేవంటూ గోమెజ్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ పరిమాణంపై ఇమిగ్రేషన్ విభాగం స్పందించలేదు. దేశ పౌరులను అదుపులోకి తీసుకునే అధికారం యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు లేకపోవడం గమనార్హం.

పురోగతి లేకపోతే వైదొలగుతాం

రష్యా, ఉక్రెయిన్‌లకు అమెరికా అల్టిమేటం

పారిస్: రష్యా, ఉక్రెయిన్ శాంతి చర్చలు ఎటూ తేలకపోవడంపై అమెరికా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ''వారాలు, నెలల తరబడి ప్రయత్నాలను కొనసాగించబోం. పురోగతి లేకపోతే చర్చల ప్రక్రియ నుంచి తప్పుకుంటాం. మధ్యవర్తిత్వ యత్నాల నుంచి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైదొలగుతారు''అని విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు. ''ఒప్పందంపై ట్రంప్ ఇప్పటికీ ఆసక్తిగా ఉన్నారు. కానీ యితే తక్షణ పురోగతి సంకేతాలు లేకపోతే ప్రయత్నాలను పూర్తిగా వదిలేయడానికి సిద్ధంగా ఉన్నారు''అని ఆయన వెల్లడించారు. శాంతి యత్నాల్లో భాగంగా గురువారం పారిస్‌లో యూరప్, ఉక్రెయిన్ నేతలతో రూబియో భేటీ అయ్యారు. అనంతరం రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో మాట్లాడినట్టు రూబియో శుక్రవారం మీడియాకు తెలిపారు. మరోవైపు ఉక్రెయిన్ ఖనిజాల ఒప్పందాన్ని వచ్చే వారంలో కుదుర్చుకోనున్నట్లు ట్రంప్ గురువారం తెలిపారు.

భారత్‌కు షింకన్సెన్ రైళ్లు




జపాన్ కానుక

టోక్యో: భారత్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన హైస్పీడ్ రైలు ప్రాజెక్టు ఊపందుకుంటోంది. ట్రయల్ రన్, తనిఖీ తదితర అవసరాల నిమిత్తం రెండు ఐకానిక్ షింకన్సెన్ రైళ్లను భారత్‌కు జపాన్ కానుకగా ఇవ్వనుంది. నిర్మాణంలో ఉన్న ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్‌లో ట్రయల్ రన్ కోసం వాటిని వినియోగించనున్నారు. వీటిలో ఒకటి ఇ5 సిరీస్‌కు, మరోటి ఇ3 సిరీస్‌కు చెందినవి. ఈ రైళ్లను 2026 మొదట్లో భారత్‌కు డెలివరీ చేయనున్నట్లు టోక్యోకు చెందిన ది జపాన్ టైమ్స్ దినపత్రిక తెలిపింది. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం పూర్తయితే దేశంలో తొలి హైస్పీడ్ రైలు మార్గం అవుతుంది. దీని గరిష్ట వేగం గంటకు 320 కిలోమీటర్లు. బుల్లెట్ ట్రైన్‌గా పిలిచే ఈ రైలు వ్యవస్థను భారత రైల్వే అనుబంధ సంస్థ నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ) అభివృద్ధి చేస్తోంది. ముంబై–అహ్మదాబాద్ మార్గంలో పనులు పూర్తయ్యాక అధిక ఉష్ణోగ్రతలు, ధూళి ప్రభావాలతో సహా డ్రైవింగ్ పరిస్థితులపై డేటాను సేకరించడానికి షింకన్సెన్ రైళ్లను ఉపయోగిస్తారు. అంతకు అవసరమైన తనిఖీ పరికరాలను బిగించిన మీదట జపాన్ వాటిని భారత్‌కు అప్పగించనుంది.

హైస్పీడ్ టెక్నాలజీ

షింకన్సెన్ జపాన్ హైస్పీడ్ రైల్వే టెక్నాలజీ. ఈ10 అందులో నెక్స్ట్ జనరేషన్ మోడల్. 2030 నాటికి ముంబై–అహ్మదాబాద్ కారిడార్లో ఈ అత్యాధునిక ఈ10 మోడల్ షింకన్సెస్ రైళ్లను ప్రవేశపెట్టాలని భారత్ యోచిస్తోంది. 'మేకిన్ ఇండియా'కింద ఈ రైళ్లను భారత్‌లోనే తయారు చేసేందుకు 2016లో నాటి జపాన్ ప్రధాని షింజో అబేతో ప్రధాని నరేంద్ర మోదీ ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాన్ని జపాన్ త్వరలో భారత్‌కు బదిలీ చేస్తుంది. ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌లో గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఆర్ఆర్‌టీఎస్, వందేభారత్ వంటి దేశీయంగా తయారైన సెమీ హైస్పీడ్ రైళ్లను భారత్ ఉపయోగిస్తోంది. ముంబై–అహ్మదాబాద్ హైస్పీడ్ కారిడార్లో ఈ5 సిరీస్ షింకన్సెన్ రైళ్లను నడపాలని తొలుత భావించింది. కానీ అధిక ఖర్చులు, జాప్యం కారణంగా ఆ ప్రతిపాదనలో ప్రతిష్టంభన ఏర్పడింది. దాన్ని తొలగించడమే గాక భారత్‌కు ఏకంగా అత్యాధునిక ఇ10 సిరీస్ రైళ్లను అందించేందుకు జపాన్ ముందుకొచ్చింది. అదే సమయంలో ఇ5, ఇ3 సిరీస్‌లకు చెందిన ఒక్కో రైలును ట్రయల్స్ తదితర అవసరాల నిమిత్తం పూర్తి ఉచితంగా అందించనున్నట్టు పేర్కొంది. మోదీ త్వరలో జరపనున్న జపాన్ పర్యటనలో ఇందుకు సంబంధించి ఒప్పందం కుదురుతుందని సమాచారం.

భగవద్గీత, నాట్యశాస్త్రానికి యునెస్కో గుర్తింపు


భగవద్గీత

మెమరీ ఆఫ్ ద వరల్డ్ రిజిస్టర్‌లో చోటు

న్యూఢిల్లీ: భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, కళలకు ప్రపంచవ్యాప్తంగా చక్కటి ఆదరణ లభిస్తోంది. భారతీయులు పవిత్రంగా భావించే భగవద్గీతతోపాటు భరతముని నాట్యశాస్త్రానికి అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. ఈ రెండింటిని ఐక్యరాజ్య సమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) మెమరీ ఆఫ్ ద వరల్డ్ రిజిస్టర్‌లో చేర్చారు. గురువారం మొత్తం 74 నూతన డాక్యుమెంటరీ హెరిటేజ్ కలెక్షన్లను ఈ రిజిస్టర్‌లో యునెస్కో పొందుపర్చింది. దీంతో ఇప్పటిదాకా ఇందులో కలెక్షన్ల సంఖ్య 570కు చేరుకుంది. ఈ రిజిస్టర్‌లో పుస్తకాలు, రాత ప్రతులు, మ్యాప్‌లు, ఫొటోగ్రాఫ్స్, ఆడియో, వీడియో రికార్డింగ్‌లు ఉంటాయి. వివిధ దేశాల నుంచి ఇండిపెండెంట్ ఇంటర్నేషనల్ అడ్వైజరీ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు వేటిని చేర్చాలన్న దానిపై యునెస్కో ఎగ్జిక్యూటివ్ బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుంది. ఈసారి చార్లెస్ డార్విన్(యూకే), ఫ్రెడరిక్ నీషే(జర్మనీ), విల్‌హెం కాన్రాడ్ రాంట్‌జెన్(జర్మనీ), కార్లోస్ చాగస్(బ్రెజిల్) తదితరుల డాక్యుమెంట్లను ఇందులో చేర్చారు.

ప్రధాని మోదీ హర్షం

భగవద్గీత, భరతముని నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ ద వరల్డ్ రిజిస్టర్‌లో స్థానం దక్కడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి భారతీయుడికీ ఇది గర్వించదగ్గ క్షణమని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. మన ఘనమైన సంస్కృతి, విజ్ఞానానికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందన్నారు. భగవద్గీత, నాట్యశాస్త్రం శతాబ్దాలపాటు మన నాగరికత మరింత అభివృద్ధి చెందడానికి దోహదపడ్డాయని తెలిపారు. అంతేకాకుండా ప్రపంచాన్ని సైతం ప్రభావితం చేస్తున్నాయని ఉద్ఘాటించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సైతం స్పందించారు. భారతదేశ నాగరికత, వారసత్వానికి ఇది చరిత్రాత్మక క్షణమని వెల్లడించారు. యునెస్కో మెమరీ ఆఫ్ ద వరల్డ్ రిజిస్టర్‌లో ఇండియా నుంచి ఇప్పటివరకు 14 హెరిటేజ్ డాక్యుమెంట్లకు చోటు దక్కిందన్నారు. భగవద్గీత, నాట్యశాస్త్రానికి ప్రపంచస్థాయిలో అరుదైన గుర్తింపు దక్కడం పట్ల కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా సైతం హర్షం వ్యక్తంచేశారు.

ఎందరు 'షా'లు వచ్చినా అదరం బెదరం: స్టాలిన్

సాక్షి, చెన్నై: ఢిల్లీ పాలకులకు తలొగ్గే ప్రసక్తే లేదని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సహా ఎందరు 'షా'లు వచ్చినా అదరం బెదరం అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తేల్చిచెప్పారు. శుక్రవారం చెన్నై శివారులోని తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యాన్ని సహించే ప్రసక్తే లేదన్నారు. తమిళనాడు ఎన్నడూ ఎవరికీ తలవంచదని స్పష్టంచేశారు. మీ పరివారం మొత్తం తీసుకురండి చూద్దాం అంటూ కేంద్ర ప్రభుత్వ పెద్దలకు సవాలు విసిరారు. ఇతర రాష్ట్రాల్లో సాగినట్లుగా బీజేపీ ఆటలు తమిళనాడులో సాగవని తేల్చిచెప్పారు. ఎన్ని రూ.వేల కోట్ల నిధులు ఇచ్చినా ఇక్కడి వారు ఏడుస్తూనే ఉన్నారంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యలపై స్టాలిన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఏడవడం లేదని, తమ హక్కును సాధించుకొనేందుకు పోరాడుతున్నామని చెప్పారు. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తాము మళ్లీ అధికారంలోకి వస్తామని స్టాలిన్ ధీమా వ్యక్తంచేశారు. న్యాయపోరాటానికే కాదు, అవసరమైతే ఏ పోరాటాలకైనా సిద్ధమని అన్నారు. నీట్, త్రిభాషా విధానం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై నిజాలు చెప్పడానికి అమిత్‌షా సిద్ధమా? అని ప్రశ్నించారు. గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి గడువులోగా తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగిస్తున్నామని స్టాలిన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ ఉత్తర్వులు ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులకు నచ్చడం లేదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌పై పరోక్షంగా ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రతినిధులే ప్రభుత్వాన్ని నడపాలని పేర్కొన్నారు. అంతేతప్ప నియామకాల ద్వారా పదవుల్లో వచ్చినవారు ప్రభుత్వాన్ని నడపొద్దని స్పష్టంచేశారు. చట్టం కంటే ఎవరూ ఎక్కువ కాదని ఉద్ఘాటించారు.



ఎలాన్ మస్క్‌కు ప్రధాని మోదీ ఫోన్

సాంకేతికత, నూతన ఆవిష్కరణలపై సంభాషణ

న్యూఢిల్లీ: టెస్లా, స్పేస్ఎక్స్ సంస్థల అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ఇండియన్ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్‌లోకి త్వరలో టెస్లా అడుగుపెట్టబోతున్న నేపథ్యంతో వారిద్దరూ మాట్లాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మస్క్, మోదీ పలు కీలక అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. టెక్నాలజీ, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో భారత్, అమెరికా మధ్య పరస్పర సహకార మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు. సాంకేతికత, నవీన ఆవిష్కరణల విషయంలో ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకొనేలా పటిష్ట వ్యూహంతో ముందుకెళ్లాలని ఉద్ఘాటించారు. మస్క్‌తో సంభాషణ అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. మస్క్‌తో చక్కటి సంభాషణ జరిగిందన్నారు. వేర్వేరు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నామని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో తాము కలిసినప్పుడు చర్చించుకున్న అంశాలు మరోసారి ప్రస్తావనకు వచ్చాయన్నారు. ప్రధానంగా టెక్నాలజీ, ఇన్నోవేషన్ పైనే తమ మాట్లాడుకున్నామని వివరించారు. ఈ రెండు అంశాల్లో అమెరికాతో భాగస్వామ్యాన్ని మరింత దృఢతరం చేసుకొనేందుకు కట్టుబడి ఉన్నామని మోదీ స్పష్టంచేశారు. మరోవైపు ఇండియన్ మార్కెట్‌లో ప్రవేశించానికి టెస్లా ఏర్పాట్లు చేసుకుంటోంది. తొలుత ముంబై, ఢిల్లీ, బెంగళూరులో టెస్లా కార్లు విక్రయించబోతున్నారు. వేలాది టెస్లా కార్లు ఇండియాను ముంచెత్తబోతున్నాయి.

యెమెన్ నౌకాశ్రయంపై అమెరికా భీకరదాడులు

74 మంది మృతి, 171 మందికి గాయాలు

దుబాయ్: యెమెన్‌లోని హౌతీ రెబల్స్ ఆధీనంలో ఉన్న చమురు నౌకాశ్రయంపై అమెరికా భీకర వైమానిక దాడులు జరిపింది. ఘటనలో 74 మంది చనిపోగా, 171 మంది గాయపడినట్లు హౌతీలు ప్రకటించారు. కాగా, హౌతీల లక్ష్యాలపై ట్రంప్ ప్రభుత్వం మార్చి 15 నుంచి కొనసాగిస్తున్న దాడుల్లో శక్తివంతమైంది ఇదేనని చెబుతున్నారు. గురువారం రాత్రి జరిగిన దాడితో రస్ ఇసా ఆయిల్ పోర్టులో భీకర శబ్దాలతోపాటు భారీగా మంటలు వ్యాపించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దాడికి సంబంధించిన గ్రాఫిక్ ఫుటేజీని హౌతీలు విడుదల చేశారు. ఇరాన్ దన్నుతో చెలరేగుతున్న హౌతీల ప్రధాన ఆదాయ వనరును ధ్వంసం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఒక ప్రకటనలో పేర్కొంది. గత పదేళ్లుగా ఈ ప్రాంతంలో భయోత్పాతం సృష్టించే హౌతీలకు అక్రమ ఆదాయం అందకుండా చేయడానికే ఈ దాడుల లక్ష్యమని తెలిపింది. శాంతియుతంగా జీవించాలని కోరుకునే యెమెన్ ప్రజలకు హాని తలపెట్టడం తమ ఉద్దేశం కాదని పేర్కొంది. అమెరికా దాడిని హౌతీలు తీవ్రంగా ఖండించారు. ఇది యెమెన్ సార్వభౌమత్వంపై చేసిన దాడిగా పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో 33 మంది మావోలు లొంగుబాటు

సుక్మా: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 33 మంది మావోయిస్టులు భద్రతా బలగాల ఎదుట లొంగిపోయారు. వీరిలో 17 మందిపై మొత్తం రూ.49 లక్షల రివార్డు ఉందని ఎస్పీ కిరణ్ చవాన్ చెప్పారు. వీరిలో 9 మంది మహిళలు సహా 22 మంది సీఆర్‌పీఎఫ్ ఎదుట, మరో ఇద్దరు మహిళలు సహా 11 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారని వివరించారు. సైద్ధాంతిక బలం లేని మావోయిస్టు పార్టీ స్థానిక గిరిజనులపై అమానవీయ చర్యలకు పాల్పడుతున్నందునే తీవ్రవాదాన్ని వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు వీరు చెప్పారన్నారు. లొంగిపోయిన వారిలో సుమారు 22 మంది ఛత్తీస్‌గఢ్‌లోని మా, ఒడిశాలోని నౌపడలో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కిరణ్ చవాన్ వివరించారు. లొంగుబాట పట్టిన వారిలో ప్రముఖంగా పీఎల్‌జీఏ డిప్యూటీ కమాండర్ ముచాకి జోగా(33), అతడి భార్య, అదే స్క్వాడ్‌కు చెందిన జోగి(28) ఉన్నారని వీరిపై రూ.8 లక్షల చొప్పున రివార్డు ఉందని ఎస్పీ చెప్పారు. ఇంకా కమిటీ సభ్యులైన కికిడ్ దెవె(30), మనోజ్‌లపై రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉందన్నారు.

ఉగ్రవాది హ్యాపీ పాసియా అరెస్టు

న్యూయార్క్/చండీగఢ్: గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదిగా మారిన హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ పాసియా అలియాస్ జోరా అమెరికాలో అరెస్టయ్యాడు. పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ, ఖలిస్తానీ సంస్థ బీకేఐతో సంబంధాలున్న హ్యాపీ పాసియా పంజాబ్‌లో పలు ఉగ్రవాద దాడుల ఘటనల్లో నిందితుడిగా రికార్డుకెక్కాడు. వాంటెట్ జాబితాలో ఉన్న జోరా కోసం భారత దర్యాప్తు అధికారులు వెతుకుతున్నారు. అమెరికాలోని శాక్రమెంటో నగరంలో ఎఫ్‌బీఐ అతడిని అదుపులోకి తీసుకున్నట్లు అమెరికా అధికారులు శుక్రవారం వెల్లడించారు. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించినందుకు అక్కడి అధికారులు అరెస్టు చేసినట్లు తెలిపారు. పంజాబ్‌లో 16 ఉగ్రవాద దాడుల్లో జోరా ప్రమేయం ఉన్నట్లు భారత అధికారులు గుర్తించారు. ఈ ఏడాది జనవరిలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అతడిపై రూ.5 లక్షల నగదు రివార్డు ప్రకటించింది. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్ జిల్లాలోని పాషియా గ్రామంలో జన్మించిన జోరా తొలుత గ్యాంగ్‌స్టర్‌గా వ్యవహరించాడు. తర్వాత పాకిస్తాన్, ఖలిస్తాన్ సంస్థలతో సంబంధాలు ఏర్పరచుకొని ఉగ్రవాదిగా మారాడు. 2018 ఏప్రిల్‌లో దుబాయ్‌కి చేరుకున్నాడు. 2019లో ఫిబ్రవరిలో ఇండియాకు తిరిగివచ్చాడు. 2020 అక్టోబర్‌లో లండన్‌కు, అక్కడి నుంచి అమెరికాకు వెళ్లిపోయాడు.

ఇలాంటి ఉపరాష్ట్రపతిని ఏనాడూ చూడలేదు: సిబల్

న్యూఢిల్లీ: రాష్ట్రపతిని ఆదేశించే అధికారం న్యాయ వ్యవస్థకు లేదంటూ వ్యాఖ్యానించిన ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తీరును రాజ్యసభ సభ్యుడు, సీనియర్ లాయర్ కపిల్ సిబల్ తప్పుపట్టారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉంటూ రాజకీయపరమైన స్టేట్‌మెంట్లు ఇచ్చిన ఉప రాష్ట్రపతిని తన జీవితంలో ఏనాడూ చూడలేదని అన్నారు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ అధికార, విపక్షాల మధ్య సమదూరం పాటించాల్సి ఉంటుందని చెప్పారు. అంతేతప్ప ఒక రాజకీయ పార్టీకి అధికార ప్రతినిధిగా పనిచేయకూడదని పేర్కొన్నారు. కపిల్ సిబల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు హుందాగా వ్యవహరించాలని సూచించారు. పదవికి రాజ్యాంగం కల్పించిన ప్రతిష్టను దిగజార్చకూడదని చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థకు ఉప రాష్ట్రపతి పాఠాలు చెప్పాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా పని చేస్తుందని తెలిపారు. కోర్టులు ఇచ్చే తీర్పులు నచ్చకపోతే దూషించడమే పనిగా పెట్టుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

ఉపాధి హామీ పనులు..

17 జిల్లాలు అప్.. 15 జిల్లాలు డౌన్..



నోటిఫైడ్ వేతనం రూ.300..

కూలీలు పొందినది రూ.213 మాత్రమే

ఆధార్ పేమెంట్స్ తప్పనిసరితో గత మూడేళ్లలో 6.1 లక్షల కుటుంబాలు 21 లక్షల మంది కార్మికుల తొలగింపు..

సాక్షి, హైదరాబాద్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో తెలంగాణకు సంబంధించి మిశ్రమ ఫలితాలు నమోదయ్యాయి. జాతీయస్థాయిలో పనిదినాల కల్పనలో 7 శాతం క్షీణత నమోదు కాగా...అదే తెలంగాణలో 1.1 శాతం వృద్ధి నమోదైంది. అయితే అదే సమయంలో కుటుంబాల సగటు పనిదినాలు అనేవి మాత్రం 2023-24లో 47.71 ఉండగా, 24-25లో 45.80 కి పడిపోయాయి. కుటుంబాలకు సంబంధించి వందరోజుల పని విషయంలో ఒకేసారి 31.1 శాతానికి దిగజారింది. ఇదే సమయంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 32 జిల్లాలకు (హైదరాబాద్ మినహా)గాను 17 జిల్లాల్లో ఉపాధి పనుల పెరుగుదల నమోదు కాగా, 15 జిల్లాల్లో తగ్గుదల రికార్డయ్యింది. శుక్రవారం లిబ్‌టెక్ ఇండియా సంస్థ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం...మొత్తం పనిదినాలు 12.1 కోట్ల నుంచి 12.2 కోట్లకు (1.1%) పెరిగాయి. అయితే జాతీయస్థాయిలో చూస్తే..పనిదినాలు మాత్రం 7% శాతం తగ్గాయి. అంటే సాపేక్షంగా తెలంగాణ పరిస్థితి ఈ విషయంలో బాగుంది.

ముఖ్యాంశాలు..

- ఒక్కో ఇంటికి లభించిన సగటు పనిదినాలు 47.71 నుంచి 45.80 రోజులకు (4%) తగ్గాయి. ఎక్కువమంది పథకంలో పనిచేసినా, అందరికీ తగిన స్థాయిలో పని లభించలేదు.
- 100 రోజుల పనిపొందిన కుటుంబాల సంఖ్యలో తీవ్ర పతనం.. 100 రోజులు పనిచేసిన కుటుంబాల సంఖ్య 1.35 లక్షల నుంచి 0.93 లక్షలకు (31.1%) తగ్గింది.ఇది జాతీయస్థాయి పతనం (9.5%) కంటే 3 రెట్లు అధికం.

మొదటి 3.. చివరి 3 జిల్లాలు ఇలా..

- తెలంగాణలోని 32 జిల్లాల్లో 17 జిల్లాల్లో పని దినాలు పెరిగాయి. టాప్‌లో ములుగు జిల్లా +36.5%, కామారెడ్డి జిల్లా +24.6%, వరంగల్ +23.7% ఉన్నాయి. చివరి నుంచి మేడ్చల్ జిల్లా -25.3%, సంగారెడ్డి జిల్లా -19.2%, మహబూబాబాద్ జిల్లా -18.1%తో గణనీయంగా క్షీణించాయి.

ఏప్రిల్-మే లో వృద్ధి, తర్వాత క్షీణత

- 2024 ఏప్రిల్‌లో +88%, మేనెలలో +35%తో పనిదినాల్లో భారీ పెరుగుదల ఉంది. కానీ జూన్ 2024 నుంచి మార్చి 2025 వరకు గత సంవత్సరం కంటే పనిదినాలు తగ్గాయి. 2024 మే 24న కేంద్రం తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలో 60% వ్యవసాయ ఖర్చుల నిబంధనల ఉల్లంఘనలపై ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత ఈ క్షీణత జరిగింది.

ఉపాధి కూలీల తొలగింపులు తగ్గకపోవడం, పునరుద్ధరణలో వెనుకబాటు ▶ నికరంగా 0.91 లక్షల మంది కార్మికులు తొలగింపునకు గురయ్యారు. | దేశవ్యాప్తంగా 119 లక్షల కొత్త కార్మికులు ఈ పథకంలో చేరగా, తెలంగాణ ఈ విషయంలో వెనుకబడింది. | ఆధార్ పేమెంట్ వ్యవస్థను తప్పనిసరి చేయడం వల్ల గత మూడేళ్లలో రాష్ట్రం నుంచి 6.1 లక్షల కుటుంబాలు, 21లక్షల కార్మికులను తొలగించారు.

అధిక వేతన నోటిఫికేషన్ ఉన్నా, వాస్తవ వేతనంలో తీవ్ర వ్యత్యాసం.. ▶ నోటిఫైడ్ వేతనం రూ.300కి పెరిగినా. వాస్తవంగా కార్మికులు పొందిన వేతనం రూ.213 మాత్రమే.. అంటే 71% మాత్రమే నోటిఫైడ్. వాస్తవ వేతనాల మధ్య వ్యత్యాసం అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి.

తెలంగాణలో ఉపాధి నిధుల దుర్వినియోగం రూ.24.55 కోట్లు

గ్రామీణాభివృద్ధి శాఖ ఏటీఆర్ నివేదిక వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024-25గాను దేశవ్యాప్తంగా నిర్వహించిన సామాజిక తనిఖీల్లో నిధుల దుర్వినియోగ వివరాలను యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) వెల్లడించింది. తెలంగాణ విషయానికొస్తే.. రూ.24.55 కోట్లు దుర్వినియోగం జరగ్గా, వీటిలో కేవలం రూ.6.22 లక్షలు (0.25శాతం) మాత్రమే రికవరీ చేసినట్టు తెలిపింది. నిధుల దుర్వినియోగంపై 5,985 మందికి హెచ్చరికలు జారీ చేయగా, ముగ్గురిని టెర్మినేట్ చేసినట్టు వివరించింది.

'వుమ్మిడి' జ్యువెల్లర్స్ అక్షయ తృతీయ ఆఫర్స్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 30వ తేదీన అక్షయ తృతీయ సందర్భంగా వుమ్మిడి బంగారు జ్యువెల్లర్స్ అద్భుతమైన ఆఫర్స్‌ను అందిస్తున్నట్లు వుమ్మిడి బంగారు జ్యువెల్లర్స్ మేనేజింగ్ పార్టనర్ అమరేంద్ర వుమ్మిడి ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రతీ అక్షయ తృతీయ మాకు ఎంతో ప్రత్యేకమైంది. అయితే ఈ ఏడాది మా సంస్థ 125వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ఇది మరింత ప్రాముఖ్యం పొందింది. వినియోగదారుల కోసం అద్భుతమైన ఆభరణాలను అందుబాటులోకి తెస్తున్నాం. ఈ సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నాం. ఈ ఆఫర్ ఈనెల 15వ తేదీ నుంచి మే 1 వరకు అందుబాటులో ఉంటుంది. బంగారం, డైమండ్, ప్లాటినం, విలువైన రాతి ఆభరణాలు, వెండి సామగ్రి తయారీ చార్జీలపై 20 శాతం వరకు తగ్గింపు ఉంటుంది' అని పేర్కొన్నారు.

కమీషన్ల కోసమే ఏజెంట్ల కక్కుర్తి

- ఉద్యోగం ఇప్పిస్తామంటూ యువత నుంచి రూ. 50-రూ.60 వేలు వసూలు
- సైబర్ ముఠాలకు అప్పగిస్తూ వారి నుంచి అంతేస్థాయిలో కమీషన్లు
- 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'దర్యాప్తులో కీలక వివరాలు వెల్లడించిన ఏజెంట్ బషీర్
- ఇప్పటికే 8 మంది ఏజెంట్లు అరెస్టు.. తాజాగా మరో కేసు నమోదు




సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాల పేరిట ఏజెంట్లు వేసే ఉచ్చులో యువత ఈజీగా చిక్కుకుంటోంది. విదేశాల్లో కొలువు చేసి బాగా స్థిరపడాలన్న వారి ఆశను కొందరు ఏజెంట్లు సొమ్ము చేసుకుంటున్నారు. థాయ్‌లాండ్‌లో డేటా ఎంట్రీ, ఇతర ఉద్యోగాల్లో చేర్చుతామని ఒక్కొక్కరి నుంచి రూ.50 -రూ.60 వేలు కమీషన్లు తీసుకొని అక్కడకు పంపుతున్నారు. ఆ తర్వాత వారిని ఒక బంగ్లాదేశీయుడి ద్వారా మయన్మార్, కాంబోడియాలోని చైనీయులు నడిపే సైబర్‌నేర ముఠాలకు అప్పగిస్తున్నారు. ఈ క్రమంలో వారి నుంచి కూడా కమీషన్లు తీసుకుంటారు. ఈ మొత్తం వ్యవహారంలో బంగ్లాదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి కీలకంగా ఉన్నట్టు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు దర్యాప్తులో గుర్తించారు. రాష్ట్రానికి చెందిన 24 మందిని గత నెలలో మయన్మార్ ఆర్మీ రెస్క్యూ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మయన్మార్ ముఠా నుంచి బయట పడి ఇండియాకు వచ్చిన వనస్థలిపురానికి చెందిన సాయికార్తీక్ ఫిర్యాదుతో టీజీసీఎస్‌బీ మరో కేసు నమోదు చేసింది. అన్ని కేసుల్లో కీలకంగా వ్యవహరించిన స్థానిక ఏజెంట్లపై టీజీసీఎస్‌బీ అధికారులు ఫోకస్ పెంచారు. ఇప్పటికే ఎనిమిది మంది ఏజెంట్లను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠా ఏజెంట్లలో ఒకరైన బషీర్ అహ్మద్ నుంచి సేకరించిన వివరాల మేరకు బంగ్లాదేశ్‌కు చెందిన రియాజ్‌ఖాన్ ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా ఉన్నట్టు గుర్తించారు.

అందరిదీ అదే కథ

ఆర్థిక అవసరాలు తీరక, విదేశాల్లో కొలువుల కోసం ప్రయత్నించే వారిని కొందరు ఏజెంట్లు టార్గెట్ చేస్తున్నారు. థాయ్‌లాండ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్, టెలికాలర్ జాబ్స్ ఉన్నాయని, కొంత డబ్బు ఖర్చు పెట్టుకుంటే అక్కడకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని నమ్మబలుకుతున్నారు. అక్కడి కంపెనీల ప్రతినిధులతో జూమ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఎదుటి వ్యక్తులు తమ వలలో పడ్డట్టు గుర్తించిన తర్వాత, మొదట థాయ్‌లాండ్‌కు పంపుతున్నారు. 'అక్కడ విమానం దిగగానే.. కంపెనీ ప్రతినిధి వచ్చి మిమ్మల్ని కలుస్తాడు.. మీరు పనిచేసే చోటకు తీసుకెళతాడు'అని చెబుతున్నారు. ముందు చెప్పినట్టుగానే సైబర్ ముఠాకు చెందిన వారు ఎయిర్‌పోర్టుకు వచ్చి భారత్ నుంచి వచ్చిన యువకులను రిసీవ్ చేసుకుంటారు. వెంటనే వారి నుంచి పాస్‌పోర్టును తీసుకొని ఆ తర్వాత మయన్మార్‌లోని కేకే3 పార్క్ ప్రాంతంలోని సైబర్ ముఠాల కాల్ సెంటర్లకు పంపుతున్నారు. ఇలా భారత్ నుంచి మనుషులను అక్రమంగా రవాణా చేసినందుకు ఒక్కో ఏజెంట్‌కు రూ.50 నుంచి రూ.60వేల వరకు సైబర్‌ముఠాలు ఇస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని రియాజ్‌ఖాన్ హైదరాబాద్ సహా దేశంలోని పలు నగరాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా చేస్తున్నట్టు టీజీసీఎస్‌బీ అధికారులు గుర్తించారు. అటు అమాయకులైన యువకుల నుంచి రూ.50 నుంచి రూ.60 వేల వరకు, అటు సైబర్ ముఠాల నుంచి రూ. 60 వేల వరకు ఈ ఏజెంట్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా సైబర్ ముఠాలకు చేరిన యువకులతో చైనా సైబర్ ముఠాలు క్రిప్టో కరెన్సీ, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు సహా పలు రకాల ఆర్థిక మోసాలపై తర్ఫీదు ఇచ్చి మరీ చేయిస్తున్నారు. ఈ వ్యవహారం నచ్చక ఎదురు తిరిగితే పాస్‌పోర్టు ఇచ్చేందుకు రూ.లక్షల్లో డబ్బులు ఇవ్వాలని చిత్రహింసలు పెడుతు న్నారు. మయన్మార్, ఇండియన్ ఆర్మీ రెస్క్యూ ఆపరేషన్లలో బయటపడుతున్న కొందరు తిరిగి స్వస్థలాలకు చేరుకుంటున్నారు. ఇలా తెలంగాణకు చేరిన బాధితుల నుంచి ఫిర్యా దులు తీసుకోవడంతోపాటు ఈ మయన్మార్ ముఠాలపై టీజీసీఎస్‌బీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది.

టీటీడీ గోవుల మరణాలపై కోర్టులో కేసు వేస్తా

- 'సాక్షి'తో కేంద్ర మాజీ మంత్రి సుబ్రహ్మణ్యస్వామి
- ఒకేసారి వందల సంఖ్యలో గోవుల మృతి వెనుక కుట్ర ఉంది
- దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరగాలి



సాక్షి, అమరావతి: టీటీడీ గోశాలలో ఒకేసారి వందల గోవులు చనిపోవడం అనుమానాలు రేకెత్తిస్తోందని, దీని వెనుక కుట్ర ఉందని, అన్ని కోణాల్లో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి, విరాట్ హిందూస్థాన్ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి అభిప్రాయపడ్డారు. కొన్ని గోవులే చనిపోయాయని తేలిగ్గా వదిలేసే విషయం కాదని, ఇది చాలా తీవ్రమైన అంశమని అన్నారు. తిరుపతి నుంచి అధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. తర్వలోనే తిరుమల వెళ్లి పూజల్లో పాల్గొన్న అనంతరం గోవుల మరణంపై అదనపు సమా చారం సేకరించి, జూలై మొదటి వారంలోగా కోర్టును ఆశ్ర యించనున్నట్లు వివరించారు. సమర్థ చర్యలు తీసుకోవడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గోవుల రక్షణకు రాజ్యాంగ పరంగా ప్రాధాన్యం ఉందని.. కానీ, టీటీడీ పెద్దలు, ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని పేర్కొన్నారు. గోవుల మృతిపై టీటీడీ చైర్మన్ బాధ్యతారహితంగా మాట్లాడడాన్ని సుబ్రహ్మణ్యస్వామి తప్పుబట్టారు. ఆయన వెంటనే పదవికి రాజీ నామా చేయాలని, లేదంటే సీఎం చంద్రబాబే తప్పించాలని డిమాండ్ చేశారు. సుబ్రహ్మణ్యస్వామి శుక్రవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. ''టీటీడీ గోవుల మృతి నాకు చాలా బాధ కలిగించింది. ఎన్ని చని పోయాయన్నది కాదు. రాజ్యాంగంలో గో సంరక్షణ గురించి స్పష్టంగా ఉంది. ప్రతి ప్రభుత్వం అందుకు కట్టుబడి ఉండాలి. వయసు మళ్లిన మనుషుల్లాగే గోవులు కూడా చనిపోతున్నా యంటూ టీటీడీ చైర్మన్ బాధ్యతారహితంగా మాట్లాడారు. రేపు నువ్వు చనిపోతే కూడా వయసు మళ్లిందని వదిలేస్తారా? ఎవరినైనా వృద్ధులని చంపేస్తుంటే అది సాధారణమే అనుకోవచ్చా? ఇవి పరిణతి లేని వ్యాఖ్యలు.

చంద్రబాబు ప్రభుత్వానిది వ్యాపార ధోరణి

గోవుల జీవనశైలి భిన్నమైనది. చాలా ఊళ్లలో ఎవరి అజమాయిషీ లేకుండా ఆరోగ్యంగా జీవిస్తుంటాయి. ఒకేసారి పెద్ద సంఖ్యలో చనిపోయే పరిస్థితి సాధారణంగా ఉండదు. టీటీడీలో చంద్రబాబు ప్రభుత్వ వ్యాపార ధోరణి కారణంగా ఇలా జరుగుతుండొచ్చు. గోవులకు సరైన వైద్యం అందించకుండా వదిలేస్తున్నందుకే ఇలా జరిగి ఉండొచ్చు. గోవుల కళేబరాలను ఏం చేశారన్నది తేలాల్సి ఉంది. మాంసాన్ని రెస్టారెంట్లకు పంపుతున్నారా? గోవు కోట్లాది మందికి ఆరాధ్య దైవం. టీటీడీ చైర్మన్ దానిగురించి తెలుసుకోవాలి. రాజ్యాంగంపై అవగాహన ఉన్నవారు ఎవరూ అలా మాట్లాడరు అని అన్నారు.

ఏపీ రాజధాని నిర్మాణ పనుల్లో..

రూ.9,000 కోట్ల ప్రజాధనానికి 'టెండర్'!

సిండికేట్లతో మిలాఖత్.. ఒక్క మొబిలైజేషన్ అడ్వాన్సుల్లోనే రూ.3,200 కోట్లకుపైగా ముఖ్యనేత జేబులోకి

ఇదీ స్థూలంగా నష్టం..!	రాజధాని పనులను అధిక ధరలకు కట్టబెట్టడం వల్ల ఖజానాపై అదనపు భారం: రూ.1,231.42 కోట్లకుపైగా	జ్యుడీషియల్ ప్రివ్యూ-రివర్స్ టెండరింగ్ అమలు చేయకపోవడంతో నష్టం: రూ.4,000 కోట్లు	కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించి 8 శాతం కమీషన్లు వసూళ్లతో అక్రమాలు: రూ.3,200 కోట్లకుపైగా

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో 2014లో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి తక్కువ ధరలకే రైతుల నుంచి భూములు కాజేసిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు రాజధాని నిర్మాణ పనుల్లో భారీ ఎత్తున దోపిడీకి తెర తీశారు. రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించక ముందే సన్నిహితు లకు చెందిన తొమ్మిది కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యనేత సిండికేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే రూ.40,497.55 కోట్ల విలువైన 63 ప్యాకేజీల పనులను సిండికేట్ కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. ఆ మేరకు పనులు అప్ప గిస్తూ సిండికేట్ కాంట్రాక్టర్లతో సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ), ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అగ్రిమెంట్ (ఒప్పందం) చేసుకున్నాయి. ఆ వెంటనే అగ్రిమెంటు విలువలో పది శాతం అంటే రూ.4,049.75 కోట్లను మొబిలైజేషన్ అడ్వాన్సుగా ముట్టజెప్పాయి. అందులో ఎనిమిది శాతం అంటే రూ.3,239.80 కోట్లను ముఖ్యనేత వసూలు చేసుకున్నారు!

అధిక ధరలకు కట్టబెట్టి..

రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ (ఆసియా అభివృద్ధి బ్యాంకు) నుంచి రూ.15 వేల కోట్లు, హడ్కో (హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి రూ.11 వేల కోట్లు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.5 వేల కోట్లు వెరసి రూ.31 వేల కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తెచ్చింది. రాజధాని నిర్మాణ పనులకు రూ.47,249 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశామని.. మరో 46,249 కోట్ల రుణం కోసం ప్రయత్నిస్తున్నామని ఇటీవల 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు చెప్పారు. అప్పు తెచ్చిన నిధులతో రాజధాని నిర్మాణ పనులు చేపట్టారు. పనుల అంచనాలను భారీగా పెంచేశారు. అధిక ధరలకు కాంట్రాక్టర్లకు కట్టబెట్టి ఖజానాపై తీవ్ర భారం మోపారు.

- ప్రస్తుత ఎస్ఎస్ఆర్(స్టాండర్డ్ షెడ్యూల్ రేట్స్) ధరల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి జీఎస్టీ, సీనరేజీ వంటి పన్నులతో కలిపి రూ.250 కోట్లకు మించదు. ప్రస్తుత ధరల ప్రకారం మట్టి తవ్వకానికి క్యూబిక్ మీటర్‌కు రూ.వంద చెల్లిస్తున్నారు. ఈ లెక్కన 10 నుంచి 11 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ తవ్వకానికి కి.మీ.కి రూ.5.5 కోట్ల నుంచి రూ.6 కోట్లకు మించి వ్యయం కాదని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు స్పష్టం చేస్తున్నారు. కానీ రాజధాని వరద ముంపు నివారణ పనుల్లో 0.4 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన నీరుకొండ రిజర్వాయర్ నిర్మాణ పనులకు రూ.470.74 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచారు. ఆ పనిని రూ.487.41 కోట్లకు(3.54 శాతం అధిక ధరకు) ఎన్‌సీసీ సంస్థకు అప్పగించారు. జీఎస్టీ, సీనరేజీ వంటి పన్నుల రూపంలో రూ.68.30 కోట్లను రీయింబర్స్ చేయనున్నారు. అంటే 0.4 టీఎంసీల సామర్థ్యం కలిగిన నీరుకొండ రిజర్వాయర్ పనులను రూ.555.41 కోట్లకు కట్టబెట్టినట్లు స్పష్టమవుతోంది. అంచనా వ్యయాన్ని రూ.305.41 కోట్లు పెంచేసినట్లు వెల్లడవుతోంది.

రాజధాని నిర్మాణ పనుల్లో ఏ సంస్థకు ఎంత విలువైన పనులు?

సంస్థ పేరు	అప్పగించిన పనుల విలువ (రూ.కోట్లలో) (జీఎస్టీ, న్యాక్, సీనరేజీ వంటి పన్నులు కాకుండా)
1.బీఎస్సార్ ఇన్‌ఫ్రాటెక్	7,298.97
2.మేఘా	7,022.38
3.ఎన్‌సీసీ	6,910.93
4.ఆర్వీఆర్	6,031.79
5.ఎల్ అండ్ టీ	1,427.21
6.ఎంవీఆర్ ఇన్‌ఫ్రా	796.04
7.బీఎస్‌సీపీఎల్	779.82
8.కేఎంవీ ప్రాజెక్ట్స్	429.23
9.పీవీఆర్ ప్రాజెక్ట్స్	309.06

- దేశంలో ఎన్‌హెచ్ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) కి.మీ.కి సగటున రూ.20 కోట్ల చొప్పున ఆరు వరుసలతో కూడిన జాతీయ రహదారులను నిర్మిస్తోంది. కానీ అమరావతిలో ఆరు వరుసల రహదారి నిర్మాణ పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేశారు. ఈ-13 రహదారిని ఎన్‌హెచ్-16 వరకూ పొడిగిస్తూ 7.29 కి.మీ.ల పొడవున ఆరు వరుసలతో నిర్మించడానికి రూ.384.78 కోట్ల అంచనాతో ఏడీసీఎల్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. జీఎస్టీ, సీనరేజీ లాంటి పన్నుల రూపంలో 81.92 కోట్లు రీయింబర్స్ చేస్తామని పేర్కొంది. అంటే.. అంచనా వ్యయం రూ.466.7 కోట్లు అన్నమాట. ఈ లెక్కన కి.మీకి 64.01 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణ పనులకు టెండర్ పిలిచినట్లు స్పష్టమవుతోంది. జాతీయ రహదారికి కి.మీ.కి అయ్యే వ్యయం కంటే ఈ-13 రహదారి వ్యయం రూ.44.01 కోట్లు అధికంగా పెంచేశారు.
- భూసమీకరణ కింద రాజధానికి 29,357 మంది రైతులు 34,773.76 ఎకరాల భూమిని ఇచ్చారు. ల్యాండ్ పూలింగ్ స్కీం కింద ఆ రైతులకు 17 వేల ఎకరాల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇవ్వాలి. ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధి పనులకు 18 ప్యాకేజీల కింద రూ.14,887.64 కోట్లతో కాంట్రాక్టర్లకు అప్పగించింది. కాంట్రాక్టు విలువలో 18 శాతం జీఎస్టీ, 0.45% సీనరేజీ, 0.1 శాతం న్యాక్ పన్నుల రూపంలో రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. అంటే.. అప్పుడు వాటి వ్యయం రూ.2,761.66 కోట్లు ఇస్తారన్నమాట. ఈలెక్కన ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధి పనుల కాంట్రాక్టు విలువ రూ.17,649.3 కోట్లుకు చేరుతుంది. ఈ లెక్కన ఎకరంలో లేఅవుట్ అభివృద్ధికి రూ.కోటికిపైగా వెచ్చిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కానీ అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించి లేఅవుట్‌ను అభివృద్ధి చేసి నా ఎకరానికి రూ.50 నుంచి రూ.60 లక్షలకు మించదని బడా రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.
- అత్యాధునిక హంగులతో భవనాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.1,800 నుంచి రూ.2 వేలకు మించదు. అంతస్తులు పెరిగే కొద్దీ నిర్మాణ వ్యయం తగ్గుతుంది. పైగా ఇసుక ఉచితం. ఈ లెక్కన రాజధానిలో భవనాల నిర్మాణ వ్యయం తగ్గాలి. కానీ వ్యయాన్ని భారీగా పెంచేసి అధిక ధరలకు కాంట్రాక్టర్లకు అప్పగించారు. మంత్రుల బంగ్లాల నిర్మాణ పనులను చదరపు అడుగుకు రూ.10,042.86 చొప్పున అప్పగించడం గమనార్హం. మిగతా భవనాల నిర్మాణ పనుల్లోనూ అదే తీరు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కుటుంబ తగాదాలకు కమ్యూనిటీ మీడియేషనే ఉత్తమ పరిష్కారం

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

హనుమకొండలో కమ్యూనిటీ మీడియేటర్లకు శిక్షణ ప్రారంభం



వరంగల్ లీగల్: కుటుంబ వ్యవస్థలో తలెత్తే వివాదాల పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేషన్ ఉత్తమమైనదని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. భార్యాభర్తలు, తల్లిదండ్రులు, పిల్లల మధ్య తగాదాల పరిష్కారానికి ఈ విధానం చక్కగా పనిచేస్తుందని తెలిపారు. హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ఆడిటోరియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్లకు నిర్వహించనున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. 'ఏ వివాదమైనా వ్యక్తులు లేదా సమూహం మధ్య ఏర్పడుతుంది. వారు ఏదో ఒక కమ్యూనిటీకి చెందిన వారై ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో కమ్యూనిటీ మీడియేటర్ల జోక్యంతో సహృద్భావ వాతావరణంలో వివాదాలు సులభంగా పరిష్కరమయ్యే అవకాశం ఉంటుంది. ఈ విధానాన్ని దేశంలో మొదటిసారి కేరళలో ప్రవేశపెట్టగా విజయవంతమైంది. 2023లో వచ్చిన మీడియేషన్ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించింది. న్యాయస్థానాల్లో కేసుల విషయంలో ఇరుపక్షాల్లో ఒకరు గెలిస్తే మరొకరు పై కోర్టుకు వెళ్తారు. కానీ, కమ్యూనిటీ మీడియేషన్ విధానంలో వివాదం పరిష్కారమైతే రెండు పక్షాలు సంతోషంగా ఉంటాయి'అని వివరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ.. ఈ విధానం ఇప్పటికే నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్‌లో విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ 7న కామారెడ్డిలో ఒకేసారి 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వీబీ నిర్మలా గీతాంబ, సీహెచ్ రమేశ్‌బాబు, రెండు జిల్లాల న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, కమ్యూనిటీ మీడియేటర్లు పాల్గొన్నారు.

సింగరేణిలో మహిళా భద్రతా దళం



భూపాలపల్లి ఏరియాలో నోటిఫికేషన్...

దరఖాస్తుకు ఈ నెల 25 గడువు

గోదావరిఖని: సింగరేణి ఆస్తులను పరిరక్షించేందుకు యాజమాన్యం ఉమెన్ సెక్యూరిటీ ఫోర్స్‌కు శ్రీకారం చుడుతోంది. ఆసక్తిగల మహిళా ఉద్యోగులు సెక్యూరిటీ విభాగంలో పనిచేసేందుకు దరఖాస్తు చేయాలని భూపాలపల్లి ఏరియాలో నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఇందుకు బదిలీ వర్కర్లు, జన రల్ మజ్దూర్లు అర్హులని వెల్లడించింది. ఆసక్తి గల మహిళా ఉద్యోగులు 25లోగా దరఖాస్తు చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ ఏరి యాలో పర్మనెంట్ సెక్యూరిటీ సిబ్బంది కొరత అధికంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. త్వరలో సింగరేణి వ్యాప్తంగా మహి ళా సెక్యూరిటీ గార్డులను నియమించాలని సింగరేణి యోచిస్తోంది. వీరికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ అమలు చేస్తారు. ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తారు. ఆస్తుల పరిరక్షణ కోసం కీలక ప్రాంతాల్లో 3 షిఫ్టుల్లో వీరిని నియమిస్తారు.

తగ్గుతున్న పర్మనెంట్ సెక్యూరిటీ

సింగరేణిలో పర్మనెంట్ సెక్యూరిటీ సిబ్బంది తగ్గిపోతోంది. వీరిస్థానంలో ప్రైవేట్ సెక్యూరిటీని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం సింగరేణివ్యాప్తంగా 982 మంది పర్మనెంట్ ఉద్యోగులు ఉండగా, ప్రైవేట్‌కు చెందినవారు 1,328 ఉన్నారు. ఉద్యోగ విరమణ చేసేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. వారి స్థానంలో మహిళలను నియమించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యయనం చేస్తోంది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. అయితే, తగ్గుతున్న పర్మనెంట్ సెక్యూరిటీ సిబ్బంది స్థానంలో బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లను సెక్యూరిటీ సిబ్బందిగా అవకాశం కల్పించాలని యాజమాన్యం భావిస్తోంది. 150 మంది వరకు సెక్యూరిటీని నియమించాలని యోచిస్తోంది.

అధ్యయనం తర్వాతే..



ప్రతీనెలా పర్మనెంట్ సెక్యూరిటీ సిబ్బంది సంఖ్య తగ్గుతోంది. ఆ సంఖ్యను భర్తీ చేసేందుకు మహిళలను నియమించాలని యోచిస్తున్నాం. ఈ విషయంలో యాజమాన్యం అధ్యయనం చేస్తోంది. ఆ ప్రక్రియ పూర్తయ్యాక విధివిధానాలు ఖరారు చేస్తారు. ప్రస్తుతం తాత్కాలిక ప్రాతిపదికన భూపాలపల్లి ఏరియాలో సెక్యూరిటీ సిబ్బందిగా నియమించేందుకు నిర్ణయించారు. త్వరలోనే అన్ని ఏరియాల్లో అమలు చేస్తాం. – లక్ష్మీనారాయణ, సెక్యూరిటీ జీఎం, సింగరేణి

ఎంఎంటీఎస్‌లో అత్యాచారయత్నం అబద్ధం

అబద్ధం చెప్పి తప్పుదోవ పట్టించిన యువతి

రైలులో రీల్స్ చేస్తూ కాలుజారి పడినట్లు పోలీసులకు వెల్లడి

ఇంట్లో తిడతారనే భయంతో నాటకం ఆడినట్లు ఒప్పుకోలు

అడ్డగుట్ట: సికింద్రాబాద్ ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచార యత్నం కేసు కీలక మలుపు తిరిగింది. ఇన్‌స్టాలో రీల్స్ చేస్తుండగా ఆ యువతి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయిందని, ఇంట్లో తిడతారనే భయంతో అత్యాచారం యత్నం నాటకం ఆడినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. దీంతో కేసును క్లోజ్ చేసినట్లు తెలిసింది. మార్చి 22న రాత్రి 7.30 గంటల సమయంలో సికింద్రాబాద్ - మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలు నుంచి ఓ యువతి కింద పడిపోవటంతో తీవ్రంగా గాయపడింది. పోలీసుల విచారణలో తనపై ఓ వ్యక్తి అత్యాచార యత్నం చేయటంతో రైలులోంచి దూకేసినట్లు తెలిపింది. ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఆ యువతి తన స్వస్థలానికి వెళ్లిపోగా, కేసు దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులకు ఎక్కడా ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గందరగోళ పరిస్థితి ఎదురైంది. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు మొత్తం 14 రైల్వే స్టేషన్లతోపాటు బయట ఉన్న ప్రైవేటు సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. మొత్తం 250 సీసీ కెమెరాలను పరిశీలించి 120 మందిని అనుమానితులుగా గుర్తించారు. రైల్వే స్టేషన్లలో అనుమానాస్పదంగా సంచరించిన వారిని కూడా విచారించారు. మొదట్లో మహేష్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేసిన యువతి.. అనంతరం పోలీసుల ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెబుతూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. చివరకు అసలు నిజం ఒప్పుకుంది. రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయానని చెప్పిందని పోలీసు వర్గాలు తెలిపాయి. దీంతో పోలీసులు కేసు క్లోజ్ చేసినట్లు సమాచారం. కానీ, రైల్వే పోలీసులు మాత్రం ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయ సలహా తీసుకుంటున్నామని, ఉన్నతాధికారులు పూర్తి వివరాలు వెల్లడిస్తారని చెబుతున్నారు.

హైదరాబాద్ మరో బెంగాల్ అవుతుంది

- యంగ్ ఇండియా పేరుతో ఆస్తులు కాజేసే కుట్ర
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపణలు




సాక్షి, హైదరాబాద్: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా శనివారం మజ్లిస్ పార్టీ నిర్వహిస్తున్న సభ కాంగ్రెస్ స్పాన్సర్డ్ కార్యక్రమమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణలో బెంగాల్ తరహా పరిస్థితులు వచ్చే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు రేవంత్‌రెడ్డి సర్కార్‌దే బాధ్యత అని పేర్కొన్నారు. సీఎం ఆర్థిక సహాయంతోనే మజ్లిస్ ఆందోళన చేస్తోందన్నారు. శుక్రవారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, కార్యదర్శులు ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఉమారాణి, అధికార ప్రతినిధులు విఠల్, రాణీ రుద్రమదేవి, ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌రావు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తదితరులతో కలిసి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఎంఐఎంకు దూరంగా ఉండాలని రాహుల్‌గాంధీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు ఓటు వేయకుండా చిత్తశుద్ధి నిరూపించుకుంటారా? అని సంజయ్ ప్రశ్నించారు. డూప్లికేట్ గాంధీ కుటుంబానికి భారత చట్టాలు వర్తించవా? అని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను కాజేసేందుకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ కుటుంబం చేసిన కుట్రగా అభివర్ణించారు. వారు రాజ్యాంగానికి అతీతులనుకుంటున్నారా? అని నిలదీశారు. ఇందులో బీజేపీకి, ప్రధాని నరేంద్రమోదీకి ఏం సంబంధం అని సంజయ్ ప్రశ్నించారు. రాహుల్ స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్ పేరుతో ఫోర్త్ సిటీకి చెందిన రూ.50 వేల కోట్ల ఆస్తులను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రధానిని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని బూతులు తిడుతుంటే వారిని వారించాల్సిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమర్థిస్తారా? అని నిలదీశారు.

పంటకూ పరిహారమివ్వండి

ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతుల డిమాండ్

- భూ పరిహారం ఆలస్యంతో రైతుల అధీనంలోనే భూములు
- మేలో ఖరీఫ్ పంట వేసుకునేందుకు ఏర్పాట్లు
- పెట్టుబడి, పంట కోల్పోతున్నందున పరిహారానికి డిమాండ్
- గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చినందున ఆ భూమి సేకరించినట్లే
- అలాంటప్పుడు పరిహారం ఎలా ఇస్తామంటున్న ఎన్‌హెచ్ఏఐ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) భూ సేకరణ ప్రక్రియలో కొత్త చిక్కు వచ్చి పడింది. గతంలో ట్రిపుల్ ఆర్‌కు అసలు భూములే ఇచ్చేది లేదని భీష్మించిన రైతులు, ఇప్పుడు పంట నష్టపరిహారం కోసం పట్టుబడుతున్నారు. రింగురోడ్డు నిర్మాణానికి పిలిచిన టెండర్లను త్వరలో తెరిచి నిర్మాణ సంస్థను గుర్తించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఏర్పాట్లు చేస్తోంది. అది కాగానే పనులు చేపట్టేందుకు వీలుగా భూమిని ఆ సంస్థకు అప్పగించాల్సి ఉంది. అది జరగాలంటే ఆ భూమి పూర్తిగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధీనంలోకి రావాల్సి ఉంటుంది. ఇక్కడే పేచీ వచ్చింది.

పరిహారం చెల్లింపులో జాప్యంతో..

రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం కోసం దాదాపు 2 వేల హెక్టార్ల భూమిని ఎన్‌హెచ్ఏఐ సేకరించింది. భూ సేకరణ ప్రక్రియకు సంబంధించి వరుసగా మూడు రకాల గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసింది. అయితే, గ్రామాల వారీగా అవార్డులు పాస్ చేసి రైతుల ఖాతాల్లో భూ పరిహారాన్ని జమ చేయాల్సిన కీలక ప్రక్రియ మాత్రమే మిగిలి ఉంది. రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు కోసం రెండు నెలల క్రితమే టెండర్లు పిలిచినా పర్యావరణ అనుమతులు రాకపోవటంతో వాటిని తెరవలేదు. అటవీ, పర్యావరణ అనుమతులు, రోడ్డుకు ఎక్స్‌ప్రెస్‌వే నంబర్ కేటాయింపు లాంటి ప్రక్రియల్లో ఆలస్యం కావటంతో భూసేకరణ గెజిట్ నోటిఫికేషన్లు జారీచేసి దాదాపు రెండేళ్లు గడిచినా, భూములు మాత్రం ఇంకా రైతుల అధీనంలోనే ఉన్నాయి. వారు ఆ భూముల్లో సాగు కొనసాగిస్తున్నారు. ట్రిపుల్ ఆర్‌కు ఇటీవలే అటవీ, పర్యావరణ అనుమతులు రావటంతో టెండర్లు తెరిచేందుకు మార్గం సుగమమైంది. త్వరలో టెండర్లు పిలిచి కాంట్రాక్టు సంస్థను ఎంపికచేసి భూములు అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే, తమ ఖాతాల్లో పరిహారం జమ కాకుండా భూములు ఇచ్చేది లేదని ఇప్పటికే తేల్చి చెప్పిన రైతులు, ఇప్పుడు భూమిని తీసుకుంటే తాము కోల్పోయే పంటకు కూడా నష్టపరిహారం చెల్లించాలని కొత్త డిమాండ్ తెరపైకి తెచ్చారు. ఖరీఫ్ పంటకు సిద్ధమవుతున్నామని కొన్ని ప్రాంతాల్లో, యాసంగి పంట పూర్తికానందున ఇప్పుడే భూములు ఇవ్వబోమని మరికొన్ని ప్రాంతాల్లో మొండికేస్తున్నారు. 'ఇప్పటివరకు పరిహారమే అందలేదు. అలాంటప్పుడు భూమిని ఎలా సేకరిస్తారు? మరో నెల, నెలన్నరలో భూ పరిహారం ఇస్తే.. ఆ లోపు ఖరీఫ్ పంట సాగు మొదలవుతుంది. పంట పెట్టుబడికి మాకు ఖర్చవుతుంది. పంట చేతికందకుండా భూమిని ఇవ్వలేము. ఒకవేళ ముందే భూమిని తీసుకుంటే ఆ పంటకు నష్టపరిహారం ఇవ్వాల్సిందే'అని డిమాండ్ చేస్తున్నారు.

పంట నష్టపరిహారం ఎలా ఇస్తాం?: ఎన్‌హెచ్ఏఐ

రైతులకు పంట నష్టపరిహారం ఎలా ఇస్తామని ఎన్‌హెచ్ఏఐ గట్టిగా ప్రశ్నిస్తోంది. జాతీయ రహదారుల చట్టం–1956 లోని సెక్షన్ 3డీ ప్రకారం తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయటమంటేనే.. ఆ భూమిని తాము సేకరించినట్టుగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంటోంది. ఈ విషయం రైతులకు కూడా చెప్పామని, అంతర్గతంగా కొన్ని సాంకేతిక కారణాలతో పనుల్లో జాప్యం జరిగిందే తప్ప.. భూసేకరణ జరగక కాదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామాలవారీగా అవార్డులు పాస్ చేస్తున్నందున త్వరలో రైతుల ఖాతాలో భూపరిహారం డబ్బులు జమ అవుతాయని పేర్కొంటున్నారు.

కాంట్రాక్టు సంస్థకు 80 శాతం భూమి అప్పగిస్తేనే పనులు..

త్వరలో టెండర్లు తెరిచి కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేయనున్నందున, ఈలోపే భూమిని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నది ఎన్‌హెచ్ఏఐ ప్రణాళిక. కాంట్రాక్టు సంస్థతో తొలుత లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది జరగాలంటే మొత్తం భూమిలో 80 శాతం కాంట్రాక్టు సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. 80 శాతం భూమి తన అధీనంలోకి వచ్చాకే నిర్మాణ సంస్థ పనులు ప్రారంభిస్తుంది. ఒప్పందం అమలులోకి వచ్చిన నిర్ధారిత సమయంలోగా భూమిని అప్పగించని పక్షంలో ఎన్‌హెచ్ఏఐ ఒప్పందం ప్రకారం కాంట్రాక్టు సంస్థకు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. దీంతో రైతులను ఒప్పించేందుకు అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

కాంగ్రెస్ పంచసూత్ర

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బహుముఖ కోణంలో సమీక్షిస్తున్న మీనాక్షి • ఐదు అంశాల్లో నేతలకు దిశానిర్దేశం చేస్తున్న రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి

సాక్షి, హైదరాబాద్ : ఐదు సూత్రాల ప్రాతిపదికన అధికార కాంగ్రెస్ పార్టీ సమీక్షలు నిర్వహిస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపోటములు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణ బలోపేతం, ప్రభుత్వ పథకాల విస్తృత ప్రచారం, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అంతర్గత కొట్లాటలపై దృష్టి సారించి సమీక్షిస్తున్నారు. రెండు రోజులుగా గాంధీభవన్‌లో జరుగుతున్న ఈ సమీక్షల్లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఈ మేరకు దిశానిర్దేశం చేస్తున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని మెజారిటీ స్థానాల్లో గెలిచేలా ముందుకెళ్లాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, సన్నబియ్యం లాంటి పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, దశాబ్దాలుగా పార్టీలో ఉంటున్నవారు, కొత్తగా పార్టీలో చేరినవారు కలిసి పనిచేయాలని ఆమె సూచిస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఏఐసీసీ పిలుపు మేరకు జైబాపూ, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించడంపై కూడా ఆమె పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

వాళ్ల పెత్తనమేంటి?

సమీక్షల్లో పాల్గొంటున్న నేతలు మీనాక్షికి భారీగానే ఫిర్యాదులు చేస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ గూటికి చేరిన ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలకు సంబంధించి ఈ ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్టు సమాచారం. తాము దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకొని పనిచేస్తుంటే, కొత్తగా వచ్చినవారు తమపై పెత్తనం చేస్తున్నారని, వారికి అధికారిక పదవులు రావడమేంటని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం జరిగిన చేవెళ్ల సమీక్షలో శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు చెందిన నేతలు ఇదే అంశంపై మీనాక్షి వద్ద మొరపెట్టుకున్నట్టు తెలుస్తోంది. చేవెళ్ల నుంచి ఎంపీగా పోటీ చేసిన రంజిత్‌రెడ్డి అయితే ఒక అడుగు ముందుకేసి తాను ఏ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలో చెప్పాలని మీనాక్షిని అడిగినట్టు తెలిసింది. ఇందుకు స్పందించిన ఆమె పాత, కొత్త నాయకత్వాలను కలుపుకొని పనిచేయాలని, అందరూ కలిసి పనిచేయాలని, త్వరలోనే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు జరుపుతానని చెప్పినట్టు తెలిసింది. ఇక, అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా తమ మాట చెల్లుబాటు కావడం లేదని, అధికారులు కూడా తమను పట్టించుకోవడం లేదని, పదవుల్లో ఉన్న నాయకులు కూడా దూరం పెడుతున్నారని, పార్టీకి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కొందరు నేతలు మీనాక్షిని కోరినట్టు సమాచారం.



చేవెళ్ల నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో మీనాక్షి నటరాజన్ తదితరులు

మిగిలిన సమీక్షలు జిల్లాల్లోనే

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా గత నెలలో ఐదు నియోజకవర్గాల సమీక్షలు పూర్తి కాగా, రెండు రోజులుగా మరో ఐదు నియోజకవర్గాల సమీక్షలు పూర్తయ్యాయి. మీనాక్షి నటరాజన్‌తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథన్ తదితరులు పాల్గొన్నారు. గురువారం హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ నియోజకవర్గాల సమీక్షలు జరగ్గా, శుక్రవారం చేవెళ్ల, జహీరాబాద్‌ల సమీక్షలు పూర్తయ్యాయి. ఈ సమావేశాల్లో మంత్రి దామోదర రాజనర్సింహ, సీనియర్ నేతలు షబ్బీర్‌అలీ, గీతారెడ్డిలతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల సమీక్షలు గాంధీభవన్‌లో కాకుండా స్థానికంగా నిర్వహించాలని మీనాక్షి నిర్ణయించారు. తొలుత మహబూబాబాద్, వరంగల్, ఆ తర్వాత నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, అనంతరం భువనగిరి, నల్లగొండ, ఖమ్మం లోక్‌సభల వారీగా ఎక్కడికక్కడే ఈ సమీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన తేదీలు ఖరారు కావాల్సి ఉంది. కాగా, రెండు రోజుల పర్యటన ముగించుకున్న మీనాక్షి శనివారం ఉదయం ఢిల్లీ వెళ్లనున్నట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

రైతుల సంక్షేమానికే భూభారతి చట్టం

వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



భూదాన్‌పోచంపల్లి: రైతుల సంక్షేమానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో శుక్రవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భూదాన వజ్రోత్సవాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమారెడ్డి, వెదిరె కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినోబాభావే మందిరంలో శాంతియజ్ఞం నిర్వహించారు. అనంతరం 'భూ భారతి–భూదాన భూముల సమస్యలు' అంశంపై సదస్సు నిర్వహించారు. భూభారతి రూపకర్త భూమి సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలోనే భూభారతి చట్టం అత్యుత్తమైనదని ప్రశంసించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. వెదిరె రాంచంద్రారెడ్డి భూదాన స్ఫూర్తి ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ వెన్‌రెడ్డి సంధ్య తదితరులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం భూదాన్ పోచంపల్లికి చెందిన సీత శ్రీరాములు, తడక ముత్యాలు, కరగల్ల నర్సింహకు భూదాన జయంతి పురస్కారం అందజేశారు.

రాజకీయ జీవితంలో ఒక్క మంచిపని చేశావా?

- మీ కారణంగా ఫలానా అభివృద్ధి పని జరిగిందని చెప్పగలరా?
- ఒవైసీ, కిషన్‌రెడ్డి పూర్వజన్మలో అన్నదమ్ములేమో?
- అసలు మీ ఓట్లు ఎన్ని ఉన్నాయని ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మగాడే అయితే.. ఆయన రాజకీయ జీవితంలో తెలంగాణ అభివృద్ధి కోసం ఏం చేశారో చెప్పాలని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. తాను రాజకీయ విమర్శలు మాత్రమే చేస్తానని.. ఏదంటే అది మాట్లాడే అలవాటు లేదని, కానీ చెప్పుతో కొట్టాలని కిషన్‌రెడ్డి మాట్లాడినందుకే తాను ఈ వ్యాఖ్య చేస్తున్నానని చెప్పారు. 'కిషన్‌రెడ్డి అలియాస్ కిస్మత్‌రెడ్డి ఒక 25 ఏళ్ల క్రితం తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఉంటారు. ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన అంబర్‌పేటలో అయినా, ఇప్పుడు కేంద్రమంత్రిగా తెలంగాణ అభివృద్ధి కోసమైనా ఫలానా పని చేశానని, తన కారణంగా ఈ అభివృద్ధి జరిగిందని ఆయన చెప్పగలరా' అని ప్రశ్నించారు. గెలిచేందుకు తగినంత సంఖ్యాబలం లేకుండానే హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు దిగజారి మాట్లాడుతున్నారని నిలదీశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు, ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిలతో కలిసిమాట్లాడారు. బీజేపీ గెలవకపోతే తెలంగాణలో రజాకార్ల రాజ్యం వస్తుందని అనడానికి కిషన్‌రెడ్డికి ఏమైనా బుద్ధి ఉందా అని ప్రశ్నించారు. 'ఉదయం అసదుద్దీన్ ఒవైసీ, రాత్రికి అక్బరుద్దీన్ ఒవైసీ.. ఇలా నిత్యం ఒవైసీ జపం చేయడం తప్ప కిషన్‌రెడ్డికి వేరే పనిలేదు. పూర్వజన్మలో కిషన్‌రెడ్డి, ఒవైసీలు అన్నదమ్ములుగా పుట్టారని అనుకుంటున్నా. బీజేపీకి గెలిచే బలం లేకుండా పోటీ చేయడమే కాకుండా, మతం పేరు చెప్పి రాజకీయం చేయడం తగదు'అన్నారు.

మా పథకాలపై రాద్ధాంతం చేయడం కాదు

'రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో చరిత్రాత్మక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇవి అమలు కాకూడదని కిషన్‌రెడ్డి, సంజయ్‌లు అడ్డుపడుతున్నారు. బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం పథకాన్ని అమలు చేయమని చెప్పండి'అని మహేశ్‌గౌడ్ అన్నారు. ఎవరికీ మంత్రిపదవి ఇవ్వొద్దని జానారెడ్డి అడగలేదని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రిపదవి ఇవ్వాలని మాత్రమే ఆయన కోరారని చెప్పారు.

కూతురి నిశ్చితార్థం రోజే

తండ్రి బలవన్మరణం

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో విషాదం



అంజయ్య(ఫైల్)

వర్గల్(గజ్వేల్): అప్పోసొప్పో చేసి పెద్దకూతురు పెళ్లి చేశాడు ఆ తండ్రి. చిన్న కూతురు పెళ్లి కోసం సంబంధం చూశాడు. 'రేపు నిశ్చితార్థం.. అందరూ రావాలి'అని బంధువులను ఆహ్వానించాడు. కొంత డబ్బు అప్పుగా తీసు కొస్తానని ఇంటి నుంచి వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖాల్సాలో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ కరుణాకర్ రెడ్డి కథనం ప్రకారం.. కొండగల్ల అంజయ్య (57), స్వరూప దంపతులకు ఇద్దరు కూతుళ్లు. కూలీ పనులే వారికి జీవనాధారం. గతంలోనే రూ.5 లక్షల దాకా అప్పుచేసి పెద్దకూతురు వివాహం చేశాడు. కాగా, శుక్రవారం చిన్న కూతురు నిశ్చితార్థం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఖర్చులకు కొంత డబ్బు అప్పుగా తీసుకొచ్చేందుకు గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన అంజయ్య రాత్రి అయినా ఇంటికి రాలేదు.

విగతజీవిగా చెట్టుకు వేలాడుతూ : శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు విగతజీవిగా వేలాడుతున్న అంజయ్యను స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. నిశ్చితార్థం జరిపించాల్సిన కుటుంబ పెద్ద బలవన్మరణంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

భూభారతి పేదోడి చుట్టం

- 9.24 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరిస్తాం
- పార్ట్–బీలో ఉన్న పేదల భూములకు త్వరలో మోక్షం
- ధరణితో పేదోడి భూములు కొల్లగొట్టారు
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. వేదికపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీ బలరాంనాయక్ తదితరులు

సాక్షి, ఆదిలాబాద్/వెంకటాపురం(ఎం): భూభారతి చట్టం రాష్ట్రంలోని పేదలకు చుట్టం కాబోతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నలుగురు వ్యక్తులు, నాలుగు గోడల మధ్య కూర్చొని తయారు చేసిన చట్టంతో పేదోడి భూములను కొల్లగొట్టారని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు. 'ఒక చట్టం చేస్తే 50 ఏళ్లు ఉండాలి.. పేదవాడికి చుట్టంలా ఉండాలి.. సామాన్యులు దాని ద్వారా ఇబ్బందులు పడితే సవరించాలి.. తప్పులు జరిగినా దాన్ని పట్టించుకోకపోవడం, సవరించాలనే ఆలోచన కూడా రాకపోవడం దారుణం'అని ధ్వజమెత్తారు. ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం పూసాయి గ్రామంలో, ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భూభారతితో భూములకు శాశ్వత భద్రత కల్పిస్తామని తెలిపారు. ధరణి కారణంగా భూములపై మధ్యలో హక్కులు వచ్చిన వారిని మధ్యలోనే పంపేస్తామని చెప్పారు. పార్ట్–బీలోని భూముల సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ధరణి వల్ల ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు.

భూ సమస్యను బీఆర్ఎస్ జటిలం చేసింది: మంత్రి సీతక్క

రాష్ట్రంలో భూ సమస్యలను గత బీఆర్ఎస్ సర్కార్ జటిలం చేసిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే భూ భారతిని తీసుకొచ్చామని తెలిపారు. భూ భారతి చట్టం ఒక తల్లిలా రైతులకు న్యాయం చేస్తుందని పేర్కొన్నారు.

'కంచ గచ్చిబౌలి'పై కేంద్రం విచారణ జరపాలి

- రూ.10 వేల కోట్ల అక్రమాలు జరిగాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన రూ.10 వేల కోట్ల ఆర్థిక అక్రమాలపై కేంద్రం విచారణ చేపట్టాలని, పర్యావరణంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఆర్థిక అక్రమాల పైన విచారణ చేపట్టి కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. కంచ గచ్చిబౌలి అంశం కేవలం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదన్నారు. ఇప్పటికే కేంద్ర విజిలెన్స్ కమిషన్, సీబీఐ, ఆర్బీఐ, సెబీ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ సంస్థలకు ఆధారాలతో సహా కాంగ్రెస్ చేసిన పదివేల కోట్ల ఆర్థిక మోసం గురించి వివరించామని వెల్లడించారు. సుప్రీంకోర్టు పంపించిన ఎంపవర్డ్ కమిటీ కూడా ఈ అంశంలో ఆర్థిక అవకతవకలను నిర్ధారించిందని, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థలతో విచారణ చేయాలని సూచించిందని పేర్కొన్నారు. నగరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశమని, పర్యావరణ విధ్వంసం చేసిన రేవంత్‌రెడ్డి లాంటి నాయకులను ప్రజల ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆదివాసుల జాతి హననాన్ని ఆపాలి

- బస్తర్‌లో నరమేధం జరుగుతోంది
- అక్కడ చట్టాలు అమలు కావడం లేదు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మావోయిస్టులు కాల్పులు విరమించాలి
- భారత్ బచావో సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న హర గోపాల్. చిత్రంలో కోదండరాం, సోనిసోరీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: మధ్య భారత దేశంలో ఆదివాసుల జాతి హననం జరుగుతోందని, ఆది వాసీ ప్రజలపైన ప్రభుత్వాలు విచక్షణారహిత తమైన దాడులకు పాల్పడుతున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మావోయిస్టులు వెంటనే కాల్పుల విరమణ పాటించాలని కోరారు. శాంతి స్థాపన కోసం ఇరు వర్గాలు చర్చలు జరపాలని సూచించారు. భారత్ బచావో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్య క్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ హర గోపాల్ మాట్లాడుతూ, నక్సలైట్ల పేరుతో ఆది వాసీలను చంపడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అమాయక ప్రజలను అరెస్టు చేసి, జైళ్లలో బంధించి హతమారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నక్సలైట్ల పేరుమీద అత్యధికంగా ప్రాణా లు కోల్పోతున్నది అమాయకమైన ఆదివాసీలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి భక్తచరణ్‌దాస్ మాట్లాడుతూ, శాంతి యుతమైన ఉద్యమాల ద్వారా కూడా ప్రజల సమ స్యలను పరిష్కరించవచ్చునన్నారు.ఆదివాసీ హక్కుల నాయకురాలు సోనిసోరీ మాట్లాడుతూ, ఆదివాసీలను కాపాడటం రాజకీయ పార్టీలు, పౌర సమాజం బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం బస్తర్‌లో ఎలాంటి మానవ హక్కులు లేవని, చట్టాలు పనిచేయడం లేదని చెప్పారు. పునరావా సం పేరిట బస్తర్ నుంచి ఆదివాసీలను పూర్తిగా తరిమికొట్టి అడవిని, ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టేందుకు పథక రచన చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ ఇరువర్గాల మధ్య చర్చలు జరగాలన్నారు. రాజ్యాంగం విధించిన పరిమితు ల్లోనే ప్రభుత్వాలు పనిచేయాలని, ఒక వేళ ఆ పరిధి దాటితే ప్రభుత్వాలకే ప్రమాదకరమన్నారు. మాజీ ఎంపీ వినోద్ మాట్లాడుతూ, 1980 నాటి తెలంగాణ యుద్ధ వాతావరణం ఇప్పుడు బస్తర్‌లో కనిపిస్తోందన్నారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి..

మానవ హక్కుల కార్యకర్త బేలాభాటియా మాట్లాడుతూ, బస్తర్‌లో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనుషులు తిరిగి ఇల్లు చేరేవరకు నమ్మకం లేదన్నారు. బస్తర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని జస్టిస్ చంద్రకుమార్ కోరారు. ట్రైబల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ, అమాయకులైన ఆదివాసీ ప్రజలను చిత్రహింసలకు గురిచేయటం సరైనది కాదన్నారు. సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్, అల్లం నారాయణ, భారత్ బచావో ప్రతినిధి డాక్టర్ గోపీనాథ్, గాదె ఇన్నయ్య, సాధినేని వెంకటేశ్వర రావు, దేవి ప్రసాద్, ప్రొఫెసర్ కె.సీతారామారావు, ట్రియాజ్,ఒబైదుల్ల కొత్వాల్ పాల్గొన్నారు.

41 మంది బడా మిల్లర్లపై కేసులు

- వారి నుంచి రావాల్సిన సీఎంఆర్ బకాయిలు రూ. 848.5 కోట్లు
- రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద వసూలు చేయాలని కలెక్టర్లకు సిఫారసు

సాక్షి, హైదరాబాద్ : సకాలంలో ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్(సీఎంఆర్) చేయకుండా, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని అడ్డదారుల్లో అమ్ముకొని రూ.845.5 కోట్లు పౌరసరఫరాల సంస్థకు బకాయి పడిన 41 మంది బడా మిల్లర్లపై కేసులు నమోదయ్యాయి. రెవెన్యూ రికవరీ యాక్ట్ ఉపయోగించి ఆయా మిల్లర్లకు చెందిన ఆస్తులను జప్తు చేసి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం సిఫారసు చేసింది. 2022–23 యాసంగి పంటకు సంబంధించి మిల్లర్లు సుమారు రూ. 7 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని సీఎంఆర్ చేయకుండా నిల్వ చేసి, ఆ తర్వాత అమ్ముకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు రూ.4 వేల కోట్ల వరకు రికవరీ చేసింది. మరో రూ.3 వేల కోట్లు రికవరీ కావాల్సింది. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బకాయిలు చెల్లించకుండా మొండికేస్తున్న మిల్లర్ల నుంచి ఎలాగైనా రికవరీ చేయాలన్నారు. మిల్లరు, వారి కుటుంబసభ్యుల పేర్ల మీదున్న ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవాలని, మిల్లుల లైసెన్సులు రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన కమిషనర్ డీఎస్ చవాన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేశారు. గత సోమవారం నుంచి రైస్‌మిల్లులు, పీడీఎస్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లతో పాటు సరిహద్దు రాష్ట్రాల్లోని గోడౌన్‌లపై దాడులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రూ. 848.5 కోట్లు బకాయిపడిన 41 మిల్లులకు సీజ్ నోటీసులు ఇచ్చి, కేసులు నమోదు చేశారు.

ప్రధానికి కేటీఆర్ ధన్యవాదాలపై ఎద్దేవా


'ఎక్స్'లో భువనగిరి ఎంపీ చామల పోస్టు



సాక్షి, హైదరాబాద్: కంచగచ్చిబౌలి భూముల విషయంలో ప్రధాని మోదీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధన్యవాదాలు చెప్ప డాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయ న శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ధన్యవాదాలు ఎందుకంటే.. తెలంగాణకు ఐటీ పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నందుకు, యువతకు ఉపాధి, ఉద్యోగాలు రాకుండా అడ్డుకున్నందుకు, తాను క్రియేట్ చేయించిన ఫేక్ వీడియోలను నమ్మినందుకు, తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు నిధులు రాకుండా అడ్డుకున్నందుకు, నిధులు వచ్చి ప్రజాసంక్షేమం ఇనుమడిస్తే రేవంత్ సర్కారుకు మంచి పేరు రాకుండా అడ్డుకున్నందుకు, మొత్తం మీద రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళ్లలో కట్టెలు పెట్టడంలో తమతో కలిసి వచ్చినందుకు..' అని ఎంపీ చామల ట్వీట్‌లో వ్యాఖ్యానించారు.

హిందువులపై దాడులను నిరసిస్తూ వీహెచ్‌పీ ఆందోళన నేడు

సాక్షి, హైదరాబాద్: వక్ఫ్ బిల్లు పేరుతో పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న హింసను నిరసిస్తూ.. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ తెలిపింది. ఆ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న మారణకాండను తీవ్రంగా నిరసిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అక్కడి హిందువులకు రక్షణ కల్పించాలని, రాష్ట్రపతి పాలన విధించాలని, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర అలజడి సృష్టిస్తున్న ఉగ్రమూకలను కఠినంగా అణచి వేయాలని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు.



సాక్షి హైదరాబాద్

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



కౌంట్.. అండ్ ఈట్..

వస్తువుల్ని తూకం వేసి అమ్మడం తెలిసిందే.. కానీ కొలత వేసి తినడం ఇప్పుడు సిటీజనులు అలవాటు చేసుకుంటున్నారు.

- సిటీప్లస్‌లో



.. బొమ్మ అదిరిపోవాల్సిందే

ఆయన వృత్తిరీత్యా పశువైద్యుడు, ప్రొఫెసర్. కుంచె పడితే మాత్రం బొమ్మ అదిరిపోవాల్సిందే. అద్భుతమైన పెయింటింగ్స్ వేస్తూ ఔరా అనిపిస్తున్నాడు.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
37.0/26.0

వాతావరణం

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



బోయిన్‌పల్లిలోని మౌంట్ కార్మెల్ చర్చిలో..



సిలువపై ప్రేమ సందేశం!

మానవాళి పాప పరిహారం కోసం సిలువపై ప్రాణ త్యాగం చేసిన జీసస్‌ను స్మరిస్తూ శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నగరంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిలువపై నుంచి యేసుక్రీస్తు విశ్వమానవాళికి ప్రేమ సందేశాన్ని అందించిన ఘట్టాలకు సంబంధించిన ప్రదర్శనలు భక్తుల హృదయాలపై చెరగని ముద్ర వేశాయి.



క్రీస్తు త్యాగాన్ని స్మరిస్తూ..

జూ పార్కులో రైనో ఫుడ్ కోర్టు ప్రారంభం

చార్మినార్: నగరంలోని జంతు ప్రదర్శన శాలకు వచ్చే సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా అన్ని రకాల సేవలను అభివృద్ధి చేస్తున్నట్లు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్) ఆర్.ఎం.డోబ్రియల్ అన్నారు. జూ పార్కులో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఫుడ్ కోర్టును అటవీశాఖ అందుబాటులోకి తెచ్చింది. రైనో పేరుతో ఫుడ్ కోర్టు ప్రారంభమైంది. అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్) ఆర్.ఎం.డోబ్రియల్ కొత్త క్యాంటీన్ సేవలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరు, జూ పార్క్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ హిరేమత్, క్యూరేటర్ వసంత పాల్గొన్నారు.



రైనో ఫుడ్ కోర్టును ప్రారంభిస్తున్న డోబ్రియల్

పిటీ.. కనెక్టివిటీ!

రైళ్ల మళ్లింపుతో చర్లపల్లి టెర్మినల్‌కు పెరిగిన రద్దీ

- అరకొరగా సిటీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు
- క్యాబ్‌లు, ఆటో సర్వీసులకు భారీ డిమాండ్
- ఇక్కడి నుంచి సుమారు 60 రైళ్ల రాకపోకలు



సాక్షి, సిటీబ్యూరో:

హబ్సిగూడకు చెందిన కృష్ణమూర్తి ఇటీవల ఒకరోజు ఉదయం 4.30 గంటలకు చర్లపల్లి టెర్మినల్‌లో రైలు దిగారు. ఆ సమయంలో సిటీ బస్సులు అందుబాటులో ఉండవు. ఎంఎంటీఎస్ రైళ్ల జాడ కనిపించదు. ఇంకేం.. క్యాబ్‌లు, ఆటో చార్జీలకు రెక్కలు వచ్చేశాయి. మరో గత్యంతరం లేక ఆయన రూ.350 ఇచ్చి ఆటోలో ఇంటికి చేరుకున్నారు. ఇలా ఒక్క కృష్ణమూర్తి పరిస్థితి మాత్రమే కాదు. నగరానికి చెందిన చాలా మంది ప్రయాణికులు చర్లపల్లి టెర్మినల్ నుంచి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టెర్మినల్ ను వినియోగంలోకి తెచ్చి మూడు నెలలు గడుస్తున్నా సిటీబస్సు, ఎంఎంటీఎస్ కనెక్టివిటీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైళ్ల మళ్లింపుతో చర్లపల్లికి తాకిడి పెరిగింది. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 60 రైళ్లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్ని నేరుగా ఇక్కడి నుంచే బయలుదేరుతుండగా, మరికొన్ని చర్లపల్లి మీదుగా వివిధ ప్రాంతాలకు నడుస్తున్నాయి. దీంతో చర్లపల్లిలో హాల్టింగ్ సదుపాయం పెరిగింది. కానీ ప్రయాణికుల డిమాండ్ మేరకు కనెక్టివిటీ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

నిత్యం 10 వేలమంది ప్రయాణికులు..

- ప్రస్తుతం చెన్నై నుంచి చర్లపల్లికి నడిచే చెన్నై ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్, నాగర్‌సోల్, ఈస్ట్ కోస్ట్, గోరఖ్‌పూర్, నాందేడ్- సంబాల్‌పూర్, చర్లపల్లి నుంచి మాల్డా టౌన్, చర్లపల్లి- భువనేశ్వర్, చర్లపల్లి- షాలిమార్, చర్లపల్లి-సంత్రాగచ్చి, చర్లపల్లి- నహర్ లాగున్ తదితర రెగ్యులర్, ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి, చెన్నై ఎక్స్‌ప్రెస్ ఉదయం 4.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ప్రత్యేక రైళ్లు రాత్రిపూట ఆలస్యంగా బయలుదేరుతున్నాయి. మరోవైపు రెగ్యులర్ రైళ్లలో కూడా చాలా వరకు ఉదయం 7 గంటల లోపు చర్లపల్లికి వచ్చేవే ఉన్నాయి.
- ఇక్కడి నుంచి బయలుదేరేరైళ్లలో ఒక్క ఈస్ట్ కోస్ట్ మినహా చాలా వరకు రాత్రి వేళల్లో బయలుదేరుతున్నాయి.ఈ రైళ్ల రాకపోకలకు అనుగుణంగా బస్సులు మాత్రం అందుబాటులో లేవు. 'రాత్రి 8 గంటలు దాటితే సిటీ బస్సును నమ్ముకోవడం కష్టం. ఆటో కోసం, క్యాబ్ కోసం వెతుక్కోవాల్సిందే. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చి కేవలం అయిదారు కిలోమీటర్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది'అని బేగంపేట్‌కు చెందిన సుధాకర్ విస్మయం వ్యక్తం చేశారు.
- ప్రస్తుతం లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ మీదుగా చర్లపల్లికి ఎంఎంటీఎస్ రైళ్లు ఇంకా అందుబాటులోకి రాలేదు. ఉదయం, సాయంత్రం రెండు సర్వీసులు మాత్రం చర్లపల్లి నుంచి మేడ్చల్ వైపు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు సిటీ బస్సులపై మాత్రమే ఆధారపడాల్సివస్తోంది. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభంతో పాటే ఎంఎంటీఎస్ రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ దిశగా ఇప్పటి వరకు పెద్దగా చర్యలు తీసుకోలేదు. దీంతో రోడ్డు మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు టెర్మినల్‌కు కేవలం ఒక వైపు రోడ్డు సదుపాయం ఉంది. దీంతో సిటీ బస్సులు తప్ప మరో గత్యంతరం లేదు. రైళ్ల రాకపోకలకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ఆటోవాలాలు, క్యాబ్ డ్రైవర్లు భారీగా డిమాండ్ చేస్తున్నారు.

పెరిగిన వేసవి డిమాండ్..

వేసవి ప్రత్యేక రైళ్లు సైతం చర్లపల్లి నుంచే నడుస్తున్నాయి. దీంతో డిమాండ్ పెరిగింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేసవి రద్దీ ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి రాకపోకలు సాగించే రైళ్లలో ఎక్కువ శాతం ఉదయమే నగరానికి చేరుకుంటాయి. సాయంత్రం బయలుదేరుతాయి. ప్రత్యేక రైళ్ల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులతో సమయపాలనలో తేడాలు ఉంటాయి. దీంతో కొన్ని రైళ్లు రాత్రిపూట ఆలస్యంగా నగరానికి చేరుకుంటాయి. కొన్ని ఆలస్యంగానే బయలుదేరుతాయి. ఇలాంటి రైళ్ల వేళలకు అనుగుణంగా ఎలాంటి రవాణా సదుపాయాలు లేవు.' క్యాబ్‌లు, ఆటోల్లో అడ్డగోలుగా చార్జీలు పెంచేస్తున్నారు. రాత్రిపూట బస్సులు పెంచితే బాగుంటుంది. చర్లపల్లికి చేరుకోవాలన్నా, అక్కడి నుంచి సిటీలో ఎక్కడికి వెళ్లాలన్నా కష్టంగానే ఉంది' అని మల్కాజిగిరికి చెందిన సుధ అనే ప్రయాణికురాలు పేర్కొన్నారు.

మన ఎయిర్‌పోర్టుకు మరో ఘనత

'ఆర్‌జీఐఏ'కు లెవెల్ 5 కార్బన్ అక్రిడిటేషన్ గుర్తింపు



శంషాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సంస్థ నిర్వహణలోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరో ప్రఖ్యాత గుర్తింపు దక్కింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆసియా పసిఫిక్, మధ్య తూర్పు దేశాల్లో నాలుగు విమానాశ్రయాల్లో కార్బన్ అక్రిడిటేషన్ గుర్తింపు పొందిన నాలుగు విమానాశ్రయాల్లో ఆర్‌జీఐఏ ఒకటి అన్నారు. కర్బన ఉద్గారాల తగ్గింపును జీరో స్థాయికి తీసుకురావడంతో ఆర్‌జీఐఏ చేస్తున్న కృషికి ఈ గుర్తింపు లభించిందని జీఎంఆర్ ఎయిర్‌పోర్టుల ఈడీ, చీఫ్ ఇన్నోవేషన్ అధికారి ఎస్‌జీకే కిశోర్ తెలిపారు. పర్యావరణహిత చర్యలు, సోలార్ ఎనర్జీ, ఎల్‌ఈడీల నిర్వహణ తదితర అంశాల్లో వివిధ భాగస్వాముల సహకారంతో ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

పుప్పాలగూడలో హిట్ అండ్ రన్

స్విగ్గీ డెలివరీ బాయ్ దుర్మరణం



జీవన్‌కుమార్ మృతదేహం

మణికొండ: కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న యువకుడు వేసవి సెలవుల్లో స్విగ్గీబాయ్‌గా చేరి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలను పోగొట్టుకున్న ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన కుతాడి జీవన్ కుమార్ (21) కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. వేసవి సెలవులు ఉండటంతో నగరానికి వచ్చి స్విగ్గీ డెలివరీ బాయ్‌గా చేరాడు. తన తండ్రికి ఇటీవల గుండె ఆపరేషన్ కావటం, కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో నగరానికి వచ్చి పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా శుక్రవారం ఉదయం పుప్పాలగూడ ఈఐపీఎల్ కార్నర్ స్టోన్ సమీపంలో జీవన్ ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. కింద పడిన అతడిపై నుంచి వెనకగా వచ్చిన టిప్పర్ వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు, టిప్పర్‌ల డ్రైవర్‌లు పరారయ్యారు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జంక్షన్ జాం!

తార్నాక చౌరస్తా రీ ఓపెన్

- తొలిరోజు తప్పని తిప్పలు
- భారీగా ట్రాఫిక్‌జాం
- వాహనదారుల అసంతృప్తి

లాలాపేట: దాదాపు దశాబ్ద కాలం పాటు మూసివేసిన తార్నాక జంక్షన్ (సిగ్నల్)ను శుక్రవారం రీ ఓపెన్ చేశారు. ఇంత కాలం ఓయూ క్యాంపస్ నుంచి లాలాపేట వైపు వెళ్లే వారు యూ టర్న్ నుంచి రాకపోకలు సాగించేవారు. సిగ్నల్ సిస్టమ్‌ను పునరుద్ధరించడంతో ఓయూ వైపు నుంచి లాలాపేట వైపు వెళ్లే వాహనదారులు నేరుగా సిగ్నల్ వద్ద ఆగి వెళుతున్నారు. హబ్సిగూడ నుంచి లాలాపేట వైపు వెళ్లే వాహనదారులకు యథావిధిగా రైల్వే డిగ్రీ కళాశాల వద్ద యూ టర్న్ తీసుకువెళ్లాలనీ ట్రాఫిక్ పోలీసులు అనౌన్స్‌మెంట్ ద్వారా తెలియజేశారు.

గుడ్ ఫ్రైడే హోలీ డే రోజే ఇలా ఉంటే ఇక వర్కింగ్ డే మరింత వాహనాల రద్దీ ఉండే అవకాశం ఉంది. మొదటి రోజు లాలాపేట వైపు సెయింటాన్స్ స్కూల్ వరకు వాహనాలు నిలిచిపోయాయి.

తార్నాక, లాలాపేట రోడ్డులో వాహనాల రద్దీ

తార్నాక జంక్షన్ పునరుద్ధరణతో రోజంతా ట్రాఫిక్ జాం నెలకొంది. ఓయూ క్యాంపస్ నుంచి తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో వాహనాలు బారులు తీరాయి. లాలాపేట రోడ్డు విస్తరణ పనులు దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతున్నాయి. విస్తరణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. ఫలితంగా ఈ మార్గంలో దాదాపు అర కిలో మీటర్ మేర ట్రాఫిక్‌జాం నెలకొంది.

యూటర్న్‌తోనే ట్రాఫిక్‌కు చెక్

గతంలో ఉన్న యూ టర్న్‌తో తార్నాక జంక్షన్‌లో వాహనాల రద్దీ తగ్గింది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సాఫీగా కొనసాగింది. పెరిగిన వాహనాల సంఖ్యను అధికారులు పొరపాటుగా అంచనా వేశారు. తార్నాక జంక్షన్ విస్తరణ, రోడ్ల విస్తరణ చేపట్టకుండా రీఓపెన్ చేయడం సరికాదు. అధికారులు పునరాలోచించాలి. - సూరి, ద్విచక్ర వాహనదారు

రోడ్డు విస్తరణ చేపడితేనే..

తార్నాక చౌరస్తా నుంచి లాలాపేట వరకు రోడ్డు ఇరుకుగా మారింది. వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలం చెందారు. ప్రస్తుతం ఉన్న రోడ్డులోనే చిన్నపాటి డివైడర్లు ఏర్పాటు చేసి జంక్షన్‌ను ఓపెన్ చేయడంతో వాహనాల రద్దీ నెలకొంది. - రవి. లాలాపేట, వాహనదారు





తార్నాక జంక్షన్ నుంచి వెళ్తున్న వాహనదారులు, తార్నాక - లాలాపేట రహదారిపై ట్రాఫిక్ జాం

గాలివాన.. హైరానా..

నగరంలో వర్ష బీభత్సం



పంజగుట్టలో..



ఓల్డ్ మలక్‌పేట్ మెట్రో స్టేషన్ వద్ద ముంచెత్తిన వరద నీరు

సాక్షి, సిటీబ్యూరో: ఈదురు గాలితో కూడిన వర్షం నగరంలో పలు చోట్ల బీభత్సం సృష్టించింది. నగరంలో అత్యధికంగా కంచన్‌బాగ్‌లో 8.5 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తింది. భారీ ఈదురుగాలుల తాకిడికి చెట్ల కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాలు దెబ్బతిన్నాయి. రెడ్‌హిల్స్‌లోని ఓ భారీ వృక్షం కూలి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. గ్రేటర్ వ్యాప్తంగా సుమారు 350 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన కూడళ్లలోకి వరద నీరు చేరడంతో భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. వర్షాల నేపథ్యంలో గ్రేటర్ అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిందిగా హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.



బేగంపేట్‌లో ట్రాఫిక్ జాం



అమీర్‌పేట్‌లో..

ప్రాంతం	సెం.మీ
కంచన్‌బాగ్	8.05
బహదూర్‌పురా	7.88
యాకుత్‌పురా	7.63
బేగంబజార్	6.98
బండ్లగూడ	6.95
చార్మినార్	6.60
ఈడ్‌బజార్	6.18
నాంపల్లి	6.13
ఎల్బీస్టేడియం	5.65
చందులాల్ బారాదరి	5.65
బార్కాస్	4.63
ఖైరతాబాద్	4.40
కుత్బుల్లాపూర్	4.38
బాలానగర్	4.15
అంబర్‌పేట్	4.00
రాజేంద్రనగర్	3.80
హిమాయత్‌నగర్	2.53
ముషీరాబాద్	2.40



నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద..

మద్యం మత్తులో వీరంగం

● పార్క్ చేసి ఉన్న కారును ఢీ ● ఫొటో తీస్తున్న వాచ్‌మెన్‌పై దాడి

దుండిగల్: మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. పీకల దాకా తాగి ఓ కారును ఢీ కొట్టడమేగాక కారు ఫొటోను తీస్తున్న ఓ వాచ్‌మెన్‌పై దాడి చేసిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూరారం ప్రాంతానికి చెందిన గణేశ్, తిరుమలేశ్, అజయ్‌లతో పాటు మరో ఇద్దరు బహదూర్‌పల్లి నుంచి సూరారం వైపు కారులో వస్తున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వీరు బహదూర్‌పల్లిలోని అయోధ్య విల్లాల పక్కనే పార్కింగ్ చేసిన ఓ కారును ఢీ కొట్టారు. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్ దిలీప్ తన సెల్‌ఫోన్‌లో కారు ఫొటో తీశాడు. దీనిని గుర్తించిన ఐదుగురు యువకులు ఒక్కసారిగా వాచ్‌మెన్‌పై దాడి చేశారు. అంతటితో ఆగకుండా తమకు అడ్డు వస్తే చంపేస్తామని, బెదిరించారు. తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య పూలా భాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఏడాదిన్నర క్రితం ఓ ఇంట్లో శుభకార్యం జరుగుతున్న సమయంలో ప్రస్తుతం దాడికి పాల్పడిన యువకులు ఇంట్లోకి చొరబడి పెళ్లి కొడుకును తీవ్రంగా కొట్టడమేగాక ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేయడం అప్పట్లో సంచలనం మారింది. అప్పటి నిందితులే మరో సారి ఇదే విధంగా దాడికి పాల్పడటం పట్ల స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ప్రధాన నిందితులు సూరారం ప్రాంతానికి చెందిన రాజకీయ పార్టీల నేతల వారసులు కావడం గమనార్హం.

గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: నిర్మాణంలో ఉన్న భవనం ప్రహరీ కూలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దూలపల్లిలోని మహాలక్ష్మి లేఅవుట్ రోడ్డులో కోజీఎసెన్స్ బిల్డర్స్‌కు చెందిన భవనం నిర్మాణంలో ఉంది. శుక్రవారం సాయంత్రం సైట్‌లో పనులు చేస్తున్న బొల్లి చెన్నయ్య(55) అనే కార్మికుడిపై కాంపౌండ్ గోడ కూలడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.4 వేలకే బోర్డర్ క్రాస్!

పశ్చిమ బెంగాల్ కేంద్రంగా వ్యవస్థీకృత దందా

- బంగ్లాదేశీ యువతుల అక్రమ రవాణా
- ఇక్కడ వ్యభిచారం, ఇతర దందాలకు వినియోగం
- కేసుల దర్యాప్తులో గుర్తించిన పోలీసు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానితో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవల విదేశీ యువతులతో వ్యభిచారం చేయిస్తున్న అనేక ముఠాలు పట్టుబడ్డాయి. ఈ బాధితుల్లో అత్యధికం బంగ్లాదేశీ యువతులే ఉంటున్నారు. దీంతో వీరు దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న విధానంపై దర్యాప్తు అధికారులు దృష్టి పెట్టారు. ప్రాథమిక ఆధారాలను బట్టి కొన్ని కీలక విషయాలు గుర్తించారు. ఈ మనుషుల అక్రమ రవాణా దందాకు పశ్చిమ బెంగాల్ కీలకంగా ఉన్నట్లు తేలింది. అక్కడి కొందరు సూత్రధారులు బంగ్లాదేశ్‌లోనూ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. వారి ద్వారా ఒకరిని అక్రమంగా బోర్డర్ దాటించడానికి రూ.4 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది.

కీలకంగా వ్యవహరిస్తున్న రాహుల్...

బంగ్లాదేశీయులతో పాటు మయన్మారీల అక్రమ రవాణా దందాకు పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాలు కీలకంగా మారాయి. ఆయా దేశాల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అక్రమ రవాణా పెరిగింది. దీన్ని క్యాష్ చేసుకునేందుకు కొత్తగా ముఠాలు పుట్టుకువచ్చాయి. వీటికి నేతృత్వం వహిస్తున్న వ్యక్తులకు ఇటు పశ్చిమ బెంగాల్‌తో పాటు అటు బంగ్లాదేశ్‌లోని సరిహద్దు గ్రామాల్లో అనుచరులు ఉంటున్నారు. ఇలాంటి సూత్రధారుల్లో పశ్చిమ బెంగాల్‌లోని బసిర్హత్ జిల్లా సోలదాన గ్రామానికి చెందిన రాహుల్ అమన్ దాలి కీలకమని దర్యాప్తు అధికారులు గుర్తించారు. అక్రమంగా సరిహద్దులు దాటాలని భావించిన బంగ్లాదేశీయులు ఆ దేశంలో ఉన్న సరిహద్దు గ్రామాలకు చేరుతున్నారు. వీరిని సంప్రదిస్తున్న రాహుల్ అనుచరులు రూ.4 వేలకు.. డిమాండ్ ఎక్కువగా ఉంటే రూ.5 వేలకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

ఇక్కడి నుంచే కథ నడిపించే రాహుల్...

ఈ మొత్తాన్ని ఆ యువతులతోనే బంగ్లాదేశ్‌లోని సరిహద్దు గ్రామాల్లో ఉండే దుకాణదారుల వద్ద భారత కరెన్సీలోకి మార్పిస్తున్నాడు. మరికొందరు దళారుల ద్వారా ఈ నగదు బ్యాంకు ఖాతా లేదా యూపీఐ ద్వారా తనకు చేరేలా చేస్తున్నాడు. ఈ మొత్తం నుంచి రూ.1000 కమీషన్‌గా సరిహద్దుకు అటు–ఇటు ఉన్న గ్రామాలకు చెందిన తన అనుచరులకు ఇస్తుంటాడు. అక్కడ ఉన్న వారు అనువైన ప్రాంతం, సమయంలో యువతుల్ని పంపిస్తుండగా... ఇక్కడ ఉన్న వాళ్లు రిసీవ్ చేసుకుని సురక్షిత ప్రాంతానికి తరలిస్తుంటారు. రాహుల్ ఎక్కడా తెరపైకి రాకుండా ఈ వ్యవహారం నడిపిస్తుంటాడని అధికారులు చెబుతున్నారు. 2017 నుంచి ఈ దందా చేస్తున్న రాహుల్‌కు కోల్‌కతాకు చెందిన కొన్ని ముఠాలతో సంబంధాలు ఉన్నాయి. వారి సహకారంతోనే డిమాండ్ చేసిన మొత్తం చెల్లించిన వారికి నకిలీ గుర్తింపుకార్డులు తయారు చేయించి ఇస్తున్నాడు. ఇలా ఇక్కడి ఆధార్, ఓటర్ ఐడీలు పొందుతున్న బంగ్లాదేశీ యువతులు పశ్చిమ బెంగాల్ వాసులుగా చెలామణి అవుతున్నారు.

హైదరాబాద్ సహా మరికొన్ని చోట్లకు...

కొందరు దళారులు సదరు యువతులను హైదరాబాద్ సహా మరికొన్ని నగరాలకు తరలిస్తున్నారు. ఉద్యోగం పేరుతో తీసుకువచ్చి వ్యభిచార కూపాల్లోకి నెడుతున్నారు. అతి తక్కువ మంది మాత్రం మసాజ్ పార్లర్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో పని చేస్తున్నారు. ఇదే పంథాలో కొందరు బంగ్లాదేశ్ యువకులు కూడా అక్రమంగా సరిహద్దులు దాటి వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మనుషుల అక్రమ రవాణా నెట్‌వర్క్ పూర్వాపరాలతో ఓ సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు. ఎవరెవరు కీలకంగా వ్యవహరిస్తున్నారు? ఎక్కడ నుంచి సరిహద్దులు దాటిస్తున్నారు? తదితర అంశాలను నిఘా వర్గాలతో పాటు సరిహద్దు భద్రతా దళం దృష్టికి తీసుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లో నమోదైన మనుషుల అక్రమ రవాణా కేసుల్లో కొన్ని దర్యాప్తు నిమిత్తం జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్ఐఏ) చేరాయి. దీంతో ఆ విభాగంతో సమన్వయం ఏర్పాటు చేసుకుని, సమాచార మార్పిడి చేసుకోనున్నట్లు తెలిసింది.

నగ్న చిత్రాలు తీసి వేధింపులు

ఆరుగురిపై కేసులు నమోదు

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరచడమే కాకుండా అతని నగ్న చిత్రాలు తీసి బెదిరింపులకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బోయిన్‌పల్లికి చెందిన అనీషా, ఆమె భర్త కిరణ్ యాదవ్‌లకు మధ్య కేసు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కేసు నడుస్తోంది. అయితే అనీషాకు విడాకులు ఇష్టం లేకపోవడంతో ఈ విషయంలో మధ్యవర్తిత్వం చేయాలని తన సోదరి వినీత స్నేహితుడైన తరుణ్‌ను కోరింది. దీంతో మార్చి 26న ఈ విషయమై మాట్లాడేందుకు గుండపోచంపల్లికి వచ్చిన తరుణ్‌పై కిరణ్‌యాదవ్ అతడి స్నేహితులు కర్రలతో కొట్టి నగ్న చిత్రాలను తీసి సోషల్ మీడియాలో పెట్టి వేధిస్తున్నారు. దీంతో బాధితుడు తరుణ్ ఈ నెల 13న పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించగా నిందితులు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9.5 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు గుడిమల్కాపూర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి 9.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిమల్కాపూర్ రోడ్డు పిల్లర్ నెంబర్ 68 ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లుగా సమాచారం అందడంతో దాడులు చేసి పట్టుకున్నారు. ఈ కేసులో పర్వేస్ సిద్ధం, దివంత్ మహీధర్‌లను అరెస్ట్ చేయగా రితిక్ అనే వ్యక్తి పైన కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

బైసన్‌పోలో మైదానంలో పోలో మ్యాచ్



రసూల్‌పురా: సికింద్రాబాద్ బైసన్‌పోలో మైదానంలో తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఎగ్జిబిషన్ పోలో మ్యాచ్ నిర్వహించారు. ఆర్మీ 61వ క్యావల్రీ రెజిమెంట్, హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను దక్షిణ భారత ప్రాంత జనరల్ ఆఫీసర్ కమాండింగ్, లెఫ్టినెంట్ జనరల్ కరణ్‌దీప్ సింగ్ బ్రార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలో హైదరాబాద్‌కు తిరిగి వచ్చిందని, గుర్రపు స్వారీ క్రీడల పట్ల భారత సైన్యం నిబద్ధతను ప్రదర్శించిందని ప్రధాన పోలో గమ్యస్థానంగా నగరం తన స్థానాన్ని నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో పోలో రైడింగ్ క్లబ్, క్యావల్రీ రెజిమెంట్ జట్టు క్రీడాకారులు, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..


బాలిక అదృశ్యం..

బంజారాహిల్స్: సోషల్ మీడియాలో యాక్టివ్ ఉంటున్న ఓ బాలిక (16)ను తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో చెప్పకుండా అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని సయ్యద్ నగర్‌కు చెందిన బాలిక (16) ఐదేళ్ల క్రితం ఏడో తరగతి ఫెయిలైంది. రేయింబవళ్లు ఫోన్‌తోనే కాలక్షేపం చేసేది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలలో యాక్టివ్‌గా ఉంటూ రాత్రిళ్లు కూడా నిద్రపోకుండా ఫోన్‌తోనే కాలం వెళ్లదీస్తుండడంతో తల్లిదండ్రులు ఇటీవల ఫోన్ పక్కన పెట్టేసి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని మందలించారు. దీంతో మనస్తాపానికి లోనైన బాలిక గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తల్లిదండ్రులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నారు.

21 నుంచి అమర్‌నాథ్ యాత్ర మెడికల్ సర్టిఫికెట్లు జారీ

గాంధీ ఆస్పత్రిలో సోమ, బుధ, శుక్రవారాల్లో వైద్యపరీక్షలు

గాంధీఆస్పత్రి: హిమలింగాకారంలో కొలువుదీరిన ముక్కంటిని దర్శించుకునేందుకు అమర్‌నాథ్‌కు వెళ్లే యాత్రికులకు మెడికల్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానుంది. మెడికల్ బోర్డు ద్వారా ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించేందుకు రంగం సిద్ధం చేసినట్లు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. అమర్‌నాథ్‌కు వెళ్లే యాత్రికులు నిర్దేశిత మెడికల్ బోర్డు నుంచి ఆరోగ్య ధృవీకరణ పత్రం పొందాలనే కేంద్రప్రభుత్వ నిబంధన మేరకు తెలంగాణ ప్రభుత్వం గాంధీ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, కార్డియాలజీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ కిరణ్, జగదీశ్వర్‌రెడ్డి భానుప్రియ, కృష్ణనాయక్‌లతో మెడికల్ బోర్డును ఏర్పాటు చేసింది.



అమర్‌నాథ్ మంచులింగం

దరఖాస్తు చేసుకునేది ఇలా..

అమర్‌నాథ్ యాత్రికులు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో గాంధీ ప్రధాన భవనం మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డు సెక్షన్ (ఎంఆర్‌డీ)లో నేరుగా హాజరు కావాలి. దరఖాస్తును పూర్తి చేసి అందిస్తే వరుస క్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారు.

చేయించుకోవాల్సిన పరీక్షలు ఇవీ..

వైద్యపరీక్షలకు హాజరయ్యేవారు కంప్లీట్ బ్లడ్ ప్రొఫైల్లింగ్ (సీబీపీ), ఆర్థరైటీ సెడిమెంటేషన్ రేట్ (ఈఎస్ఆర్), కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్ (సీయుఈ), ఎలక్ట్రోకార్డియా గ్రామ్(ఈసీజీ)బ్లడ్ యూరియా, సీరం క్రియేటిన్, చెస్ట్ ఎక్స్‌రే నివేదికలను మెడికల్ బోర్డుకు సమర్పించాలి. 50ఏళ్ల వయసు పైబడిన వారు పై నివేదికలతోపాటు రెండు మోకాళ్లు (బోత్ నీస్) ఎక్స్‌రేలు జతచేయాలి. నివేదికలు పరిశీలించి, అవసరమైతే మరికొన్ని వైద్యపరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారు. ఈ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుంటే అమర్‌నాథ్ సమీపంలోని చెకింగ్ పాయింట్ల వద్ద కేంద్ర భద్రత బలగాలు యాత్రకు అనుమతించరు.

అదే స్లోగన్

- ఆ మూడు పార్టీలు ఒక్కటే..
- ఇరకాటంలో పెట్టడమే అజెండా
- గెలుపు మాటెలా ఉన్నా.. భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది.
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ప్లాన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. గెలుపోటములు మాట పక్కనపెడితే రజాకర్ల పాలనకు వ్యతిరేకంగా పోరాడేది ఒక్క బీజేపీ మాత్రమే అనే చర్చను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ మూడు పార్టీలు ఒక్కటే అనే స్లోగన్‌ను ఎంచుకుంటోంది. అవకాశం చిక్కినపుడల్లా ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇవి ఆయా పార్టీలను ఇరకాటంలో పెట్టే అంశాలే. ఈ పరిణామాలు ఇప్పటికిప్పుడు ఎలాంటి ప్రయోజనం చేకూర్చుతాయో లేదో పక్కన పెడితే వచ్చే జీహెచ్ఎంసీలో పార్టీకి మంచి ఆయుధంగా ఉపయోగపడతాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. శుక్రవారం నగరంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌లతో సహా, కార్పొరేటర్లు ఎన్నికల సన్నద్ధతపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్యనేతలు తమ ఆలోచనలను పంచుకున్నారు. రజాకర్ల పాలన వర్సెస్ బీజేపీ పోటీ పడుతున్నాయంటూ ప్రచారంలో దూసుకెళ్లాలని పలువురు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఎన్నికల సందర్భంగా పార్టీలకు అతీతంగా అందరూ కార్పొరేటర్లను కలసి తమకు ఓటు వేయాలని అభ్యర్థించాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ పరంగా ఉన్న కార్పొరేటర్ల సంఖ్యకు మించి ఎన్ని ఓట్లు ఎక్కువ వచ్చినా అది ప్రజల్లో బాగా చర్చ జరుగుతుందని గట్టిగా నమ్ముతున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీలో నిలబడలేదు. మనకంటూ కొంత మంది మద్దతు ఇచ్చేవారుంటారన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ అలా కాకుండా ప్రత్యర్థి పార్టీలు ఎంఐఎంకు ఓటు వేసి నట్టితే ఆ పార్టీలు ఒక్కటేనని మేం ఎప్పటి నుంచో చెబుతున్నాం. ఇప్పుడు తేటతెల్లమైందని గట్టిగా గళం విప్పొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఏం జరిగినా మన మంచికే అనే ధోరణ కనిపిస్తోంది.



రాజాసింగ్ గైర్హాజరు

పార్టీ పరంగా అత్యంత ముఖ్యమైన సమావేశానికి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోమారు డుమ్మాకొట్టారు. కీలక నేతలంతా హాజరైనా రాజాసింగ్ రాకపోవడం పట్ల పార్టీలో ఏం జరుగుతోందనే చర్చ జరుగుతోంది. ఇటీవల రాజాసింగ్‌ను ఎంపీ బండి సంజయ్ కలిసి, ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. దీంతో ఇకనైనా అలక వీడి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని అంతా ఆశించారు. అయితే గౌతం రావు అభ్యర్థిత్వాన్ని ఆది నుంచి వ్యతిరేకిస్తున్న రాజాసింగ్ తన పట్టుదల విడవలేదని మారోమారు స్పష్టమైంది.

నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం



చిక్కడపల్లి: మూఢ నమ్మకాల నిర్మూలనకు కందుకూరి వీరేశలింగం చేసిన సేవలు ఎనలేనివని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా కందుకూరి వీరేశలింగం యాదిలో పేరిట సంస్మరణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ బాల్యం వివాహాల కారణంగా ఎందరో యువతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారికి మళ్లీ పెళ్లి చేయాలని ఉద్యమించిన అభ్యుదయవాది కందుకూరి అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి. జయరాములు, కళా జనార్దనమూర్తి, శ్రీమణి, భమిడిపాటి ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలు

- 12 పడకలతో అత్యవసర కేర్ యూనిట్
- ప్రారంభించిన టీజీఎస్‌ఆర్‌టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: హృద్రోగ బాధితుల కోసం తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 12 పడకల సామర్థ్యంతో అత్యవసర కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సర్వీసులను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శుక్రవారం ప్రారంభించారు. ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ క్యాథ్‌ల్యాబ్‌కు ఆర్థిక సహకారం అందజేయగా, క్రిటికల్ కేర్ యూనిట్‌కు అశోక్ లేలాండ్ సంస్థ సహకరించింది. అత్యవసర విభాగానికి నిర్మాణ్ డాట్ ఓఆర్‌జీ సంస్థ ఆర్థిక తోడ్పాటును అందజేసింది. ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ..ఆర్టీసీకి ప్రధాన వనరులైన ఉద్యోగులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ పనితీరు బాగుంటుందన్నారు. ఆస్పత్రిని భవిష్యత్తులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తార్నాక ఆస్పత్రిలో కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా వైద్య సేవలు అందుతున్నాయని, 2021లో రోజు సగటు ఓపీ 600 ఉండగా, ప్రస్తుతం రెండు వేలకు చేరిందన్నారు. ఎంఆర్ఐ, సీటీస్కాన్‌తో పాటు ఎమర్జెన్సీ వార్డు 24 గంటల ఫార్మసీ, ఫిజియో థెరపీ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, మునిశేఖర్, వెంకన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజామూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూతురే.. కుమారుడిగా..

- తండ్రి చితికి నిప్పంటించిన బిడ్డ
- ముగిసిన వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ వెంకట్ రామ్ నర్సయ్య అంత్యక్రియలు



తండ్రికి దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె శాంతి

చిక్కడపల్లి: దేశంలోనే ప్రసిద్ధి గాంచిన వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకట్ రామ్‌నర్సయ్య (82) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని తన ఇంట్లో కన్నుమూశారు. ఆయనకు కుమారులు లేకపోవడంతో కుమార్తె శాంతి తండ్రి చితికి నిప్పటించి అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు తల్లి లక్ష్మితో పాటు శాంతి భర్త నవీన్ చక్రవర్తి ఆమోదం తెలపడంతో శుక్రవారం అంబర్‌పేట శ్మశాన వాటికలో ఆయన దహన సంస్కారాలు పూర్తి చేశారు. రామ్‌నర్సయ్య వృత్తి రీత్యా డాక్టర్ అయినా ప్రవృత్తి మాత్రం వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ. వైల్డ్‌లైఫ్ ఫొటో గ్రఫీలో అప్పటి కాంగ్రెస్ అగ్రనేత, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్‌కు ఆయన గురువు కావడం గమనార్హం. ఉమ్మడి ఏపీలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో దిగ్విజయ్‌సింగ్, డాక్టర్ వెంకట్ కలిసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆయన తీసిన పులుల ఫొటోలతో దేశంలోనే టాప్ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా పేరు తెచ్చిపెట్టాయి. అంతేగాకుండా పులులపై ఆయన ఓ పుస్తకాన్ని కూడా రాశారు.

ఏడు గంటలు ఖాళీగా కూర్చోబెట్టారు

మూడోసారి మన్నె క్రిషాంక్ విచారణ



గచ్చిబౌలి: ఎలాంటి ప్రశ్నలు అడక్కుండానే ఏడు గంటలు ఖాళీగా కూర్చోబెట్టాకని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్ అన్నారు. శుక్రవారం కంచె గచ్చిబౌలి సర్వే నెంబర్ 25 భూములకు సంబంధించి ఫేక్ వీడియోల కేసులో మూడో సారి ఆయన విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవాల్లో పాల్గొనకుండా పోలీసులు నోటీసులు ఇస్తున్నారన్నారు. ఎంతో మంది సోషల్ మీడియోలో వీడియోలు పెట్టారని వారందరిపై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కంచె గచ్చిబౌలి భూములు తాకట్టు పెట్టి రూ. 10 వేల కోట్లు తీసుకుంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గ్రూప్ వన్ ఫలితాలను ఇప్పటికే హైకోర్టు నిలిపివేసింది, అవకతవకలు బయటకు వస్తాయని విచారణ పేరిట కూర్చోబెడుతున్నారన్నారు. గ్రూప్ వన్ అభ్యర్థుల తరుపున కచ్చితంగా సోషల్ మీడియాలో ప్రశ్నిస్తామని, ఎన్ని కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. ఈనెల 23న విచారణకు హాజరు కావాలని గచ్చిబౌలి పోలీసులు నోటీసులు ఇచ్చారని, విచారణ పేరిట మానసికంగా వేధించడం ప్రభుత్వానికి మంచిదికాని, వేధింపులపై న్యాయపోరాటం చేస్తామన్నారు.జింకలు చావడం, చెట్లను నరికివేయడంపై సీఈసీ నివేదిక ఇచ్చిందన్నారు. సుప్రీం కోర్టు నమ్మిన వీడియోలను రాష్ట్ర మంత్రులు తప్పుబట్టడం సరికాదన్నారు.

యువకుడి ఆత్మహత్య...

మూసాపేట: మరో ఆరు రోజుల్లో పెళ్లి, అంతలోనే ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూసాపేట హబీబ్‌నగర్‌కు చెందిన మహ్మద్ చోటు (25) బేకరీలో పని చేసేవాడు. ఈ నెల 25న అతడిక పెళ్లి జరగాల్సి ఉంది. అయితే గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. అయినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపానికి లోనైన అతను శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలించగా పరీక్షించి వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరానగర్‌లో 'బీజేపీ గావ్ చలో'


బస్తీవాసులకు కరపత్రాలు అందజేస్తున్న లక్ష్మణ్

రహమత్‌నగర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా డివిజన్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరానగర్ బస్తీలో గావ్ చలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ..తెలంగాణలో బీజేపీ అధికారంలోని రావడం ఖాయమన్నారు. నాయకులు కొలన్ సత్యనారాయణ, రాంధారిబాబు, మహేష్, శివ, రామకృష్ణ, షేర్ ఆలం, గోపాల్, లావణ్య, శైలజ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఖైరతాబాద్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..ఫుట్‌పాత్‌పై నివాసముంటూ పలు ఫంక్షన్ హాళ్లలో కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న మహేష్ (35) గురువారం కూలీ పని కోసం ఫంక్షన్ హాల్ వెళ్లాడు. అక్కడే కారిడార్‌లో నిద్రపోయాడు. తోటి కూలీ మహ్మద్ జాఫర్ వచ్చి అతన్ని నిద్రలేపేందుకు ప్రయత్నించాడు. అతని నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం అందజేశారు. అంబులెన్స్ పిలిపించి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. జాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అఘోరి శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడిన అఘోరి శ్రీనివాస్ అలియాస్ శివను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో అఘోరిపై కేసులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అఘోరిగా చలామనవుతున్న శ్రీనివాస్ రాజ్యాంగాన్ని చట్టాలను రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ మాట్లాడారని ఆయన తెలిపారు. పలు ప్రసార సాధనాలల్లో ఇంటర్వ్యూల్లో ఇస్తున్న సందర్భంగా అఘోరి శ్రీనివాస్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు.

కుష్టువ్యాధి సర్వే పూర్తి

- అనుమానితుల గుర్తింపు
- రెండో దశలో రక్త పరీక్షలు
- లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి


కుష్టువ్యాధిపై సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బంజారాహిల్స్: కుష్టువ్యాధి అనారోగ్య సమస్యలతో పాటు శారీరిక వైకల్యాలకు కారణమవుతూ సమాజానికి పెనుసవాల్‌గా మారుతుంది. ఇది వంశపారపర్యంగా వస్తుందని, నయం కాదనే అపోహ గత కొన్నేళ్లుగా ప్రజల్లో నాటుకుపోయింది. దీంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో గత దశాబ్దకాలంగా రోగులు తగ్గుతూ వస్తున్నారు. అంతరించి పోతుందనుకుంటున్న తరుణంలో ఈ మహమ్మారి మళ్లీ చాపకింద నీరులా కొంత కాలంగా విస్తరిస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ తనిఖీల్లో బయటపడింది. దీంతో ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, షేక్‌పేట, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 10 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 బస్తీ దవాఖానాల పరిధిలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన తేదీల ప్రకారం 'లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్'(ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వేలో గణాంకాలు ఈ మహమ్మారి మళ్లీ విస్తరిస్తున్నట్లుగా వెల్లడైంది. మార్చి 17 నుంచి 30వ తేదీ వరకు వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఈ సర్వే చేపట్టారు.

ఇంటింటి సర్వే..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో 186 మందితో ఇంటింటి సర్వే చేశారు. ఖైరతాబాద్ జోన్ వ్యాప్తంగా 3 లక్షల మందిని సర్వే చేయాల్సి ఉండగా గడువు లోపు లక్ష మందిని సర్వే చేశారు. అనుమానంగా ఉన్న 166 మందిని గుర్తించారు. వీరికి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ఉన్న తాధికారులు, వైద్యులు వెళ్లి నేరుగా పరిశీలించి రక్త పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారిస్తారు. వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రతియేటా రెండుసార్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అనుమానితులను గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. ఇందులో భాగంగానే మొదటి దశ సర్వే పూర్తయ్యింది. వ్యాధి గురించి తెలిస్తే చుట్టుపక్కల వారు ఏమనుకుంటారోనని ఆలోచనతో, దూరం పెడతారనే భయం ఉండడంతో ఇతరులకు కూడా సోకే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

- కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా లెప్రే ద్వారా సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకిన 4 నుంచి 15 ఏళ్ల తర్వాత దుష్పరిణామాలు వెలుగుచూస్తాయి.
- శరీరంపై ఎక్కడైనా తెల్ల మచ్చలు ఉండి మెరుస్తున్నట్లయితే వెంటనే పరీక్షలు చేయించుకుని చికిత్స పొందితే ఈ వ్యాధి బారిన పడకుండా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు.
- నిర్లక్ష్యం చేస్తే శరీరమంతా బ్యాక్టీరియా విస్తరిస్తూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఏర్పడి క్రమేపీ అంగవైకల్యానికి గురవుతారని వైద్యాధికారులు సూచిస్తున్నారు.
- ఈ వ్యాధి సులువుగా ఒకరి నుంచి మరొకరికి సోకదని, అయితే ఎక్కువ కాలం వ్యాధిగ్రస్తులతో ఉంటే సంక్రమించే అవకాశాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు.

ఆందోళన అవసరం లేదు..

కుష్టువ్యాధిపై ప్రతియేటా వైద్యాధికారులు సర్వే చేయిస్తున్నారు. అవగాహన లోపంతో శరీరంలో మచ్చలు ఉన్నా పరీక్షలు చేయించుకునేందుకు కొంతమంది భయపడి ముందుకురావడం లేదని ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలింది. వ్యాధి నిర్ధారణ అయితే ఒకే ట్యాబ్లెట్‌తో ఇతరులకు సోకుండా ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. వ్యాధి తీవ్రత ను బట్టి ఆరు నెలల నుంచి ఏడాది పాటు వైద్యం అందిస్తారు. ఈ క్రిములు నరాలకు చేరకముందే చికి త్స పొందడం ద్వారా అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చని పేర్కొంటున్నారు. కుటుంబ సభ్యులు కూడా తమ ఇంట్లో ఎవరికైనా ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలని ప్రభుత్వాలు కోరుతున్నాయి. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ముప్పు ఉంటుందని, వైకల్యం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.


ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో..టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

బంజారాహిల్స్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు శిలువ నాటికలను కళాకారులు ప్రదర్శించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రపంచానికి ప్రేమతత్వం బోధించిన దయామయుడు ఏసుక్రీస్తు అన్నారు. షారోన్ చార్చి పాస్టర్ ఎం.ప్రభుదాస్ మాట్లాడుతూ..శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదర భావం ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చిలో ఏసుక్రీస్తును శిలువ ఎక్కించిన వైనాన్ని కళ్లకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు వచ్చే క్రైస్తవ కుటుంబాలు కన్నీటి పర్యంతం అయ్యాయి.


షారోన్ చర్చిలో..


బంజారాహిల్స్ రోడ్ నెం 9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చిలో క్రీస్తు శిలువ నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

రహమత్‌నగర్‌లో..

రహమత్‌నగర్: గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని వినాయకనగర్ సీఎస్ఐ సెయింట్ పీటర్ చర్చిలో రెవరెండ్ జ్ఞానప్రసాద్ రావు నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి కార్యదర్శి అమృత్ పి.శ్రీనివాస్, దేవాదాస్ తదితరులు పాల్గొన్నారు. బోరబండ సైట్–2 ఎస్ఆర్ఆర్‌పురం సెయింట్ ప్రాన్సిస్ చర్చిలో ఏసు శిలువ మోసే విధానంపై ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. విక్టర్ జాకబ్, యాజిన్, క్లైమెంట్‌తో పాటి జేసీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వినాయకనగర్ సీఎస్ఐ చర్చిలో వాఖ్యోపదేశం చేస్తున్న రెవరండ్ జ్ఞాన ప్రసాద్‌రావు

అంజన్ కుమార్ యాదవ్ దిష్టిబొమ్మ దహనం

శ్రీనగర్‌కాలనీ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అసభ్యపదజాలంతో మాట్లాడిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ నేతలు మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కుంబాల గంగరాజు హెచ్చరించారు. శుక్రవారం అమీర్‌పేట చౌరస్తాలో బీజేపీ నేతలు మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ విషయమై డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని, కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడిపై అనుచిత, అసభ్యపదజాలాన్ని వాడటం సిగ్గుచేటని విమర్శించారు. నేతలు ప్రేమ్‌కుమార్, అనంతలక్ష్మి, విజయ్ కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


అంజన్‌కుమార్ యాదవ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నేతలు

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో 'ఆపరేషన్ రోప్'నిర్వహించి పెద్ద ఎత్తున ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సితార హోటల్ వరకు రోడ్డుకు రెండువైపులా 30కి పైగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. నెలన్నర క్రితం ఇదే రోడ్డులో భారీ ఎత్తున ఆపరేషన్ రోప్ నిర్వహించి 100కు పైగా ఆక్రమణలు తొలగించగా, ఇటీవల కొందరు చిరువ్యాపారులు మళ్లీ ఫుట్‌పాత్‌లను కబ్జా చేసి ఆక్రమించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పోలీసులు మరోసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్డుకు రెండువైపులా ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు

రహమత్‌నగర్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..ఫాతీమానగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్ వద్ద ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో గురువారం రాత్రి సెక్టార్ ఎస్సై మనోజ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి దాడి చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న సాయి చరణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఒక సెల్ ఫోన్ స్వాధినం చేసుకుని గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

చెత్త కాల్చివేతకు చెక్


న్యాయ విహార్ వద్ద చెత్త ఖాళీ స్థలం చుట్టూ గోడ కట్టిన జీహెచ్ఎంసీ అధికారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని న్యాయ విహార్, భరణి లే అవుట్ దాటిన తర్వాత ఉన్న ఖాళీ స్థలంలో నిత్యం కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను కాలుస్తూ వాతావరణ కాలుష్యానికి పాల్పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు న్యాయ విహార్‌లో ఉండే పలువురు న్యాయమూర్తులతో పాటు స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా జీహెచ్‌ఎంసీ అధికారులు న్యాయ విహార్ దాటిన తర్వాత రోడ్డును ఆనుకొని ఉన్న స్థలానికి దాతల సహకారంతో ప్రహరీని నిర్మించారు. దీంతో ఈ ఖాళీ స్థలంలోకి వెళ్లి చెత్తను కాల్చే అవకాశం ఉండదని అధికారులు తెలిపారు.

భూదాన్ భూములను నిరుపేదలకు పంచాలి

హిమాయత్‌నగర్: భూదాన్ భూములను నిరుపేదలకు పంచాలని అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూదాన్ భూదాత వెదిరె రామచంద్రారెడ్డి కుమారుడు వెదిరె ప్రోమోతిష్ చంద్రరెడ్డి, అఖిల భారత సర్వసేవ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తోలుపునురి కష్టగౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భూదాన్ ఉద్యమం ప్రారంభించబడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఏడాది పాటు వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం మహారాష్ట్రలోని కొల్హాపూర్ పట్టణంలో భూదాన్ ఉద్యమం వజ్రోత్సవాలను ప్రారంభిస్తున్నామని, అనంతరం ఏడాదిపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, జిల్లాలో జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా జులై 17న హైదరాబాద్‌లో లక్ష మందితో ఈ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

శ్రీనగర్‌కాలనీ: టీబీపై అపోహలను నివృత్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలంగాణ టీబీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, చార్మినార్, మారేడుపల్లి, జంగమ్మెట్ పరిసర ప్రాంతాల్లో టీబీ రోగులకు ప్లాన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. టీబీ వ్యాధి నివారణకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని, పౌష్టికాహారం చాలా ముఖ్యమని టీబీ జిల్లా నియంత్రణాధికారి డాక్టర్ చల్లాదేవి తెలిపారు.


సోమాజిగూడ బొంగుల బస్తీలో...


పంజగుట్టలో..


అమీర్‌పేట్ ఫిష్‌మార్కెట్ వద్ద...

వాన..హైరానా

ఒక్కసారిగా దంచికొట్టిన వానతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, అమీర్‌పేట్, ఫిలింనగర్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వానకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. దీంతో రహదారులన్నీ వాహనాలతో స్తంభించిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు సజావుగా వాహనాలు ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు. – బంజారాహిల్స్


శ్రీనగర్ కాలనీలో...


హైదర్‌గూడా వద్ద ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు


పంజగుట్ట బిగ్‌బజార్ ఎదురుగా...

వివాహం విషయంలో గొడవ.. యువకుడిపై దాడి

ఫిలింనగర్: వివాహం విషయంలో తలెత్తిన గొడవలో ముగ్గురు వ్యక్తులు కలిసి ఓ యువకుడిపై దాడి చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మణికొండ మెయిన్‌రోడ్డులోని అల్కాపూర్ టౌన్‌షిప్ ప్రాంతంలోని నిజాం అలీ (22) హెయిర్‌స్టైలిస్ట్. అతని సోదరుడు ఇస్లాంకు తర్నుమ్ అనే యువతితో వివాహం నిశ్చయమైంది. అయితే కొన్ని రోజుల నుంచి నౌషాద్ అనే వ్యక్తి ఇస్లాంకు ఫోన్ చేసి వివాహాన్ని రద్దు చేసుకోవాలని కోరాడు. ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో నిజాం అలీ తన సమీప బంధువు నజీమ్‌తో కలిసి ఓయూ కాలనీలోని సెలూన్ ఫ్రెష్ టచ్ సెలూన్ ముందు నిలబడ్డాడు. అదే సమయంలో నౌషాద్ తన స్నేహితులు సబాబ్, అఫ్జల్‌తో కలిసి అక్కడికి వచ్చి నిజాం అలీపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో నిజాం అలీ తలకు గాయం కాగా, అడ్డుకున్న నజీమ్ ముక్కుపై గాయలయ్యాయి. ఆ తర్వాత ఆ ముగ్గురూ అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మే 20న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ వైద్య, ఆరోగ్య కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.నరసింహ(ఏఐటీయూసీ), భూపాల్(సీఐటీయూ), జి.రాజశేఖర్(ఐఎన్‌టీయూసీ), డాక్టర్ జి.శాంతి కుమార్(బీఆర్‌టీయూ) మాట్లాడారు. వైద్య రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీబాయి, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసీయుద్దీన్, నేతలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

బంజారాహిల్స్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సాయిరెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని బీఎస్ ఎంటర్‌ప్రైజెస్ గ్యాస్ గోడౌన్‌లో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఎలా నియంత్రించాలి.. ఆస్తి నష్టం జరగకుండా ఎలా వ్యవహరించాలి అనే విషయాలను ప్రయోగాత్మకంగా తెలియజేయడమే కాకుండా వెంటనే 101కు కూడా ఫిర్యాదు చేయాలని, సకాలంలో సిబ్బంది అక్కడికి చేరుకుంటారన్నారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ఆస్తి నష్టంతో పాటు ఇతర ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరించారు.


అవగాహన కల్పిస్తున్న జూబ్లీహిల్స్ ఎస్ఎఫ్ఓ సాయిరెడ్డి

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్ । శనివారం । 19 । ఏప్రిల్ । 2025

కౌంట్.. అండ్ ఈట్..



- మెనూలో కేలరీల సమాచారం అందిస్తున్న రెస్టారెంట్లు
- కేలరీస్ కౌంటింగ్ తెలిపే యాప్స్ వినియోగం
- తగ్గినా.. పెరిగినా.. అనారోగ్యమే..
- అవగాహన అవసరం అంటున్న పోషకాహార నిపుణులు

ఏది తింటే ఎన్ని కేలరీలు? అని కొలుస్తున్న నగరవాసులు

వస్తువుల్ని తూకమేసి అమ్మడం తెలిసిందే.. కానీ కొలత వేసి తినడం ఇప్పుడు సిటీజనులు అలవాటు చేసుకుంటున్నారు. సుష్టుగా తినడానికి బోలెడన్ని అవకాశాలున్నా వాటిని సరిగ్గా జీర్ణించుకునేందుకు తగిన శారీరక శ్రమ లేని నేపథ్యంలో నగరవాసుల 'పొట్ట'తిప్పలు కొత్త దారి పట్టాయి. అవసరాన్ని మించిన ఆహారం ఆరోగ్యానికి చేటు అని గుర్తిస్తూ.. తింటున్న ఆహారాన్ని కొలిచే పనిలో పడ్డారు. వీరికి నగరంలో చెఫ్‌లు, న్యూట్రిషనిస్టుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన తరగతులు ఉపకరిస్తున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో



రుచికన్నా మన శరీరానికి కలిగే లాభం మిన్న అనే ఆరోగ్య స్పృహ నగరవాసుల్లో బాగా పెరిగిందని నగరానికి చెందిన చెఫ్ కుమార్ అంటున్నారు. గతంలో అత్యంత రుచికరమైన వంటలు ఎలా చేయాలో అడిగిన మహిళలు ఇప్పుడు పోషక విలువలతో కూడిన ఆహారం గురించి అడుగుతున్నారని చెప్పారు. తరచూ తాము నిర్వహిస్తున్న స్మార్ట్ స్నాకింగ్ సెషన్స్‌లో ఒక్కోసారి ఒక్కో దినుసుతో ఆరోగ్యకరమైన వంటలు ఎలా చేయాలో నేర్పుతున్నామని, ఈ క్లాసెస్‌కి ఆదరణ బాగుందన్నారు.

ఎంత వరకూ యాప్?


పలు యాప్స్ సిటీజనుల ఆహారపు అలవాట్లను పర్యవేక్షిస్తున్నాయి. తింటున్న ఆహారం ద్వారా వారికి అందుతున్న కేలరీలను అవి ఖర్చవుతున్న తీరూ చెబుతున్నాయి. అయితే కొన్ని యాప్స్ అమెరికన్/విదేశాల ఫుడ్ వాల్యూస్‌తో తయారైనవి కాబట్టి మనకి అవి పూర్తిగా కరెక్టా కాదా? అనేది ఖచ్చితంగా చెప్పలేమని న్యూట్రిషనిస్టులు అంటున్నారు.

మెనూలోనూ సమాచారం..

నగరంలోని పలు స్టార్ హోటల్స్, టాప్‌క్లాస్ రెస్టారెంట్లు తమ వంటకాల మెనూలోనే కేలరీల సమాచారాన్ని కూడా పొందుపరుస్తున్నాయి. రెస్టారెంట్స్‌లో తినడం అనే అలవాటు నగరాల్లో పెరిగిపోయిన నేపథ్యంలో 2022లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ(ఎఫ్ఎస్ఎస్ఎఐ) రెస్టారెంట్లు తమ మెనూలోని వంటకాలు అందించే కేలరీల గణనను తప్పనిసరిగా పేర్కొనాలని ఆదేశించింది. దాంతో పలు స్టార్ హోటల్స్ ఈ ఆదేశాలను పాటిస్తుండటం వల్ల నగరవాసులకు తాము తీసుకుంటున్న ఆహారం అందించే కేలరీలపై అవగాహన ఏర్పడుతోంది.

అవగాహన తరగతులూ షురూ..

'బాదం పప్పులు రోజువారీగా ఆహారంలో తీసుకోవడం మంచిది. కేవలం 4 పప్పులు తీసుకుంటే 29గ్రాముల ప్రొటీన్, 15 గ్రాముల కార్బొహైడ్రేట్స్, 322 మి.గ్రా కాల్షియం, 987 మి.గ్రా పొటాషియం, 322 మి.గ్రా కాల్షియం, 16.2 మి.గ్రా పీచు పదార్థాలు, 460 మి.గ్రా సోడియం.. వగైరాలు లభిస్తాయి'.. శ్రీనగర్ కాలనీలో తన కుమార్తెకు వివరంగా చెబుతున్న మధ్యవయస్కురాలైన సుగుణ ఇటీవల తాజ్ డెక్కన్ హోటల్‌లో ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా సంస్థ నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరవడం ద్వారా ఇలాంటి విషయాలు తెలుసుకోగలిగారు. ఇదేవిధంగా నగరానికి చెందిన మరి కొందరు గృహిణులు సైతం పోషకాహారంపై అవగాహన పెంచుకుంటున్నారు.



కేలరీస్.. కేర్‌ఫుల్ ప్లీజ్..

అధిక కేలరీల వల్ల ఊబకాయం, డయాబెటిస్, కేన్సర్ తదితర వ్యాధులకు దారితీస్తుంది. తగినంత కేలరీలు పొందకపోవడం పోషకాహార లోపం, అలసట, కండరాల నష్టం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు దారి తీస్తుంది. అంటువ్యాధులు, ఆందోళన ఏకాగ్రత లోపం పెంచుతుంది. అధిక కేలరీల భారం లేకుండా కీలకమైన పోషకాలను అందించే పండ్లు, కూరగాయలు, లీన్ ప్రొటీన్లు తృణధాన్యాలు వంటి పూర్తి, ప్రాసెస్ చేయని ఆహారాలను తీసుకోవాలి. తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు ఆహారాన్ని ప్రోత్సహించడానికి చిన్న ప్లేట్లు గిన్నెలను ఉపయోగించడం ద్వారా అతిగా తినడం తగ్గించాలి. చక్కెర పానీయాలు, ప్రాసెస్ చేసిన స్నాక్స్ సాధారణంగా పోషకాలు లేనివిగా, అధిక కేలరీలు కలిగి ఉంటాయి. అటువంటి ఆహారాలకు దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాలను ఎంచుకోవాలి. ప్రతి భోజనం నిదానంగా చేయాలి.. నెమ్మదిగా నమలాలి, ప్రతి బైట్‌ను ఆస్వాదించడానికి పరధ్యానాన్ని వదలాలి. రెగ్యులర్ శారీరక శ్రమ శక్తిని ఖర్చు చేయడం ద్వారా కేలరీలను సమతుల్యం చేయడంలో సహాయ పడుతుంది. వారానికి కనీసం 150 నిమిషాల మితమైన–తీవ్రతతో వ్యాయామం చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలి.



ఆచి తూచి.. ఆలోచించి..

ఆహారం మీద సిటిజనుల్లో అవగాహన పెరగడం మంచి పరిణామమే. కానీ ఇంకా చాలా విషయాల్లో సరిపడా లేదనే చెప్పాలి. ఉదాహరణకు టీలు, కాఫీలు తాగితే ఏమీ కాదనుకుంటారు. కానీ టీ లేదా కాఫీ కూడా రోజుకి 2 కప్పులు మించకూడదు. దానిలో ఉండే పంచదార, పాలు కేలరీలను పెద్ద సంఖ్యలోనే జమ చేస్తాయి. అలాగే ఆల్కహాల్ తాగితే ద్రవమే కదా కేలరీలు రావనుకుంటారు. కానీ 1ఎం.ఎల్ ఆల్కహాల్‌తో 7 కేలరీలు వస్తాయి. దానికి తోడు మంచింగ్ పేరుతో స్నాక్స్ అవీ జత చేస్తే మరింత హాని కలుగుతుంది. ఒకటే ఆహార పదార్థం ఇంట్లో వండిన దానికి బయట కొన్న దానికి కేలరీల్లో చాలా తేడా ఉంటుంది. బయట వండేవారు రుచి కోసం కలిపే నూనెలు, ఉప్పులు, దినుసుల వల్ల ఆ తేడా వస్తుంది. కూల్ డ్రింక్స్ కూడా అధికంగా కేలరీలను అందిస్తాయి. సగటున ఒక వ్యక్తి 1800 నుంచి 2200 వరకూ కేలరీలను తీసుకోవచ్చు. అయితే శారీరక శ్రమ, చేసే పని బట్టి ఇందులో కొద్దిగా మార్పు చేర్పులు ఉంటాయి. జాగ్రత్త పడినా బరువు పెరుగుతున్నామంటే మనం పాటిస్తున్న, అనుసరిస్తున్న ఆహారపు అలవాట్లలో లోపం ఉన్నట్లే భావించి తగిన వైద్య సలహా తీసుకోవాలి. – డా.జానకి, న్యూట్రిషనిస్ట్




అందమంతా చీరలోనే..

సంప్రదాయ చేనేత చీరలంటే తనకు ఎంతో ఇష్టం అన్నారు నటి సంయుక్త మీనన్. ఏఎస్ రావునగర్‌లో నీలాంబరి సిల్క్స్ ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతీ ప్రత్యేక సందర్భంలోనూ చీర కట్టేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని, చీరకట్టుకు మించిన అందం ఎందులోనూ రాదని అన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు బి.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



శారీ.. ఎంతో ఇష్టం..

సంక్రాంతి వస్తున్నాం.. మూవీ ఫేమ్ ఐశ్వర్య రాజేశ్ కూకట్‌పల్లిలో శుక్రవారం సందడి చేశారు. జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన కనక వస్త్ర సిల్క్స్‌ను ఆమె ప్రారంభించారు. ఆకర్షణీయమైన చీరకట్టుతో హాజరై పలువురితో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగుదనాన్ని ప్రతిబింబించే చీరకట్టు ఎంతో ఇష్టమని తెలిపారు. సంప్రదాయానికి అధునాతన హంగుల సమ్మేళనంతో అందమైన కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు, డైరెక్టర్ పోతంశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. షోరూం సహ డైరెక్టర్లు మాతురి పవన్ కుమార్, జున్నా రోహిత్‌రెడ్డి, నాగశ్రీరెడ్డి పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



కుంచె పడితే.. బొమ్మ అదిరిపోవాల్సిందే..

ఆయన వృత్తిరీత్యా పశువైద్యుడు, ప్రొఫెసర్.. కుంచె పడితే మాత్రం బొమ్మ అదిరిపోవాల్సిందే. ఇష్టంగా నేర్చుకున్న కళను దూరం చేసుకోలేక సమయం చిక్కినపుడల్లా ఇంట్లో, కార్యాలయంలో అద్భుతమైన పెయింటింగ్స్ వేస్తూ ఔరా.. అనిపిస్తున్నాడు. కాన్వాస్ క్లాత్‌పై ఆక్రలిక్ వాటర్ పెయింట్స్‌తో బొమ్మకు జీవం పోస్తున్నాడు పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాంసింగ్ లకావత్. ఒక దశలో చదువును పక్కనపెట్టి పెయింట్సింగ్‌పైనే దృష్టిపెట్టాలని బలంగా నిర్ణయించుకున్నా కుటుంబ సభ్యుల ఒత్తిడితో ఉన్నత చదువులు చదివి, ఉద్యోగంలో చేరానని చెబుతున్నారు. ఆయన మాటల్లోనే మరికొన్ని విశేషాలు.. – సాక్షి, సిటీబ్యూరో

వృత్తి ప్రొఫెసర్.. ప్రవృత్తి పెయింటింగ్ | ఇల్లు, కార్యాలయం ఎక్కడ చూసినా చిత్రాలే.. | అద్భుత చిత్రాలతో ఔరా అనిపిస్తున్న రామ్‌సింగ్ లకావత్



8వ తరగతి నుంచే ఆసక్తి

పాఠశాల స్థాయిలోనే పెయింటింగ్స్‌పై ఆసక్తి ఉండేది. 8వ తరగతి నుంచి గోడలపై రాతలు రాయడం అలవాటు. కాస్త పెద్దయ్యాక ఎన్నికల సమయంలో వివిధ పార్టీల అభ్యర్థులు మా పార్టీకి సంబంధించిన పెయింటింగ్స్ వేయడం లేదని, వాళ్లవే వేస్తున్నాడు మీ కొడుకు అంటూ ఇంటికి గొడవలు వచ్చేవి. ఇలాంటి సందర్భాల్లో చాలాసార్లు తల్లిదండ్రులు ఎందుకురా నీకు ఈ రాతలు, అవన్నీ వచ్చి మన ఇంటిపై పడుతున్నాయని మందలించేవారు. అయినా నాకు ఆసక్తి తగ్గలేదు. దారిన పోతున్నప్పుడు అక్కడ ఎవరైనా పెయింట్స్ వేస్తుంటే చూస్తూ ఉండిపోయేవాడిని. పెద్దపెద్ద చిత్రకారుల చిత్రాలను చూసినప్పుడు నేను ఇంతటి గొప్ప చిత్రాలు వేయాలనుకునేవాడిని. జంతువులు, ప్రకృతి, పండగలు, మనుషులు తదతర అంశాలపై పెయింట్స్ వేయడానికి ఆసక్తి చూపిస్తాను. కాన్వాస్ క్లాత్‌పై ఆక్రలిక్ వాటర్ పెయింట్స్ వేయడం నాకు హాబీగా మారింది. కళాశాల రోజుల్లో అనాటమి విద్యార్థులు చిత్రాలు వేసేవాడిని.

జైపూర్‌లో.. ప్రథమ బహుమతి

తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ లోగో తయారీకి ఓపెన్ కాంపిటేషన్ పెట్టారు. లోగో మొత్తం తయారు చేసి, దీనికి సంబంధించిన సీడీ, ఇతర అన్ని రకాలుగా యూనివర్సిటీకి అందించాను. లోగో విడుదల చేసినప్పుడు మొత్తం 96 శాతం నేను వేసిన లోగోనే ఉంది. రెండు చిన్న మార్పులు చేశారు. కళాకారుడిగా డబ్బుతో కాకుండా పేరుతో సంతృప్తి చెందేవాడిని. తర్వాత చాలా పోటీల్లో పాల్గొన్నాను. ఆర్ట్ కాంపిటేషన్ జైపూర్‌లో ప్రథమ బహుమతి వచ్చింది. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైన్ ఆర్ట్స్



యూనివర్సిటీల కాంపిటేషన్‌లో ప్రథమ బహుమతి వచ్చింది.





నా మనసు దోచాయి..

అందరికీ నచ్చే ఆభరణాలు.. నా మనస్సు దోచాయని సినీనటి పాయల్ రాజ్‌పుత్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ జ్యూవెల్ ఎగ్జిబిషన్‌ను పలువురు సినీతారలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. 100కి పైగా టాప్ జ్యూవెలరీ డిజైన్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు వివాహాది శుభకార్యాలకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంప్రదాయ జ్యూవెలరీ నగరవాసులను ఆకట్టుకుంటున్నట్లు తెలిపారు. నటి శ్రవంతి చోకరపు, నయని పావని, కుషిత కల్లపు తదితరులు పాల్గొన్నారు. – మాదాపూర్

నృత్యోత్సాహం..



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా న్యూజెర్సీ నుంచి వచ్చిన కూచిపూడి కళాకారిణి నీలిమరాజు శుక్రవారం నృత్య ప్రదర్శనతో అలరించారు. సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ నాట్యగురువు పద్మకళ్యాణ్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. కళాకారులు కృతిక, కుందన, శాన్విక, శ్రీలత, సహస్ర, వన్య, నేత్ర, ఉపశ్రీ, సాహితి, ఆశ్రిత, చక్రికా, రిధి పాల్గొన్నారు. – మాదాపూర్



చికుబుకు చికుబుకు రైలు

రైల్ మ్యూజియం సూపర్..

ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లోని రైల్ మ్యూజియంలోకి ఉచిత సందర్శన సదుపాయాన్ని కల్పించారు. పిల్లలు, పెద్దలు, ప్రయాణికులు వారి కోసం తరలి వచ్చిన బంధుమిత్రులు మ్యూజియంను సందర్శించారు. నిజాంకాలం నాటి రైల్ ఇంజిన్లు, సిగ్నలింగ్ వ్యవస్థ, లోకోమోటివ్‌లు తదితర వస్తువులను ప్రదర్శించారు. 1916లో కాచిగూడ స్టేషన్‌ను నిర్మించినప్పటి దృశ్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో





ప్రీమియం.. హోమ్..

Premium Home

రూ.కోటికి తగ్గకుండా ఉండేలా..

అందుబాటు ఇళ్లపై తగ్గుతున్న ఆసక్తి | ప్రీమియం యూనిట్ల వైపు కస్టమర్ల మొగ్గు

లగ్జరీ ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లలో 17 శాతం వృద్ధి

నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి

సొంతింటి కల సాకారం చేసుకునేందుకు నగరవాసులు ఎంతైనా ఖర్చు చేసేందుకు ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. జేబుకు భారం కాకుండా బడ్జెట్ ఇళ్లను కొని, తర్వాత బాధపడే బదులు.. భవిష్యత్తు అవసరాలను ముందుగానే ఊహించి అధిక విస్తీర్ణం కలిగిన ఖరీదైన గృహాలను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో గ్రేటర్‌లో రూ.50 లక్షలలోపు ధర ఉండే అందుబాటు ఇళ్ల విక్రయాలు క్రమంగా తగ్గుతూ.. రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉండే ప్రీమియం యూనిట్ల అమ్మకాలు పెరుగుతున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

నగరంలో ఈ ఏడాది మార్చిలో జరిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో అఫర్డబుల్ హౌసింగ్ వాటా 55 శాతంగా ఉంది. కానీ, గతేడాది ఇదే నెలలోని 60 శాతంతో పోలిస్తే మాత్రం ఈ విభాగం వాటా 14 శాతం మేర తగ్గింది. అదే రూ.కోటి కంటే ఖరీదైన ఇళ్ల వాటా ఏడాది కాలంలో 17 శాతం మేర పెరిగింది. మార్చిలో రిజిస్ట్రేషన్స్ అయిన మొత్తం ప్రాపర్టీలలో ఖరీదైన ఇళ్ల వాటా 19 శాతంగా ఉంది. గతేడాది ఇదే నెలలో ఈ విభాగం వాటా 15 శాతమే. దీని అర్థం.. గృహ కొనుగోలుదారులు అందుబాటు గృహాల నుంచి క్రమంగా ఖరీదైన ఇళ్ల వైపు మొగ్గు చూపిస్తున్నారని నైట్‌ఫ్రాంక్ ఇండియా నెలవారీ నివేదిక వెల్లడించింది.

గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్ గణాంకాలివీ

	యూనిట్ల సంఖ్య		విలువ (రూ.కోట్లలో)	
	2024	2025	2024	2025
జనవరి	5,444	5,464	3,293	3,463
ఫిబ్రవరి	7,135	5,988	4,362	3,925
మార్చి	6,870	6,327	4,275	4,471

(మార్చి) ధరల వారీగా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ గణాంకాలివీ

	యూనిట్ల సంఖ్య		ప్రాపర్టీల విలువ	
	2024	2025	2024	2025
రూ.50 లక్షలలోపు	4,100	3,509	2,551	2,480
రూ.50 లక్షల నుంచి రూ.కోటి	1,731	1,605	1,077	1,134
రూ.కోటిపైన	1,039	1,213	647	857



రూ.4,471 కోట్ల విలువైన ప్రాపర్టీలు..

గ్రేటర్‌లో గత నెలలో 6,327 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్స్ అయ్యాయి. వీటి విలువ రూ.4,471 కోట్లు.. అయితే అంతకు క్రితం నెలతో పోలిస్తే ప్రాపర్టీల విలువ రూ.14 శాతం మేర, రిజిస్ట్రేషన్లు 6 శాతం వృద్ధి చెందాయి. ఫిబ్రవరిలో రూ.3,925 కోట్ల విలువైన 5,988 యూనిట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అయితే గతేడాది మార్చితో పోలిస్తే మాత్రం రిజిస్ట్రేషన్లు 8 శాతం తగ్గగా.. విలువ 4 శాతం మేర పెరిగింది. 2024 మార్చిలో రూ.4,275 కోట్ల విలువైన 6,870 యూనిట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి.



2 వేల చ.అ. కంటే విస్తీర్ణమైనవి..

గత నెలలో రూ.2,480 కోట్ల విలువైన 3,509 అఫర్డబుల్ యూనిట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అయితే గతేడాది ఇదే నెలతో పోలిస్తే మాత్రం ఇది 14 శాతం తక్కువ. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ధర ఉన్న 1,605 యూనిట్లు మార్చిలో రిజిస్ట్రేషన్ కాగా.. వీటి విలువ రూ.1,134 కోట్లు. 2024 మార్చితో పోలిస్తే ఈ విభాగంలోనూ రిజిస్ట్రేషన్లు 7 శాతం మేర తగ్గాయి. ఇక, రూ.కోటి కంటే ఖరీదైన ఇళ్లు గత నెలలో 1,213 రిజిస్ట్రేషన్ కాగా.. వీటి విలువ రూ.857 కోట్లు. అయితే గతేడాది మార్చితో పోలిస్తే మాత్రం ప్రీమియం ఇళ్ల విభాగంలో రిజిస్ట్రేషన్లు 17 శాతం, విలువలు 33 శాతం మేర వృద్ధి చెందాయి. గతేడాది మార్చిలో 2 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన ఇళ్ల వాటా 13 శాతంగా ఉండగా.. గత నెలకొచ్చే సరికి 16 శాతానికి పెరిగింది. 1,000 నుంచి 2,000 చ.అ. యూనిట్ల వాటా 71 శాతం నుంచి 68 శాతానికి తగ్గింది.



- నియో పోలిస్‌లో ఎంఎస్ఎన్ లగ్జరీ ప్రాజెక్ట్
- 7.7 ఎకరాల్లో 655 ఫ్లాట్ల నిర్మాణం
- వచ్చే ఐదేళ్లలో 2 కోట్ల చ.అ. అభివృద్ధి లక్ష్యం
- ఎంఎస్ఎన్ గ్రూప్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి వెల్లడి

వన్ @ 55 అంతస్తులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ నిర్మాణ సంస్థ ఎంఎస్ఎన్ రియాల్టీ అద్భుతమైన ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నియోపోలిస్ ప్రాంతంలో అల్ట్రా లగ్జరీ హైరైజ్ ప్రాజెక్ట్‌ను 'వన్'ను నిర్మించనుంది. 7.7 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,750 కోట్ల పెట్టుబడులతో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనుంది. 40 లక్షల చ.అ.లలో నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్‌లో 5 టవర్లు, ఒక్కోటి 55 అంతస్తుల్లో ఉంటుంది. 5,250 చ.అ. నుంచి 7,460 చ.అ. విస్తీర్ణంలో మొత్తం 655 యూనిట్లు ఉంటాయి. ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలను సంస్థ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అన్నీ 4 బీహెచ్‌కే యూనిట్లే ఉండే ఈ ప్రాజెక్ట్‌లో చ.అ. ధర రూ.11 వేలుగా ఉంటుంది. ప్రతి అపార్ట్‌మెంట్‌కు రెండు బాల్కనీలు, లార్జ్ డెక్ ఉంటుంది. గండిపేట చెరువు వ్యూ ఉండే ఈ ప్రాజెక్ట్‌లో 1.8 లక్షల చ.అ. విస్తీర్ణంలో క్లబ్ హౌస్ ఉంటుంది. ఇందులో 30కి పైగా ఆధునిక వసతులు ఉంటాయి. మూడు స్విమ్మింగ్ పూల్స్, యోగా డెక్, స్కై సినిమా, ఆక్వా జిమ్, వెల్‌నెస్, లైఫ్‌స్టైల్ జోన్లతో పాటు బ్యాడ్మింటన్, స్క్వాష్, పికిల్‌బాల్, ప్యాడిల్ బాల్ కోర్టులు, బౌలింగ్ అల్లే, క్రికెట్, ఫుట్‌బాల్, గోల్ఫ్ కోసం ప్రత్యేక సిమ్యులేటర్లు ఉంటాయని ఆయన వివరించారు. నగరంలో వచ్చే ఐదేళ్లలో 2 కోట్ల చ.అ.లలో ప్రాజెక్ట్‌లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు.



పీఈ డౌన్..

సాక్షి, సిటీబ్యూరో: దేశీయ స్థిరాస్తి రంగంలోకి వచ్చిన ప్రైవేట్ ఈక్విటీ(పీఈ) పెట్టుబడులు కాస్త తగ్గాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన పెట్టుబడులు అంతకుముందు ఏడాదితో పోలిస్తే 3 శాతం మేర తగ్గినట్లు రియల్టీ కన్సల్టెంట్ అనరాక్ క్యాపిటల్ వెల్లడించింది. 2024–25లో ఈ పెట్టుబడులు 3.7 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు తెలిపింది. అంతకుముందు ఏడాది ఇవి 3.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఆఫీసు భవనాలకు ఇన్వెస్ట్‌మెంట్స్ తగ్గడమే ఈ క్షీణతకు కారణం. 2020–21లో అత్యధికంగా 6.4 బిలియన్ డాలర్ల పీఈ పెట్టుబడులు రాగా.. 2021–22లో ఇవి 4.3 బిలియన్ డాలర్లకు తగ్గాయి. అయితే 2022–23 కల్లా 4.4 బిలియన్ డాలర్లకు పెరిగినప్పటికీ.. తర్వాత తగ్గుముఖం పట్టాయి. ఐదేళ్లుగా దేశీ రియల్టీలో పీఈ ఇన్వెస్ట్‌మెంట్స్ తగ్గుతూ వచ్చాయి. 6.4 బిలియన్ డాలర్ల నుంచి 3.7 బిలియన్ డాలర్లకు అంటే 43 శాతం మేర క్షీణించాయి.

ప్రీ పేమెంట్ బెటరా..?



ఇంటి రుణం ముందుగా చెల్లించడం మంచిదేనా..?

సాక్షి, సిటీబ్యూరో: సగటు మనిషి తన జీవితంలో తీసుకునే అతిపెద్ద రుణం ఇంటి కోసమే.. ఇది కనీసం 15–30 ఏళ్ల పాటు చెల్లించాల్సి ఉంటుంది. అంత పెద్ద మొత్తం అన్ని సంవత్సరాలు చెల్లించడం వల్ల చాలా ఎక్కువ మొత్తం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. మనకు తెలియకుండానే తీసుకున్న రుణం కంటే దాదాపు రెట్టింపుపైనే చెల్లిస్తాం. ఈ నేపథ్యంలో అవకాశం ఉన్నప్పుడు ఇంటి రుణం ముందుగా చెల్లించడం మంచిదేనా? అంటే అవుననే అంటున్నారు ఆర్థిక నిపుణులు. మీకు అందుబాటులో డబ్బు ఉన్నప్పుడు ఇంటి రుణం తీర్చుకోవడం తెలివైన పని అని సూచిస్తున్నారు. అయితే ఇంటి రుణం ముందుగా చెల్లించాలా? లేదా అనే నిర్ణయం మీరు ఎంచుకున్న పన్ను విధానంపై కూడా ఆధారపడి ఉంటుంది.

- ఇంటి రుణం ముందస్తు చెల్లింపు.. ముఖ్యంగా ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. వారి ఆదాయం తగ్గక ముందే బాధ్యతలను క్లియర్ చేయడంలో ఇది సహాయపడుతుంది. మొత్తం వడ్డీ భారాన్ని తగ్గించడంతో పాటు ముందస్తు చెల్లింపు రుణ కాలపరిమితిని తగ్గిస్తుంది. అలాగే క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరుస్తుంది. పైగా ముందస్తు చెల్లింపు ఈఎంఐలను తగ్గించడంలో సహాయపడుతుంది. రుణ గ్రహీత గృహ రుణాన్ని ముందస్తుగా చెల్లించినప్పుడు, అతిపెద్ద ప్రయోజనం మొత్తం వడ్డీ అవుట్‌గో తగ్గడం, వడ్డీని బాకీ ఉన్న అసలుపై లెక్కించినందున, ఒకేసారి చెల్లింపులు చేయడం వల్ల వడ్డీ వచ్చే బకాయి మొత్తం తగ్గుతుంది.
- ఉదాహరణకు 20 సంవత్సరాల కాల వ్యవధికి 9 శాతం వడ్డీ రేటుతో రూ.50 లక్షల గృహ రుణాన్ని తీసుకుంటే.. రుణ గ్రహీత ఐదు సంవత్సరాల తర్వాత రూ.5 లక్షలను ముందస్తుగా చెల్లిస్తే.. మిగిలిన రుణ బ్యాలెన్స్ సుమారు రూ.39.35 లక్షలకు తగ్గుతుంది. ఫలితంగా భవిష్యత్తు ఈఎంఐల వడ్డీ భారం తగ్గుతుంది. బ్యాంక్ పాలసీని బట్టి రుణ గ్రహీత ఈఎంఐ మొత్తాన్ని తగ్గించుకోవచ్చు లేదా రుణ కాలపరిమితిని తగ్గించుకోవచ్చు. రుణ గ్రహీత ఈఎంఐని మార్చకుండా ఉంచాలని ఎంచుకుంటే రుణ కాలపరిమితి 20 ఏళ్ల నుంచి దాదాపు 15 ఏళ్లకు తగ్గుతుంది. తద్వారా వడ్డీ చెల్లింపులతో సుమారు రూ.16.30 లక్షలు ఆదా అవుతుంది.

గృహం.. ప్రియం

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో ప్రాపర్టీ ధరలు పెరుగుతాయా అంటే.. అవుననే అంటున్నాయి కొన్ని సంస్థలు. దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో ఈ ఏడాది కొత్త ప్రాజెక్టుల ధరలు 9 శాతం మేర పెరిగే అవకాశం ఉందని డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్ ఈక్విటీ అంచనా వేసింది. 2024–25లో ప్రాపర్టీ ధరలు సగటున 9 శాతం పెరిగి చ.అ.కు రూ.13,197కు చేరుతుందని పేర్కొంది. ఏడాది కాలంలో కోల్‌కతాలో ఇళ్ల ధరలు అత్యధికంగా 29 శాతం మేర పెరిగాయి. ఆ తర్వాత థానేలో 17 శాతం, బెంగళూరులో 15 శాతం, పుణెలో 10 శాతం, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 5 శాతం, హైదరాబాద్‌లో 5 శాతం, చెన్నైలో 4 శాతంగా ఉన్నాయి.

- ముంబై, నవీ ముంబైలో ఇళ్ల ధరలు 3 శాతం తగ్గాయి. కాగా రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఇళ్ల ధరలు 18 శాతం పెరిగాయి. అత్యధికంగా బెంగళూరులో 44 శాతం వృద్ధి నమోదయ్యింది. కోల్‌కత్తాలో 29 శాతం, చెన్నైలో 25 శాతం, థానేలో 23 శాతం, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 20 శాతం, పుణేలో 18 శాతం, నవీ ముంబైలో 13 శాతం, ముంబైలో 11 శాతం, హైదరాబాద్‌లో 5 శాతం పెరుగుదల నమోదు చేసింది. మరోవైపు ఈ ఏడాది జనవరి-మార్చిలో గృహాల అమ్మకాలు 23 శాతం తగ్గి, 1,05,791 యూనిట్లకు చేరుకోగా.. సరఫరా 34 శాతం తగ్గి 80,774లకు చేరుకుంది.
- ప్రస్తుతం కొత్త ప్రాజెక్ట్‌లలో ధరలను పరిశీలిస్తే.. బెంగళూరులో గతేడాది చ.అ. సగటున ధర రూ.8,577 ఉండగా.. ప్రస్తుతం అది రూ.9,852కు పెరిగింది. కోల్‌కత్తాలో చ.అ. ధర రూ.6,201 నుంచి రూ.8,009కి పెరిగింది. చెన్నైలో రేట్లు చ.అ.కు రూ.7,645 నుంచి రూ.7,989కు పెరిగాయి. హైదరాబాద్‌లో చ.అ.కు రూ.7,890 నుంచి రూ.8,306కు పెరిగాయి. పుణెలో చ.అ.కు రూ.9,877 నుంచి రూ.10,832కు పెరిగాయి. థానేలో సగటు చ.అ. ధర రూ.11,030 నుంచి రూ.12,880కు పెరిగాయి. ఢిల్లీలో చ.అ.కు రూ.13,396 నుంచి రూ.14,020కు పెరిగాయి.



స్థిరాస్తి రంగాన్ని కరోనా ముందు, తర్వాత అని విభజించక తప్పదేమో.. మహమ్మారి కాలంలో ఇంటిలో ప్రత్యేక గది, ఇంటి అవసరం ఎలాగైతే తెలిసొచ్చిందో.. ఆఫీసు విభాగంలోనూ సేమ్ ఇదే పరిస్థితి. కోవిడ్ అనంతరం ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు రప్పించాలంటే ఆఫీసు స్థలం విశాలంగా ఉండక తప్పని పరిస్థితి. దీంతో విస్తీర్ణమైన కార్యాలయ స్థలాలకు డిమాండ్ పెరిగింది. హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో 25 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. ఇందులో 80 శాతం స్థలం పెద్ద, మధ్య స్థాయి కార్యాలయాల వాటానే ఉన్నాయి. ఈ విభాగంలో 20 లక్షల చ.అ. స్పేస్ లీజుకు పోయింది. అత్యధికంగా 35 శాతం ఐటీ సంస్థలు, 17 శాతం ఫార్మా అండ్ హెల్త్ కేర్ సంస్థలు లీజుకు తీసుకున్నాయని గ్లోబల్ రియల్ ఎస్టేట్ అడ్వైజరీ సావిల్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో

OFFICE SPACE

విశాలమైన ఆఫీస్.. ఫుల్ డిమాండ్

- గ్రేటర్‌లో క్యూ1లో 25 లక్షల చ.అ. లావాదేవీలు
- ఇందులో 20 లక్షలు పెద్ద సైజు ఆఫీసులే..
- సావిల్స్ ఇండియా నివేదిక వెల్లడి

ఈ ఏడాది తొలి మూడు నెలల్లో దేశంలో కార్యాలయ స్థల లావాదేవీలు సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఆరు ప్రధాన నగరాలలో క్యూ1లో 1.89 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లీజుకు పోయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ. 2020 తర్వాత ఈ స్థాయిలో ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరగడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ముగింపు నాటికి ఆఫీసు స్పేస్ లావాదేవీలు 7.10 కోట్ల చ.అ.లకు చేరుతుందని అంచనా.



2025 క్యూ1లో ఆఫీసు స్పేస్ లావాదేవీలు(చ.అ. లక్షల్లో..)

నగరం	నికర లీజు	సరఫరా
బెంగళూరు	49	37
చెన్నై	20	5
ఢిల్లీ-ఎన్‌సీఆర్	37	20
హైదరాబాద్	25	-
ముంబై	33	10
పుణె	25	13

సరఫరాలో 28 శాతం వృద్ధి..

2025 క్యూ1లో ఆరు మెట్రో నగరాల్లో కొత్తగా మార్కెట్‌లోకి 86 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ సరఫరా అయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 28 శాతం అధికం. ఈ ఏడాది ముగింపు నాటికి కొత్తగా 8.15 కోట్ల చ.అ. స్థలం అందుబాటులోకి వస్తుందని అంచనా. లీజులలో వృద్ధి, సరఫరా కారణంగా ఈ త్రైమాసికం ముగింపు నాటికి ఆఫీసు స్పేస్ వేకన్సీ రేటు 15 శాతంగా ఉంది.

జీసీసీల జోరు..

ఇప్పటి వరకు దేశంలోని ఆరు మెట్రోలలో 80.62 కోట్ల చ.అ. గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్ అందుబాటులో ఉంది. ఈ ఏడాది ముగింపు నాటికి 87.91 కోట్ల చ.అ.లకు చేరుతుందని అంచనా. స్థూల ఆర్థికాభివృద్ధి, స్థిరమైన ధరలు, నైపుణ్య కార్మికుల అందుబాటు తదితర కారణాలతో ఐటీ, బ్యాంకింగ్, తయారీ రంగాలలో ఫ్లెక్సిబుల్ ఆఫీసు స్పేస్ లావాదేవీలు పెరగడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థల గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ) ఏర్పాటుతో ఆఫీసు స్పేస్ విభాగం మరింత వృద్ధి సాధిస్తుంది.

కలల సౌధం లీకేజీ భయం

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణం సమయంలో తడిగా ఉండే ప్రదేశాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆయా ప్రాంతాల వద్ద అత్యంత నాణ్యత ఉండేలా చూసుకుంటే.. మన కలల సౌధం పది కాలాల పాటు దృఢంగా ఉంటుంది. మరుగుదొడ్లు, స్నానాల గదులు, కిచెన్ సింక్, వాషింగ్ మిషన్ ఉండే చోట నిర్మాణం సమయంలోనే నాణ్యత పాటించేలా చూసుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా మరుగుదొడ్లు, స్నానాల గదుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆ తర్వాత ఎదురయ్యే పరిణామాలు తలనొప్పిగా మారుతుంటాయి. ఇంటి కొనుగోలు సమయంలోనే ఈ విషయాలు గమనించాలి. పైకి ఆకట్టుకునేలా ఉండటమే కాకుండా ఎంత క్వాలిటీ వస్తువులు వాడారు.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు అనే విషయాలు తెలుసుకోవాలి.

వెంటనే అప్రమత్తం..

వాటర్ ప్రూఫింగ్ సక్రమంగా లేకుంటే టైల్స్‌పై నిలిచిన నీటి నుంచి సన్నగా లీకేజీ ప్రారంభమవుతుంది. ఇందుకు వ్యక్తిగత గృహాలు, విల్లాలు ఏవీ మినహాయింపు కాదు. లీకేజీకి ఎక్కడైనా అవకాశం ఉంటుంది. నిర్మాణం పూర్తయిన సంవత్సరం.. ఆ తర్వాత ఈ సమస్య బయట పడుతుంది. గోడలకు చెమ్మ రావడం, వాసన వస్తుండటం వంటి సంకేతాలు కనిపిస్తుంటాయి. వెంటనే అప్రమత్తం కాకపోతే సమస్య క్రమంగా భవనమంతా వ్యాపిస్తుంది. అదే అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ బహుళ అంతస్తుల భవనాల్లో మన ఫ్లాట్ కింద ఉన్న వారికి సమస్యలు మొదలవుతాయి. గోడలకు చెమ్మ రావడం, రంగు మారిపోవడం, పెచ్చులుగా రంగు ఊడిపోతుండడం, దుర్వాసన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. సమస్య తమ ఫ్లాట్‌లోనే ఉందని తొలుత అంతా భావిస్తారు. భవన నిర్మాణదారుడు సరైన వాటర్ ప్రూఫింగ్ విధానం పాటించకపోవడంతో పైఫ్లాట్ నుంచి లీకేజీ అవుతున్నట్లు ఆలస్యంగా గ్రహిస్తారు. వీటిని ప్లంబర్లు, నిర్మాణ మేస్త్రీలు మాత్రమే కచ్చితంగా గుర్తిస్తారు.



అక్కడి నుంచే మొదలు..

సాధారణంగా అత్యధిక లీకేజీలు టాయిలెట్ రూమ్ నుంచే మొదలవుతాయి. ఆ ప్రదేశాలలో నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు టైల్స్ ఎగుడుదిగుడుగా లేకుండా చూసుకోవాలి. దీనికంటే ముందు నిర్మాణ దశలోనే కాంక్రీట్ లేదంటే బ్రిక్స్‌తో రసాయనాలు వినియోగించి వాటర్ ప్రూఫ్ బెడ్ ఏర్పాటు చేయాలి. ఇక నీటి పైప్‌లైన్ల కారణంగానూ లీకేజీలు ఏర్పడతాయి. వంట గదిలో సింక్ దగ్గర, వాషింగ్ మిషన్ ప్రదేశాలలో పైపుల దగ్గర జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఫలించిన చివరి ప్రయత్నం



గోదావరిలో మంచిర్యాల రైల్వే వంతెన సమీపం నుంచి తీసిన కాలువ

మంచిర్యాల అగ్రికల్చర్: మంచిర్యాల గోదావరి తీర ప్రాంత రైతులు వరి పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నమే చేశారు. నస్పూర్ మండలం సీతారాంపల్లి (ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్) గ్రామానికి చెందిన రైతులు.. కొన్నేళ్లుగా గోదావరి తీర ప్రాంతంలో వరి సాగు చేస్తున్నారు. గోదావరి నదిలో బోరుమోటార్లు, పైపులు అమర్చి వరికి నీటితడులు అందిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో ఎగువనున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరిలోకి ఆశించిన నీరు రావడం లేదు. నది మధ్యలో పారుతున్న అరకొర నీరు జిల్లా సరిహద్దు దూర ప్రాంతం నుంచి వెళ్తోంది. రెండు నెలల క్రితం సీతారాంపల్లి రైతులంతా కలిసి.. ఆ నీటిని ఇటువైపు మళ్లించేందుకు ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. మంచిర్యాల గోదావరి రైల్వే ట్రాక్ వంతెన సమీపం నుంచి వెళ్తున్న నీటిని సీతారాంపల్లి వరకు.. 12 అడుగుల వెడల్పు, ఆరు అడుగుల లోతులో.. దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర జేసీబీతో తవ్వి కాలువ తీయించారు. గోదావరి సరిహద్దు నుంచి రైతు పొలం దూరాన్ని బట్టి.. ఒక్కొక్కరైతు ఎకరానికి రూ.600 నుంచి రూ.1,500 వరకు జమ చేశారు. మొత్తంగా 200 ఎకరాల రైతులు రూ.2 లక్షలు జమ చేసి మూడు రోజులు కాలువ తీయించారు. మధ్యలో రెండుసార్లు కాలువ తెగిపోతే.. రూ.20 వేలు ఖర్చుచేసి కాలువను పునరుద్ధరించుకున్నారు. కాలువ నుంచి పైపులు వేసి మోటార్ల ద్వారా పంటలకు నీరందిస్తున్నారు.





ఆనంద వలయం

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని ముదిరాజ్ కులస్తులు సుమారు 223 మంది నాలుగు బృందాలుగా ఏర్పడి చేపల వేటలో నిమగ్నమయ్యారు. గత వర్షాకాలంలో వదిలిన చేప పిల్లలు పెరిగి పెద్దవి కావడంతో, సంఘాల్లోని సభ్యులంతా సమష్టిగా చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

మజ్లిస్ అంటే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు వణుకు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సనత్‌నగర్ (హైదరాబాద్): 'మజ్లిస్ అంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు వెన్నులో వణుకు. ప్రజలను దోపిడీ చేసి, ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడిన మజ్లిస్‌కు ఆ రెండు పార్టీలు కొమ్ము కాస్తూ, జీ హుజూర్ అంటూ వంగి వంగి సలాం కొడుతున్నాయి'అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం బేగంపేటలోని హరితాప్లాజాలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మజ్లిస్ పార్టీ ఓల్డ్‌సిటీకి మాత్రమే పరిమితం కాలేదని, తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాపకింద నీరులా విస్తరిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్‌కు సాయపడేందుకు కుట్ర చేస్తున్నాయన్నారు. ప్రజలను జాగృతం చేయాలనే పవిత్ర ఉద్దేశంతో బీజేపీ హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తోందన్నారు. తమకు గెలుపు ఒక్కటే ముఖ్యం కాదని, హైదరాబాద్‌ను రక్షించడం కూడా ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇదిలా ఉండగా జీహెచ్ఎంసీ పరిస్థితి దారుణంగా మారిందని, వీధి లైట్లు కొనడానికి కూడా డబ్బుల్లేని స్థితికి దిగజారిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైటెక్ సిటీలో రంగులు వేసి అభివృద్ధి అంటూ ప్రచారం చేశారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పేరు చెప్పి ఎక్కడైతే రియల్ఎస్టేట్ వ్యాపారం ఉందో అక్కడే దృష్టిపెట్టారని, అక్కడ కూడా ఇరుకైన రోడ్లనే నిర్మించారని ఆరోపించారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి అన్నారు. కాంగ్రెస్ నాయకులు విదేశీ పెట్టుబడుల గురించి గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ అవి మోదీ ప్రభుత్వ సమర్థవంతమైన పాలనతోనే వచ్చాయని స్పష్టం చేశారు. హైదరాబాద్ అంటే కేవలం హైటెక్ సిటీ మాత్రమే కాదని, అన్ని ప్రాంతాల్లో కూడా సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

డయాగ్నొస్టిక్స్ డల్!

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాల్లో పేదలు అనివార్యంగా రూ. వేలు ఖర్చుపెట్టి మళ్లీ ప్రైవేటు డయాగ్నస్టిక్ కేంద్రాలపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది.

32 జిల్లాల్లో హబ్స్.. 1,546 చోట్ల స్పోక్స్

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద హబ్ అండ్ స్పోక్ విధానంలో హైదరాబాద్ నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) ప్రధాన హబ్‌గా తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ఏర్పాటైంది. ఆపై రాష్ట్రవ్యాప్తంగా హబ్‌లను విస్తరించారు. ప్రస్తుతం నారాయణపేట, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల్లో 32 బయో కెమిస్ట్రీ, మైక్రోబయోలజీ, పాథలాజీ ల్యాబ్స్‌తో కూడిన హబ్స్ ఏర్పాటయ్యాయి. ఆదిలాబాద్‌లోని ఏజెన్సీ ప్రాంతంలోనూ ప్రత్యేక హబ్‌ను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాలు, కమ్యూనిటీ సెంటర్లు మొదలైన 1,546 చోట్ల స్పోక్స్ (చిన్న కేంద్రాలు)ను ఏర్పాటు చేశారు. తక్షణమే వచ్చే పరీక్షల ఫలితాలను స్పోక్స్‌లలో, ఇతర వైద్య పరీక్షలను హబ్‌లలో నిర్వహిస్తున్నారు. పాథాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయోలజీ పరీక్షలకు సంబంధించి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన యంత్ర పరికరాలు 32 హబ్‌లలో ఉన్నాయి. సాధారణ మధుమేహ వ్యాధిని నిర్ధారించే పరీక్షలు మొదలుకొని మూత్రపిండాల వ్యాధి నిర్ధారణకు క్రియాటిన్ పరీక్షల వరకు, కేన్సర్ పరీక్షకు వినియోగించే సీరం–ఎలక్ట్రోఫొరెసిస్ యంత్రాల వరకు హబ్‌లలో అందుబాటులో ఉన్నాయి. పాథాలజీ, రేడియాలజీ సేవలు, అల్ట్రాసౌండ్, టెలి ఈసీజీ, ఎక్స్‌రే, మామోగ్రామ్, 2డీ ఎకో పరీక్షలన్నీ ఈ కేంద్రాల్లో జరుగుతాయి. ఏదైనా తగ్గని జబ్బుతో రోగి బాధ పడుతుంటే ఆ జబ్బు మూలాలను కనుక్కొని, తగిన మందులు సిఫారసు చేసేందుకు వీలుగా 'కల్చర్ అండ్ సెన్సిటివిటీ' టెస్టులు కూడా ఈ హబ్‌లలో జరిపేందుకు వీలుంది.

ల్యాబ్ టెక్నీషియన్లు, మైక్రోబయోలజిస్టుల కొరతతో..

రాష్ట్రవ్యాప్తంగా 32 హబ్‌లలోని మైక్రోబయోలజీ ల్యాబ్‌లలో 'కల్చర్ అండ్ సెన్సిటివిటీ'పరీక్షల కోసం సుమారు రూ. 50 లక్షల విలువైన వైద్య పరికరాలను తెచ్చిపెట్టారు. అందుకు సంబంధించిన వైద్య పరీక్షలను ల్యాబ్ టెక్నీషియన్లు నిర్వహిస్తే వాటిని మైక్రోబయోలజిస్టులు నిర్ధారించాల్సి ఉంటుంది. అయితే హైదరాబాద్‌తోపాటు కొన్ని పాత జిల్లా కేంద్రాలల్లోని హబ్‌లలో తప్ప ఎక్కడా మైక్రోబయోలజిస్టులు లేక ఈ యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. అలాగే కేన్సర్‌ను నిర్ధారించేందుకు రూ. 50 లక్షల చొప్పున హబ్‌లలో ఏర్పాటు చేసిన సీరం–ఎలక్ట్రోఫొరెసిస్ యంత్రాలకు అవసరమైన రీఏజెంట్లు (రసాయనాలు) అందుబాటులో లేక చాలా వరకు పరికరాలు వృథాగా పడి ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

కొన్ని టెస్టులతోనే సరి..

ప్రతి హబ్‌లో బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాథాలజీకి సంబంధించి 134 రకాల వైద్య పరీక్షలు జరగాల్సి ఉండగా చాలా హబ్‌లలో 30–40 టెస్టులు మాత్రమే జరుగుతున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్ల కొరతతోపాటు రేడియాలజిస్టులు, మైక్రోబయోలజిస్టులు, ఇతర డాక్టర్లు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

హబ్‌లపై సన్నగిల్లుతున్న నమ్మకం

వివిధ హబ్‌లలో తరచూ పరీక్షల ఫలితాలు ఒకరివి మరొకరికి మారిపోతుండటంతో ప్రజల్లో తెలంగాణ డయాగ్నొస్టిక్స్‌పై విశ్వాసం సన్నగిల్లుతోంది. స్పోక్స్ (చిన్న కేంద్రాలు)లో బీపీ, షుగర్ మినహా అన్ని పరీక్షలను హబ్‌లకే పంపుతుండగా అక్కడ పరీక్షలు జరిగి ఫలితాలు వచ్చేందుకు రెండు రోజుల సమయం పడుతోంది. ఆ రిపోర్టులను తీసుకొస్తేనే పీహెచ్‌సీల్లో చూపించుకొనే పరిస్థితి ఉండటంతో గ్రామాల్లో చాలా మంది ఆర్ఎంపీల ద్వారా జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. పీహెచ్‌సీల్లో సమయానికి డాక్టర్లు ఉండకపోవడం కూడా రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించడానికి కారణమవుతోంది. కాగా, ల్యాబ్ టెక్నీషియన్ల కొరత నేపథ్యంలో తాజాగా 700 మంది ల్యాబ్ టెక్నీషియన్లను నియమించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

వివిధ జిల్లాల్లో పరిస్థితి ఇలా..

➤ ఖమ్మంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్స్ హబ్‌లో రీ ఏజెంట్ల కొరతతో కేన్సర్‌కు సంబంధించి మూడొంతుల టెస్టులు జరగడం లేదు. ➤ అక్కడ 134 రకాల పరీక్షలకుగాను 38 పరీక్షలే అందుబాటులో ఉన్నాయి. కొన్ని వైద్య పరికరాలు లేకపోవడమే అందుకు కారణం. ➤ జిల్లాలోని స్పోక్స్‌లలో రీ ఏజెంట్ల కొరతతో ఎక్కడా డయాగ్నస్టిక్ టెస్టులు నిర్వహించడం లేదు. శాంపిల్స్ సేకరించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని హబ్‌కు పంపుతున్నారు. ➤ జనగామ జిల్లాలోని హబ్‌లో వైద్య పరికరాలు ఉన్నా టెక్నీషియన్లు, మైక్రోబయోలజిస్టులు అందుబాటులో లేక మైక్రోబయోలజీ సంబంధిత పరీక్షలు జరగడం లేదు. ➤ పీహెచ్‌సీల నుంచి తీసుకున్న తాత్కాలిక సిబ్బందితోనే బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లలో సీరం–ఎలక్ట్రోఫొరెసిస్ యంత్రాల ద్వారా పరీక్షలు చేస్తున్నారు. కేన్సర్‌కు సంబంధించి సీఏ 125, సీఈఏ, పీఎస్ఏ మూడు టెస్టులు ఇప్పటి వరకు 30 వరకు చేశారు. ➤ ఈ హబ్‌లో 17 రకాల మిషన్లతో రోజుకు 1,659 పరీక్షలను చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ➤ మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ హబ్‌లో కల్చర్ అండ్ సెన్సిటివిటీ టెస్టుల కోసం పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని ఉంచేందుకు సరైన బిల్డింగ్ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ➤ నిర్మల్ జిల్లాలో మైక్రోబయాలజిస్టులు, పాథాలజిస్టులు లేరు. కేన్సర్ టెస్టులు చేయడం లేదు. బయోకెమిస్ట్రీ, థైరాయిడ్, సీబీపీ, డెంగీ, థైరాయిడ్ టెస్టులను మాత్రం చేస్తున్నారు. ➤ మంచిర్యాల టీ హబ్‌లోని మైక్రోబయోలజీ ల్యాబ్‌లో కల్చర్ అండ్ సెన్సిటివిటీ టెస్టుల పరికరాలు ఉన్నా సిబ్బంది లేక దాన్ని వాడట్లేదు. అక్కడ మైక్రోబయోలజిస్ట్ మాత్రం ఉన్నారు. సీరం–ఎలక్ట్రోఫొరెసిస్ యంత్రాలు ఉన్నా సిబ్బంది లేరు. కేన్సర్ టెస్ట్‌కు ఉపయోగించే రీ ఏజంట్లు ఉన్నా.. టెస్టులు చేసే వారు లేరు. 134 రకాల పరీక్షలకుగాను 76 పరీక్షలు చేస్తున్నారు.

అన్ని రకాల పరీక్షలు జరుగుతున్నాయి

రాష్ట్రంలోని 32 హబ్స్, 1,546 స్పోక్స్‌లలో రోగులకు అన్ని వైద్య పరీక్షలు జరుగుతున్నాయి. మైక్రోబయోలజిస్టులు లేనిచోట జిల్లా వైద్య కళాశాల అనుబంధ డీఎంఈ ఆసుపత్రుల సేవలను వినియోగించుకుంటున్నాం. సీరం–ఎలక్ట్రోఫొరెసిస్ పరీక్ష 5 జిల్లాల హబ్స్‌లో జరుపుతున్నాం. ప్రిస్క్రిప్షన్ ప్రకారమే పరీక్షలు జరుగుతాయి. ప్రతి డయాగ్నొస్టిక్ హబ్‌లో 10 నుంచి 20 మంది సిబ్బంది నమూనాలు తీసుకునేందుకు పనిచేస్తున్నారు. ఈ ఏడాది డీఎంఈ, టీవీవీపీ ఆసుపత్రుల నుంచి సిబ్బందిని తీసుకోవాలనుకుంటున్నాం. – ఆర్.వి. కర్ణన్, ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కవిత తదితరులు

పార్టీలో మహిళల భాగస్వామ్యం పెంచుదాం

- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 60 మంది మహిళలకు అవకాశం
- మహిళానేతల్లో రాజకీయ చైతన్యం పెంచేలా మే నెలలో శిక్షణ
- ఎర్రవల్లి నివాసంలో రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ ఉద్యమంలో మహిళలను చైతన్యపరుస్తూ వారినుంచి నాయకత్వ లక్షణాలున్న వారిని గుర్తించాల్సిన అవసరముంది. భవిష్యత్‌లో అసెంబ్లీ, పార్లమెంట్‌లో మహిళా నాయకుల సంఖ్య భారీగా పెరుగుతుంది. సంస్థాగతంగా ఇప్పటి నుంచే సమర్థులైన మహిళా నేతలను తయారు చేయడంపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి సారిస్తుంది'అని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు.

రిజర్వేషన్లతో పరిమిత నాయకత్వం: 'వ్యవసాయ మార్కెట్ కమిటీలతోపాటు స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ పాలనలో మహిళా రిజర్వేషన్లు అమలు చేశాం. చాలామంది మహిళలు తమ పదవీకాలం పూర్తి కాగానే తెరమరుగు అవుతున్నారు. ఒక్క తెలంగాణ నుంచే రాబోయే రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్‌లో సుమారు 60 మంది మహిళలకు అవకాశాలు లభిస్తాయి. గ్రామస్థాయి నుంచి మొదలుకొని జాతీయస్థాయి వరకు మహిళా నాయకత్వాన్ని తయారు చేసుకునేందుకు క్షేత్రస్థాయి నుంచి శిక్షణ కార్యక్రమాలు చేపడదాం. మే నెల రెండో వారంలో పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న మహిళా నేతలతో హైదరాబాద్‌లో ప్రత్యేక భేటీ ఉంటుంది'అని కేసీఆర్ ప్రకటించారు.

అన్ని వర్గాల మహిళలను కలుపుకొనిపోవాలి: 'కాలేజీ విద్యార్థినులు మొదలుకొని రిటైర్డ్ మహిళా ఉద్యోగుల వరకు అందరినీ కలుపుకుపోవాలి. వరంగల్ సభకు సాధారణ మహిళలను తరలించి ఇబ్బందులకు గురి చేయొద్దు. పార్టీలో క్రియాశీల మహిళా నాయకులు వరంగల్‌కు స్వచ్ఛందంగా తరలివస్తారు. సభాస్థలి వద్ద మహిళలను దృష్టిలో పెట్టుకొని పార్కింగ్, మూత్రశాలలు తదితర వసతులు కల్పించాలి 'అని కేసీఆర్ సూచించారు.

రజతోత్సవ సభపై...: పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లను కేసీఆర్ సమీక్షించారు. సభ అనంతరం తాను వరంగల్‌లోనే బస చేస్తున్నట్టు కేసీఆర్ సంకేతాలు ఇచ్చారు. కేసీఆర్‌తో జరిగిన భేటీలో ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితెల సతీశ్‌కుమార్, చంద్రావతి, ఏ.జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు చొరవ చూపండి

కేంద్రమంత్రి బీఎల్ వర్మకు బీసీ ఆజాదీ ఫెడరేషన్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కులగణన చేయాలని, తెలంగాణ బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఆజాదీ ఫౌండేషన్.. కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మను బీసీ ఆజాదీ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ నేతృత్వంలోని బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. కులగణనలో జాప్యం కారణంగా బీసీలు విద్య, ఉద్యోగ, ఉపాధి తదితర రంగాల్లో అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసిన 42 శాతం బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేలా చొరవ చూపాలని కేంద్రమంత్రిని కోరారు. దేశ వ్యాప్త కులగణన కోసం బీసీ ఆజాదీ జేఏసీ నేత బత్తుల సిద్ధేశ్వర పటేల్ 18 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విషయాన్ని బీఎల్ వర్మ దృష్టికి తీసుకెళ్లారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ నేతలు చాపర్తి కుమార్, రాం నర్సయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

అడవిలో అగ్గిపెట్టె.. రూ.5 వేల జరిమానా

ఏటూరునాగారం: అటవీప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అగ్గిపెట్టె కలిగి ఉన్న వ్యక్తికి అధికారులు శుక్రవారం రూ.5 వేల జరిమానా విధించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం మీటింగ్ హాల్ వెనుక ఓ వ్యక్తి అగ్గి పెట్టె పట్టుకుని ఉన్నారు. గమనించిన అధికారులు అతడి నుంచి అగ్గిపెట్టెను స్వాధీనం చేసుకొని రూ.5 వేలు జరిమానా విధించినట్లు అటవీశాఖ సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వన్యప్రాణి ప్రాంతంలో అగ్గిపెట్టె కలిగి ఉండటం చట్టరీత్యా నేరమన్నారు. చట్టానికి లోబడి అటవీ ప్రాంతాల్లో ప్రయాణించాలని ఆయన సూచించారు.

21 నుంచి నిజామాబాద్‌లో రైతు మహోత్సవం

వ్యవసాయశాఖ డైరెక్టర్ ఐఏఎస్ బి.గోపి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రైతు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ సంచాలకుడు బి.గోపి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్థానిక జీజీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే ఈ రైతు మహోత్సవాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రైతులు, వారు పండించిన ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో పెడతారని వెల్లడించారు. 150కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, అందులో వ్యవసాయం, అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, స్టార్టప్‌లు, ఎఫ్‌పీఓలు, ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన స్టాల్స్ ఉంటాయని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల అవార్డు గ్రహీత రైతులతో కొత్త సాంకేతికత పద్ధతులపై 3 రోజుల వర్క్‌షాప్ ఉంటుందని గోపి పేర్కొన్నారు.



దుబ్బాకలో వరదలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్న రైతు



రాజన్న సిరిసిల్ల జిల్లా మస్తాబాద్ మద్దికుంటలో రాలిన మామిడి కాయలు



జనగామ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిడుగుపాటు క్షతగాత్రులు

ఒక్క వానకే కకావికలం

- హైదరాబాద్‌లో స్తంభించిన ట్రాఫిక్
- పలు జిల్లాల్లో పంట నష్టం.. తడిసిన ధాన్యం
- జనగామ జిల్లాలో పిడుగుపాటుకు 12 మందికి గాయాలు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో శుక్రవారం పగలంతా మండిన ఎండలు.. సాయంత్రానికి ఒక్కసారిగా మారిన వాతావరణం.. ఈదురుగాలులకు తోడు భారీ వర్షంతో పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్ర ప్రణాళికా శాఖ గణాంకాల ప్రకారం నగరంలోని కంచన్‌బాగ్‌లో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బహదూర్‌పురాలో 7.9, చార్మినార్‌లో 7.63 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లోనూ మోస్తరు వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోని పలుచోట్ల వరద నీరు భారీగా చేరడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా కురిసిన భారీ వర్షాలతో వరి, మామిడి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. సిద్దిపేట జిల్లాలో ఏకధాటి వర్షానికి దుబ్బాకలో 10 వేల క్వింటాళ్లకుపైగా ధాన్యం తడిసిపోయింది. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మామిడికాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఉడకబెట్టి ఆరబెట్టిన పసుపు పంటలు తడిసి ముద్దయ్యాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగు

జనగామ జిల్లా ఆలింపూర్‌లో వాన పడుతుండటంతో తలదాచుకునేందుకు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో వేసిన చలువ పందిరి కిందకు వెళ్లారు. వారికి సమీపంలోనే పిడుగు పడగా, ఆ ధాటికి వారంతా ఎగిరిపడ్డారు. 12 మందికి గాయాలయ్యాయి. వీరిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అపస్మారకస్థితిలో ఉన్న కొందరికి వైద్యులు సీపీఆర్ చేశారు. కాగా, కామారెడ్డి మండలం ఇస్రోజివాడిలో పిడుగు పడి 40 గొర్రెలు మృతి చెందాయి. రూ.5 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్టు బాధితుడు కడారి దేవయ్య తెలిపాడు. జనగామ జిల్లా చేర్యాలలో పిడుగుపాటుకు మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి.

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్ఠం		
నిజామాబాద్	42.6	దుండిగల్	38.5
ఆదిలాబాద్	41.3	హకీంపేట్	38.5
మెదక్	40.2	భద్రాచలం	38.2
మహబూబ్‌నగర్	39.5	నల్లగొండ	38.0
రామగుండం	38.8	ఖమ్మం	37.6
		హనుమకొండ	37.5

నేడు, రేపు అక్కడక్కడా వానలు

రాష్ట్రంలో రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. మరోపక్క రాష్ట్రంలో రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని, కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఒకటి నుంచి మూడు డిగ్రీల మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని సూచించింది. శుక్రవారం నిజామాబాద్‌లో 42.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత, దుండిగల్‌లో 19.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



తెల్లాపూర్‌లో విద్యుత్ తీగలపై బ్యానర్ పడి కరెంట్ పోవడంతో ఇలా ప్రమాదకరమైన రీతిలో క్రేన్‌కు వేలాడుతూ తొలగించేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది



వారసత్వ కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత

- డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్
- చార్మినార్–చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్

చార్మినార్: వారసత్వ కట్టడాల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం పురస్కరించుకొని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ, జేబీఆర్ఏసీ, ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్‌తో పాటు ఇతర పౌరసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన చార్మినార్ వద్ద వాక్‌ను ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ చారిత్రక ఘనతను ప్రజలకు తెలియజేస్తూ వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరం ఉంటుందని తెలిపారు. ప్రొఫెసర్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ చార్మినార్ కట్టడం చారిత్రక శిల్పకళా విశేషాల గురించి విద్యార్థులకు వివరించారు. చార్మినార్ కట్టడం నుంచి ప్రారంభమైన హెరిటేజ్ వాక్.. లాడ్ బజార్, మోతీ గల్లీ, ముర్గీ చౌక్, మక్కా మసీద్, జులుఖానా, కుర్సీద్ జా బహదూర్ ప్యాలెస్, ఇక్బాల్ ఉద్ దౌలా ప్యాలెస్, ఖిల్వత్, చౌమహల్లా ప్యాలెస్ వరకు కొనసాగింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 19-4-2025

బాలీవుడ్ నటి, ఇంటీరియర్ డిజైనర్ ట్వింకిల్ ఖన్నా పాత దుస్తులతో అందమైన గృహాలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు. 'మీ ఇంటిని మేకోవర్ చేయడానికి డెకార్ స్టోర్‌లకు వెళ్లాల్సిన పనిలేదు, భారీ కొనుగోళ్లు అవసరం లేదు' అని తన అలంకరణ వస్తువులను చూపుతూ వివరిస్తున్నారు. ఆమెకు తోడు పూనమ్ షా అనే ఆమె తన కూతురి చిన్ననాటి బొమ్మలను అందమైన ఫర్నీచర్‌గా రూపొందించింది. వీరి సృజన చూద్దాం రండి...

● రీ యూజ్

జ్ఞాపకమే అలంకారం!



ట్వింకిల్ ఖన్నా





ఇంట్లో లివింగ్ రూమ్‌లోని ప్లెయిన్ గోడను రకరకాల ఫ్రేమ్‌లతో అలంకరించాలన్నా, కుషన్స్, సోఫా కవర్స్‌ని వినూత్నంగా మార్చాలన్నా పాత డ్రెస్సులు, కుర్తాలనే ఎంచుకోవచ్చునంటారు బాలీవుడ్ నటి, రచయిత్రి, ఇంటీరియర్ డిజైనర్ ట్వింకిల్ ఖన్నా. ఆమె తన పాతచీరలు, స్కార్ఫ్‌లు, పాత కుషన్ కవర్లు, పాత దుపట్టాలను అత్యంత అందంగా మార్చేసింది. ఇంటీరియర్ డెకార్ గురించి సోషల్ మీడియా ద్వారా సూచనలు చేస్తోంది ట్వింకిల్ – 'మన దేశంలో వారసత్వ కళతో నిండిన హ్యాండ్లూమ్స్, ఇతర వస్తువులు చాలానే ఉన్నాయి. ఒక తరం నుంచి ఇంకో తరానికి వచ్చే వస్తువులూ ఉంటాయి. వాటిని మన ఇంటి అలంకరణలో అద్భుతమైన కళాఖండాలుగా మార్చుకోవచ్చు.



పూనమ్ షా

నిండిన వార్డ్‌రోబ్‌కు శ్వాస

ఫ్యాషన్ ట్రెండ్స్ ఎప్పటికప్పుడు మారుతున్నాయి. దీంతో మన వార్డ్‌రోబ్‌లోకి కొత్త కొత్త డిజైన్స్ వచ్చి, ప్లేస్ సరిపోనంతగా నిండిపోతుంటాయి. పాత చీరలు, కుర్తాలు, కానుకగా వచ్చిన డ్రెస్సులను తీసేయాలని కూడా అనిపించదు. ఒకప్పుడు ఎంతో ప్రియంగా మన ఒంటిని హత్తుకుపోయిన దుస్తులకు జీవం పోసి వాటిని మరింత అందంగా, ఓ మంచి జ్ఞాపకంగా ఇంటిని అలంకరించవచ్చు.





సీజన్ షైన్

పండుగల సమయాల్లో సంప్రదాయ అలంకరణను ఇష్టపడతాం. సీజన్‌ని దృష్టిలో పెట్టుకొని ఆ వాతావరణానికి తగినట్టు ఇంటిని మేకోవర్ చేయాలనుకుంటాం. ఇలాంటప్పుడు మొత్తం డెకర్ స్టోర్‌ను కొనుగోలు చేయవలసిన అవసరం లేదు. ఖరీదైన అలంకరణలలో పెట్టుబడి పెట్టడానికి బదులుగా, ఉన్న ప్లేస్‌ని మీకు నచ్చిన ఫాబ్రిక్‌ను ఉపయోగించి, కొత్తగా మార్చేయవచ్చు. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలను ఉపయోగించి గ్యాలరీ గోడను సృష్టించవచ్చు. నేను తయారు చేసిన ఈ గ్యాలరీ గోడ చూస్తే నా పాత కుర్తా ఫ్యాబ్రిక్ అని ఎవరూ అనుకోరు. మనలో చాలామంది సెంటిమెంట్ కారణాల వల్ల కొన్ని డిజైన్లు ఉన్న ఫాబ్రిక్ పీసెస్‌ను దాచిపెట్టుకుంటారు. కానీ కాలక్రమేణా, అవి చెడిపోయి తమ ఆకర్షణను కోల్పోతాయి. వాటిని దాచి ఉంచడానికి బదులుగా అలంకార కళాఖండాలుగా తిరిగి ఉపయోగించవచ్చు.

అందమైన సృష్టి

ఎంబ్రాయిడరీ ఫ్యాబ్రిక్ ముక్కను ఫ్రేమ్ చేయండి. లేదా పాతచీరలను వాల్ హ్యాంగింగ్స్‌గా ఉపయోగించండి. ఒకసారి మీ పాత డ్రెస్సులను ఈ అలంకార వస్తువులుగా రూపొందించడానికి ఇష్టపడితే, వాటినుంచి ఎన్నో అద్భుతమైన డిజైన్లకు మీరే సృష్టికర్త అవ్వచ్చు. కుషన్ కవర్లు, టేబుల్ రన్నర్ల నుండి లాంప్‌షేడ్‌లు, కర్టెన్ యాక్సెంట్‌ల వరకు, మీరు సృష్టించగల వాటికి పరిమితి లేదు.

స్టీలు సామాన్ల వాళ్లకి వేద్దాం అని అట్టడుగున పడేసి ఉంచిన పాతచీరలు, స్కార్ఫ్‌లు, పాత కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీయండి. వాటితో మీ ఇంటికి ఎలాంటి అందాన్ని జోడించవచ్చో ఆలోచించండి!'' అని ఛాలెంజ్ విసురుతున్నారు ట్వింకిల్.

– నిర్మలారెడ్డి

ముంబై వాసి పూనమ్ షా తమ పాత జ్ఞాపకాలకు శాశ్వత రూపాన్ని అందిస్తోంది. పిల్లలు చిన్నతనంలో ఆడుకున్న రకరకాల బొమ్మలు, వాడిన పెన్సిళ్లు, ఎరేజర్లు, చాకొలెట్ రేపర్లు.. ఇలా ఎన్నో ఉంటాయి. పిల్లలు పెద్దయ్యాక కూడా వాళ్లు ఎంతో అబ్బురంగా వాడిన వాటిని పడేయడానికి చాలామంది తల్లులకు మనసొప్పదు. అలాగని, ఇంట్లో వాటిని ఎక్కడ దాచి ఉంచాలో కూడా తెలియదు. కొన్నింటిని షో కేస్‌లో పెట్టి... మిగిలిన, విరిగిన, పాడైపోయిన బొమ్మలను పడేస్తుంటారు. అలా పడేసే బొమ్మలను రెసిన్ ఆర్ట్ ఫర్నిచర్‌గా మార్చేస్తోంది 37 ఏళ్ల పూనమ్ షా. 'ప్రతి బొమ్మకు ఒక కథ ఉంటుంది. ఒక జ్ఞాపకం ఉంటుంది. అలా కొన్నింటితో కుర్చీ, టేబుల్, క్యాండిల్ హోల్డర్... ఇలా మన ఇంట్లో మరో వస్తువుగా రూపొందించుకోవచ్చు. ఈ ఆర్ట్ నాకు ఎన్నో అవకాశాలకు మార్గం చూపింది. కొన్నేళ్ల క్రితమే నాకు రెసిన్ ఆర్ట్‌లో నైపుణ్యం ఉన్నా కోవిడ్ టైమ్‌లో నా ఏడేళ్ల కూతురు 'నా బొమ్మలను కొత్తగా రెడీ చేయవచ్చా' అని అడిగింది. ఆ ఆలోచన ఇలా టాయ్ ఆర్ట్ ఫర్నీచర్‌కు ప్రాణం పోసింది' అంటారు పూనమ్.

కూల్ సమ్మర్

చల్లగా తీయగా హాయిగా...



మన దేశంలో ప్రతి ప్రాంతంలో ప్రత్యేకమైన వేసవి పానీయాలు ఉన్నాయి. అలాంటి ఒక పానియం ఆమ్ పన్నా. ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్‌లో ఆమ్ పన్నా ఇంటింటి నేస్తం. పచ్చి మామిడి కాయలతో ఈ పానీయాన్ని తయారుచేస్తారు. మామిడి కాయలను ఉడకబెట్టి ఆ తరువాత తాజా పుదీనాను కలుపుతారు. మసాల దినుసులు వేస్తారు. చల్లని నీటితో కలిపి తాగుతారు.

సంప్రదాయ కశ్మీరీ పానీయం 'బాబ్రీ బయోల్' ను మండు వేసవి తాపానికి విరుగుడుగా భావిస్తారు. తులసి గింజలతో తయారు చేసిన ఈ పానీయం వేసవిలో శరీరాన్ని చల్లబర్చడానికి సహాయపడుతుంది. ఎండు కొబ్బరి, కుంకుమ పువ్వు, యాలకుల పొడి, ఎండు ద్రాక్ష, బాదం... మొదలైనవి ఈ పానీయంలో కలుపుతారు.

కేరళలో ప్రసిద్ధ పొందిన వేసవి పానీయం... కులుక్కి సబ్బత్. ఈ రిఫ్రెషింగ్ పానీయం తీపి, మసాలా, సిట్రస్ రుచుల సమ్మేళనం. నిమ్మరసంలో పచ్చిమిర్చి, తులసి గింజలు, చక్కెర పాకం, ఉప్పు, నీరు, ఐస్ కలుపుతారు. తులసి గింజలు పానీయానికి కూలింగ్ ఎలిమెంట్‌ను జోడిస్తే, పచ్చి మిర్చి స్పైసీ కిక్ ఇస్తుంది.

ముంబై, గోవాలలో కుంకుమ్ షర్బత్, ఉత్తర్ ప్రదేశ్‌లో తండాయ్ ఫేమస్. ఎప్పుడూ మనకు తెలిసిన పానీయాల రుచి మాత్రమే కాకుండా అప్పుడప్పుడు ఇతర రాష్ట్రాల పానీయాల రుచి కూడా చూస్తే... ఎంత హాయో!

● లైఫ్ స్టైల్

సంసార రథంలో చెరో సగమై...

'కష్టాల్లో, సుఖాల్లో భర్తకు తోడుగా' అంటుంటారు. కష్టాలు, సుఖాల్లోనే కాదు... వృత్తిలోనూ భర్తకు తోడూ నీడగా ఉంటుంది జ్యోతి. భర్త డ్రైవర్, భార్య క్లీనర్!

జ్యోతి ఎందుకు క్లీనర్ కావాల్సి వచ్చింది? కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళితే...





శోభనాద్రి జ్యోతి

లారీ డ్రైవర్ అయిన భర్త శోభనాద్రి దూరప్రాంతాలకు వెళుతుండేవాడు.

'ఎక్కడ ఉన్నాడో... ఏం తింటున్నాడో' అని ఎప్పుడూ భర్త గురించి బెంగగా ఉండేది. అందుకు తగ్గట్టే డ్యూటీ దిగి ఇంటికి వచ్చిన భర్త బక్కచిక్కి కనిపించేవాడు.

ఒకరోజు అడిగింది...

'నేను నీతోపాటే వస్తాను'

'మరి ఇల్లు?' అన్నాడు భర్త.

'బండే మన ఇల్లు' అన్నది ఆమె. ఇక ఆరోజు నుంచి బండే వారి ఇల్లు, బండే స్వర్గసీమ.

లారీ ఎక్కడికి కిరాయికి వెళ్లినా క్లీనర్‌గా జ్యోతి భర్త వెంటే వెళుతుంది. లారీలోనే వంట సామగ్రి ఏర్పాటు చేసుకుని, మార్గ మధ్యంలో భర్తకు అవసరమైన భోజనం, టీ, అల్పాహారం వంటివి ఏర్పాటు చేస్తుంది.

గతంలో దూరప్రాంతాలకు వెళ్లిన సందర్భాల్లో సరైన భోజనం లేక శోభనాద్రి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నాడు. భర్త వెంట వెళితే ఇబ్బందులు ఉండవని జ్యోతి భావించింది. రాత్రి పూట భర్త డ్రైవింగ్ చేస్తుంటే నిద్ర రాకుండా ఉండేందుకు భర్తతో ముచ్చట్లు పెడుతూ అతడిని అప్రమత్తం చేస్తుంటానని చెబుతోంది జ్యోతి. కోళ్ల దాణా, ధాన్యం, బొగ్గు, మొక్కజొన్న వంటివి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు రవాణా చేస్తుంటామని, భార్య తోడు రావడం వల్ల ఇంటి బెంగ కూడా ఉండదని శోభనాద్రి చెబుతున్నాడు.

'పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు చేశాం. బాధ్యతలు తీరిపోయాయి. ఇక మా ఇద్దరి జీవనం ఇలా కలిసిమెలిసి సాగిపోతోంది' అని భార్యాభర్తలు చెబుతున్నారు. వీరిది ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామం.

–జి.వి.వి. సత్యనారాయణ, సాక్షి, కొవ్వూరు

న్యూస్‌మేకర్

ప్రతిష్ఠాత్మక నేషనల్ డిఫెన్స్ అకాడెమీ ఫలితాలు ఇటీవలే వెలువడ్డాయి. దేశం మొత్తం నుంచి 12 లక్షల మంది రాశారు. వీళ్లలో లక్షన్నర మంది అమ్మాయిలు. ఈ అమ్మాయిల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించింది పూణెకు చెందిన రుతుజా వర్హాడే. అంతే కాదు.. దేశం మొత్తం మీద 3వ ర్యాంక్ పొందింది. 75 ఎన్‌డీఏ చరిత్రలో ఒక అమ్మాయి టాప్ ర్యాంక్ సాధించడం ఇదే మొదలు. 'మొదటి నుంచి డిఫెన్స్‌లో పని చేయాలనేది నా కోరిక... అందుకే కష్టపడ్డా" అంటోంది రుతుజా.



రుతుజా వర్హాడే

దేశం కోసమే మొదటి అడుగు

పూణెలో ఉండే ప్రతిష్ఠాత్మక నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్.డి.ఏ) ఎంట్రన్స్ సంవత్సరంలో రెండుసార్లు జరుగుతుంది. ఏప్రిల్‌లో. సెప్టెంబర్‌లో. ఏప్రిల్‌లో జరిగిన ఎంట్రన్స్‌కు 12 లక్షల మంది దేశవ్యాప్తంగా అప్పియర్ అయితే వారిలో 3వ ర్యాంక్ సాధించింది రుతుజ వర్హాడే. అకాడెమీ చరిత్రలో ఒక అమ్మాయికి ఈ స్థాయి ర్యాంక్ రావడం ఇదే మొదలు. పరీక్షలో పాల్గొన్న 12 లక్షల మంది అభ్యర్థుల్లో లక్షన్నర మంది అమ్మాయిలైతే వారిలో మొదటి స్థానంలో నిలిచింది రుతుజ. అందుకే ఆమెను అందరూ శ్లాఘిస్తున్నారు. ఆ ప్రతిభకు సెల్యూట్ చేస్తున్నారు.

దేశం కోసం...

రుతుజ పూణెలో పుట్టి పెరిగింది. తండ్రి ప్రొఫెసర్. తల్లి ఇంట్లో 5వ తరగతి పిల్లల నుంచి ఇంజనీరింగ్ పిల్లల వరకూ మేథ్స్‌లో ట్యూషన్ చెబుతుంది. రుతుజ చిన్నప్పటి నుంచి చదువులో చాలా బ్రిలియంట్‌గా ఉంది. పదవ తరగతిలో టాప్ మార్క్స్ వచ్చాయి. ఇంటర్‌లో కూడా అంతే. ఎన్.డి.ఏ ఎంట్రన్స్ ఇంటర్ తర్వాత రాయాలి కాబట్టి ముందు నుంచి ప్రిపేర్ అవుతూ కోచింగ్ తీసుకుంటూ రాసి టాప్ ర్యాంక్ సాధించింది. 'ఆర్మ్‌డ్ ఫోర్స్‌లో పని చేయాలనేది నా కల. దేశం కోసమే నా మొదటి అడుగు' అంటోంది రుతుజ.

ఎనిమిదవ తరగతిలో ఉండగా...

సాధారణంగా అమ్మాయిలు ఎన్.డి.ఏ.లో చదవాలని కోరుకోరు. అందుకే నిన్న మొన్నటి వరకూ వారిని అనర్హులుగా చూసేది ఎన్.డి.ఏ. అయితే రుతుజ ఎనిమిదవ క్లాస్‌లో ఉన్నప్పుడు ఎన్.డి.ఏ. ఇకపై ఆడపిల్లలకూ ప్రవేశం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. 'ఈ విషయం మా క్లాస్‌లో చర్చకి వచ్చింది. అప్పుడే ఎన్.డి.ఏ గురించి తెలిసింది. మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండటం మొదటి అర్హత అయితే కఠినమైన రిటన్ టెస్ట్‌లో పాసయ్యి రెండవ దశలో సీట్ సంపాదించడం ఇంకా కష్టమని తెలుసుకున్నాను. ఎలాగైనా ఈ అకాడెమీలో చేరాలని నిర్ణయించుకుని కష్టపడ్డాను. మేథ్స్, అబిలిటీ, జనరల్ నాలెడ్జ్ మీద ప్రశ్నలు ఉంటాయి. వాటి కోసం కోచింగ్ సెంటర్‌లో నాలుగైదు గంటల మెగా లెక్చర్స్ వినేదాన్ని. అంతేకాదు... మా నాన్నగారు అందించిన ప్రోత్సాహం కూడా నన్ను మోటివేట్ చేసింది' అంటుంది రుతుజ.

మాటలు పడినా...

రుతుజ ఈ క్రమంలో కొన్ని సవాళ్లు ఎదుర్కొంది. చదువులోనే నిమగ్నమై ఉండటంతో స్నేహితులు ఆమెను బాయ్‌కాట్ చేశారు. ఎప్పుడూ చదువే నీకు... ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో నీ ప్రతిభ గుండు సున్నా అని ఎగతాళి చేశారు. 'రోషపడి సీనియర్ ఇంటర్‌లో క్లాసుల కంటే కూడా స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్‌లో ఎక్కువ సమయం వెచ్చించాను. దాంతో నా గ్రేడ్స్ పడిపోయాయి. చాలా డల్ అయిపోయాను. ఆ దశ నుంచి తిరిగి టాప్ స్టూడెంట్‌గా నిలవడానికి కష్టపడాల్సి వచ్చింది' అని తెలిపింది రుతుజ.

'సాధారణంగా సీనియర్ ఇంటర్‌లో చాలా మంది డైవర్ట్ అవుతారు. అలా కాకుండా కష్టపడి చదివి లక్ష్యం వైపు అడుగు వేస్తే విజయం మీదే' అంటోంది రుతుజ.

వంటిల్లు

అదిరేటి అరటి రుచులు





పిల్లలు సైతం సిద్ధం చేసుకోగలిగే ఈజీ రెసిపీల్లో బనానా రెసిపీలు మొదటి వరసలో ఉంటాయి. పైగా అవి రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం కూడా. ఇప్పుడు కొన్ని వెరైటీలు చూద్దాం.

బనానా శాండ్‌విచ్

కావాల్సినవి: అరటిపండు – 2 లేదా 3; పీనట్ బటర్ – పావు కప్పు; బ్రెడ్ స్లైసెస్ – కొన్ని;

తయారీ: ముందుగా బ్రెడ్ స్లైసెస్‌ను ఓవెన్‌లో దోరగా వేయించుకోవాలి. ఈలోపు అరటిపండ్లను గుండ్రంగా కట్ చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు పీనట్ బటర్‌ను బ్రెడ్ ముక్కలకు ఒకవైపు అప్లై చేసుకుని, రెండేసి బ్రెడ్‌ముక్కల్లో కొన్ని అరటిపండు ముక్కలను పెట్టుకుని, పైన పంచదార పొడితో గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది.

బనానా చాక్లెట్ పాప్స్



కావాల్సినవి: అరటిపండ్లు – 4; ఐస్ క్రీమ్ పుల్లలు – 6 పైనే; చాక్లెట్ చిప్స్ – అర కప్పు (మెల్ట్ చేసుకోవాలి); డ్రై ఫ్రూట్స్ ముక్కలు – కొన్ని (నచ్చినవి)

తయారీ: ముందుగా అరటిపండు తొక్క తీసి.. నచ్చిన విధంగా కట్ చేసుకుని.. ఒక్కో ముక్కకు ఒక్కో ఐస్ క్రీమ్ పుల్ల గుచ్చాలి. ఒక ప్లేట్‌లో పార్చ్‌మెంట్ పేపర్ వేసి అరటిపండు ముక్కలను దానిపై పేర్చి రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. అరటిపండు ముక్కలు గట్టిపడిన తర్వాత కరిగిన చాక్లెట్‌లో ముంచి, వెంటనే తరిగిన డ్రై ఫ్రూట్స్ ముక్కలను పైన జల్లి సర్వ్ చేసుకోవచ్చు.

బనానా ఓట్ మీల్ బాల్స్



కావాల్సినవి: అరటిపండు – 1 (మెత్తగా గుజ్జులా చేసుకోవాలి); రోల్డ్ ఓట్స్ – అర కప్పు; పీనట్ బటర్ – ఒక టేబుల్ స్పూన్; బెల్లం తురుము – కొద్దిగా; దాల్చినచెక్క పొడి – కొద్దిగా.

తయారీ: ముందుగా ఒక పాత్రలో రోల్డ్ ఓట్స్, అరటిపండు గుజ్జు, పీనట్ బటర్, దాల్చినచెక్కపొడి, బెల్లం తురుము ఒక దాని తర్వాత ఒకటి వేసుకుని బాగా కలుపుకోవాలి. అభిరుచిని బట్టి బ్రెడ్ పౌడర్ కూడా కలుపుకోవచ్చు. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలు చేసుకుని, కొద్దిగా కొబ్బరి కోరులో దొర్లించి సర్వ్ చేసుకుంటే సరిపోతుంది.

బనానా హనీ బైట్స్



కావాల్సినవి: అరటిపండ్లు – 2; తేనె – 4 లేదా 5 టేబుల్ స్పూన్లు; దాల్చినచెక్క పొడి – టీ స్పూన్

తయారీ: ముందుగా అరటి పండ్లను గుండ్రంగా కట్ చేసుకుని ఒక పాత్రలోకి తీసుకోవాలి. అభిరుచిని బట్టి నెయ్యి లేదా బటర్‌లో దోరగా వేయించుకోవచ్చు. వేయించుకున్నా వేయించుకోకపోయినా వాటిపై తేనె, దాల్చినచెక్క పొడి వేసుకుని, కాసేపు ఫ్రిజ్‌లో పెట్టుకుని సర్వ్ చేసుకుంటే భలే రుచిగా ఉంటాయి ఈ బైట్స్.

ఏఐ ట్రెండ్

శునక మానవ సుందర చిత్రం



శునక యజమానులు తమ శునకాల ఫోటోలను చాట్ జీపీటితో మానవ రూపంలోకి మార్చడం సరికొత్త ఏఐ ట్రెండ్‌గా మారింది.

నా పెట్‌ను.. ఆఫీసులో పని చేస్తున్న ఉద్యోగిలా చూడాలి... జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వస్తాదులా చూడాలి.. కేఫ్‌లో చాయి తాగుతున్న కస్టమర్‌లా చూడాలి... ఒక్కటా... రెండా... ఎన్నెన్నో వి'చిత్ర' ఊహలతో శునక మానవ చిత్రాలను సృష్టిస్తున్నారు. ఈ ట్రెండ్‌లో చేరాలంటే చాట్ జీపీటీ.కామ్‌లోకి వెళ్లి సైన్ అప్ (ఫ్రీ ఎకౌంట్) చేయాలి. మీ పెట్ ఫోటోను అప్‌లోడ్ చేయాలి. 'కెన్ యూ క్రియేట్ యాన్ ఇమేజ్ ఆఫ్ దిస్ డాగ్ యాజ్ ఏ...' అంటూ ప్రాంప్ట్ టైప్ చేయాలి.

కొన్ని ఫాలో–అప్ క్వశ్చన్‌లను చాట్‌జీపీటీ అడుగుతుంది.

ఉదా: పెట్ జెండర్, వయసు, క్లాతింగ్ స్టైల్

రెడీ అయిన ఇమేజ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆన్‌లైన్‌లో షేర్ చేయాలి. వేలాది మంది యూజర్‌లు సోషల్ మీడియాలో తమ వెర్షన్‌లను పోస్ట్ చేసి ఎంజాయ్ చేస్తున్నారు.

రోజంతా ఉల్లాసంగానే...



చాలామంది రోజంతా నీరసంగా.. నిస్సత్తువగా గడుపుతుంటారు. దీనివల్ల శరీరం నిస్తేజంగా మారడమే కాకుండా అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అయితే కొన్ని చిన్నపాటి మార్పుల ద్వారా రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండవచ్చు. అవేంటో చూద్దాం..



తగినంత నిద్ర.. ప్రతిరోజూ కనీసం 7–8 గంటలు నిద్ర పోవడం చాలా ముఖ్యం. నిద్రలేమి చిరాకు, నీరసానికి దారితీస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం.. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్లు శరీరానికి శక్తినిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర ఎక్కువగా ఉండే వాటిని తగ్గించడం మంచిది.



వ్యాయామం.. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల మీ మానసిక స్థితి మెరుగుపడుతుంది. శక్తి స్థాయులు పెరుగుతాయి. నడవడం, యోగా, డ్యాన్స్ లేదా ఇష్టమైన ఏదైనా శారీరక శ్రమ చేయవచ్చు.

నీరు తాగడం.. రోజంతా తగినంత నీరు తాగడం చాలా అవసరం. డీహైడ్రేషన్ వల్ల అలసట, చిరాకు కలగవచ్చు.

ధ్యానం, విశ్రాంతి.. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం లేదా రిలాక్సేషన్ టెక్నిక్స్ కోసం కేటాయించండి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.

పాజిటివ్ ఆలోచనలు.. ప్రతికూల ఆలోచనలను తగ్గించుకుని సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోండి. కృతజ్ఞత కలిగి ఉండటం కూడా చాలా ముఖ్యం.

ఇష్టమైన పనులు చేయడం.. ఆనందం కలిగించే హాబీలు లేదా పనుల కోసం సమయం కేటాయించడం మన మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

సామాజిక సంబంధాలు.. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఇతరులతో మాట్లాడటం, కనెక్ట్ అవ్వడం మానసిక ఆరోగ్యానికి చాలా ముఖ్యం.

కొత్త విషయాలు నేర్చుకోవడం.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం లేదా కొత్త విషయాలు తెలుసుకోవడం మీ మనస్సును ఉత్తేజపరుస్తుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

రోజువారీ అలవాట్లు.. ఉదయం లేవగానే సహజమైన సూర్యకాంతిలో గడపడం శరీరపు జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించడానికి సహాయపడుతుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

చిన్న చిన్న విరామాలు.. మీరు ఎక్కువసేపు ఒకే పనిలో ఉంటే, మధ్యలో చిన్న విరామాలు తీసుకోండి. లేచి కొంచెం నడవండి లేదా స్ట్రెచ్ చేయండి.

పనులు ప్లాన్ చేసుకోవడం.. రోజువారీ పనులను ఒక క్రమంలో ప్లాన్ చేసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది, మరింత నియంత్రణలో ఉన్నట్లు అనిపిస్తుంది.

నవ్వండి, నవ్వించండి.. నవ్వడం ఒక గొప్ప ఒత్తిడి నివారిణి, హాయిగా నవ్వుకోడం మానసిక స్థితిని తక్షణం మెరుగుపరుస్తుంది.

ఈ చిట్కాలను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా రోజంతా ఉల్లాసంగాఉత్సాహంగా ఉండగలగడం ఎవరికైనా సాధ్యమే.ఒకవేళ మీకు ఏవైనా ప్రత్యేకమైన ఆందోళనలు ఉంటే, వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది.



లైఫ్@360

ప్రాణాయామంతో మనస్సు, శరీరం రీఛార్జ్

● యోగా



యోగాలో ప్రాణాయామం ప్రయోజనాలు యోగాకు మించి ఉంటాయి. శ్వాస మీద పని చేస్తున్నప్పుడు, శరీరంలోని టాక్సిన్స్‌ను తొలగిస్తూనే తగినంత ఆక్సిజన్ సరఫరాతో శ్వాసను నియంత్రించడం, సరైన విధంగా సాధన చేయడం ఈ యోగాలో కీలకం. శరీరాన్ని రీఛార్జ్ చేయడం ద్వారా ఇది పనిచేస్తుంది. ప్రాణాయామం జీర్ణాశయానికి ఆక్సిజన్ సరఫరాను పెంచుతుంది, మెరుగైన జీర్ణక్రియ కోసం రక్త ప్రవాహాన్ని, ప్రేగుల బలాన్ని పెంచుతుంది. యోగా ఆసనాలతో కలిపి చేసే ప్రాణాయామం ఒత్తిడిని తగ్గిస్తుంది. జీవక్రియ వ్యర్థాలను తొలగిస్తుంది.

సాధన చేయడానికి...

ప్రాణాయామం చేయడానికి, ఒక ప్రశాంతమైన స్థానంలో కూర్చొని, వెన్నును నిటారుగా ఉంచాలి. రెండు కళ్ళను మూసి, శ్వాసను లోపలికి పీల్చుకోవాలి. కొన్ని క్షణాలు ఆ శ్వాసను బిగించి, తర్వాత నెమ్మదిగా బయటకు వదిలేయాలి. ఈ ప్రక్రియను పదే పదే పునరావృతం చేయడం వల్ల శరీరానికి, మనసుకు ప్రశాంతత చేకూరి శక్తిమంతం అవుతాయి. శ్వాస సాధన ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

మెరుగైన ఆరోగ్యానికి మల్బరీ జ్యూస్

తియ్య తియ్యగా... పుల్ల పుల్లగా ఉండే మల్బరీ పండ్లు అన్ని కాలాలలోనూ అందుబాటులో ఉంటాయి. మల్బరీ పండ్లతో చేసిన జ్యూస్ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. అవేమిటో చూద్దాం..

మల్బరీలో ఉండే డైటరీ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకం, కడుపులో మంటలను తగ్గిస్తుంది.



గుండె ఆరోగ్యానికి మల్బరీ యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉండి రక్తనాళాల పనితీరును మెరుగుపరచి రక్తం గడ్డ కట్టకుండా చేస్తుంది. తద్వారా స్ట్రోక్స్, గుండెపోటు వంటి సమస్యలను నివారిస్తుంది.

రోగనిరోధక శక్తి పెంపు: మల్బరీలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని వ్యాధులకు వ్యతిరేకంగా శక్తిమంతమైన రక్షణను అందిస్తుంది.

ఎముకల ఆరోగ్యానికి: మల్బరీలోని విటమిన్ కె, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలు ఎముకల ఆరోగ్యానికి మంచిది.

కంటి చూపు మెరుగు: మల్బరీ జ్యూస్‌లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది కాబట్టి ఇది తాగడం వల్ల చూపు మెరుగుపడుతుంది. కంప్యూటర్ ముందు గంటల తరబడి పనిచేసే వారికి కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

వేగంగా కోలుకోవడానికి తోడ్పడుతుంది: శస్త్రచికిత్స తర్వాత రోగులకు మల్బరీ జ్యూస్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తుంది.

జుట్టు సహజ రంగును నిలుపుకుంటుంది: మల్బరీ జుట్టులో మెలనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది జుట్టు సహజ రంగును నిలుపుకోవడానికి సహాయపడుతుంది, జుట్టు నెరిసిపోవడాన్ని తగ్గిస్తుంది.

మెదడు ఆరోగ్యానికి మంచిది: మల్బరీలో న్యూరోప్రొటెక్టివ్ లక్షణాలను కలిగి ఉన్న వివిధ బయో యాక్టివ్ సమ్మేళనాలు మెదడు కణాలను ఒత్తిడి నుంచి రక్షించి ఐక్యూను మెరుగుపరుస్తాయి. మల్బరీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి, నష్టం నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చివరగా... ప్రయోజనాలు ఉన్నాయి కదా అని ఈ జ్యూస్‌ని విపరీతంగా తాగ కూడదు. పరిమితి పాటించడం మంచిది.

మండే ఎండల్లోనూ ఆరోగ్యంగా...

ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖచర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. అందువల్ల బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...



- మంచినీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటినుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.
- గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.
- నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.



సాక్షి సినిమా

అప్పనా తనామనా పాట బాగుంది

- సుకుమార్



● సువిక్షిత్, సుకుమార్, గీతిక

''**దూ**రదర్శిని' హీరో సువిక్షిత్ నా రూపం వచ్చేటట్లు వరిపొలంలో ఫార్మింగ్ చేశాడు. అప్పటి నుంచి తనతో నాకు పరిచయం ఉంది. తనకి సినిమా అంటే ప్యాషన్. ఈ మూవీ నుంచి నేను రిలీజ్ చేసిన 'అపనా తనామనా...' పాట చాలా బాగుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అని దర్శకుడు సుకుమార్ అన్నారు. సువిక్షిత్ బొజ్జ, గీతికా రతన్ జంటగా నటించిన చిత్రం 'దూరదర్శిని'. 'కలిపింది ఇద్దరిని' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో బి. సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మించారు. ఆనంద్ గుర్రాన సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'అవనా తనామనా...' అనే పాట లిరికల్ వీడియోను సుకుమార్ విడుదల చేశారు. సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని సింధుజ, శ్రీనివాసన్ ఆలపించారు. సువిక్షిత్ బొజ్జ మాట్లాడుతూ– ''నా అభిమాన దర్శకుడు సుకుమార్‌గారి చేతుల మీదుగా మా మూవీ సాంగ్ రిలీజ్ కావడం సంతోషంగా, గర్వంగా ఉంది. ఈ సినిమా అందర్నీ 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని, ప్రేమకథలను గుర్తుకు తెస్తుంది''అని తెలిపారు.

కథ గమ్మత్తుగా అనిపించింది

- నవీన్ చంద్ర



● రాకేశ్ వర్మ, రాశీ సింగ్, నవీన్ చంద్ర

''**బ్లైండ్ స్పాట్**' మంచి థ్రిల్లర్ మూవీ. రాకేష్ కథ చెప్పినప్పుడు గమ్మత్తుగా అనిపించింది. ఈ మూవీ స్క్రీన్‌ప్లే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమా నాకు వైవిధ్యమైన అనుభూతి ఇచ్చింది. కథను నమ్మి ఒక్కొక్క సినిమా చేసుకుంటూ ముందుకు వస్తున్నాను. ఎప్పటిలాగే 'బ్లైండ్ స్పాట్'కి కూడా ప్రేక్షకుల ప్రోత్సాహం ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నారు నవీన్ చంద్ర. రాకేష్ వర్మ దర్శకత్వంలో నవీన్ చంద్ర, రాశీ సింగ్ జోడీగా నటించిన చిత్రం 'బ్లైండ్ స్పాట్'. మ్యాంగో మాస్ మీడియా బ్యానర్‌పై రామకృష్ణ వీరపనేని నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో **నవీన్ చంద్ర మాట్లాడుతూ–** ''మా సినిమా పోస్టర్లో ఒక క్లూ ఉంది. అది కనిపెట్టి నాకు మెసేజ్ చేస్తే వాళ్లతో కలిసి నేను ఈ చిత్రం చూస్తాను'' అన్నారు. **రాశీ సింగ్ మాట్లాడుతూ–** ''ఈ సినిమా అంతా నా పాత్ర ఏడుస్తూనే ఉంటుంది. సినిమా బాగా వచ్చింది'' అని చెప్పారు. **రాకేష్ వర్మ మాట్లాడుతూ–** ''మా సినిమా కథ మొత్తం ఒక రాత్రిలో జరుగుతుంది. నవీన్ చంద్ర తన పాత్రలో చాలా లీనమై నటించారు. రాశీ సింగ్ గ్లిజరిన్ లేకుండా కన్నీళ్లు తెచ్చుకునేంత మంచి నటి'' అన్నారు.

వాళ్లు ఐ లవ్ యూ చెప్పలేదు

- కమల్‌హాసన్



● అభిరామి, షణ్ముగమూర్తి, ఏఆర్ రెహమాన్, మణిరత్నం, కమల్‌హాసన్, త్రిష, శింబు

''**థగ్ లైఫ్**' సినిమాలో శింబు, త్రిష, అభిరామి, జోజు జార్జ్ వంటి నటీనటులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. అయితే ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు (త్రిష, అభిరామి) ఉన్నప్పటికీ నాకు ఒక్కసారి కూడా వారు ఐ లవ్ యూ చెప్పలేదు. కానీ, జోజు జార్జ్ మాత్రం రోజూ ఐ లవ్ యూ చెప్పేవారు'' అని కమల్‌హాసన్ సరదాగా పేర్కొన్నారు. కమల్‌హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, జోజు జార్జ్, అభిరామి ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. మద్రాస్ టాకీస్, రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ బ్యానర్స్‌పై కమల్ హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. శుక్రవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూవీ నుంచి 'జింగుచ్చా...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి కమల్‌హాసన్ సాహిత్యం అందించారు. ఈ సందర్భంగా **కమల్‌హాసన్ మాట్లాడుతూ–** ''నాయగన్' తర్వాత మళ్లీ మణిరత్నంగారి దర్శకత్వంలో నటించడానికి ప్రేక్షకులే కారణం. ఆయనకు, నాకు మధ్య ఇప్పటికీ ఏమీ మారలేదు. 'థగ్ లైఫ్' కచ్చితంగా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. **మణిరత్నం మాట్లాడుతూ–** ''కమల్‌హాసన్ సినిమా లవర్. డబ్బింగ్ జరుగుతుంటే నా ఆఫీస్‌కు వచ్చిన కమల్‌హాసన్ అమెరికాలో జరుగుతున్న సౌండ్ మిక్సింగ్ గురించి చెప్పారు. ఆయన దర్శకుడికి 50 శాతం భారాన్ని తగ్గిస్తారు'' అన్నారు. **త్రిష మాట్లాడుతూ–** ''మణిరత్నంగారి దర్శకత్వంలో నేను నటించిన మూడవ చిత్రం 'థగ్ లైఫ్'. అదేవిధంగా కమల్‌హాసన్‌గారు, శింబుతోనూ నటించిన మూడో చిత్రం ఇది కావడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ''కమల్‌హాసన్‌గారి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను'' అని శింబు తెలిపారు. ఈ వేడుకలో నటీనటులు అభిరామి, జోజు జార్జ్, అశోక్ సెల్వన్, కెమేరామేన్ రవి కె.చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

– 'సాక్షి' తమిళ సినిమా, చెన్నై



● తమ్మిరాజు, సునీల్ బలుసు, కల్యాణ్‌రామ్, శ్రీకాంత్, అశోక్ వర్ధన్, ప్రదీప్ చిలుకూరి


మా అబ్బాయి మాటలతో షాక్ అయ్యా

- కల్యాణ్ రామ్

''**అర్జున్ సన్నాఫ్ వైజయంతి**' సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు, మా నందమూరి అభిమానులకు ధన్యవాదాలు. మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది'' అని హీరో కల్యాణ్ రామ్ చెప్పారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. అదే రోజు సాయంత్రం నిర్వహించిన సక్సెస్ ప్రెస్‌మీట్‌లో **కల్యాణ్ రామ్ మాట్లాడుతూ–**''మా అబ్బాయి ఈ సినిమా చూసి, 'ఇలాంటి సీక్వెన్స్ ఇండియన్ స్క్రీన్ మీద చూడలేదు... చాలా గర్వంగా ఉంది నాన్న' అని చెప్పాడు. ఆ రియాక్షన్‌కి నేను షాక్‌కి గురయ్యాను''అన్నారు. **నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ–**''ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకంతోనే మొదలుపెట్టాం. మా నమ్మకం నిజమైంది'' అని చెప్పారు. **ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ–** ''ఈ మూవీకి ఆడియన్స్ నుంచి వస్తున్న రియాక్షన్ చూస్తుంటే గూజ్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. **సునీల్ బలుసు మాట్లాడుతూ–** ''చాలా కాలం తర్వాత థియేటర్స్ అన్నీ మళ్లీ మా సినిమాతో ఫుల్ అవుతున్నాయి అని డిస్ట్రిబ్యూటర్స్ నుంచి కాల్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. సాయంత్రం నుంచే అన్ని చోట్ల షోలు యాడ్ అవుతున్నాయి'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్ వర్ధన్ ముప్పా, ఎడిటర్ తమ్మిరాజు పాల్గొన్నారు.

మేలో శుభం

హీరోయిన్ సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం' విడుదల తేదీ ఖరారైంది. మే 9న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. హర్షిత్ రెడ్డి, సి. మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్,



● 'శుభం' సినిమా పోస్టర్

శ్రావణి నటించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మించారు. ఈ మూవీని మే 9న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ''వినోదాన్ని అందించే చిత్రాలను రూపొందించడమే నా లక్ష్యం. 'శుభం' ఆ కోవలోకి వస్తుంది. ఈ చిత్రం కోసం నా టీమ్ చాలా కష్టపడింది. ఈ కథను అందరితో పంచుకోవడానికి మేం సంతోషిస్తున్నాం''అన్నారు సమంత.

ఓటీటీ ఇది చూడొచ్చు

చరిత్రలో చెరిగిపోని వీరుడు చావా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం చావా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా అనేది మన జీవిత ప్రతిబింబం. మన జీవితంలో ఎన్నో రకాల భావావేశాలు, వాటికి కారణమైన కథనాలు ఎన్ని ఉంటాయో వాటన్నిటినీ మళ్లీ నాటకీయంగా రూపకల్పన చేసి, నటీనటులను అవే కథనాలలో నటింపజేసి మన జీవితాన్ని మనకే అద్దంలో చూపించే మహా ప్రయత్నమే సినిమా. చిన్నప్పుడు బామ్మ ఒళ్లో చందమామను చూస్తూ చెప్పే కథలు చక్కగా ఎందుకు వింటామో తెలుసా... ఎక్కువగా చరిత్రలోని కథనాలే ఆవిడ మనకి చెప్పారు కాబట్టి. మన చరిత్రలో మన పూర్వీకుల వీరత్వం ఉంది. ఆ వీరత్వం మాటున బోలెడంత పోరాటం ఉంది. ఆ పోరాటం వెనక దాగి ఉన్న పట్టుదలతో కూడిన త్యాగం ఉంది. ఆ త్యాగంలో కనబడని బాధ, కనిపించే ఆనందంలాంటివి ఎన్నో ఉన్నాయి. అటువంటి పోరాటాలను అడపా దడపా నేటి దర్శకులు సినిమాల రూపంలో మన ముందుకు తీసుకువస్తున్నారు. ఆ కోవకు చెందినదే 'చావా' చిత్రం. ఛత్రపతి శివాజీ పేరు చాలా మందికి తెలుసు. కానీ శివాజీ మహారాజ్ కొడుకు శంభాజీ గురించి అందరికీ తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా ఆరంభంలోనే నాటి మొఘలు సామ్రాజ్యానికి చెందిన ఔరంగజేబుకు ఓ వార్త అందుతుంది.



భారతదేశం మూలమూలలా కబళించిన మొఘలులు మరాఠాల ప్రాంతంలో మాత్రం అడుగు కూడా పెట్టలేకపోతారు. దానికి కారణం ఛత్రపతి శివాజీ. ఆయన ఇక లేరన్న వార్త ఔరంగజేబుకు అమృతంలా అందుతుంది. వార్త విన్న ఆనందం ఆస్వాదించేలోపే శివాజీ కొడుకు శంభాలా గురించి కూడా ఔరంగజేబుకు తెలుస్తుంది. దాంతో ఔరంగజేబు తన కిరీటాన్ని తీసేసి, శంభాలాను చంపిన తర్వాతే తాను మళ్లీ కిరీటాన్ని పెట్టుకుంటానని ప్రతిన బూనుతాడు. ఆ తర్వాత శంభాలాని ఔరంగజేబు కుట్రతో ఎంత దారుణంగా చంపుతాడనేదే ఈ సినిమా. లక్ష్మణ్ ఉతేకర్ ఈ సినిమాకి దర్శకుడు. ప్రముఖ వర్ధమాన నటుడు విక్కీ కౌశల్ శంభాలా పాత్రలో ఒదిగిపోయారు. ఏసుబాయి పాత్రలో రష్మికా మందన్నా కూడా అద్భుతంగా ఒదిగిపోయారు. అలాగే ఔరంగజేబు పాత్రలో అక్షయ్ ఖన్నా జీవించారు. ఇక సినిమా పరంగా ప్రతి క్షణం ప్రేక్షకుడిని ఉద్వేగపరుస్తూ చివర్లో కన్నీటితో సాగనంపుతారు దర్శకుడు. అయితే ఇది కథాపరంగా మాత్రమే సుమా. గడిచిన పదేళ్లలో 'బాహుబలి'తో ప్రపంచ ఖ్యాతిని మూటగట్టుకున్న మన టాలీవుడ్ గురించే ప్రేక్షకులు మాట్లాడుకుంటున్న ఈ తరుణంలో 'చావా' సినిమా మాత్రం దాదాపుగా అడుగంటిన బాలీవుడ్ ఖ్యాతిని ఒక్కసారిగా ఉలిక్కిపడుతూ లేపిందనే చెప్పాలి. ఈ సినిమా విడుదలకు ముందు తర్వాత కూడా ఎన్నో సంచలనాలకు దారితీసిందన్న విషయం మనకు తెలుసు. 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమ్ అవుతున్న ఈ 'చావా' ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా, కాదు కాదు చూసి తెలుసుకోవాల్సిన చరిత్ర. తప్పనిసరిగా చూడాల్సిన చిత్రం.

– హరికృష్ణ ఇంటూరు

సాక్షి బిజినెస్
శనివారం
19-4-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 1,509	78,553
నిఫ్టీ ▲ 414	23,852

విదేశీ సూచీలు (మొదటి నాలుగు గురువారం ముగింపు)		
నాస్‌డాక్	16,286	▽ 21
డోజోన్స్	39,142	▽ 527
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,276	▲ 1
డాక్స్	21,206	▽ 105
షాంఘై	3,277	▽ 4
నికాయ్	34,730	▲ 353

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.01	111.10
€	యూరో	ఎస్‌బీఐ	96.01	98.72
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.30	60.86
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.07	56.93
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.78	67.47
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.87	23.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.35	24.13
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.82	12.64

రూ.2,000పైన యూపీఐ లావాదేవీలపై జీఎస్‌టీ లేదు

ప్రతిపాదన పరిశీలనలో లేదన్న ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: రూ.2,000 కంటే అధిక విలువ కలిగిన యూపీఐ లావాదేవీలపై జీఎస్‌టీ విధించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రూ.2,000 మించిన లావాదేవీలపై జీఎస్‌టీ వడ్డింపును ప్రభుత్వం పరిశీలిస్తోందంటూ వచ్చిన వార్తలు అవాస్తవమని, ఎలాంటి ఆధారం లేకుండా తప్పుదోవ పట్టించేవిగా పేర్కొంది. ప్రస్తుతం ప్రభుత్వం



ముందు అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని తేల్చి చెప్పింది. వ్యక్తులు వర్తకులకు చేసే చెల్లింపులపై 'మర్చంట్ డిస్కౌంట్ రేటు' (ఎండీఆర్)ను 2020 జనవరి నుంచి కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) ఎత్తివేయడం తెలిసిందే. ప్రస్తుతం యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ చార్జీలేవీ లేనందున, వీటికి జీఎస్‌టీ అమలు కాదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టత ఇచ్చింది. 2019–20లో యూపీఐ లావాదేవీల విలువ రూ.21.3 లక్షల కోట్లుగా ఉంటే, 2025 మార్చి నాటికి రూ.260 లక్షల కోట్లను దాటిపోవడం గమనార్హం.

బోర్డు సమావేశాలు


హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యస్ బ్యాంక్, ఉజ్జాస్ ఎనర్జీ, మౌంట్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మిడ్ ఈస్ట్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఇంటెగ్రా క్యాపిటల్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-4-2025	
విశాఖ	425-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

క్రాష్ టు జోష్..!





ట్రంప్ టారిఫ్‌ల సునామీ ప్రపంచ మార్కెట్లను అల్లకల్లోలం చేసింది. అనేక దేశాలపై అమెరికా భారీగా ప్రతీకార సుంకాలు వడ్డించడం, చైనా దీటుగా టారిఫ్‌లతో తిప్పికొట్టడంతో వాణిజ్య యుద్ధం తీవ్ర రూపం దాలుస్తోంది. దీంతో అమెరికా టు ఆసియా స్టాక్ మార్కెట్లు 'బేర్'మన్నాయి. అక్టోబర్ నుంచి రివర్స్‌గేర్‌లో కొనసాగుతున్న మన సూచీలు.. ట్రంప్ టారిఫ్ దెబ్బకు తాజా 17 శాతం దిగజారాయి. సెన్సెక్స్ సెప్టెంబర్లో 85,978 పాయింట్ల ఆల్‌టైమ్ గరిష్ఠం నుంచి తాజాగా 71,425 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. అయితే, ట్రంప్ ప్రతీకార సుంకాలకు 90 రోజులు విరామం ప్రకటించడం, పలు రంగాలకు మినహాయింపులు ఇవ్వడంతో మళ్లీ బుల్స్ ఫేస్ టర్నింగ్ ఇచ్చుకున్నాయి. తాజా కనిష్టం నుంచి 10 శాతం మేర 'రిలీఫ్' ర్యాలీ చేశాయి. ఈ వారంలోనే 4 శాతం జంప్ చేశాయి. కాగా, దేశీ మార్కెట్లు గతంలో కూడా సంక్షోభాలు, స్కామ్‌ల దెబ్బకు భారీగా పడి, బేర్ గుప్పిట్లో చిక్కుకున్నప్పటికీ... మళ్లీ అంతే వేగంగా రికవరీ అయ్యాయి. అమెరికా–చైనాల మధ్య టారిఫ్ వార్ ముదురుతుండటం, ట్రంప్ మళ్లీ ఎప్పుడు ఎలాంటి పిడుగు వేస్తారోనన్న అనిశ్చితితో ప్రపంచానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అయితే, టారిఫ్‌ల దుమారం పూర్తిగా సద్దుమణిగితే బుల్స్ రెట్టించిన ఉత్సాహంతో దూసుకెళ్లే అవకాశం ఉంది. మన మార్కెట్లో అతిపెద్ద పతనాలు, కోలుకున్న తీరు చూస్తే...

హర్షద్ మెహతా స్కామ్ నుంచి కోవిడ్–19 వరకు.. | భారీ పతనాలను చవిచూసిన మార్కెట్ | ఆ తర్వాత ఏడాది నుంచి నాలుగేళ్లలోనే రికవరీ... | పడిన ప్రతిసారీ కొత్త ఆల్‌టైమ్ గరిష్టాలకు సూచీలు | ఈసారి ట్రంప్ టారిఫ్ బాంబ్‌తో కల్లోలం | పరిస్థితులు సద్దుమణిగితే మళ్లీ ర్యాలీ ఖాయం అంటున్న నిపుణులు

కోవిడ్ క్రాష్..

2020లో కోవిడ్–19 మహమ్మారి దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పిట్టల్లా రాలిపోతే.. స్టాక్ మార్కెట్లో బేర్ విలయతాండవం చేసింది. ఇటీవలి చరిత్రలో మార్కెట్లు ఇలా కుప్పకూలడం ఇదే తొలిసారి. లాక్‌డౌన్‌లతో ఆర్థిక వ్యవస్థలు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో మార్చి 2020లో సెన్సెక్స్ 41,000 స్థాయి నుంచి 25,981 పాయింట్ల కనిష్టానికి క్రాష్ అయ్యింది. అయితే, సెంట్రల్ బ్యాంకుల సహాయ ప్యాకేజీలు, వడ్డీ రేట్ల భారీ కోతలతో మార్కెట్లు నేలక్కొట్టిన బంతిలా దూసుకుపోయాయి. నవంబర్ 2020 నాటికి కనిష్ఠం నుంచి 58 శాతం ఎగబాకి మళ్లీ క్రాష్ ముందస్తు స్థాయిని దాటేశాయి. వ్యాక్సిన్‌ల అందుబాటు, విదేశీ ఇన్వెస్టర్ల నిధుల కుమ్మరింపుతో నాన్ స్టాప్ ర్యాలీ చేశాయి. 2021 సెప్టెంబర్ నాటికి 60,,000 స్థాయి పైకి చేరగా.. 2024 సెప్టెంబర్‌లో 85,978 పాయింట్లతో సరికొత్త చరిత్రాత్మక గరిష్టాన్ని తాకడం విశేషం!

ప్రపంచ ఆర్థిక సంక్షోభం...

2008లో అమెరికాలో మొదలై ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక సంక్షోభం దెబ్బకు అనేక పేరొందిన ఆర్థిక సంస్థలతో పాటు పలు కంపెనీలు కూడా దివాలా తీశాయి. అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు చివురుటాకుల్లా వణికిపోయాయి. సెన్సెక్స్ మెగా పతనంతో 21,000 స్థాయి నుంచి 2009 మార్చి నాటికి 8,000 పాయింట్లకు కుప్పకూలింది. అంటే ఏకంగా 62 శాతం కరిగిపోయింది. అయితే, ప్రపంచ దేశాలన్నీ మూకుమ్మడిగా ఉద్దీపన ప్యాకేజీల అమలు, వడ్డీరేట్ల కోతలతో మార్కెట్ల రికవరీ మొదలైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు గాడిలో పడటం, విదేశీ ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో 2010 నవంబర్ నాటికి సెన్సెక్స్ మళ్లీ 21,000 మార్కును తాకింది. రెండేళ్ల రికవరీలో 162% ర్యాలీ చేసింది.

కేతన్ పరేఖ్ స్కామ్/డాట్ కామ్ బబుల్

భారత్ స్టాక్ మార్కెట్లను కుదిపేసిన కేతన్ పరేఖ్ షేర్ల కుంభకోణానికి తోడు ప్రపంచవ్యాప్తంగా డాట్–కామ్ బబుల్ బద్దలవ్వడంతో దేశీ సూచీలు కకావికలం అయ్యాయి. 2001 ఆరంభంలో 4,200 పాయింట్ల స్థాయిలో ఉన్న సెన్సెక్స్ సెప్టెంబర్ నాటికి 2,594 పాయింట్లకు కుప్పకూలింది. అయితే, మళ్లీ 2003 నుంచి నెమ్మదిగా మార్కెట్లో జోరు మొదలైంది. 2004 మధ్య నాటికి, అంటే మూడేళ్లలో 62 శాతం ర్యాలీతో 4,200 పాయింట్ల స్థాయికి చేరుకుంది. ఇందుకు ప్రధానంగా దేశ జీడీపీ వృద్ధి పుంజుకోవడం, ఐటీ రంగం పరుగులతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడులకు వరుస కట్టడం వంటి అంశాలు దోహదం చేశాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్

గతంలో సెన్సెక్స్ భారీ పతనాలు.. రికవరీ...

క్రాష్ సంఘటన	పతనమైన పాయింట్లు	కనిష్ఠ స్థాయి	రికవరీ సమయం	కనిష్ఠ స్థాయి నుంచి అప్
కోవిడ్-19 క్రాష్ 2020	15,010 (-37%)	25,981 (2020 మార్చి)	8 నెలలు (2020 నవంబర్ నాటికి)	58% (క్రాష్ ముందస్తు స్థాయికి)
ప్రపంచ ఆర్థిక సంక్షోభం, 2008	13,000 (-62%)	8,000 (2009 మార్చి)	2 ఏళ్లు (2010 నవంబర్ నాటికి)	162%
కేతన్ పరేఖ్ స్కామ్, 2001	1,606 (-38%)	2,594 (2001 సెప్టెంబర్)	3 ఏళ్లు (2004 మధ్య నాటికి)	62%
హర్షద్ మెహతా స్కామ్, 1992	1,938 (-43%)	2,529 (1993 మే)	4 ఏళ్లు (1996 నాటికి)	82%

హర్షద్ మెహతా కుంభకోణం

దేశ స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా నిలిచిపోయిన హర్షద్ మెహతా స్కామ్.. ఇన్వెస్టర్లను నిలువునా ముంచేసింది. 1992లో స్కామ్ బట్టబయలు కాగా, సెన్సెక్స్ 4,467 పాయింట్ల నుంచి 1993 మే నెలకల్లా 2,529 పాయింట్లకు (43 శాతం) పడిపోయింది. అయితే, దేశంలో ఆర్థిక సంస్కరణల అమలు, సరళీకరణ దన్నుతో విదేశీ పెట్టుబడులు జోరందుకున్నాయి. ఇన్వెస్టర్లలో విశ్వాసం కొత్తపుంతలు తొక్కి, మార్కెట్లు చెంగుచెంగున దూసుకెళ్లాయి. 1996 నాటికి సెన్సెక్స్ మళ్లీ 4,600 పాయింట్ల స్థాయికి (82 శాతం) అధిగమించి దుమ్మురేపింది.

టాటా ఎలెక్సీ లాభం డౌన్

షేరుకి రూ. 75 డివిడెండ్



ముంబై: టాటా గ్రూప్ ఐటీ సేవల ఇంజనీరింగ్ కంపెనీ టాటా ఎలెక్సీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం వార్షికంగా 13 శాతం క్షీణించి రూ. 172 కోట్లకు పరిమితమైంది. నికర లాభ మార్జిన్లు 18.1 శాతంగా నమోదయ్యాయి. నిర్వహణ ఆదాయం మాత్రం నామమాత్ర వృద్ధితో రూ. 908 కోట్లను తాకింది. వాటాదారులకు గతేడాదికిగాను కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా షేరుకి రూ. 75 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఆదాయం రూ. 3,729 కోట్లకు చేరింది. నిర్వహణ లాభం (ఇబిటా) రూ. 208 కోట్లుగా నమోదైంది. ఇబిటా మార్జిన్లు 22.9 శాతానికి చేరాయి.

టీవీఎస్ 2025 ఎడిషన్ అపాచీ ఆర్ఆర్ 310

ధర రూ. 2.77 లక్షలు

చెన్నై: టీవీఎస్ మోటార్ కంపెనీ 2025వ ఎడిషన్ సూపర్ ప్రీమియం మోటార్ సైకిల్ 'అపాచీ ఆర్ఆర్ 310'ను విడుదల చేసింది. ఆన్‌బోర్డ్ డయాగ్నోస్టిక్స్ (ఓబీడీ)–2బి నిబంధనలకు అనుగుణంగా, సరికొత్త ఫీచర్లతో దీన్ని తీసుకొచ్చింది. ఎక్స్‌షోరూమ్ ధర రూ.2,77,999. ట్రాక్, స్పోర్ట్, అర్బన్, రెయిన్ నాలుగు రకాల రైడ్ మోడ్‌లతో, 9,800 ఆర్‌పీఎం వద్ద 38పీఎస్ సామర్థ్యంతో ఈ బైక్ ఉంటుంది. కార్నరింగ్ డ్రాగ్ టార్క్ కంట్రోల్ ఫీచర్ కూడా ఉంది. సెపెంగ్ బ్లూరేస్‌ను పోలిన కొత్త రంగును ప్రవేశపెట్టింది.



ప్రపంచ మహిళల చెస్ చాంపియన్‌గా జు వెన్‌జున్



మహిళల చదరంగంలో తనకు తిరుగులేదని చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ మరోసారి నిరూపించుకుంది. క్లాసికల్ ఫార్మాట్‌లో వరుసగా ఐదోసారి ఆమె విశ్వవిజేతగా నిలిచింది. చైనాకే చెందిన టాన్ జోంగితో షాంఘైలో జరిగిన ప్రపంచ చెస్ మహిళల చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో 34 ఏళ్ల జు వెన్‌జున్ 6.5–2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఇద్దరి మధ్య 12 గేమ్‌లు జరగాల్సి ఉన్నా... తొమ్మిదో గేమ్‌లోనే జు వెన్‌జున్‌కు టైటిల్ ఖరారు కావడంతో మిగతా మూడు గేమ్‌లను నిర్వహించలేదు. తొమ్మిది గేమ్‌లలో జు వెన్‌జున్ ఐదు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయింది. విజేతగా నిలిచిన జు వెన్‌జున్‌కు 3,41,000 డాలర్లు (రూ. 2 కోట్ల 91 లక్షలు), రన్నరప్ టాన్ జోంగికి 2,27,000 డాలర్లు (రూ. 1 కోటీ 93 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 2018లో రెండుసార్లు (10 గేమ్‌ల ఫార్మాట్, నాకౌట్ ఫార్మాట్ వేర్వేరుగా) ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జు వెన్‌జున్ ఆ తర్వాత 2020లో, 2023లోనూ వరల్డ్ టైటిల్‌ను సాధించింది.

చాలెంజర్స్‌పై పంజా...

ముందు వాన... తర్వాత హైరానా! శుక్రవారం రాత్రి బెంగళూరులో రాయల్ చాలెంజర్స్ (ఆర్‌సీబీ) పరిస్థితి ఇది. ఆలస్యమైన ఆటలో వికెట్ల వేటను చకచకా మొదలు పెట్టిన పంజాబ్ కింగ్స్ ప్రత్యర్థిని వారి సొంత గడ్డపై కుదేల్ చేసింది. కుదించిన ఓవర్లలో విదిల్చిన పంజాతో ఎదురైన స్వల్ప లక్ష్యాన్ని ఎంచక్కా ఛేదించిన కింగ్స్ ఈ ఐపీఎల్‌లో ఐదో విజయాన్ని నమోదు చేసింది. ఈ సీజన్‌లో మూడోసారి బెంగళూరు ప్రేక్షకులకు నిరాశ తప్పలేదు. చిన్నస్వామి స్టేడియంలో ఆడిన మూడో మ్యాచ్‌లోనూ రాయల్ చాలెంజర్స్ బోణీ కొట్టలేకపోయింది.

5 వికెట్లతో పంజాబ్ కింగ్స్ జయభేరి

- సొంతగడ్డపై కుదేలైన బెంగళూరు
- టిమ్ డేవిడ్ మెరుపులు వృథా
- పడగొట్టిన అర్ష్‌దీప్, యాన్సెన్, చహల్
- మెరిపించిన నేహల్



నేహల్

బెంగళూరు: పంజాబ్ కింగ్స్ బౌలింగ్ గర్జించింది. బెంగళూరును వణికించింది. కింగ్స్‌ను విజేతగా నిలబెట్టింది. శుక్రవారం జరిగిన ఈ పోరులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 14 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (26 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే మెరిపించాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్, మార్కో యాన్సెన్, యజువేంద్ర చహల్, హర్‌ప్రీత్ బ్రార్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ 12.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసి గెలిచింది. నేహల్ వధేరా (19 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. హాజల్‌వుడ్ 3, భువనేశ్వర్ 2 వికెట్లు తీశారు. బెంగళూరు తమ తుదిజట్టును మార్చలేదు. పంజాబ్ మాత్రం రెండు మార్పులు చేసింది. మ్యాక్స్‌వెల్, సుర్యాంశ్ షెడ్గే స్థానాల్లో స్టొయినిస్, హర్‌ప్రీత్ బ్రార్ బరిలోకి దిగారు.

అందరూ తొందరగానే...

వర్షం వల్ల మ్యాచ్ చాలా ఆలస్యంగా ఆరంభమైంది. దీంతో మ్యాచ్‌ను 14 ఓవర్లకు కుదించారు. కోహ్లి,



టిమ్ డేవిడ్

సాల్ట్, లివింగ్‌స్టోన్‌లాంటి హిట్టర్లున్న జట్టులో ఏ నలుగురో, ఐదుగురో ఆడాల్సిన 14 ఓవర్లను ఏకంగా 11 మంది ఆడేశారు. టాపార్డర్, మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ అందరూ తొందర, తొందరగా వికెట్లను పారేసుకోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. సాల్ట్ (4), కోహ్లి (1), రజత్ పాటీదార్ (23), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ శర్మ (2), కృనాల్ పాండ్యా (1) చేతులెత్తేశారు.

డేవిడ్ ఒక్కడి మెరుపులతోనే...

జట్టు స్కోరు 95/9. అంటే 11 మంది క్రీజులోకి వచ్చారన్నమాటే! అందరూ బ్యాటింగ్‌కు దిగినా... స్కోరులో సగంకంటే ఎక్కువ స్కోరు ఒక్కడే టిమ్ డేవిడ్ చేశాడు. ఏడో వరుసలో, ఏడో ఓవర్లో బ్యాటింగ్‌కు వచ్చిన డేవిడ్ అండగా నిలిచేవారే కరువైనా... ఆఖరి రెండు ఓవర్లలోనే అంతా మార్చాడు. 12 ఓవర్లలో బెంగళూరు 9 వికెట్లకు 63 పరుగులు చేసింది. డేవిడ్ స్కోరు 19 కాగా... జేవియర్ 13వ ఓవర్లో 2 బౌండరీలు సహా 11 పరుగులు చేశాడు.

ఇన్నింగ్స్ బ్రేక్‌కు ముందు...

చివరి 14వ ఓవర్లో తొలి మూడు బంతులు వరుసగా... 0, 0, 0 పరుగే రాలేదు. తర్వాత మూడు బంతుల్ని డేవిడ్ భారీ సిక్సర్లు బాదడంతో 18 పరుగులొచ్చాయి. 48 పరుగులు చేసిన డేవిడ్ సహా అంతా ఇన్నింగ్స్ బ్రేక్ కావడంతో మైదానం వీడుతున్నారు. కానీ అంపైర్ చాలా ఆలస్యంగా నోబాల్ సిగ్నలిచ్చాడు. సహచరులతో కబుర్లాడుతూ డగౌట్ చేరుతున్న ఆటగాళ్లను వెనక్కి పిలిచి ఫ్రీ హిట్ ఆడించడంతో 2 పరుగులు తీసిన డేవిడ్ 26 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు.

నేహల్ మెరిపించాడు...

సులువైన లక్ష్యం కావడంతో పంజాబ్‌కు ఛేదనలో పెద్దగా కష్టం ఎదురవలేదు. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (16), ప్రభ్‌సిమ్రాన్ (13), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7) ఇలా టాపార్డర్ వికెట్లు రాలినా... మిడిలార్డర్‌లో నేహల్ భారీ షాట్లతో విరుచుకు పడి జట్టును గెలిపించాడు. దీంతో ఒకే ఓవర్లో హాజల్‌వుడ్ అయ్యర్, ఇన్‌గ్లిస్ (14) వికెట్లను పడగొట్టినా... నేహల్ బ్యాటింగ్ బెంగళూరును మ్యాచ్‌లో పట్టుబిగించకుండా చేసింది. 11 బంతులు మిగిలుండగానే పంజాబ్ విజయాన్ని అందుకుంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) ఇన్‌గ్లిస్ (బి) అర్ష్‌దీప్ 4; కోహ్లి (సి) యాన్సెన్ (బి) అర్ష్‌దీప్ 1; పాటీదార్ (సి) జేవియర్ (బి) చహల్ 23; లివింగ్‌స్టోన్ (సి) ప్రియాన్ష్ (బి) జేవియర్ 4; జితేశ్ (సి) నేహల్ (బి) చహల్ 2; కృనాల్ (సి అండ్ బి) యాన్సెన్ 1; టిమ్ డేవిడ్ (నాటౌట్) 50; మనోజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) యాన్సెన్ 1; భువనేశ్వర్ (సి) జేవియర్ (బి) హర్‌ప్రీత్ 8; యశ్ దయాళ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్‌ప్రీత్ 0; హజల్‌వుడ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (14 ఓవర్లలో 9 వికెట్లకు) 95. **వికెట్ల పతనం:** 1–4, 2–21, 3–26, 4–32, 5–33, 6–41, 7–42, 8–63, 9–63. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3–0–23–2, జేవియర్ 3–0–26–1, యాన్సెన్ 3–0–10–2, చహల్ 3–0–11–2, హర్‌ప్రీత్ బ్రార్ 2–0–25–2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) డేవిడ్ (బి) హాజల్‌వుడ్ 16; ప్రభ్‌సిమ్రాన్ (సి) డేవిడ్ (బి) భువనేశ్వర్ 13; అయ్యర్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 7; ఇన్‌గ్లిస్ (సి) సుయశ్ (బి) హాజల్‌వుడ్ 14; నేహల్ (నాటౌట్) 33; శశాంక్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 1; స్టొయినిస్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (12.1 ఓవర్లలో 5 వికెట్లకు) 98. **వికెట్ల పతనం:** 1–22, 2–32, 3–52, 4–53, 5–81. **బౌలింగ్:** భువనేశ్వర్ 3–0–26–2, యశ్ దయాళ్ 2.1–0–18–0, హాజల్‌వుడ్ 3–0–14–3, కృనాల్ 1–0–10–0, సుయశ్ 3–0–25–0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ	6	5	1	10	0.744
పంజాబ్	7	5	2	10	0.308
గుజరాత్	6	4	2	8	1.081
బెంగళూరు	7	4	3	8	0.446
లక్నో	7	4	3	8	0.086
కోల్‌కతా	7	3	4	6	0.547
ముంబై	7	3	4	6	0.239
రాజస్తాన్	7	2	5	4	-0.714
హైదరాబాద్	7	2	5	4	-1.217
చెన్నై	7	2	5	4	-1.276

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ X ఢిల్లీ
వేదిక: అహ్మదాబాద్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

రాజస్తాన్ X లక్నో
వేదిక: జైపూర్
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

గుజరాత్‌కు షనక... చెన్నైకి బ్రెవిస్

ఐపీఎల్ జట్లలో మార్పులు



షనక



బ్రెవిస్

న్యూఢిల్లీ: మైదానంలో గాయాల బారిన పడి ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరమైన ఆటగాళ్ల స్థానంలో జట్లు కొత్త ప్లేయర్లను ఎంచుకున్నాయి. గుజరాత్ టైటాన్స్ టీమ్‌లోకి శ్రీలంక ఆల్‌రౌండర్ దసున్ షనకను తీసుకుంది. గాయపడిన గ్లెన్ ఫిలిప్స్ స్థానంలో షనక టీమ్‌లోకి వచ్చాడు. షనకకు టైటాన్స్ రూ.75 లక్షలు చెల్లిస్తుంది. 2023 సీజన్‌లో టైటాన్స్ తరఫునే షనక ఐపీఎల్‌లో ఆడాడు. మూడు మ్యాచ్‌లలో బరిలోకి దిగిన అతను 26 పరుగులు చేయగా... ఒక్కసారి కూడా అతనికి బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. మొత్తం 243 టి20 మ్యాచ్‌ల కెరీర్‌లో 4449 పరుగులు చేసిన షనక 91 వికెట్లు తీశాడు. దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌ను చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ సొంతం చేసుకుంది. గాయపడిన గుర్‌జప్‌నీత్ సింగ్ స్థానంలో బ్రెవిస్ సీఎస్‌కే టీమ్‌లోకి అడుగు పెట్టాడు. బ్రెవిస్‌కు చెన్నై రూ. 2 కోట్ల 20 లక్షలు చెల్లిస్తుంది. ఐపీఎల్‌లో 2022, 2024లలో ముంబై ఇండియన్స్‌కు బ్రెవిస్ ప్రాతినిధ్యం వహించి 10 మ్యాచ్‌లలో 230 పరుగులు సాధించాడు. ఓవరాల్‌గా 81 మ్యాచ్‌ల టి20 కెరీర్‌లో అతను 144.93 స్ట్రయిక్‌రేట్‌తో 1787 పరుగులు సాధించాడు. 2025 ఐపీఎల్ సీజన్ కోసం బ్రెవిస్ రూ. 75 లక్షల కనీస ధరతో మెగా వేలంలో పోటీపడ్డాడు. అయితే ఏ ఫ్రాంచైజీ బ్రెవిస్‌ను తీసుకోలేదు. అయితే చెన్నై ప్లేయర్ గుర్‌జప్‌నీత్ గాయపడటంతో బ్రెవిస్‌కు ఐపీఎల్‌లో ఆడే అవకాశం వచ్చింది.

పసిడి పతకం నెగ్గిన హిమాన్షు



హిమాన్షు

దమ్మామ్ (సౌదీ అరేబియా): ఆసియా అండర్–18 యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. శుక్రవారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో హిమాన్షు భారత్‌కు పసిడి పతకాన్ని అందించాడు. 17 ఏళ్ల హిమాన్షు జావెలిన్‌ను 67.57 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. లు హావో (చైనా; 63.45 మీటర్లు) రజతం... రుసియన్ సాదుల్లాయెవ్ (ఉజ్బెకిస్తాన్; 61.96 మీటర్లు) కాంస్యం సాధించారు. హరియాణా మహిళా అథ్లెట్ ఆర్తి తన ఖాతాలో రెండో కాంస్య పతకాన్ని జమ చేసుకుంది. 200 మీటర్ల విభాగంలోనూ ఆర్తి కాంస్య పతకాన్ని సాధించింది. ఆర్తి 24.31 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచింది. 100 మీటర్ల విభాగంలోనూ ఆర్తి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు పురుషుల హైజంప్‌లో దేవక్ భూషణ్ రజత పతకాన్ని గెల్చుకున్నాడు. భూషణ్ 2.03 మీటర్ల ఎత్తుకు ఎగిరి రెండో స్థానంలో నిలిచాడు. పురుషుల షాట్‌పుట్‌లో నిశ్చయ్ రజత పతకం దక్కించుకోగా... పురుషుల మెడ్లీ రిలేలో చిరంత్, సయ్యద్ సాబీర్, సాకేత్ మింజ్, కదీర్ ఖాన్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని హస్తగతం చేసుకుంది.



ఆర్తి



చికెన్-65కి ఆ పేరెలా వచ్చిందంటే..?

చికెన్-65.. దీని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయక్కర్లేదు. చికెన్ తినేవారిలో చాలామంది ఈ వంటకాన్ని ఇష్టపడతారు. స్పైసీగా నోరూరించే ఈ స్టార్టర్ డిష్‌కి ఆ పేరెలా వచ్చిందనే ఆలోచన ఎప్పుడైనా వచ్చిందా? అన్ని అంకెలు ఉండగా.. 65 అనే ఎందుకు పెట్టారు? దీని కథాకమామీషు ఏమిటో తెలుసుకుందామా?

చికెన్ 65 అనేది పక్క దక్షిణాది వంటకం. దీని పుట్టిల్లు చెన్నై. ఎ.ఎం.బుహారీ అనే వ్యక్తి దీనికి ఆద్యుడు. చెన్నైకి చెందిన ఈయన.. శ్రీలంకలో చదువు పూర్తి చేసిన తర్వాత పాకశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించి ఆ రంగంలో స్థిరపడాలని భావించారు. భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత చెన్నై (అప్పుడు మద్రాస్) మౌంట్ రోడ్‌లో బుహారీ హోటల్ ప్రారంభించారు. జనాన్ని కాసేపు ఓచోట కలిపి ఉంచాలంటే తన హోటల్‌కు ఓ మెనూ అవసరమని నిర్ణయానికి వచ్చారు. ఆ మేరకు పేద్ద మెనూ రూపొందించారు. అయితే, అక్కడ ఉండే చాలామంది సైనికులకు తమిళ భాష రాదు. పైగా అంత పెద్ద మెనూ చూసి తమకు కావాల్సిన వంటకం ఎంచుకునే అంత సమయం కూడా ఉండేది కాదు. ఈ నేపథ్యంలో ఓ సైనికుడు మెనూలో ఉన్న 65వ నెంబర్ చికెన్ ఐటం బావుండటం గమనించాడు. అతడు ఎప్పుడు వచ్చినా.. చికెన్-65 అని చెప్పేవాడు. అది ఆ నోటా ఈ నోటా పాకి.. చివరకు అదే పేరు స్థిరపడిపోయింది. అప్పటి నుంచి ఇది రాష్ట్రాలు, దేశం కూడా దాటేసింది. అయితే, ఈ పేరు రావడానికి వేరే కారణాలు కూడా ఉన్నాయనే ప్రచారం ఉంది. ఈ వంటకం చేయడానికి 65 రకాల దినుసులు కావాలని.. 1965లో ప్రారంభమైంది కాబట్టి 65 అని పెట్టారని.. చికెన్‌ను 65 ముక్కలుగా చేసి వండుతారని.. దీనిని వండే ముందు 65 రోజులపాటు మారినేట్ చేస్తారని.. ఇలా ఏవేవో కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కానీ అసలు సంగతి మాత్రం ఈ మెనూ ముచ్చటే. అన్నట్టు.. 2024–25కి సంబంధించి టేస్ట్ అట్లాస్‌లో చికెన్-65కి 97వ స్థానం లభించింది. ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా వంద అత్యుత్తమ వంటకాలను ఈ సంస్థ ఎంపిక చేస్తుంది. 11,258 వంటకాలకు సంబంధించి 3,67,847 రేటింగ్‌ల ఆధారంగా ప్రస్తుత జాబితాను నిర్ధారించింది.

– సాక్షి సెంట్రల్ డెస్క్



డౌట్ అక్కర్లేదు.. ఇవి సింహాలే.. ఎండాకాలం ఎఫెక్ట్ మరి.. దక్షిణాఫ్రికాలోని యికుటులా రిజర్వ్ పార్క్‌లో జెడ్ నెల్సన్ అనే ఫొటోగ్రాఫర్ ఈ చిత్రాన్ని తీశారు. 2025 సోనీ వరల్డ్ ఫొటోగ్రఫీ పురస్కారాల్లో ఈ చిత్రం వైల్డ్ లైఫ్ అండ్ నేచర్ విభాగంలో మొదటి బహుమతిని గెలుచుకుంది. ఈ లయన్ రిజర్వులో శిక్షణ పొందిన గైడ్ల సాయంతో మనం సింహాలకు చాలా దగ్గరగా వెళ్లొచ్చు. వాటి జీవనశైలిని గమనించవచ్చు

కూలి పనికి కుమురంభీం మనవడు



కెరమెరి (ఆసిఫాబాద్): గిరిజన వీరుడు కుమురం భీం మనవడు కుమురం సోనేరావు.. చేతిలో చిల్లి గవ్వలేక ఉపాధి పనులకు వెళ్తున్నాడు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండలం దోబే గ్రామానికి చెందిన కుమురం సోనేరావు, గౌరుబాయి దంపతులు.. పదిహేను రోజులుగా ఉపాధి హామీ పథకం కూలి పనికి వెళ్తున్నారు. ప్రభుత్వం గతంలో ఐదెకరాల సాగుభూమి ఇచ్చినప్పటికీ.. తలదాచుకునేందుకు ఇల్లు లేదని వాపోయాడు. పలుమార్లు ఇంటి కోసం ఎమ్మెల్యే, కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించినా.. ప్రయోజనం లేకుండా పోయిందన్నాడు. గతంలో గుస్సాడీ రాజుకు ఇచ్చిన గౌరవం మాదిరిగానే.. తనను గుర్తించి ఆదుకోవాలని, నెలనెల 'ఆసరా' పింఛను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

పని కాకుండానే బిల్లుకు సిఫారసు

- ఉద్యోగిని పట్టించిన ఏఐ సాంకేతికత
- భద్రాద్రి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వెలుగులోకి
- బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేసిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: చిన్న తప్పేకదా ఎవరూ గుర్తించలేరులే అని ఆ ఉద్యోగి ధీమాగా ఉన్నాడు.. అనుకున్నట్టుగానే మూడునాలుగు అంచెల చెకింగ్స్ వరకు తప్పు ఒప్పుగానే ముందుకు సాగింది. కానీ, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత అతడి ఆట కట్టించింది. ఎక్కడో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పొరపాట్లు దొర్లితే, హైదరాబాద్‌లోని గృహనిర్మాణ శాఖ కేంద్ర కార్యాలయంలోని సాంకేతికత పట్టించింది. దీంతో ఆ బిల్ కలెక్టర్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.



ఇంటి నిర్మాణం పూర్తి కాకుండానే..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన 71 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. పునాదుల వరకు పూర్తయిన ఇళ్లకు మొదటి విడత ఆర్థిక సాయంగా రూ.1 లక్షను లబ్ధిదారులకు అందిస్తోంది. ఇళ్ల నిర్మాణం ప్రారంభమయ్యే ముందు గ్రామ కార్యదర్శులు/బిల్ కలెక్ట ర్లు ఆ ఇంటి వద్దకు వెళ్లి నిర్మాణ ప్రాంతాన్ని ఫొటో తీసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా అప్‌లోడ్ చేయాలి. అలాగే అన్ని ఇళ్ల ఫొటోలు అప్‌లోడ్ అయ్యాయి. పునాదుల నిర్మాణం పూర్తయ్యాక అవే అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా ఫొటోలు ఫిక్స్ చేయాల్సి ఉంటుంది. కానీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు గ్రామాల్లో బేస్‌మెంట్ పూర్తి కాకుండానే పూర్తయినట్టుగా సిబ్బంది వివరాలు అప్‌లోడ్ చేశారు. వివిధ స్థాయిల్లో అధికారులు వాటిని చూసే బిల్లుల తయారీకి ఉన్నతాధికారులకు పంపారు. కానీ, హైదరాబాద్‌లోని గృహనిర్మాణ శాఖ ప్రధాన కార్యాలయంలో తుది పరిశీలన సమయంలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌లో వాటిని తనిఖీ చేయగా తప్పులు వెలుగు చూశాయి. ఈ సాఫ్ట్‌వేర్‌లో ఇళ్ల బేస్‌మెంట్, ఇతర వివరాలను ఫిక్స్ చేసి ఉంచారు. స్థానిక నిర్మాణాల వివరాలు వీటితో సరిపోలాల్సి ఉంటుంది. ఈ తనిఖీ సిస్టంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గ్రామపంచాయతీ నుంచి అప్‌లోడ్ అయిన 18 ఇళ్ల వివరాలు మ్యాచ్ కాలేదు. దీంతో ఆయా ఇళ్లు బేస్‌మెంట్ నిర్మాణం జరగకుండానే పూర్తయినట్టుగా అప్‌లోడ్ చేసినట్టు తేలిపోయింది. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలపటంతో వాటిని అప్‌లోడ్ చేసిన జగదీశ్ అనే బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు. ఆ ఇళ్లకు అందించాల్సిన ఆర్థిక సాయం నిలిపివేశారు. మరో మూడు గ్రామాల్లో కూడా ఇలా తప్పులు చోటుచేసుకున్నట్టు తెలిసింది.

తప్పులు జరిగితే ఉపేక్షించం



ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అక్రమాలు, తప్పులు జరిగితే చూస్తూ ఊరుకోం. అన్ని పనులు సవ్యంగా జరగాలి. అప్పుడే బిల్లులు విడుదల అవుతాయి. ఈ విషయాన్ని ముందు నుంచీ చెప్తున్నాం. తాజాగా భద్రాచలం గ్రామ పంచాయతీలో 18 ఇళ్లకు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి కాకుండానే పూర్తయినట్టుగా స్థానిక బిల్ కలెక్టర్ తప్పుగా అప్‌లోడ్ చేసినట్టు గుర్తించి చర్యలు తీసుకున్నాం. ఇకపై ఏ స్థాయి అధికారి అయినా తప్పులు చేస్తే ఇలాగే చర్యలు ఉంటాయి.

– పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి

గోదావరిలో రోడ్డేసి..

- నది నుంచి అక్రమంగా ఇసుక తరలింపు
- సొసైటీల మాటున లక్షల క్యూబిక్ మీటర్ల కొద్దీ రవాణా



పద్మగూడెం వద్ద గోదావరిలో ఇసుక రవాణా కోసం వేసిన రోడ్డు

మణుగూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధి అనంతారం, పద్మగూడెంలోని ఇసుక సొసైటీ ర్యాంప్‌ల నిర్వాహకులు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఏకంగా గోదావరిలోకి వారధి మాదిరి రోడ్డు నిర్మించి యంత్రాల సాయంతో ఇసుకను తవ్వి బయటకు తరలిస్తున్నారు. సహజ ప్రవాహాలకు అడ్డుకట్ట వేయడం, యంత్రాలతో ఇసుకను తవ్వడం అక్రమమని తెలిసినా, పట్టించుకునే వారు లేకపోవడంతో లక్షల క్యూబిక్ మీటర్ల మేర ఇసుకను రవాణా చేస్తున్నారని సమాచారం. అనంతారం, పద్మగూడెం ర్యాంప్‌ల వద్ద ఇసుక తరలింపునకు రెండు సొసైటీలకు అనుమతి ఉండగా, పొక్లెయినర్లతో టిప్పర్ల కొద్దీ ఇసుకను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం సొసైటీ సభ్యులు మాత్రమే లోపలికి వెళ్లి, ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో బయటకు తీసుకురావాలి. కానీ పొక్లెయినర్లు వాడి, టిప్పర్లతో ఇసుక తరలింపు బహిరంగంగానే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం టీఎస్ఎండీసీ ఉన్నతాధికారులు పద్మగూడెం ర్యాంప్‌ను పరిశీలించారని తెలిసింది. ఆ సమయంలో టిప్పర్ల ద్వారా ఇసుకను తీసుకొస్తున్నా చూసీచూడనట్లు వెళ్లిపోయారని సమాచారం. టీఎస్ఎండీసీ పీఓ శంకర్ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఇదేవిషయమై మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డిని సంప్రదించగా ఇసుక ర్యాంప్‌ల పర్యవేక్షణ టీఎస్ఎండీసీదేనని తెలిపారు.



టన్నెల్ ఔట్‌లెట్ వద్దకు చేరుకున్న బేరింగ్ (ప్యాకింగ్‌లో ఉంది)

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు చేరిన బేరింగ్

- టీబీఎంకు అమర్చనున్న ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నాగర్‌కర్నూల్ జిల్లా మన్నెవారిపల్లిలోని శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ఔట్‌లెట్ వద్దకు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) బేరింగ్ చేరుకుంది. శుక్రవారం ఉదయం ఔట్‌లెట్ వద్దకు భారీ వాహనంలో తీసుకువచ్చిన బేరింగ్‌ను అన్‌ప్యాక్ చేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలోనే టన్నెల్‌లో టీబీఎం ఉన్న ప్రదేశం వరకు లోకో ద్వారా బేరింగ్‌ను తీసుకెళ్లనున్నారు. దానిని టీబీఎంకు అమర్చేందుకు నెల నుంచి 45 రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆ తరువాత ఔట్‌లెట్‌లో టన్నెల్ తవ్వకం పనులను ప్రారంభిస్తామని చెప్పారు.ఔట్‌లెట్ నుంచి 20.435 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్విన తర్వాత బేరింగ్ పాడైపోవడంతో రెండున్నరేళ్లుగా తవ్వకాలను నిలిపివేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1, ఉచితం TV స్టాండ్, సెంటర్ టేబుల్, కార్నర్ స్టాండ్ విలువ రూ. 60,000/-
MRP ₹3,76,499
Sale ₹ 1,29,999
PER DAY EMI ₹140
సఫారీ సోఫా సెట్ : 3+2+ దివాన్ (8 సీటర్)
MRP ₹62,999
Sale ₹ 23,999
PER DAY EMI ₹26
ప్రీమియం క్వాలిటీ క్వీన్ సైజ్ బెడ్
MRP ₹43,499
Sale ₹ 16,999
PER DAY EMI ₹18
ఉచితం
పిల్లో టాప్‌తో 8" స్ప్రింగ్ మ్యాట్రెస్
+ డ్రెస్సింగ్ టేబుల్
+ బెడ్‌సైడ్ టేబుల్
విలువ రూ. 15,000
మీ పాత మ్యాట్రెస్‌ను కొత్త మ్యాట్రెస్‌తో మార్చుకోండి
ఎక్స్ఛేంజ్ విలువ రూ. 12000 వరకు
+ 2 పిల్లోలు విలువ రూ. 999 వరకు
+ MRP పై 10% డిస్కౌంట్ పొందండి
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ : 1 + 6 + ఉచితం మల్టీ కలర్ డిన్నర్ క్యాబినెట్ విలువ రూ. 15000
MRP ₹63,999
Sale ₹ 29,999
PER DAY EMI ₹32
ప్రీమియం క్వాలిటీ వార్డ్‌రోబ్
PER DAY EMI ₹12
చెక్కతో : 2 డోర్ MRP ₹ 27,449 ₹ 12,999
చెక్కతో : 3 డోర్ MRP ₹ 34,449 ₹ 15,999
చెక్కతో : 3 డోర్ MRP ₹ 34,449 ₹ 15,999
మీ పాత పిల్లోను కొత్త పిల్లోతో మార్చుకోండి
ఎక్స్ఛేంజ్ విలువ రూ. 2500 వరకు
+ MRP పై 10% డిస్కౌంట్ పొందండి
ల్యాప్‌టాప్ టేబుల్
MRP ₹ 2,149
₹ 799
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
ఏదైనా సోఫా కొనండి, సెంటర్ టేబుల్ ఉచితంగా పొందండి
ఏదైనా కాట్ కొనండి, మ్యాట్రెస్, బెడ్‌సైడ్ టేబుల్ ఉచితంగా పొందండి
✆ 79950 00930, 040-27841562 79933 33351
రూ. 50,000 విలువ గల ఫర్నీచర్ కొనండి, రూ. 15,000 విలువ గల సింగిల్ కాట్ ఉచితంగా పొందండి
ఎ.ఎస్. రావ్ నగర్ ◆ అత్తాపూర్ ◆ బోడుప్పల్ ◆ దిల్‌సుఖ్‌నగర్ ◆ హైటెక్ సిటీ ◆ కర్మన్‌ఘాట్
కొంపల్లి ◆ కూకట్‌పల్లి ◆ నాగోల్ ◆ సికింద్రాబాద్ ◆ వరంగల్ ◆ విజయవాడ ◆ www.bantia.in


కరీంనగర్‌లో త్వరలో ప్రారంభం!
ప్రత్యేక డిస్కౌంట్లు, భారీ ప్రారంభ వేడుకలకు
VIP ఇన్విటేషన్ కొరకు www.bantia.inలో ఇప్పుడే రిజిస్టర్ చేసుకోండి
3 రోజులు SALE
త్వరపడండి
చివరి రోజు
రేపే
వరకు 75% OFF
డౌన్‌పేమెంట్ ₹1
36 నెలలు EMI*
మీ పాత ఫర్నిచర్‌పై
25%* వరకు
తగ్గింపు పొందండి
లెదర్ మోటరైజ్డ్ రిక్లైనర్ 3+1+1
MRP ₹3,76,499 Sale ₹1,79,999 PER DAY EMI ₹194
వరోనా రిక్లైనర్ సోఫా 3+1+1 ఉచితం బుక్ కేస్ విలువ రూ.15,000
MRP ₹1,14,999 Sale ₹49,999 PER DAY EMI ₹54
బెడ్‌రూమ్ సెట్: బాటమ్ స్టోరేజ్‌తో బెడ్ + బెడ్ సైడ్ టేబుల్
+ 3 డోర్ వార్డ్‌రోబ్ + స్టూల్‌తో డ్రెస్సింగ్ టేబుల్
MRP ₹43,499 Sale ₹19,999 PER DAY EMI ₹22
ఈ ప్రొడక్ట్ కొనండి మరియు
మ్యాట్రెస్‌పై 50% తగ్గింపు
పొందండి
ATTRACTIVE WOOD GRAIN & DESIGN OPTIONS
EUROPEAN STANDARD 15MM ENGINEERED WOOD
TERMITE RESISTANT
స్టోరేజ్‌తో బెడ్
క్వీన్ సైజ్
MRP ₹32,999 Sale ₹14,999 PER DAY EMI ₹16
కింగ్ సైజ్ ₹16,999
మార్బుల్ డైనింగ్
టేబుల్
1+2 ₹5,999
1+4 ₹15,999 ఉచితం డిన్నర్ క్యాబినెట్ విలువ రూ.10,000
1+6 ₹22,999 ఉచితం క్రాకరీ క్యాబినెట్ విలువ రూ.15,000
PER DAY EMI ₹6
ప్రీమియం
క్వాలిటీ
షూ ర్యాక్
MRP ₹9,499
Sale ₹3,999
An ISO-9001:2015 Certified Company
BANTIA
Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
ఏదైనా సోఫా కొనండి, సెంటర్ టేబుల్ ఉచితంగా పొందండి
ఏదైనా కాట్ కొనండి, మ్యాట్రెస్, బెడ్‌సైడ్ టేబుల్ ఉచితంగా పొందండి
79950 00930, 040-27841562 79933 33351
రూ. 50,000 విలువ గల ఫర్నిచర్ కొనండి, రూ. 15,000 విలువ గల సింగిల్ కాట్ ఉచితంగా పొందండి
www.bantia.in

పదిలంగా అల్లుకున్న గూళ్లు





పిచ్చుకల సందడి

వేకువనే పక్షుల కిలకిలారావాలు.. చెట్టు కొమ్మలపై ఎగురుతూ చేసే విన్యాసాలు.. ఇంజనీరింగ్ పద్ధతుల్లో గూళ్ల నిర్మాణాలు.. అందులో గుడ్లు పెట్టి.. పొదిగే ప్రక్రియ.. ఆద్యంతం అద్భుతమే.. ఆహ్లాదమే.. పెద్దపల్లి జిల్లా ధర్మారం శివారులోని ఒక తుమ్మచెట్టుపై పిచ్చుకల సమూహం నిర్మించుకున్న గూళ్ల నిర్మాణాలు కనువిందు చేస్తున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఈఏపీ సెట్ పరీక్ష జోన్లు- పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య

జోన్	అగ్రి, ఫార్మా పరీక్ష కేంద్రాలు	ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రాలు	ఇంజనీరింగ్ రాసే విద్యార్థులు	అగ్రి, ఫార్మా రాసే విద్యార్థులు	రెండూ రాసే విద్యార్థులు
హైదరాబాద్-1	19	21	48,638	20,282	82
హైదరాబాద్-2	13	25	42,967	8,731	59
హైదరాబాద్-3	18	24	50,149	16,925	43
హైదరాబాద్-4	11	12	24,440	12,577	40
నల్గొండ	1	1	1,108	553	2
కోదాడ	5	5	3,838	1,828	2
ఖమ్మం	7	6	8,037	3,837	3
భద్రాద్రి కొత్తగూడెం	1	2	778	388	2
సత్తుపల్లి	2	2	1,977	987	3
కరీంనగర్	15	15	15,116	8,276	4
మహబూబ్‌నగర్	2	2	1,800	1,107	0
సంగారెడ్డి	3	3	4,074	2,034	6
ఆదిలాబాద్	1	1	905	543	0
నిజామాబాద్	4	4	1,650	1,110	0
వరంగల్	8	9	11,785	5,845	5
నర్సంపేట	2	2	2,158	1,078	2

2018 నుంచి 2025 వరకు ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఇలా..

సంవత్సరం	ఇంజనీరింగ్	అగ్రి, ఫార్మా
2018	1,47,912	73,078
2019	1,42,210	74,989
2020	1,43,265	78,981
2021	1,64,963	86,641
2022	1,72,238	94,476
2023	2,05,351	1,15,332
2024	2,54,543	1,00,260
2025	2,19,420	86,101 (లేట్ ఫీజుతో దరఖాస్తు గడువు ఇంకా ఉంది)



యువ రైతుల పాలిట వరం ఆర్య

- ఐదేళ్లుగా 600 మంది యువ రైతులకు శిక్షణ
- వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఇతర వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి
- సిరులు కురిపిస్తున్న ఆర్య ప్రాజెక్ట్

మహబూబాబాద్ రూరల్: వ్యవసాయం, అనుబంధ రంగాలు, చిరు వ్యాపారాలు, ఇతర ఉపాధి రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఏర్పాటు చేసిన ఆర్య ప్రాజెక్టు యువతకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో ఆర్య ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నారు. గ్రామీణ యువతను వ్యాపార రంగం వైపు మళ్లించేందుకు ఉద్దేశించిన అట్రాక్టింగ్ రిటైనింగ్ యూత్ ఇన్ అగ్రికల్చర్ (ఆర్య) కార్యక్రమం ద్వారా జరుగుతున్న శిక్షణతో యువత, ఆసక్తి ఉన్నవారు ఆర్థికంగా ఉపాధి పొందగలుగుతున్నారు. 2019–20లో ప్రారంభమైన ఆర్య ప్రాజెక్ట్ ద్వారా మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో ఇప్పటివరకు సుమారు 650 మంది యువతకు వివిధ అంశాలపై పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. ఆర్య ప్రాజెక్టులో భాగంగా 30 మంది యువతను గుర్తించి వారిని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు వివిధ అంశాల్లో చిరుధాన్యాలతో ఉప ఉత్పత్తుల తయారీపై నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



నర్సరీలను సందర్శించి సూచనలు చేస్తున్న మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు

ఏయే అంశాల్లో శిక్షణ ఇస్తారంటే..

- వ్యాపార సరళిలో షేడ్ నెట్ల కింద నారు మొక్కల పెంపకం
  (ఇప్పటివరకు 4 శిక్షణ శిబిరాల ద్వారా 120 మందికి శిక్షణ ఇచ్చారు)
- వాన పాములు (వర్మీ కంపోస్ట్) తయారీ
  (నాలుగు శిక్షణ శిబిరాల ద్వారా 105 మందికి శిక్షణ)
- చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ
  (ఐదు శిక్షణ శిబిరాల ద్వారా 150 మందికి శిక్షణ)
- పెరటి కోళ్ల పెంపకం
  (ఐదు శిక్షణ శిబిరాల ద్వారా 145 మందికి శిక్షణ)
- తేనెటీగల పెంపకం
  (మూడు శిక్షణ శిబిరాల ద్వారా 90 మందికి శిక్షణ)
- బేకరీ ఉత్పత్తుల తయారీ
  (ఒక శిబిరం ద్వారా 90 మందికి శిక్షణ)

ఆర్య ప్రాజెక్ట్ ద్వారా అందిస్తున్న శిక్షణ

18 నుంచి 35 ఏళ్లలోపున్న వారికి ఆర్య ప్రాజెక్టు శిక్షణ ఇస్తుంది. శిక్షణలో భాగంగా ప్రత్యేకంగా 30 మందిని హైదరాబాద్‌కు లేదా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. గతంలో ఆర్య శిక్షణ ద్వారా ప్రగతి సాధించిన వారితో వివరాలను చెప్పిస్తున్నారు. తద్వారా వారిని శిక్షణార్థులు ఆదర్శంగా తీసుకుని.. వ్యవసాయం, అనుబంధ రంగాలు, చిరు వ్యాపారాలు, ఇతర ఉపాధి రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వీలు కలుగుతుంది.

నర్సరీతో లాభాల కాపు
వ్యాపారాత్మకంగా షేడ్ నెట్లో నర్సరీ..

మహబూబాబాద్ జిల్లాలో మిరప, టమాట, వంగ, చామంతి పంటకు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన నారు దొరకడం రైతులకు ప్రధాన సమస్యగా మారింది. గతంలో రైతులు ఎవరికి కావలసిన నారును వారు.. ఎత్తైన మడి చేయకుండా పెంచుకునేవారు. దీనివల్ల వేరుకుళ్లు, ఎండుతెగులు బాగా ఆశించేవి. ఎవరికి వారు షేడ్ నెట్ల కింద నారు పెంచుకోవడం వల్ల ఖర్చు కూడా పెరుగుతుంది. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో పొందిన శిక్షణ ద్వారా గిరిజన యువకులు ప్రేరణ పొందారు. తొర్రూరు మండలం అమ్మాపురానికి చెందిన యువకుడు గుగులోత్ రమేశ్ ఆధ్వర్యంలో ఒక బృందంగా ఏర్పడ్డారు. రమేశ్ నర్సరీ పేరుతో నర్సరీని స్థాపించారు. ఈ బృందం 256 చదరపు మీటర్ల స్థలంలో తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామ శివారు జీకే తండా వద్ద నర్సరీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ నర్సరీ ఏర్పాటుకు కావాల్సినవి, ఆర్థిక సహాయాన్ని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం వారు అందించారు. వాణిజ్య సరళిలో రైతులకు నాణ్యమైన నారును తక్కువ ఖర్చుతో అందించాలనే సంకల్పంతో.. రమేశ్ గ్రూపు నర్సరీ అత్యంత నాణ్యమైన కూరగాయ, పూల నారును ఏడాదంతా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో షేడ్ నెట్లో ఉత్పత్తి చేస్తోంది. జూన్‌లో మిరపనారును పోసుకుని.. జూలై మధ్యలో నుంచి అమ్ముకుంటున్నారు. గత ఏడాది కాలంగా 1.80 లక్షల నుంచి 2 లక్షల వరకు మొక్కలను ఇతర రైతులకు అమ్ముకున్నారు. పూల పెంపకంలో గల సువర్ణావకాశాలను గుర్తించి.. చామంతి అంటు మొక్కలను షేడ్ నెట్ నర్సరీలో పెంచి.. చుట్టు పక్కల పాలీహౌస్ రైతులకు అమ్ముతున్నారు. కొంతమంది రైతులు పూర్తిగా పాలీహౌస్‌లో సీజన్‌తో సంబంధం లేకుండా.. ఏడాదంతా పూల సాగును చేపడుతున్నారు. ఇంతకు ముందు మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులు మహారాష్ట్ర నుంచి ఒక చామంతి నారు మొక్కను రూ.3 చొప్పున కొనుగోలు చేసి పంటను పండించేవారు.

ప్రస్తుతం రమేశ్ నర్సరీ నాణ్యమైన మిరప, టమాట, వంగ నారుతో పాటు చామంతి నారు మొక్కను రూపాయికి ఇతర రైతులకు అమ్మి విజయవంతమయ్యారు. ఏడాదిలో మిరపతో పాటు చామంతి నారును అమ్మి, ఖర్చులు పోగా రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల నికరాదాయాన్ని సంపాదిస్తున్నారు. ఔత్సాహిక యువతకు రమేశ్ నర్సరీ బృందం ఆదర్శంగా నిలుస్తోంది.



హోం ఫుడ్స్ తయారీని వివరిస్తున్న నిర్వాహకులు



అన్నపూర్ణ హోం ఫుడ్స్ ఏర్పాటు చేసిన ఆర్య శిక్షణార్థులు

మిరప నారు పెంపకంపై శిక్షణ



జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా పేరెన్నికగన్న మిరప విషయంలో రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో.. 'ఆర్య ప్రాజెక్టు'లో భాగంగా మిరప నారు పెంపకంపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన వారు నర్సరీలను ఏర్పాటు చేసుకుని.. నారు పెంచుకుని విక్రయించుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించగలుగుతున్నారు. 300 చదరపు గజాల స్థలంలో మిరప నారు పెంపకానికి నర్సరీలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

- బీరం స్వరూప, నిర్వాహకురాలు అన్నపూర్ణ హెూం ఫుడ్స్

చిరుధాన్యాలతో సిరులు



మహిళలు వ్యవసాయం చేసుకుంటూ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో స్వయం ఉపాధి పొందడం కోసం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో ఆర్య ప్రాజెక్ట్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ప్రోత్సాహం అందించారు. వారిని చిరుధాన్యాలతో బిస్కెట్లు, మురుకులు, చకోడి, కేక్స్ తయారీపై ప్రోత్సహించారు. ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు గ్రామానికి చెందిన బీరం స్వరూప సహా నలుగురు మహిళలు.. ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. చిరుధాన్యాలతో వివిధ ఉప ఉత్పత్తులను తయారు చేసి స్వయం ఉపాధి పొందాలని నిర్ణయించుకున్నారు. చిరుధాన్యాలతో కూడిన పోషక విలువలున్న పదార్థాలు తమ గ్రామంలో లభించకపోవడాన్ని గుర్తించిన ఈ నలుగురు మహిళలు ఒక గ్రూపుగా 'అన్నపూర్ణ హోం ఫుడ్స్' ఏర్పాటు చేశారు. తాము నివసించే ప్రాంతంలో ఒక గదిని అద్దెకు తీసుకుని.. చిరుధాన్యాలతో వివిధ ఉప ఉత్పత్తులు తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇలా ప్రారంభించిన 'అన్నపూర్ణ హెూం ఫుడ్స్' అనతి కాలంలోనే మండల, జిల్లావ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. వీరు చిరుధాన్యాలతో రాగి లడ్డు, రాగి మురుకులు, జొన్న లడ్డు, జొన్న మురుకులు, సజ్జ చకోడి, నువ్వులు, పల్లీలతో లడ్డు చేస్తున్నారు. ఈ గ్రూపు ప్రతి నెల రూ.65 వేల నుంచి రూ.70 వేల ఆదాయాన్ని పొందుతోంది. రోజుకు కేవలం 4 గంటల శ్రమతోనే.. వీరు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు తమకున్న ఆర్డర్లు పూర్తి చేసుకుని.. తరువాత సొంత వ్యవసాయ పనులు చూసుకుంటూ వివిధ రకాల పంటలు పండిస్తున్నారు.

- గుగులోత్ రమేశ్ జీకే తండా, అమ్మాపురం, తొర్రూరు మండలం

షేడ్ నెట్లలో నర్సరీ పెంపకం



నైపుణ్య శిక్షణ కార్యక్రమాలైన షేడ్ నెట్లలో నర్సరీ పెంపకంపై యువ రైతులు శిక్షణ తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మిరప పంట ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. రైతు స్థాయిలో నేల మీద నారు పెంపకం చేయడం వల్ల వేరు కుళ్లు ద్వారా అధిక మొత్తంలో నారు చనిపోయి రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. షేడ్ నెట్లలో నర్సరీ పెంపకంపై శిక్షణ ద్వారా నారు పెంపకంలో మెలకువలు నేర్చుకుని జిల్లాలోని తోటి రైతులకు నాణ్యమైన మిరప నారును అందిస్తున్నారు.

- బి.క్రాంతికుమార్, ఇన్‌చార్జి, ఆర్య ప్రాజెక్ట్, పంట ఉత్పాదక శాస్త్రవేత్త, మల్యాల కేవీకే

ఉపాధి.. ఆర్థికాభివృద్ధి



ఆర్య ప్రాజెక్టులో భాగంగా బేకరీ పదార్థాల తయారీ, పెరటి కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ తీసుకున్నవారు వివిధ చిరు ధాన్యాలైన రాగి లడ్డు, జొన్న లడ్డు, జొన్న మురుకులు, జొన్న పాయసం వంటివి తయారీ చేస్తూ స్వయం ఉపాధిని పొందుతున్నారు. తద్వారా వారు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు కృషి చేయగలుగుతున్నారు. - డాక్టర్ ఎస్.కిశోర్ కుమార్, విస్తరణ శాస్త్రవేత్త, మల్యాల కేవీకే

గ్రామీణ యువతకు ఉపాధి



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో ఆర్య ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నాం. ఆర్య ప్రాజెక్ట్ 2019–20 సంవత్సరంలో ప్రారంభం కాగా మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా.. మహబూబాబాద్ జిల్లాలోని దాదాపు 650 మందికి పైగా గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ఈ ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో గ్రామీణ యువత ఉపాధి అవకాశాలు పొందుతూ స్వయం ఉపాధిని పొందుతున్నారు.

- డాక్టర్ ఎస్.మాలతి, సమన్వయకర్త, మల్యాల కేవీకే



శుక్రవారం టోక్యోలో జరిగిన 'ఇండియా-జపాన్ ఎకనమిక్ పార్టనర్‌షిప్ రోడ్ షో'కు హాజరైన పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. (పక్కన) జెట్రో బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటాని, జపాన్‌లో భారత రాయబారి సిబి జార్జ్, తెలంగాణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌లతో సీఎం రేవంత్



కూటి కోసం కోటి తిప్పలు..




కోటిపై నాగలితో పలు ప్రదర్శనలు చేస్తున్న యువకుడు



తాడుపై కర్రతో పలు ప్రదర్శనలు చేస్తున్న యువకుడు

నిర్మల్ జిల్లా ఖానాపూర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో.. ఎక్బాల్‌పూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాల వారు ప్రదర్శించిన గారడీ ఆకట్టుకుంది. ఎక్బాల్‌పూర్‌లో నక్కలోళ్ల (బొందిలోళ్ల) కుటుంబాలు కొన్నేళ్లుగా నివసిస్తున్నాయి. కొన్ని రోజులుగా ఖానాపూర్ పట్టణంలోని పలు కాలనీల్లో రాత్రి వేళ గారడీ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. కాగడాలు ప్రదర్శించడం, రైతు నాగలిని నోటితో ఆపుతూ చేసిన ప్రదర్శనలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి.

- ఖానాపూర్



వకుళామాతకు అరుణ కిరీటం

శ్రీ వేంకటేశ్వరస్వామి మాతృమూర్తి శ్రీవకుళమాత ఆలయం శుక్రవారం అరుణ కాంతుల మధ్య ధగధగా మెరిసిపోయింది. తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరులో ఉన్న వకుళామాత ఆలయం వద్ద ఈ మనోహర దృశ్యాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

గుడ్ ఫ్రైడే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయవాడలోని గుణదల మేరిమాత చర్చివద్ద కొండపైకి శిలువమార్గంలో వెళ్తున్న విశ్వాసులు
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయండి

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలంటూ విజయవాడ కుమ్మరిపాలెం వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రొయ్యకు లోకల్ మార్కెట్



స్థానిక వినియోగం పెంచే ప్రయత్నాలు

- ఏడాదిన్నర క్రితమే రొయ్యల డోర్ డెలివరీకి కార్యాచరణ
- పైలెట్ ప్రాజెక్టుగా భీమవరం ఎంపిక
- ఎన్నికలు రావడంతో నిలిచిన ప్రక్రియ
- తర్వాత పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సాక్షి, భీమవరం: రొయ్య ధరల స్థిరీకరణకు స్థానిక వినియోగం పెంచడం మంచి పరిష్కారమని చెబుతున్నారు. ఆ దిశగా ప్రముఖులతో ప్రమోషన్ చేయించాలని, చికెన్ షాపుల్లోనూ రొయ్యల అమ్మకాలు చేయాలని ప్రాన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ నిర్ణయించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సిద్ధంచేసిన లోకల్ మార్కెట్ కాన్సెప్ట్‌ను ఇప్పుడు కూటమి కమిటీ తెరపైకి తెస్తోంది. ఏడాదికి ఒక్కొక్కరు 10–12 కిలోల సగటు వినియోగంతో రొయ్యలు ఎక్కువగా తినే దేశాల్లో చైనా టాప్‌లో ఉంటే, 8–10 కిలోలతో అమెరికా రెండో స్థానంలో ఉంది. యూరోపియన్ దేశాల్లోనూ సగటున ఒక్కొక్కరు ఎనిమిది కిలోల వరకు తీసుకుంటారు. ప్రపంచ దేశాలకు రొయ్యలు ఎగుమతి చేసే మనదేశంలో మాత్రం సగటు వినియోగం 800 గ్రాములు మాత్రమే. ఆక్వా ఉత్పత్తులు, ఎగుమతుల్లో దేశంలోనే మొదటిస్థానంలో ఉన్న ఏపీలో వినియోగం 1.5 కిలోలు ఉన్నట్లు ఫిషరీస్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంటే అత్యధికంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే 2.63 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఏటా సుమారు మూడు



రొయ్యలు పట్టుబడి చేస్తున్న రైతులు (ఫైల్)

లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తితో జిల్లా మొదటి స్థానంలో ఉంది. టీడీపీ హయాంలో నకిలీ సీడు, ఫీడు, దళారుల దోపిడీతో కుదేలైన ఆక్వా రంగానికి గత ప్రభుత్వం కొత్త ఊపిరిలూదింది. ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారటీ (అప్సడా) ఏర్పాటు చేసి రొయ్య ధరలను లాభసాటి చేయడంతో పాటు, మేత ధరలను తగ్గించి, ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం పెంచకుండా నియంత్రించింది. నాన్ ఆక్వా జోన్ పరిధిలోని వేలాది ఎకరాలను ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి విద్యుత్ రాయితీ అందజేసింది. రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందేలా చర్యలు తీసుకుంది. ఫిష్ ఆంధ్రా ద్వారా డొమెస్టిక్ వినియోగం పెంచేందుకు మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి 60 శాతం, మిగిలిన వారికి 40 శాతం రాయితీపై జిల్లా వ్యాప్తంగా రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు విలువైన 250కు పైగా అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు. ఫోర్ వీలర్స్, టూ వీలర్స్ సబ్సిడీపై అందించారు.

రొయ్యల డోర్ డెలివరీకి కార్యాచరణ

క్వాలిటీ రొయ్యలను స్థానికంగా సామాన్య వినియోగదారుల చెంతకు చేర్చేలా రొయ్యల డోర్ డెలివరీకి ఏడాదిన్నర క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్యాచరణ చేసింది. ప్రభుత్వ సహకారంతో ఈ ప్రక్రియ అమలుకు ఏపీ రొయ్య రైతుల ఫెడరేషన్ అప్పట్లో ముందుకు వచ్చింది. ఎక్స్‌పోర్టు తరహాలో ప్రాసెస్ చేసిన రొయ్య పప్పు కిలోకు కౌంట్‌ను బట్టి రూ.600 నుంచి రూ.850 వరకు ధర నిర్ణయించారు. తొలుత జిల్లాలోని భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేసి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ నగరాలు, పట్టణాలకు విస్తరింప చేయా లని భావించారు. 2023 ఏడాది చివర్లో మత్స్యశాఖ జిల్లా అధికార వర్గాలు అందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈలోగా ఎన్నికలు హడావుడి మొదలు కావడంతో ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు.



మరుగున పడేసిన కూటమి

కూటమి ప్రభుత్వం రొయ్యల స్థానిక వినియోగం పెంచే కార్యాచరణను మరుగున పెట్టేసింది. అమెరికా ప్రతీకార సుంకాలు అమలులోకి రాక పోయినా వాటిని సాకుగా చూపించి రెండు వారాలుగా ఎగుమతిదారులు రొయ్య ధరలను కౌంట్‌కు రూ.40 నుంచి రూ.90 వరకు తగ్గించి కొనుగోలు చేస్తుండటం పట్ల రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మేత ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో మంగళవారం విజయవాడలో భేటీ అయిన ప్రాన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ స్థానిక వినియోగం పెంచడం లక్ష్యంగా కార్యాచరణ నిర్ణయించడం గమనార్హం. రొయ్యల ప్రాముఖ్యతను వివరిస్తూ సినీ నటులు, ప్రముఖులతో ప్రమోషన్ చేయించాలని, 100, 250, 500 గ్రాములుగా ప్యాకెట్లు చేసి విక్రయించాలని, చికెన్ షాపుల్లో సైతం వీటిని అందుబాటులో ఉంచాలని ప్రతిపాదించారు. భవిష్యత్తులో ఆ దిశగా ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వం కోవిడ్ సమయంలో సైతం రొయ్య ధరలు తగ్గకుండా రైతులకు అండగా నిలిచి మద్దతు ధర అందించింది. తర్వాతి కాలంలో ధరలు తగ్గించకుండా ఎక్స్‌పోర్టర్స్‌పై నియంత్రణ ఉంచింది. స్థానిక వినియోగం పెంచేందుకు కృషిచేసింది. అదే మాదిరి కూటమి ప్రభుత్వం స్థానిక వినియోగంతో పాటు ఎక్స్‌పోర్టర్స్‌పై ఒత్తిడి తెచ్చి రొయ్య ధరలను రైతులకు లాభసాటి చేసేందుకు కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

ఇన్‌చార్జ్ మంత్రి ఎదుటే ఘర్షణకు దిగిన 'తమ్ముళ్లు'



ఘర్షణకు దిగిన టీడీపీ నాయకులు


అనంతపురం: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ సాక్షిగా అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి చెందిన 'తమ్ముళ్లు' ఘర్షణకు దిగారు. శుక్రవారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో ఇన్‌చార్జ్ మంత్రి భరత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీపై పలువురు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మండల ఇన్‌చార్జ్‌గా ఉంటూ ఇబ్బందులు పడుతూనే పార్టీ కోసం కష్టపడ్డామని, ఇప్పుడు తమకు ఎమ్మెల్యే అన్యాయం చేస్తున్నారని యల్లనూరు మండలానికి చెందిన వాసాపురం బాబు అలియాస్ మనోహర్ నాయుడు ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే వర్గానికి చెందిన బొప్పేపల్లి రవికుమార్ రెడ్డి కల్పించుకోవడంతో వాగ్వాదం మొదలైంది. వాసాపురం బాబు, రవికుమార్ రెడ్డి పరస్పరం దాడి చేసుకునే స్థాయికి వెళ్లారు. ఇన్‌చార్జ్ మంత్రి భరత్ కల్పించుకుని ఇద్దరినీ అతిథిగృహం నుంచి బయటకు పంపించారు. బయటకు వచ్చిన వాసాపురం బాబుపై బొప్పేపల్లి రవికుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి దాడికి యత్నించాడు. దీంతో రవికుమార్ రెడ్డి చొక్కాను వాసాపురం బాబు అనుచరులు చించేశారు. సమీపంలోనే ఎస్పీ కార్యాలయం ఉన్నప్పటికీ అక్కడే రాళ్లు రువ్వుకునే స్థాయికి వెళ్లారు. పోలీసులు వచ్చి గొడవను సద్దుమణిగించారు.

జిల్లా కేంద్రాల్లో పవన్ కళ్యాణ్ పర్యటన

సాక్షి, అమరావతి: తాను జిల్లాల్లో పర్యటించి భూ కబ్జాలు, దందాలపై బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిపై అధికారులతో సమీక్షిస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. కొద్ది రోజులుగా ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి అందిన భూ కబ్జాలు, తప్పుడు రెవెన్యూ రికార్డుల ద్వారా ఆక్రమణల అర్జీలపై శుక్రవారం పవన్‌కళ్యాణ్ తన కార్యాలయ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా 'నేనే స్వయంగా జిల్లా కేంద్రాలకు వెళ్లి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సమక్షంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి బాధలు తెలుసుకొని, భరోసా ఇస్తాను. తొలుత కాకినాడ, విశాఖ వెళ్తాను. ఆయా ప్రాంతాల్లో భూ దందా బాధితులతో మాట్లాడతాను. వారి ఫిర్యాదులపై పరిశీలన చేస్తాను. వారు కూటమి నేతల మూలంగా ఇబ్బందిపడ్డా..ఉపేక్షించబోం' అంటూ అధికారులకు పవన్ కళ్యాణ్ స్పష్టం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది.



శ్రీవారి దర్శనానికి 15 గంటలు



తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 56,279 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,019 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల సమయం పడుతోంది.

మహానందీశ్వర స్వామి దంపతులకు కల్యాణోత్సవం



మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం కల్యాణం కమనీయంగా సాగింది. స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవచనం, మాంగళ్యధారణ, అక్షతల సమర్పణ పూజలు చేశారు. మహానందిలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు



కొత్తపల్లి: సరస్వతీ క్షేత్రంగా విరాజిల్లుతున్న కొలనుభారతి క్షేత్రంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేటప్టారు. పంచమి మూల నక్షత్రం కావడంతో అమ్మవారిని అలంకరించి పంచసూక్తములతో అభిషేకాలు, కుంకుమార్చనలు, మంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శ్రీనివాస శర్మ అమ్మవారి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు బీజాక్షరాలు రాయించి సుమారు 50 మంది దాక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరించారు. అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పోటెత్తారు, సెలవు దినం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్రదర్శనంతో పాటు వీఐపీ దర్శన క్యూలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శన ఏర్పాట్లను ఆలయాధికారులు పర్యవేక్షించారు.

లక్ష్మీపురం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాలు



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న ఆలయానికి దత్తత ఆలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

శిశిరంలో వసంతంలా..

- మోడువారిన భారీ వృక్షాలకు పునరుజ్జీవం
- కడియం నర్సరీ రైతుల ఘనత

కడియం: శిశిర రుతువులో ఆకులన్నీ రాలిపోయి చెట్లు మోడుల్లా మారుతూంటాయి. అలా మోడువారిన చెట్లన్నీ.. తిరిగి వసంత రుతువు ఆగమనాన్ని సూచిస్తూ లేచివుళ్లు వేసి.. చూస్తూండగానే తిరిగి ఆకుపచ్చని శోభను సంతరించుకుంటాయి. ఇదంతా సహజంగా జరిగే ప్రక్రియ. కానీ, అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం, ఇతర కారణాలతో నరికివేసే భారీ వృక్షాలు మాత్రం మోడుల్లానే మిగిలిపోతూ.. చివరకు జీవాన్ని కోల్పోతున్నాయి. ఇటువంటి వృక్షాలకు మళ్లీ జీవం పోస్తూ.. వాటికి వసంత శోభను తీసుకుని వస్తున్నారు తూర్పు గోదావరి జిల్లా కడియం ప్రాంత నర్సరీ రైతులు. వివిధ ప్రాంతాల్లో మోళ్లుగా మిగిలిన రావి, మర్రి, జమ్మి, జువ్వి, బాదం, ఉసిరి, గానుగ, కదంబం, కొబ్బరి, తాటి వంటి భారీ వృక్షాలను వేర్లతో సహా పెకలించి, ఇక్కడకు తీసుకుని వస్తున్నారు. వాటిని బతికించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారు. దీనికోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఒకవేళ తీసుకు వచ్చిన వృక్షం చనిపోతే, ఆ మేరకు నష్టాన్ని కూడా వీరు భరించాల్సి ఉంటుంది. అయినప్పటికీ వారు ఏమాత్రం వెనుకాడటం లేదు. చెట్టు ఎంత భారీ సైజులో ఉన్నప్పటికీ, నిపుణుల పర్యవేక్షణలో తొలగించి, వేర్లకు ప్రత్యేక పోషణ చేపడుతున్నారు. వేర్లు దెబ్బ తినకుండా తగు జాగ్రత్తలు తీసుకుని, ట్రాలీలపై తీసుకుని వస్తున్నారు. అలా తెచ్చిన చెట్లకు మినరల్స్, సూక్ష్మ పోషకాలు (మైక్రో న్యూట్రియెంట్స్) అందించి, మాను నుంచి చిగుళ్లు వచ్చే వరకూ పోషిస్తారు. చిగుళ్లు వచ్చి, చెట్టు మళ్లీ బతికిందని నిర్ధారించుకున్న తరువాత రవాణాకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియకు ఏడాది నుంచి నాలుగైదేళ్ల వరకూ పడుతుంది. అప్పటి వరకూ దీనిపై పెట్టుబడి పెడుతూనే ఉండాలి. చెట్టు సైజు, వయస్సును బట్టి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకూ వీటిని విక్రయిస్తున్నారు.



ట్రాలీపై రవాణా చేస్తున్న భారీ వృక్షం



కడియం ప్రాంత నర్సరీ రైతులు పునరుజ్జీవం కల్పిస్తున్న భారీ వృక్షాలు

ఆలయాల నుంచి డిమాండ్

లక్షలాది రూపాయలు వెచ్చింది, పునరుజ్జీవింపజేసిన భారీ వృక్షాలకు ఆలయాల నుంచి డిమాండ్ ఉంటోంది. ఆలయం ఎంత భారీగా నిర్మించినప్పటికీ, అందుకు తగిన విధంగా సంబంధిత వృక్షాన్ని నాటడానికి దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాధాన్యం ఇస్తున్నారు. కడియం ప్రాంతం నుంచి భారీ వృక్షాలను తీసుకుని వెళ్లి, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాల్లో నాటుతున్నారు. అలాగే, జన్మ నక్షత్రాన్ని అనుసరించి, తగిన వృక్షాన్ని కూడా పెంచుకునేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో కూడా భారీ వృక్షాలకు డిమాండ్ ఏర్పడుతోంది. చెట్టు సైజు, వయస్సును బట్టి ధర పలుకుతుంది.
– కొత్తపల్లి మూర్తి, బుర్రిలంక, కడియం మండలం

మామిడిని ఆరోగ్యంగా మాగిద్దాం



- ఇథిలీన్ వాయువుతో మంచి ఫలితం
- కాల్షియం కార్బైడ్‌తో మాగిస్తే ప్రజల ఆరోగ్యంపై ప్రభావం
- జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు

కర్నూలు (అగ్రికల్చర్): ఏటా వేసవిలో అందరినీ ఊరించే పండు మామిడి. జూన్ వరకు మార్కెట్‌లో మామిడిదే పైచేయి. సంపన్నులైనా.. సామాన్యులైనా.. మామిడి రుచిని ఆస్వాదించాల్సిందే. బంగినపల్లి (బేనీసా) రకం మామిడి అంటే దానికి ఉన్న డిమాండే వేరు. మామిడి ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో పసుపుపచ్చగా కనువిందు చేస్తోంది. రంగు బాగా ఉంది కదాని తింటే అనారోగ్యాలను కొని తెచ్చుకోవాల్సిందే. ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి మాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మామిడి ఆరోగ్యకరమైన పద్ధతుల ద్వారా మాగించాల్సిన అవసరం ఉందని కర్నూలు జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. ఈ ఏడాది మామిడి దిగుబడులు ఒక మోస్తరుగా ఉన్నాయని వీటిని ఆరోగ్యవంతమైన పద్ధతిలో మాగించుకుంటే మంచి డిమాండ్, ధర లభిస్తుందని తెలిపారు. మార్కెట్‌లో మామిడి పండ్లు కొనుగోలు చేసే ముందు సూక్ష్మంగా పరిశీలించాలన్నారు. పండ్లు కొనేటప్పుడు, తినేటప్పు డు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్బైడ్‌కు ప్రత్యామ్నాయంగా పండ్లు మాగించే పద్ధతులను వివరించారు.



పండ్లు ఎలా మాగుతాయి...

సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా పండ్ల నందు ఉత్పత్తి అయ్యే ఇథలీన్ వల్ల మాగడం జరుగుతుంది. ఇథలీన్ పండు పక్వానికి వచ్చినప్పుడు దాని నిర్మాణ, రంగు, రుచి వంటి మార్పులకు ఉపయోగపడుతుంది.

- తప్పని పరిస్థితుల్లో కాయలు మాగబెట్టుటకు ఎథిలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే ఉపయోగించాలి. 100 పీపీఎం ఎథిలిన్ వాయువు 24 గంటలు తగిలేటట్లుగా ఉంచితే 5 రోజులలో సహజత్వానికి దగ్గరగా ఎలాంటి హాని లేకుండా మాగుతాయి.
- ఇంటిలో అయితే మాగని కాయల్లో కొన్ని మాగిన పండ్లను గాలి చొరవ డబ్బాలో ఉంచాలి. పక్వానికి వచ్చిన కాయలను ఒక రూములో వరిగడ్డి లేదా బోదగడ్డిలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల సహజ సిద్ధంగా మాగుతాయి.

కొనేటప్పుడు ఇలా చూడాలి..

సీజన్ రాకముందే అపరిపక్వముగా ఉండి కృత్రిమంగా మాగబెట్టిన రంగు వచ్చేటట్లు చేసిన పండ్లు కొనరాదు. రంగు చూసి మోసపోరాదు. సీజన్‌లో పండ్లు పరిపక్వత చెంది సహజముగా మాగిన పండ్లు కొనడం ఆరోగ్యదాయకం.

తినేటప్పుడు ఇలా చేయాలి..

పండ్లను ముందుగా ఉప్పు కలిపిన నీటిలో 15–20 నిముషాలు ఉంచి, తిరిగి వాటిని మంచినీటిలో కడిగి తడి లేకుండా తుడిచిన తర్వాత వాటిని తినాలి. లేదా ఫ్రిజ్‌లో ఉంచుకోవాలి. సాధ్యమైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడం మంచిది.



సహజ, కృత్రిమంగా మాగిన పండ్లకు తేడాలు..

రంగు..: సహజంగా మాగిన పండు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వంగా ఉంటుంది.
కృత్రిమంగా మాగిన వాటిలో పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటాయి. పైకి మాగినట్లుగా కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటాయి.

వాసన..: సహజంగా మాగిన పండు కొంత దూరంలో ఉన్నప్పటికీ కమ్మని మామిడి పండు వాసన వస్తుంది. కృత్రిమంగా మాగిన పండును ముక్కుకు దగ్గరగా ఉంచినప్పుడు మాత్రమే మామిడి పండు వాసన వస్తుంది.

రుచి..: సహజంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడుతుంది. కావున తియ్యగా రుచిగా ఉంటుంది. కృత్రిమంగా మాగిన పండులో తగినంత చక్కెర శాతం ఏర్పడక తక్కువ తీపిదనం, రుచి లేకకుండా ఉంటాయి.

నిల్వ..: సహజంగా మాగిన మామిడి పండ్లు మెత్తగా ఉంటాయి. ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
కృత్రిమంగా మాగిన వాటిలో పండ్ల తొక్క ముడతలు లేకుండా ఉండి గట్టిగా ఉంటాయి. పండు త్వరగా పాడైపోతుంది. తొక్కపై నల్లని చుక్కలు ఏర్పడతాయి.



కార్బైడ్‌తో మాగిస్తే శిక్ష...

ఆహార సురక్షణ ప్రమాణాల చట్టం–2006 ప్రకారం కార్బైడ్ వాడి పండ్లు మాగబెట్టిన వారికి, అమ్మే వారికి ఒక ఏడాది జైలు శిక్ష, మూడు లక్షల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. కార్బైడ్ వాడిన పండ్లను తినడం వల్ల అనేక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఈ విషయం శాస్త్రీయంగా నిర్ధారణ అయింది.





ముంబై కామిక్ కాన్ ఫెస్టివల్

ముంబైలో ఏప్రిల్ 12, 13 తేదీల్లో కామిక్ కాన్ ఫెస్టివల్ జరిగింది. జియో కన్వెన్షన్ సెంటర్‌లో పిల్లలు హడావిడి చేశారు. కామిక్ బుక్స్ కొన్నారు. కామిక్ క్యారెక్టర్స్ వేషాలు కట్టారు. వర్చువల్ రియాలిటీ గేమ్స్ ఆడారు. అయితే ఇది ఊరికే కాదు. టికెట్ ఉంటుంది. ఈ వేసవిలో ప్రతి పెద్ద ఊరిలో ఇలాంటివి జరిగితే బాగుంటుంది కదూ.





• తెలుసుకుందాం

అబ్రకదబ్ర.. అంటే ఏంటో తెలుసా?



పిల్లలూ! మీరేదైనా మ్యాజిక్ షోకి వెళ్లినప్పుడు స్టేజీ మీద ఉన్న మెజీషియన్ తప్పకుండా 'అబ్రకదబ్ర' అనే మాట వాడటం వినే ఉంటారు. చాలా సార్లు మ్యాజిక్ షోలలో ఈ పదం వాడుతుంటారు. దీనికి అర్థమేమిటో, ఈ పదం ఎలా పుట్టిందో తెలుసా? ఈ పదం ఎప్పుడు, ఎవరు, ఎలా పుట్టించారో కచ్చితమైన ఆధారాలు లేవు. కానీ రెండో శతాబ్దానికి చెందిన రోమన్ వైద్యుడు సెరెన్ సమ్మోనికస్ రాసిన గ్రంథాల్లో ఈ మాట ఉంది. కాబట్టి ఇది చాలా పురాతనమైన మాట అని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. జ్వరం తగ్గిపోవడానికి చిట్కాగా ఆయన తన గ్రంథంలో 'అబ్రకదబ్ర' అనే పదాన్ని వాడారు.

ఈ పదానికి హిబ్రూ భాషలో 'నేను చెప్పినట్లే సృష్టిస్తాను', అరేబిక్ భాషలో 'నా మాట ప్రకారం సృష్టి జరుగుతుంది' అనే అర్థాలు న్నాయంటారు. హిబ్రూ భాష లోని 'హ బ్రఖా దబరా'(ఆశీర్వాదం పొందినవారు) అనే వాక్యం నుంచి ఈ పదం వచ్చి ఉంటుందని డాన్ స్కీమర్ అనే చరిత్రకారుడు అంచనా వేశారు. ఇవన్నీ అంచనాలే తప్ప 'అబ్రకదబ్ర' అనే పదానికి స్పష్టమైన అర్థాన్ని ఎవరూ కనుక్కోలేకపోయారు. ఈ పదానికి చాలా శక్తి ఉందని, ఇది పఠిస్తే అనుకున్నవన్నీ జరుగుతాయని రకరకాలుగా ప్రచారం చేశారు. అనంతరం 1800 నుంచి మెజీషియన్లు దీన్ని తమ షోల్లో వాడటం మొదలుపెట్టారు. ఏదైనా ఒక మ్యాజిక్ ట్రిక్ చేసే ముందు ఈ పదాన్ని వాడి, ఆ ట్రిక్ చేయడం ద్వారా ఈ పదానికి మహత్యం ఉందని అందరూ అనుకునేవారు. నేటికీ అది కొనసాగుతోంది.




• వండర్ కిడ్

వావ్.. ఐదేళ్లకే పుస్తకం రాసేసింది

ఐదేళ్ల వయసుండే పిల్లలు ఆటపాటల్లో గడుపుతారు. స్కూల్‌కి వెళ్లనని మారాం చేస్తారు. కానీ బెల్లా మాత్రం అవేవీ చేయలేదు. పుస్తకం రాసి ప్రచురించింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా మరో పుస్తకం రాయబోతోంది. అందరూ తన ప్రతిభను చూసి ఆశ్చర్యపోతున్నారు.

బెల్లా.జె.డార్క్ అనే పాప యూకేలోని వేమౌత్ ప్రాంతంలో పుట్టింది. చిన్ననాటి నుంచే అమ్మ చెప్పే కథలు వింటూ పెరిగింది. చిన్నారుల కోసం ప్రచురించే పుస్తకాలు చదివి, వాటి మీద ఆసక్తి పెంచుకున్న తను సొంతంగా కథలు రాయాలని ఐదేళ్ల వయసులో నిశ్చయించుకుంది. కానీ ఏ అంశం మీద రాయాలా అని ఆలోచిస్తూ ఉంది. ఆ సమయంలో తను గీసిన ఓ పిల్లి బొమ్మను చూసి ఓ ఆలోచన వచ్చింది. వెంటనే దాన్ని అక్షరరూపంలో పెట్టేసింది. ఆ కథే "The lost cat' (ది లాస్ట్ క్యాట్).





ఐదు రోజుల పాటు ఆ కథ రాసిన బెల్లా దానికి తనే సొంతంగా బొమ్మలు కూడా వేసింది. అర్ధరాత్రి పూట ఇంటి నుంచి బయటకు వెళ్లిన పిల్లి ఎలాంటి ఇబ్బందులు పడింది, తిరిగి ఎలా తన ఇంటికి చేరిందనేది ఇందులోని కథ. ఈ కథే ఎందుకు రాశావని బెల్లాని అడిగితే, 'పిల్లలు అలా ఎవరికీ చెప్పకుండా ఎక్కడికీ వెళ్లకూడదు. ముఖ్యంగా రాత్రిపూట అస్సలే వెళ్లకూడదు. ఆ విషయం అందరికీ చెప్పాలనే ఈ కథ రాశాను' అంటోంది. 2022 జనవరి 31న ఈ కథ పుస్తకంగా ప్రచురితమయ్యేనాటికి బెల్లాకు ఐదేళ్ల 211 రోజులు. ఈ విషయాన్ని గుర్తించిన గిన్నిస్ ప్రతినిధులు 'అతి చిన్న వయసు రచయిత్రి' అంటూ రికార్డు అందజేశారు. 'ది లాస్ట్ క్యాట్' పుస్తకం ఇప్పటికి వేల కాపీలు అమ్ముడుపోయింది. ఈ పుస్తకం చదివి అనేకమంది బెల్లాకు మెయిల్స్ చేస్తున్నారు. తను రాసిన కథను మెచ్చుకుంటున్నారు. ఆ సంతోషంతో ఆ కథకు కొనసాగింపుగా మరో కథ రాసేందుకు సిద్ధమవుతోంది. ఖాళీ సమయాల్లో ఈత కొట్టడం, ఆడుకోవడం తనకు ఇష్టమని అంటోంది బెల్లా.

• ఈ వారం విశేషం



పిల్లల కోసం ఉందో వార్తల వెబ్‌సైట్

ప్రపంచంలో రోజూ జరిగే విషయాలన్నీ పత్రికలు, న్యూస్ ఛానెల్స్, వెబ్‌సైట్లలో చూస్తూ ఉంటాం. అయితే ఇందులోని కొన్ని విషయాలు చిన్నారులకు అర్థమవుతాయి, మరికొన్ని అర్థం కావు. అందులోని భాష కూడా చిన్నారులు అర్థం చేసుకోలేనట్లుగా ఉంటుంది. మరి వారి కోసం, వారికి అర్థమయ్యే భాషలో న్యూస్ వెబ్‌సైట్ ఉంటే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనతోనే అమెరికాలో "Newsforkids.net' అనే వెబ్‌సైట్ మొదలయ్యింది. నేటికీ చిన్నారుల కోసం వార్తలు అందిస్తోంది.

2018లో అమెరికాకు చెందిన విల్ ఆడమ్స్ అనే టీచర్ Newsforkids.netని ప్రారంభించారు. ఆయన ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా చిన్నారులకు ఇంగ్లిషు చెప్పేవారు. ఆ సమయంలో పిల్లల్ని దినపత్రికలు చదవమని అనేవారు. అయితే పత్రికల్లోని భాష అర్థం కాక పిల్లలు అయోమయపడేవారు. దీంతో వారికోసం, వారికి అర్థమయ్యే భాషలో వార్తలు ఇస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది.




అనంతరం కొంతమంది విద్యావేత్తలతో చర్చించి, అటు చిన్నారులకు, ఇటు కొత్తగా ఇంగ్లిషు నేర్చుకునేవారికి అనుకూలంగా ఉండేలా ఓ వార్తల వెబ్‌సైట్ ప్రారంభించాలని అనుకున్నారు. అలా ప్రారంభమైన ఈ వెబ్‌సైట్ కొద్దికాలంలో చాలామందికి చేరువైంది. చిన్నారులతోపాటు అమెరికాకి వచ్చిన అనేకమంది విదేశీయులు తమ ఇంగ్లిష్‌ను అభివృద్ధి చేసుకునేందుకు, స్థానికంగా జరిగే విషయాలను తెలుసుకునేందుకు ఈ వెబ్‌సైట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇందులో ప్రపంచంలో జరిగే విషయాలతోపాటు అమెరికా రాజకీయాలు, సైన్స్, క్రీడలు, ఆర్ట్స్ వంటి అంశాల వార్తలు విడివిడిగా ఉంటాయి.

ఇది ప్రధానంగా విద్యార్థుల కోసం ఉద్దేశించిన వెబ్‌సైట్ అంటున్నారు ఆడమ్స్. ప్రతి వార్తనూ వారికి అర్థమయ్యేలా, ఓ కథలా రాసి అందిస్తున్నామని వివరిస్తున్నారు. చిన్నారులకు అర్థం కాని విషయాలున్నప్పుడు దాని గురించి మరింత సమాచారం ఇచ్చి మరీ, ఆ విషయాన్ని అర్థం చేయించేలా ఈ వెబ్‌సైట్‌ని రూపొందించామని అంటున్నారు. ప్రపంచంలో ఎక్కడున్నవారైనా ఈ వెబ్‌సైట్ చూడొచ్చని వివరిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలోని మాసచూసెట్స్ ప్రాంతంలో ఉంటున్న ఆయన ఈ వెబ్‌సైట్‌కు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

• బాలల కథ

దోమ పెళ్లి





అనగనగా ఓ నగరంలో ఓ దోమ ఉండేది. ఒకసారి నగరానికి సమీపంలో ఉన్న అడవికి ఆ దోమ విహారానికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడున్న ఏనుగును చూసింది. భారీ ఆకారం, చేటల్లాంటి చెవులు, పొడవైన తొండం చూసి ముచ్చటపడింది. ఏనుగు నడిచి వస్తూ ఉంటే మిగిలిన అన్ని జంతువులూ పక్కకు తప్పుకోవడం చూసి అబ్బురపడింది. ఎలాగైనా ఏనుగును పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుంది. వెంటనే వెళ్లి తనను పెళ్లి చేసుకోమని ఏనుగును అడిగింది.

ఏనుగు దోమను ఆశ్చర్యంగా చూసింది. మనిద్దరికీ కుదరదని, ఇద్దరం వేర్వేరు పద్ధతుల్లో జీవిస్తున్నామని చెప్పింది. అయినా దోమ వినలేదు. తనను పెళ్లి చేసుకొమ్మని పట్టుపట్టింది. దీంతో ఏం చేయాలో ఏనుగుకు అర్థం కాలేదు. పెళ్లికి ఇప్పుడు ముహూర్తం లేదు, దీపావళికి రా అని చెప్పి దోమను పంపించింది. దోమ సంతోషంగా నగరానికి వెళ్లింది.

దీపావళి మూడు రోజుల ముందునుంచి నగరంలో టపాకాయలు కాల్చడం మొదలైంది. ఆ పొగ కారణంగా దోమ ఉక్కిరిబిక్కిరయ్యింది. విపరీతమైన జ్వరంతో ఎటూ కదలలేని పరిస్థితి వచ్చింది. దీంతో ఏనుగు దగ్గరికి వెళ్లలేకపోయింది. దీపావళి అయిపోయిన తర్వాత దోమ ఏనుగు దగ్గరికి వెళ్లింది. అయితే ముహూర్తం దాటిపోయాక వచ్చావని ఏనుగు కోప్పడింది. దోమ తనకు జరిగిన విషయాన్ని వివరించింది. ఈసారి పుష్యమాసంలో వస్తే తప్పకుండా పెళ్లి చేసుకుంటానని చెప్పింది ఏనుగు. సరేనని వెళ్లిపోయింది దోమ. పుష్యమాసం మొదలు కాగానే ఏనుగు దగ్గరికి బయలుదేరింది దోమ. కానీ చలికాలపు గాలుల కారణంగా ఒక అడుగు ముందుకు వేస్తే, నాలుగడుగులు వెనక్కి పడ్డాయి. ఎంత ప్రయత్నించినా నగరం దాటి అడవికి వెళ్లలేకపోయింది. దీంతో పుష్యమాసం దాటిపోయింది. ఆ తర్వాత అడవికి వెళ్లి ఏనుగును బతిమాలుకుంది. తన ఇబ్బందిని వివరించింది.

ఈసారి ఎండాకాలంలో రమ్మని చెప్పింది ఏనుగు. తప్పకుండా వస్తానని దోమ నగరానికి బయలుదేరింది. మధ్యలో దోమకు ఈగ కనిపించింది. ఏనుగుతో పెళ్లికి ఏర్పడ్డ అడ్డంకుల గురించి ఈగతో చెప్పింది దోమ. అంతా విన్న ఈగ 'నువ్వింకా ఆ ఏనుగు మాటల మాయలోనే ఉన్నావా?' అని అడిగింది. దోమ ఆశ్చర్యంగా చూసింది.

'దీపావళి సమయంలో పొగ కారణంగా నువ్వు రాలేవని ఏనుగుకు తెలుసు. అందుకే అప్పుడు రమ్మంది. ఆ తర్వాత పుష్యమాసంలో కూడా రాలేవని అప్పుడు రమ్మంది. ఇప్పుడు ఎండాకాలంలో రమ్మంటోంది. మడుగులు, కుంటల్లో నీళ్లన్నీ అడుగంటిపోయి దోమలన్నీ ఇబ్బంది పడుతూ ఉంటే, ఆ సమయంలో నువ్వు రాలేవని తెలుసు. అందుకే అప్పుడు రమ్మని షరతు పెట్టింది. ఆ ఏనుగుకు నిన్ను పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదు. కాబట్టి వదిలేసి నీ బతుకేదో నువ్వు బతుకు' అని హితవు చెప్పింది.

కానీ దోమ ఆ మాటలు వినకుండా ఆవేశంగా ఏనుగు దగ్గరికి తిరిగివెళ్లింది. తనను ఇప్పటికిప్పుడే పెళ్లి చేసుకోమని పట్టుబట్టింది. ఏనుగు తన చేటల్లాంటి చెవులతో దోమను ఒక్క దెబ్బ కొట్టింది. దీంతో దోమ చచ్చి కిందపడింది.

నీతి:

అలవిగాని కోరికలు కోరి ఇబ్బందులు తెచ్చుకోకూడదు.

ఎండలూ... ఎండు చేపలూ...



ఆహారాన్ని ఎండబెట్టి దాచుకోవడం మనిషి తన అవసరం కొద్దీ కనిపెట్టాడు. పచ్చిగా ఉన్న ఆహారం పాడవుతుంది. అదే ఎండపెడితే నిల్వ ఉంటుంది. కొన్ని రకాల పండ్లు కాయలు, మాంసాహారం ఎండపెట్టి దాచితే కొన్ని రోజులు నిల్వ ఉంటాయి. మనిషికి నిత్యం ఆహారం కావాలి. కాని ప్రకృతి ఏ రోజు ఎలా ఉంటుందో తెలియదు. వానల్లో, చలికాలంలో, తీవ్రమైన ఎండల్లో పనికి వెళ్ల ఆహారం తెచ్చుకోలేడు. అలాంటప్పుడు ఎండపెట్టిన ఆహారం తింటాడు. వాటిలో ఎండు చేపలు ఒకటి. సముద్రంలో పట్టిన కొన్ని రకాల చేపలను ఎండపెట్టి, ఉప్పు కలిపితే నిల్వ ఉంటాయి. రెండు నెలలు మూడు నెలలు కూడా ఉంటాయి. ఇక్కడ మీరు చూస్తున్నది చెన్నైలో ఈ ఎండల్లో ఎండపెడుతున్న ఎండుచేపలను.

• మహనీయులు

తెలుగువారి కీర్తిపతాకం.. భోగరాజు పట్టాభి సీతారామయ్య



పిల్లలూ! ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా ఎందరో మహనీయులు పుట్టిన ప్రాంతం. అటువంటి ప్రాంతంలో పుట్టిన ఓ మహనీయుడి గురించి ఇవాళ తెలుసుకుందాం. ఆయనే భోగరాజు పట్టాభి సీతారామయ్య.

సీతారామయ్య 1880 నవంబర్ 24న కృష్ణా జిల్లా గుండుగొలను అనే ఊరిలో జన్మించారు. చిన్ననాటి నుంచి వైద్యుడిగా మారాలన్న ఆలోచనతో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చేరి ఎంబీసీఎం డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం మచిలీపట్నంలో వైద్యుడిగా సేవలందించడం మొదలుపెట్టారు. స్వాతంత్ర్య ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో తన పని వదిలేసి స్వాతంత్రోద్యమంలో చేరారు. 1923లో ఆంధ్రాబ్యాంకు స్థాపించారు. అందుకే ఆంధ్రాబ్యాంకు ప్రధాన భవనానికి 'పట్టాభి భవన్' అని పేరు పెట్టారు. దీంతోపాటు ఆయన ఆంధ్రా ఇన్సూరెన్స్ సంస్థను కూడా స్థాపించారు.

కాంగ్రెస్ పార్టీలో కీలకమైన నాయకుడిగా ఎదిగిన సీతారామయ్య మహాత్మాగాంధీకి సన్నిహితుడిగా మారారు. 1935లో 'ది హిస్టరీ ఆఫ్ ది కాంగ్రెస్' పుస్తకం రాశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఆయన్ని మూడేళ్లపాటు అహ్మద్ నగర్ జైల్లో ఉంచారు. అక్కడున్నరోజుల్లో 'ఫెదర్స్ అండ్ స్టోన్స్' పేరుతో తన జైలు అనుభవాలు రాశారు. ఆపై 'గాంధీ అండ్ గాంధీయిజం' పుస్తకాన్ని రాశారు. కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా పని చేశారు. రాజ్యసభ సభ్యుడిగా, మధ్యప్రదేశ్ రాష్ట్రం తొలి గవర్నర్‌గా వ్యవహరించారు. తెలుగువారి కీర్తిపతాకంగా నిలిచారు. దేశానికి ఎనలేని సేవలందించిన ఆయన 1959 డిసెంబర్ 17న మరణించారు.

• మన సినిమా

ఉల్ఫ్ కింగ్ సూపర్ యానిమేటెడ్ సిరీస్

హాయ్ కిడ్స్... ఈ హాలిడేస్‌లో మూవీస్ బాగా ఎంజాయ్ చేస్తున్నారా... అయితే ఎప్పుడూ మూవీసేనా ఒక్కోసారి సిరీస్‌లు కూడా చూడాలి. అందుకే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న ఓ సూపర్ యానిమేటెడ్ సిరీస్ మీ ముందుకు తీసుకువచ్చాం. దాని పేరే 'ఉల్ఫ్ కింగ్'. ఇదో సూపర్ యాక్షన్ స్టోరీ. డ్రూ ఫెర్రాన్ అనే కుర్రాడి కథ. ఉల్ఫ్ జాతికి చెందిన డ్రూ ఫెర్రాన్ ఆ ఫ్యామిలీలో ఆఖరివాడు. అతనికి ఉల్ఫ్ నుండి వచ్చే సూపర్ ఫాంటసీ పవర్స్ ఉంటాయి. కాని ఈ విషయం తనకు తెలియదు. డ్రూ ఫెర్రాన్ రాజ్యాన్ని సింహ రాజులు అటాక్ చేసినపుడు, వాళ్ళతో ఫైట్ చేసేటపుడు తనలోని ఉల్ఫ్ పవర్ తెలుస్తుంది. ఆ పవర్స్‌తో డ్రూ ఫెర్రాన్ ఎలా ఫైట్ చేసి తన రాజ్యాన్ని తిరిగి సంపాదించుకున్నాడనేది మాత్రం నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న యానిమేటెడ్ సిరీస్ అయిన ఉల్ఫ్ కింగ్ చూసేయండి. ఈ సిరీస్ మొత్తం 8 ఎపిసోడ్స్ ఉంటాయి. ప్రతి ఎపిసోడ్ సూపర్బ్‌గా ఉంటుంది. అంతే కాదు ఓ రాజ్యంలో రాజులకు సంబంధించిన సీక్రెట్స్, ఫైట్స్ అలాగే ఛేజింగ్స్‌తో ఈ సిరీస్ మొత్తం ఓ అద్భుతమైన రోలర్ కోస్టర్ రైడ్. ఇంకెందుకాలస్యం... గ్రాబ్ ది రిమోట్ టు క్రూస్ ఫర్ ది అడ్వెంచరస్ జర్నీ ఆఫ్ ఉల్ఫ్ కింగ్.



– హరికృష్ణ ఇంటూరు

సాక్షి ప్లస్
శనివారం। 19-4-2025



శభాష్ సౌమ్య...

- భారత మహిళల ఫుట్‌బాల్ లీగ్‌లో మెరిసిన తెలంగాణ అమ్మాయి
- తొలిసారి ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు టైటిల్ దక్కడంలో కీలకపాత్ర
- తొమ్మిది గోల్స్‌తో భారత్ నుంచి టాప్ స్కోరర్‌గా ఘనత

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఇండియన్ ఉమెన్ లీగ్ (ఐడబ్ల్యూఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. ఈస్ట్ బెంగాల్ జట్టుకు తొలిసారి టైటిల్ దక్కడంలో తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ కీలకపాత్ర పోషించింది. మిడ్‌ఫీల్డర్ పొజిషన్‌లో ఆడే సౌమ్య మొత్తం 9 గోల్స్ సాధించి ఐడబ్ల్యూఎల్ 2024–2025 సీజన్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్ల జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈస్ట్ బెంగాల్‌కే చెందిన ఫాజిలా ఇక్వాపుట్ (ఉగాండా) 24 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలువగా.. ఈస్ట్ బెంగాల్‌కే చెందిన ఎల్షాదాయ్ అచెమ్‌పోంగ్ (ఘనా) 10 గోల్స్‌తో రెండో స్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో విదేశీ క్రీడాకారిణులు ఉండటంతో... తాజా ఐడబ్ల్యూఎల్‌లో అత్యధిక గోల్స్ చేసిన భారతీయ క్రీడాకారిణిగా సౌమ్య గుర్తింపు పొందింది. ఈ ఏడాది జనవరి 10వ తేదీన మొదలైన ఈ లీగ్ ఏప్రిల్ 18న ముగిసింది. మొత్తం ఎనిమిది జట్లు డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఒక్కో జట్టుతో రెండుసార్లు చొప్పున తలపడ్డాయి. ఈస్ట్ బెంగాల్ జట్టు నిర్ణీత 14 మ్యాచ్‌లు ఆడి 37 పాయింట్లతో అగ్రస్థానాన్ని అలంకరించింది. ఈస్ట్ బెంగాల్ జట్టు 12 మ్యాచ్‌ల్లో గెలిచి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకొని, ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. ఓవరాల్‌గా ఈస్ట్ బెంగాల్ జట్టు 38 గోల్స్ చేసి, ప్రత్యర్థి జట్లకు 10 గోల్స్ సమర్పించుకుంది. ఇప్పటి వరకు ఐడబ్ల్యూఎల్ ఎనిమిదిసార్లు జరగ్గా... గోకులం కేరళ జట్టు మూడుసార్లు చాంపియన్‌గా నిలిచింది. ఈస్టర్న్ స్పోర్టింగ్ యూనియన్, రైజింగ్ స్టూడెంట్స్ క్లబ్, సేతు క్లబ్, ఒడిశా ఎఫ్‌సీ ఒక్కోసారి విజేతగా నిలిచాయి.

రెండోసారి విజేత జట్టులో...

నిజామాబాద్ జిల్లాలోని కూనేపల్లి గ్రామానికి చెందిన 23 ఏళ్ల సౌమ్య ఖాతాలో రెండోసారి ఐడబ్ల్యూఎల్ టైటిల్ చేరింది. సౌమ్య 2021–2022 ఐడబ్ల్యూఎల్ సీజన్ విజేత గోకులం కేరళ జట్టులోనూ సభ్యురాలిగా ఉంది. 2015లో భారత అండర్–14 జట్టుకు... 2016లో భారత అండర్–16 జట్టుకు ఆడిన సౌమ్య 2016 నుంచి 2018 వరకు భారత అండర్–19 జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2021లో భారత సీనియర్ మహిళల జట్టులోకి ఎంపికైన సౌమ్య ఇప్పటి వరకు ఓవరాల్‌గా 33 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి ఐదు గోల్స్ సాధించింది. 2017లో ఇండియా రష్ సాకర్ క్లబ్ (ముంబై) తరఫున తొలిసారి ఐడబ్ల్యూఎల్‌లో బరిలోకి దిగిన సౌమ్య... 2019–2020 సీజన్‌లో కెంక్రె ఎఫ్‌సీ (ముంబై) తరఫున ఆడింది. 2021–2022 సీజన్‌లో గోకులం కేరళ జట్టుకు ఆడిన సౌమ్య 2022–2023లో క్రొయేషియాకు చెందిన డైనమో జాగ్రెబ్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించింది. క్రొయేషియా లీగ్‌లో ఆడిన తర్వాత తిరిగి వచ్చిన సౌమ్య 2023–2024 ఐడబ్ల్యూఎల్‌లో మరోసారి గోకులం కేరళ జట్టు తరఫున బరిలోకి దిగింది.



సౌమ్య గుగులోత్

స్కాట్లాండ్ అవుట్

కేథరీన్ బ్రైస్ అజేయ సెంచరీ వృథా

లాహోర్: ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లలో భారత్ వేదికగా జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి అర్హత సాధించాలని ఆశించిన స్కాట్లాండ్ జట్టుకు నిరాశ ఎదురైంది. ప్రపంచకప్‌కు అర్హత పొందాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ ఓడిపోయింది. శుక్రవారం జరిగిన వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్ ఒక్క వికెట్ తేడాతో స్కాట్లాండ్‌ను ఓడించింది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్ గెలిచి... నేడు పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓడిపోతే స్కాట్లాండ్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించేది. కానీ స్కాట్లాండ్ ఆశలను ఐర్లాండ్ వమ్ము చేసింది. ఐర్లాండ్‌తో పోరులో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 268 పరుగులు సాధించింది. కెప్టెన్ కేథరీన్ బ్రైస్ (137 బంతుల్లో 131 నాటౌట్; 14 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేసి స్కాట్లాండ్‌కు గౌరవప్రద స్కోరు అందించింది. అనంతరం ఐర్లాండ్ జట్టు సరిగ్గా 50 ఓవర్లు ఆడి 9 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు సారా ఫోర్బ్స్ (55; 6 ఫోర్లు), కెప్టెన్ గ్యాబీ లూయిస్ (61; 9 ఫోర్లు), లౌరా డెలానీ (57 నాటౌట్; 4 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేసి ఐర్లాండ్ విజయంలో ముఖ్యపాత్ర పోషించారు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో స్కాట్లాండ్, ఐర్లాండ్ తమ ఐదు లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకొని నాలుగు పాయింట్లతో వరుసగా మూడో, నాలుగో స్థానంలో నిలిచాయి. నేడు చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ జట్టుతో పాకిస్తాన్; థాయ్‌లాండ్ జట్టుతో వెస్టిండీస్ తలపడతాయి. పాకిస్తాన్ ఇప్పటికే వరల్డ్‌కప్‌కు అర్హత పొందగా... రెండో బెర్త్ కోసం బంగ్లాదేశ్, వెస్టిండీస్ రేసులో ఉన్నాయి. బంగ్లాదేశ్ ఆరు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.



హంపి-హారిక గేమ్ 'డ్రా'

మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ చెస్ టోర్నీ

పుణే: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి అజేయపరంపర కొనసాగుతోంది. భారత్‌కే చెందిన మరో స్టార్ గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్‌కు చెందిన ద్రోణవల్లి హారికతో శుక్రవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను హంపి 'డ్రా'గా ముగించింది. తెల్ల పావులతో ఆడిన హంపి గేమ్‌ను 19 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఐదో రౌండ్ తర్వాత హంపి 3.5 పాయింట్లతో ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది. ఈ టోర్నీలో హంపి రెండు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. పొలీనా షువలోవా (రష్యా)తో జరిగిన గేమ్‌ను దివ్య దేశ్‌ముఖ్ 72 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు అమ్మాయి వైశాలి రమేశ్‌బాబు ఈ టోర్నీలో తొలి విజయాన్ని అందుకుంది. బత్కుయాగ్ మున్‌గున్‌తుల్ (మంగోలియా)తో జరిగిన గేమ్‌లో వైశాలి తెల్లపావులతో ఆడుతూ 52 ఎత్తుల్లో గెలుపొందింది. జు జినెర్ (చైనా)–నుర్గుల్ సలీమోవా (బల్గేరియా) మధ్య జరిగిన గేమ్ 71 ఎత్తుల్లో... మెలియా సలోమి (జార్జియా)–అలీనా కష్లిన్‌స్కాయా (పోలాండ్) మధ్య జరిగిన గేమ్ 41 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ తర్వాత జు జినెర్ నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. శనివారం విశ్రాంతి దినం. ఆదివారం జరిగే ఆరో రౌండ్ గేముల్లో దివ్య దేశ్‌ముఖ్‌తో ద్రోణవల్లి హారిక; బత్కుయాగ్ మున్‌గున్‌తుల్‌తో కోనేరు హంపి; జు జినెర్‌తో వైశాలి; పొలీనా షువలోవాతో మెలియా సలోమి; నుర్గుల్ సలీమోవాతో అలీనా కష్లిన్‌స్కాయా తలపడతారు.

టోక్యో ఒలింపిక్ స్విమ్మింగ్ చాంప్ హఫ్నాయూపై నిషేధం

ట్యూనిస్: టోక్యో ఒలింపిక్స్ స్విమ్మింగ్ చాంపియన్ అహ్మద్ హఫ్నాయూపై సస్పెన్షన్ వేటు పడింది. ట్యూనిషియాకు చెందిన ఈ స్విమ్మర్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించాడు. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నిబంధనల ప్రకారం ఆయా క్రీడాకారులు డోపింగ్ పరీక్షల కోసం తమ స్పష్టమైన ఆచూకీ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నియమాన్ని పాటించడంలో హఫ్నాయూ విఫలమవడంతో అతనిపై 21 నెలల నిషేధం విధించారు. 'గత 12 నెలల కాలంలో ఏకంగా మూడుసార్లు ఆచూకీ ఇవ్వలేదు. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా)కు అందుబాటులోనూ లేకుండా పోవడటంతో నిషేధం విధించాం'



అని ఆక్వాటిక్ స్పోర్ట్స్ ఇంటిగ్రిటీ యూనిట్ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇదివరకే నిషేధకాలాన్ని అమలు చేయడంద్వారా వచ్చే ఏడాది జనవరి 10తో గడువు ముగియనుంది. డ్రగ్స్ రహిత క్రీడాపాలసీలో భాగంగా అథ్లెట్లు ఆచూకి ఇవ్వడం తప్పనిసరి! కోవిడ్ మహమ్మారి వల్ల ఏడాది ఆలస్యంగా జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో హఫ్నాయూ 400 మీటర్ల ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. అనంతరం జపాన్‌లోని ఫుకొకాలో 2023లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటుకున్న ఈ ట్యూనిషియన్ స్విమ్మర్ 800 మీటర్లు, 1500 మీటర్ల ఈవెంట్లలో టైటిల్స్ గెలుచుకున్నాడు. అయితే కారణాలేమైనా... పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం అతను పాల్గొనలేదు.

సెమీస్‌లో అనాహత్, ఆకాంక్ష





కౌలాలంపూర్: ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత రైజింగ్ స్టార్స్ అనాహత్ సింగ్, ఆకాంక్ష సాలుంఖే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదో సీడ్, 17 ఏళ్ల అనాహత్ 11–1, 11–7, 11–5తో అకారి మిదోరికవా (జపాన్)పై, రెండో సీడ్ ఆకాంక్ష 11–0, 11–3, 11–3తో వాయ్ హాన్ యోంగ్ (సింగపూర్)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన తన్వీ ఖన్నా క్వార్టర్ ఫైనల్లో 5–11, 6–11, 12–10, 9–11తో ఎనిమిదో సీడ్ హెలెన్ టాంగ్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో అనాహత్ 11–4, 11–5, 11–7తో జెమికా అరిబాడో (ఫిలిప్పీన్స్)పై, ఆకాంక్ష 11–4, 11–3, 11–8తో రిసా సుగిమోటో (జపాన్)పై విజయం సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ వీర్ చోత్రాని కూడా సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. క్వార్టర్ ఫైనల్లో వీర్ చోత్రాని 9–11, 11–6, 11–6, 11–7తో మొహమ్మద్ సిఫిక్ కమాల్ (మలేసియా)పై గెలిచాడు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ప్లేయర్లు మే 9 నుంచి 17 వరకు చికాగోలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారు.

పతకాలపై టీనేజ్ బాక్సర్ల గురి

బరిలో 56 మంది ● నేటి నుంచి ఆసియా అండర్–15, 17 బాక్సింగ్ టోర్నీ




న్యూఢిల్లీ: జోర్డాన్‌లో జరిగే ఆసియా అండర్–15, అండర్–17 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలే లక్ష్యంగా భారత యువ బాక్సర్లు బరిలోకి దిగుతున్నారు. ఆసియా ఒలింపిక్ కౌన్సిల్, కొత్తగా ఎన్నికైన ప్రపంచ బాక్సింగ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ చాంపియన్‌షిప్ పోటీలు నేటి నుంచి మే 1 వరకు జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో జరుగుతాయి. ఈ రెండు వయో విభాగాల పోటీల్లో 56 మందితో కూడిన భారత బృందం పాల్గొంటుంది. అండర్–15లో 30 మంది బాలబాలికలు, అండర్–17లో 26 మంది యువ బాక్సర్లు పంచ్‌లకు సిద్ధమయ్యారు. గతేడాది జరిగిన ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన సాహిల్ దుహాన్, కాంస్య పతకం సాధించిన దేవాన్ష్ సహా, స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్ఐ) పోటీల్లో స్వర్ణ పతక విజేత టికమ్ సింగ్‌పై భారత్ పతకాల ఆశలు పెట్టుకుంది. బాలికల విభాగంలో ఆసియా స్కూల్ గేమ్స్ బాక్సింగ్‌లో పతకాలు సాధించిన సమీక్షా సింగ్, అన్షిక, ఖుషీ చంద్ తదితరులు బరిలో ఉన్నారు. వీరితో పాటు రవి సిహాగ్, తృష్ణ మోహిత్‌లు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ముందుగా శనివారం ప్రిలిమినరీ దశ పోటీలు నిర్వహిస్తారు.


మహారాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత క్రీడా పురస్కారం 'శివ్ ఛత్రపతి అవార్డు'ను గెల్చుకున్న భారత మహిళా క్రికెటర్, ముంబై అమ్మాయి జెమీమా రోడ్రిగ్స్

రొలాండ్ గారోస్‌లో నాదల్‌కు ప్రత్యేక సన్మానం





పారిస్: సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందు స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను ప్రత్యేకంగా సన్మానించనున్నారు. మరే ఆటగాడికీ సాధ్యంకాని రీతిలో... 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్న నాదల్... ఓవరాల్‌గా 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచాడు. ఈ ఏడాది మే 25 నుంచి ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభం కానుండగా... తొలి రోజు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో నాదల్‌ను సన్మానించనున్నారు. 'రొలాండ్ గారోస్‌కు, నాదల్‌కు విడదీయరాని అనుబంధం ఉంది. ఫ్రెంచ్ ఓపెన్‌లో అతడు చరిత్ర సృష్టించాడు. నాదల్ గౌరవార్థం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తాం. అది అభిమానులతో పాటు ప్రేక్షకులను ఆశ్చర్యానికి లోను చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం' అని ఫ్రెంచ్ ఓపెన్ డైరెక్టర్ అమెలీ మౌరెస్మో గురువారం అన్నారు. 2024 ఫ్రెంచ్ ఓపెన్ తొలి రౌండ్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ చేతిలో పరాజయం పాలైన నాదల్... అదే సమయంలో సన్మానించాలని నిర్వాహకులు భావించినా... దానికి అతడు అంగీకరించలేదు. శరీరం సహకరిస్తే మరోసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగాలని 38 ఏళ్ల నాదల్ భావించాడు. కాగా... వరుస గాయాల కారణంగా గతేడాది నవంబర్‌లో నాదల్ కెరీర్‌కు వీడ్కోలు పలకడంతో... నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నాదల్‌తో పాటు మేరీ పియర్స్, రిచర్డ్ గాస్కెట్‌ను కూడా సన్మానించనున్నారు. 25 ఏళ్ల క్రితం ఫ్రెంచ్ ఓపెన్‌లో పియర్స్ మహిళల సింగిల్స్, మహిళల డబుల్స్‌లో టైటిల్స్ సాధించింది. ఈ ఏడాది జూన్ 5న మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌కు ముందు ఆమెను సన్మానించనున్నారు. 50 ఏళ్ల పియర్స్ 2019లో టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లోనూ చోటు దక్కించుకుంది.

అనిరుధ్ జోడీకి చుక్కెదురు



లిస్బన్ (పోర్చుగల్): ఒయిరాస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–125 టెన్నిస్ టోర్నీలో పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్‌కు చుక్కెదురైంది. గత ఏడాది భారత్‌కే చెందిన అర్జున్ ఖడేతో కలిసి ఈ టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన అనిరుధ్ ఈ ఏడాది స్పెయిన్‌కు చెందిన డేవిడ్ వెగా హెర్నాండెజ్‌తో కలిసి బరిలోకి దిగాడు. తొలి రౌండ్‌లో అనిరుధ్–హెర్నాండెజ్ ద్వయం 3–6, 4–6తో టాప్ సీడ్ ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)–లుకాస్ మెడ్లెర్ (ఆస్ట్రియా) జోడీ చేతిలో ఓడిపోయింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–స్పానిష్ జోడీ ఒక ఏస్ సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. అనిరుధ్–హెర్నాండెజ్ మొత్తం 45 పాయింట్లు గెలుపొందగా... అందులో సర్వీస్ పాయింట్లు 25, రిటర్న్ పాయింట్లు 20 ఉన్నాయి. ఇదే టోర్నీలో ఆడుతున్న భారత క్రీడాకారులు జీవన్ నెడుంజెళియన్–విజయ్ సుందర్ ప్రశాంత్ జోడీ క్వార్టర్ ఫైనల్ చేరుకోగా... తన భాగస్వామి మార్టస్ గార్నెస్ (స్పెయిన్)తో కలిసి నిక్కీ కలియంద పునాచా సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.

ఫిక్సింగ్ యత్నంపై బీసీసీఐ ఆగ్రహం

ముంబై టి20 లీగ్ ఫ్రాంచైజీ సహ యజమాని గుర్మీత్‌పై నిషేధం

న్యూఢిల్లీ: ముంబై టి20 లీగ్‌లో పాల్గొన్న ఫ్రాంచైజీ యజమానిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిషేధం విధించింది. ఐదేళ్ల క్రితం ఆ లీగ్‌లో సొబో సూపర్ సానిక్స్ ఫ్రాంచైజీ సహ యజమాని గుర్మీత్ సింగ్ భమ్రా ఫిక్సింగ్‌కు యత్నించినట్లు తేలడంతో బోర్డు అంబుడ్స్‌మన్ రిటైర్డ్ జస్టిస్ అరుణ్ మిశ్రా నిషేధం విధించారు. ఐదేళ్లా లేదంటే జీవితకాల నిషేధమా అనేది తెలియాల్సి ఉంది. 2019 సీజన్‌లో సొబో సూపర్ సానిక్స్ ప్లేయర్లు ధవళ్ కులకర్ణి, భవిన్ ఠక్కర్‌లతో ఫిక్సింగ్ కోసం సంప్రదింపులు జరిపారు. టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన కులకర్ణి సహా ఠక్కర్‌లు ఫిక్సింగ్‌కు నిరాకరించారు. తదనంతరం ఈ విషయాన్ని బోర్డు అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ)కు తెలిపారు. సోనూ వాసన్ అనే వ్యక్తి ద్వారా గుర్మీత్ సింగ్ ఫిక్సింగ్ ప్రయత్నాలు చేశారు. సోనూ వాసన్ డబ్బు ఆశ చూపినా భవిన్ తలొగ్గలేదు. ఇద్దరు ఫిక్సింగ్‌కు ససేమిరా అనడంతో వారి ప్రయత్నాలు విఫలమయ్యాయి. విచారణలో గుర్మీత్ దోషని తేలడంతో శిక్ష ఖరారు చేశారు.

సాక్షి ప్లస్
శనివారం । 19-4-2025


వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం కర్నాటకలోని మంగళూరులో భారీ నిరసనలు


ప్రపంచ వారసత్వ దినం సందర్భంగా విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న ముంబై ఛత్రపతి శివాజీ రైల్వేస్టేషన్

యూరప్ 'మండుతోంది'

అత్యంత వేగంగా వేడెక్కుతోంది • నిత్యం వరదలు, కరువు, వడగాడ్పులే

ఇప్పటికే నానా సమస్యలతో సతమతమవుతున్న యూరప్ ఖండం పరిస్థితి సమీప భవిష్యత్తులో పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారనుందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు! అది పర్యావరణ మార్పుల ప్రభావానికి అత్యంత ఎక్కువగా లోనవుతుండటమే కారణం. దాంతో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వేడెక్కుతున్న ఖండంగా యూరప్ నిలిచింది. అంతేగాక వరదల దెబ్బకు ఆ ఖండంలో ఏకంగా 30 శాతం నదుల నెట్‌వర్క్ బాగా దెబ్బతింది. అక్కడ వాతావరణం ఎప్పుడెలా మారుతుందో ఎవరూ చెప్పలేనంత అస్థిరంగా మారిపోయింది. ఫలితంగా యూరప్‌కు సమీప భవిష్యత్తులో నానారకాలైన ప్రాకృతిక విపత్తులు పొంచి ఉన్నట్టు సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. ''వాటిని నివారించాలంటే యూరప్ దేశాలన్నీ ఒక్కతాటిపైకి తక్షణం ఒక్కతాటిపైకి రావాలి. ఇప్పటినుంచే సమగ్ర పర్యావరణ పరిరక్షణ విధానాలు రూపొందించాలి. అంతకంటే ముఖ్యంగా వాటిని తూచా తప్పకుండా అమలు చేయాలి. లేదంటే పెను ముప్పు తప్పదు''అని వారు కుండబద్దలు కొట్టారు.

నిత్యం ఉత్పాతాలే: యూరప్‌లో పలు దేశాల్లో ఆకస్మిక వరదలు, కనీవినీ ఎరగని ఎండలు, వడగాడ్పులు కొన్నేళ్లుగా పరిపాటిగా మారిపోయాయి. గతేడాది యూరప్ వ్యాప్తంగా చాలా దేశాలను వరదలు తీవ్రంగా వణికించడం తెలిసిందే. పశ్చిమ యూరప్‌ను గత పదేళ్లుగా 1950ల నుంచీ ఎన్నడూ చూడనన్ని వరదలు అతలాకుతలం చేశాయి. దక్షిణ యూరప్‌లో వరుసగా 13 రోజుల పాటు కనీవినీ ఎరగనంతటి వడగాడ్పులు వణించియా. స్కాండినేవియాలో గ్లేసియర్లు కొన్నేళ్లుగా శరవేగంగా కరిగిపోతున్నాయి. తూర్పు యూరప్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. యూరప్‌లోని నదుల్లో 30 శాతానికి పైగా గరిష్ట వరద స్థాయిని దాటిపోయాయి. ఒక్క 2024లోనే 12 శాతం నదులు తీవ్ర వరద స్థాయిలను దాటి నగరాల్లోకి పొంగిపొర్లాయి. ఫలితంగా గత అక్టోబర్లో ఒక్క వాలెన్సియా నగరంలోనే 232 మంది వరదలకు బలయ్యారు. గత సెప్టెంబర్లో బోరిస్ తుఫాను మధ్య యూరప్ దేశాల్లో అతి భారీ వానలకు కారణమైంది. ఇవన్నీ యాదృచ్ఛిక మేమీ కాదని సైంటిస్టులు చెబుతున్నారు. ఇదంతా రెండు దశాబ్దాలకు పైగా పర్యావరణంతో యథేచ్ఛగా చెలగాటమాడుతూ వచ్చిన ఫలితమని వారంటున్నారు. యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్, ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ)సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో సైంటిస్టులు ఈ మేరకు పేర్కొన్నారు. గతేడాది వరదలకు యూరప్‌లో చాలాదేశాల్లో తీవ్ర విధ్వంసానికి, వినాశనానికి దారితీశాయి. వాటి దెబ్బకు 4 లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారు. 335 మంది మరణించారు. యూరప్ చరిత్రలోనే కనీవినీ ఎరగని పరిణామమిది. వరదల నష్టం రూ.1.62 లక్షల కోట్ల పై చిలుకేనని అంచనా. ''ఉష్ణోగ్రతలపరంగా యూరప్ ఇప్పటికే నిప్పుల కుంపటిపై కూచుని ఉన్నట్టు లెక్క. ఇకనుంచి పెరిగి ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రతా ఆ ఖండం మొత్తాన్నీ వినాశనం వైపు నెడుతుంది''అని డబ్ల్యూఎంఓ ప్రధాన కార్యదర్శి సెలెస్టీ సావ్‌లో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూరప్ దిద్దుబాట పట్టింది. 2024లో ఖండంలో ఉత్పత్తయిన మొత్తం ఇంధనంలో సంప్రదాయేతర వనరుల వాటా 45 శాతానికి పెరిగింది. చాలా నగరాలు పర్యావరణ మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

మీరు కొత్త చట్టం కనిపెట్టారు

• మధ్యప్రదేశ్ హైకోర్టునుద్దేశించి సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: శిక్షా కాలం సగం ముగిశాక శిక్ష రద్దుపై నిర్ణయం తీసుకుంటామంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఓ వ్యక్తి పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఎటువంటి ప్రాతిపదిక లేని కొత్త చట్టాన్ని హైకోర్టు కనిపెట్టడం మాకు ఆశ్చర్యం కలిగించింది'అని వ్యాఖ్యానించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేసింది. భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నందున తీర్పును సవాల్ చేస్తూ వేసే అప్పీల్‌పై సమీప భవిష్యత్తులో వాదనలు వినే అవకాశాలు లేవు కాబట్టి బెయిలివ్వవచ్చని ఈనెల 17న వెలువరించిన తీర్పులో స్పష్టం చేసింది. చట్టాలను యథాతథంగా అమలు చేయాలని, బెయిల్ కోసం పిటిషనర్లు తమ దాకా వచ్చేలా చేయరాదని పేర్కొంది. హైకోర్టు ఏం చెప్పిందంటే..'తన వద్ద పట్టుబడిన నకిలీ నోట్ల గురించి పిటిషనర్ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. అందుకే, శిక్ష నిలిపివేత, బెయిల్ మంజూరుకు తగు ప్రాతిపదిక లేదు. మొదటి దరఖాస్తును తిరస్కరించిన రెండు నెలల్లోపలే బెయిల్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నాడు. అందుకే, సగం శిక్షా కాలం పూర్తయ్యాక మరోసారి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు'అని పేర్కొంది. సాధారణ చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల్లో నిందితులకు బెయిల్ తిరస్కరించవద్దని గతంలో ట్రయల్ కోర్టును, హైకోర్టులను కూడా సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిందని ధర్మాసనం గుర్తు చేసింది.

పంజాబ్ ఏజెంట్ ఢిల్లీలో అరెస్ట్

న్యూఢిల్లీ: ఫోర్జరీ ప్రయాణ పత్రాలు సృష్టించి భారతీయులను అమెరికాకు దొడ్డిదారిన పంపిస్తున్నట్లు ఆరోపణలున్న పంజాబ్ ఏజెంట్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. అమెరికా ఇటీవల డిపోర్ట్ చేసిన పంజాబ్ వాసి తెలిపిన వివరాల మేరకు పటియాలా జిల్లా మటొల్లి గ్రామానికి చెందిన నరేశ్ కుమార్(36)ను శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 4వ తేదీన పంజాబ్‌కు చెందిన గుర్‌సాహిబ్ సింగ్(39)ను అమెరికా అధికారులు వెనక్కి పంపారు. ఇతడిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని, ప్రశ్నించారు. 2024లో సింగపూర్ నుంచి వచ్చిన తను అమెరికా వెళ్లేందుకు గుర్‌దేవ్ సింగ్ అనే ఏజెంట్‌ను కలిసినట్లు గుర్‌సాహిబ్ విచారణలో తెలిపాడు. బేరం కుదిరిన మేరకు అతడికి రూ.20 లక్షలిచ్చినట్లు చెప్పాడు. ముందుగా యూకేకు, అక్కడి నుంచి స్పెయిన్, గ్వాటెమాలా, చివరగా మెక్సికోలో టిజువానా మీదుగా అమెరికాలోకి దొంగచాటుగా ప్రవేశించానని, అక్కడ అధికారులు మూడు నెల్ల పాటు నిర్బంధించి, వెనక్కి పంపేశారని చెప్పాడు. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు నరేశ్‌ను పట్టుకున్నారు. నకిలీ షెంజెన్ వీసాను గుర్‌సాహిబ్‌కు అంటగట్టిన నరేశ్...ఫోర్జరీని దాచిపెట్టడానికి గుర్‌సాహిబ్ పాస్‌పోర్ట్‌లో వివరాలను తారుమారు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇందుకుగాను గుర్‌దేవ్ సింగ్ తనకు కమీషన్ రూపంలో రూ.3 లక్షలిచ్చినట్లు నరేశ్ అంగీకరించాడు. తన సోదరుడితో కలిసి కొన్నేళ్లుగా ట్రావెల్ ఏజెంట్లుగా పనిచేస్తున్నట్లు వెల్లడించాడు. దీంతో, ఇతడి వల్ల ఇంకెవరైనా మోసపోసపోయారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రూ.2 వేల కోట్ల ఆస్తులపై కన్నేశారు

సోనియా, రాహుల్‌లపై బీజేపీ విమర్శ

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇచ్చిన నోటీసులకు రాజకీయ దురుద్దేశం ఆపాదిస్తున్న కాంగ్రెస్ నేతలపై బీజేపీ మండిపడింది. కోర్టుల్లో ఉన్న అవినీతి కేసుల నుంచి చేతనైతే బయటకు రావాలని సవాల్ విసిరింది. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు పంపిన ప్రజాధనాన్ని ఏదో కొద్దిమంది మాత్రమే చదివే వార పత్రిక నేషనల్ హెరాల్డ్‌లో ప్రకటనలిచ్చేందుకు దారి మళ్లించారని ఈడీ ఆరోపిస్తుండటం తెల్సిందే. ఈ పత్రికలో ఇచ్చిన ప్రకటనల కోసం ఎంత మేరకు ఖర్చు పెట్టిందీ కాంగ్రెస్ సీఎంలు వెల్లడించాలని ఠాకూర్ డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్‌ను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలా వాడుకుందన్నారు. తమ జేబు నుంచి ఒక్క పైసా పెట్టుబడి కూడా పెట్టకుండా రూ.2 వేల కోట్ల ఆస్తుల్ని కొల్లగొట్టాలని గాంధీలు ప్రయత్నించారన్నారు.

కుల వివక్ష అంతానికి రోహిత్ వేముల చట్టం తీసుకురండి

• కర్నాటక ప్రభుత్వాన్ని కోరిన రాహుల్

న్యూఢిల్లీ: విద్యాసంస్థల్లో కులవివక్షకు తావు లేకుండా చేసేందుకు రోహిత్ వేముల పేరుతో చట్టం తీసుకురావాలని కర్నాటక సీఎం సిద్ధరామయ్యను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కోరారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ తన జీవితంలో కుల వివక్ష కారణంగా పడిన అవమానాలను వివరిస్తూ ఈ నెల 16న లేఖ రాశారు. 'ఒకసారి ఎడ్లబండిలో ప్రయాణిస్తుండగా జరిగిన ఘటనను అంబేడ్కర్ ఇలా వివరించారు...మా బండిలో పుష్కలంగా ఆహారం, మంచి నీళ్లు ఉన్నాయి. మాకు బాగా ఆకలేస్తోంది కూడా. అయినప్పటికీ అంటరానివాళ్లమైన కారణంగా నీళ్లు, ఆహారం లేకుండా నిద్రపోవాల్సి వచ్చింది'అని రాహుల్ పేర్కొన్నారు. 'స్కూల్‌లో చదువుకునేటప్పుడు కూడా తరగతి గదిలో క్లాస్‌మేట్స్‌తో కాకుండా వేరుగా ఒక మూలనకూర్చునే వాడిని. అంటరానితనం కారణంగా ఇలాంటి ఎన్నో అవమానాలను, వివక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది'అని అంబేడ్కర్ అనుభవాలను గాంధీజీ వివరించారని కూడా రాహుల్ పేర్కొన్నారు. అంబేడ్కర్ పడిన అవమానాలు దేశంలో మరే విద్యార్థి కూడా పడరాదని సిద్ధరామయ్యను రాహుల్ కోరారు. 'రోహిత్ వేముల, పాయల్ తాడ్వి, దర్శన్ సోలంకి వంటి ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థుల హత్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కావు. వీటికి ముగింపు పలకాలి. దీనికోసం రోహిత్ వేముల పేరుతో ఒక చట్టం చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతున్నా'అని రాహుల్ తెలిపారు. ఈ మేరకు ఆ లేఖను ఎక్స్‌లో షేర్ చేశారు. ఇటీవల తనను కలిసిన పలువురు దళిత, ఆదివాసీ, ఓబీసీ విద్యార్థులు సైతం కాలేజీలు, వర్సిటీల్లో కుల వివక్ష కారణంగా అవమానాలకు గురవుతున్నట్లు తనకు తెలిపారని రాహుల్ పేర్కొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన రోహిత్ వేముల అనే దళిత విద్యార్థి కుల వివక్ష కారణంగా 2016లో ఆత్మహత్య చేసుకోవడం తెల్సిందే.

రాణా ప్రతాప్, శివాజీ మన హీరోలు.. ఔరంగజేబ్ కాదు: రాజ్‌నాథ్

ఛత్రపతి శంభాజీ నగర్: రాణా ప్రతాప్ సింగ్, ఛత్రపతి శివాజీ మహారాజ్‌లు మన జాతి హీరోలని, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ కాదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మేవాడ్ పాలకుడు మహారాణా ప్రతాప్ విగ్రహాన్ని శుక్రవారం ఛత్రపతి శంభాజీ నగర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఔరంగజేబ్, బాబర్‌లను శ్లాఘించడం దేశంలోని ముస్లింలను అగౌరవపర్చడమే అవుతుందని చెప్పారు. 'ధైర్యసాహసాలు, దేశ భక్తికి ప్రతిరూపం మహారాణా ప్రతాప్..ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ముఖ్యంగా గెరిల్లా యుద్ధతంత్రంలో ఆయనే స్ఫూర్తి'అని రాజ్‌నాథ్ తెలిపారు. ఔరంగజేబ్‌ను పొడిగేవారు అతడి గురించి పండిట్ నెహ్రూ ఏం రాశారో తెలుసుకోవాలని సూచించారు. స్వాతంత్ర్యానంతరం వామపక్ష అనుకూల భావాలు కలిగిన కొందరు చరిత్రకారులు రాణా ప్రతాప్, శివాజీలకు తగు ప్రాధాన్యం ఇవ్వలేదు సరికదా, ఔరంగజేబ్‌ను కీర్తించారని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని మతాలను గౌరవిస్తూ ఉపనిషత్తులను అనువదించిన దారా షికోను ఔరంగజేబ్ చంపించాడన్నారు. మొఘలులతో జరిగిన హల్దీఘాటి యుద్ధంలో రాణా ప్రతాప్ సైన్యాధికారి హకీంఖాన్ సూరి ప్రాణత్యాగం చేశాడని చరిత్రను మంత్రి గుర్తు చేశారు.

అల్లర్ల బాధితులను కలిసిన బెంగాల్ గవర్నర్

• కేంద్రానికి నివేదిక అందజేయనున్నట్లు వెల్లడి
• ఎన్‌హెచ్చార్సీ, ఎన్సీడబ్ల్యూ బృందాల పర్యటన


శుక్రవారం మాల్దా బాధితులను పరామర్శించేందుకు వస్తున్న పశ్చిమబెంగాల్ గవర్నర్ ఆనందబోస్

మాల్దా/కోల్‌కతా: పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్‌తోపాటు, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్ బృందాల సభ్యులు శుక్రవారం మాల్దా జిల్లాలో ఆశ్రయం పొందుతున్న అల్లర్ల బాధితులను కలుసుకున్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్ జిల్లాలోని ముస్లిం మెజారిటీ ఉన్న షంషేర్‌గంజ్, సుటి, ధులియన్, జంగీపూర్ ప్రాంతాల్లో ఈ నెల 11,12వ తేదీన చోటుచేసుకున్న అల్లర్లలో ముగ్గురు చనిపోవడం తెల్సిందే. హింసాత్మక ఘటనల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. భీతిల్లిన సామాన్యులు వందలాదిగా పొరుగునే ఉన్న మాల్దా జిల్లాకు వెళ్లి ఆశ్రయం పొందుతున్నారు. వీరి కోసం మాల్దాలోని పర్ లాల్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక సహాయ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రశాంతత కొనసాగేందుకు పర్యటనను వాయిదా వేసుకోవాలని సీఎం మమతా బెనర్జీ చేసిన సూచనను గవర్నర్ సీవీ ఆనంద బోస్ పట్టించుకోలేదు. అక్కడికెళ్లి స్వయంగా పరిస్థితులను స్వయంగా పరిశీలించి, కేంద్రానికి నివేదిక అందజేస్తానంటూ ఆయన శుక్రవారం రైలులో పర్ లాల్‌పూర్ చేరుకుని బాధితులతో సమావేశమయ్యారు. వారి కష్టనష్టాలను తెలుసుకున్నారు. కొందరు దుండగులు తమ ఇళ్లపై దాడులు చేసి, సర్వస్వం దోచుకుని, బయటకు గెంటేశారని బాధిత మహిళలు చెప్పారని అనంతరం గవర్నర్ ఆనందబోస్ మీడియాకు తెలిపారు. సహాయక శిబిరాల్లో వసతుల లేమిపై యంత్రాంగం నుంచి సవివర నివేదిక కోరానన్నారు. ఆయన వెంట ఉన్న రాజ్‌భవన్ అధికారులు ఫిర్యాదులను నోట్ చేసుకున్నారు.

పార్ లాల్‌పూర్‌లో ఉద్రిక్తతలు

ప్రాణభయంతో పారిపోయి వచ్చిన తమను జిల్లా అధికారులు తిరిగి వెనక్కి వెళ్లిపోవాలని బలవంతం చేస్తున్నట్లు పార్ లాల్‌పూర్‌లో ఆశ్రయం పొందుతున్న ముర్షిదాబాద్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం తమ వద్దకు వచ్చిన జిల్లా అధికారులను వారు చుట్టుముట్టారు. ఎండిన రొట్టెలు, అరటి పండ్లు, ముక్కిపోయిన బియ్యం ఇస్తున్నారన్నారు. శిబిరాల్లో పరిస్థితులు జైలు కంటే దారుణంగా ఉన్నాయని మండిపడ్డారు. తమ సొంతూళ్లో పరిస్థితులు ఏమంత సురక్షితంగా లేవన్నారు. తమ నివాసప్రాంతాల్లో బీఎస్‌ఎఫ్ జవాన్లు క్యాంపులను ఏర్పాటు చేసేదాకా తిరిగి వెళ్లేది లేదన్నారు. పోలీసులు తమను మీడియాతోను, చివరికి బంధువులతో సైతం మాట్లాడవద్దని ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్చార్సీ) శుక్రవారం మాల్దాలోని పర్ లాల్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాల సహాయ శిబిరాన్ని సందర్శించింది. కమిషన్ సభ్యులు బాధిత కుటుంబాలతో మాట్లాడారు. వీరు మూడు వారాల్లోగా ఎన్‌హెచ్చార్సీకి నివేదికను సమర్పించాల్సి ఉంది. ముర్షిదాబాద్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందంటూ అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎన్‌హెచ్చార్సీ ప్రకటించింది. అదేవిధంగా, జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ విజయా రాహత్కర్ తన బృందంతో శుక్రవారం మాల్దాలోని తాత్కాలిక సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న అల్లర్ల బాధితుల కుటుంబాలతో మాట్లాడారు. శిబిరాల్లో మహిళలు, చిన్నారులకు కల్పించిన సౌకర్యాలను చూసి షాక్‌కు గురైనట్లు ఆమె తెలిపారు. మహిళలను ఇళ్ల నుంచి వెళ్లగొట్టి, అనూహ్యమైన ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌ను మరో బంగ్లాదేశ్ మాదిరిగా మార్చాలని టీఎంసీ ప్రభుత్వం అనుకుంటోందా? అని ప్రశ్నించారు. శనివారం ఈ బృందం ముర్షిదాబాద్‌కు వెళ్లనుంది. అనంతరం కోల్‌కతాలో గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు డీజీపీతో భేటీ అవుతారు. కాగా, గవర్నర్ ఆనంద బోస్, ఎన్‌హెచ్చార్సీ, ఎన్సీడబ్ల్యూ బృందాల పర్యటనలు రాజకీయ ప్రేరేపితమని, పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని టీఎంసీ ఆరోపించింది.

గాజాపై యుద్ధం ఆపండి

ఇజ్రాయెల్ సర్కారుకు సైనికుల లేఖలు! • తొలగిస్తామన్న హెచ్చరికలూ బేఖాతరు

టెల్అవీవ్: గాజాపై యుద్ధం పట్ల ఇజ్రాయెల్ సైనికుల్లోనూ అసంతృప్తి, వ్యతిరేకత నానాటికీ ప్రబలుతున్నాయి. దానికి ఇకనైనా తెర దించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు. తొలుత వైమానిక దళానికి చెందిన 1,000 మందికి పైగా మాజీ సైనికులు ఇటీవల ఈ మేరకు బహిరంగ లేఖ రాశారు. దానిపై సైన్యం కన్నెర్రజేసింది. లేఖపై రిజర్వ్ సైనికులెవరైనా సంతకం చేస్తే ఉద్వాసన తప్పదని హెచ్చరించింది. వాటిని బేఖాతరు చేస్తూ కొద్ది రోజులుగా మాజీలు, రిజర్వ్ సైనికులు కూడా వేలాదిగా బహిరంగ లేఖలు రాస్తుండటం విశేషం. ఇజ్రాయెల్‌లో క్రమంగా ఇదో ఉద్యమంగా మారుతుండటం విశేషం. నెతన్యాహు సర్కారు ఫక్తు రాజకీయ కారణాలతోనే యుద్ధాన్ని కొనసాగిస్తోందని వారు ఆరోపించారు. రెండేళ్లు సమీపిస్తున్నా ఇంకా బందీలందరినీ విడిపించడం ప్రభుత్వానికి చేతగావడం లేదని ఆక్షేపించారు. గాజాపై పోరు విషయంలో ఇజ్రాయెలీల్లో నెలకొన్న వ్యతిరేకతకు ఈ ఉదంతం అద్దం పడుతోందని పరిశీలకులు భావిస్తున్నారు. 2023లో న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు నెతన్యాహు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు.

రోమ్‌లో వాన్స్, మెలోనీ టారిఫ్ చర్చలు

రోమ్: టారిఫ్‌లపై అమెరికా–ఇటలీల మధ్య జరుగుతున్న చర్చల వేదిక రోమ్‌కు మారింది. శుక్రవారం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీతో సమావేశమయ్యారు, ప్రధాని కార్యాలయం ఛిగి ప్యాలెస్‌లో వీరు చర్చలు జరిపారు. అనంతరం, వైట్‌హౌస్, మెలోనీ కార్యాలయం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అతిత్వరలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటలీని సందర్శించనున్నారని ఆ ప్రకటన తెలిపింది. ఆ సమయంలోనే అమెరికా– యూరప్ మధ్య చర్చలు జరపాలనే విషయం పరిశీలనలో ఉందని కూడా పేర్కొంది. గురువారం వైట్ హౌస్‌లో చర్చల సందర్భంగా మెలోనీ పక్కనే కూర్చున్న ట్రంప్..వాణిజ్యం ఒప్పందాలు కుదుర్చుకునేందుకు తాము తొందరపడటం లేదని తెలిపారు. యూరప్‌తోపాటు మధ్యధరా ప్రాంతంలో అమెరికాకు అత్యంత ముఖ్యమైన భాగస్వామిగా ఇటలీ ఉంటుందని భావిస్తున్నామని మెలోనీ పేర్కొన్నారు. వాన్స్‌తో జరుగుతున్న చర్చల్లో సుదీర్ఘకాలం మైత్రి మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముందు మీ సంగతి చూసుకోండి

• మైనారిటీల దుస్థితిపై దృష్టి పెట్టండి
• బంగ్లా వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ (సవరణ) చట్టం సంబంధిత హింసపై బంగ్లాదేశ్ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. బంగ్లాలో మైనారిటీలపై సాగుతున్న తీవ్ర హింస నుంచి అంతర్జాతీయ సమాజం దృష్టి మరల్చేందుకు ఇదో చౌకబారు ప్రయత్నమంటూ దుయ్యబట్టింది. బెంగాల్ ఘర్షణలతో ప్రభావితమవుతున్న ముస్లిం మైనారిటీలను కాపాడాలని బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి యూనుస్ ప్రెస్ సెక్రటరీ గురువారం భారత అధికారులను కోరారు. వీటిపై కేంద్రం మండిపడింది. అనవసర వ్యాఖ్యలు మాని బంగ్లాలో మైనారిటీల హక్కుల పరిరక్షణపై దృష్టి పెట్టాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సూచించారు. బంగ్లాలో మైనారిటీలపై విచ్చలవిడిగా కొనసాగుతున్న హింసతో బెంగాల్‌ను పోల్చడం నిస్సిగ్గు వ్యవహారమంటూ దుయ్యబట్టారు.

బంగ్లాలో మైనారిటీలే టార్గెట్

బంగ్లాదేశ్‌లో గతేడాది షేక్ హసీనా పదవీచ్యుతురాలైన నాటి నుంచి పరిస్థితులు దారుణంగా క్షీణిస్తూ వస్తున్నాయి. హిందువులు, మైనారిటీలపై రాడికల్ ఇస్లామిస్టులు తీవ్ర దాడులకు పాల్పడుతున్నారు. 200కు పైగా ఆలయాలను ధ్వంసం చేశారు. ఆలయాల అపవిత్రం పండుగల సందర్భంగా దాడులు పరిపాటిగా మారాయి. అర్చకులను అరెస్టు చేశారు. బంగ్లాలో మైనారిటీల దుస్థితిపై భారత్ పలుమార్లు ఆందోళన వ్యక్తం చేస్తోంది. బెంగాల్‌లో వక్ఫ్ వ్యతిరేక అల్లర్లలో బంగ్లాదేశీ దుండగులు పాత్ర ఉందని కేంద్ర హోం శాఖ పేర్కొనడం తెలిసిందే.

ఐదేళ్ల విరామం అనంతరం మానస సరోవర యాత్ర షురూ

• లిపులేఖ్, డెమ్ చోక్ మీదుగా కొత్త మార్గం!

న్యూఢిల్లీ: ఐదేళ్ల విరామం తర్వాత కైలాస మానస సరోవర యాత్ర తిరిగి ప్రారంభం కానుంది. అందుకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. విదేశాంగ శాఖ ఈ మేరకు త్వరలో పబ్లిక్ నోటీస్ జారీ చేయనుంది. భారత్, చైనా దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా యాత్రను పునఃప్రారంభిస్తున్నారు. ''యాత్ర త్వరలో ప్రారంభమవుతుంది. ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తాం'' అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. జూన్, సెప్టెంబర్ మధ్య జరిగే మానస సరోవర యాత్రను గాల్వన్ ఘర్షణల నేపథ్యంలో 2020లో నిలిపేశారు. ఐదేళ్లుగా యాత్ర జరగడం లేదు. చైనాతో సంప్రదింపుల అనంతరం యాత్రకు మార్గాలను పునర్నిర్మించాలని భారత్ తాజాగా భావిస్తోంది. లిపులేఖ్ కనుమతో పాటు డెమ్‌చోక్ మీదుగా అక్కడికి వెళ్లేలా ఓ మార్గాన్ని యోచిస్తున్నాయి. 2024 అక్టోబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన చర్చల్లో ఈ విషయమూ ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. తూర్పు లద్దాఖ్‌లోని డెప్సాంగ్, డెమ్చోక్ వంటి కీలకమైన ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణకు ఇరు దేశాలు అంగీకరించాయి.

షికాగోలో భారత సంతతి వ్యక్తి కాల్చివేత

షికాగో: భారత సంతతికి చెందిన అమెరికా పౌరుడు షికాగోలో హత్యకు గురయ్యాడు. మృతుడిని 28 ఏళ్ల కెవిన్ పటేల్‌గా గుర్తించారు. అతడిని లింకన్ పార్క్‌లో కాల్చి చంపారు. కాల్పులకు కారణాలు తెలియరాలేదు. షికాగోలో వెస్ట్ లిల్ అవెన్యూలోని 800 బ్లాక్‌లో ఏప్రిల్ 16 రాత్రి 9.20 గంటల ప్రాంతంలో కాల్పుల శబ్దం వినిపించింది. పక్కనే నివాసముంటున్న వ్యక్తి అప్రమత్తమై బయటికి వెళ్లి చూడగా పటేల్ తన పక్కింటి ముందు గాయాలతో పడున్నాడు. ఇద్దరు వ్యక్తులు అక్కణ్నుంచి పారిపోతూ కన్పించారు. పటేల్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదు. ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా నివేదిక ప్రకారం అమెరికాలో ఒక్క 2023లోనే తుపాకీ సంబంధిత గాయాల కారణంగా ఏకంగా 47,000 మరణాలు సంభవించాయి. అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ ప్రకారం యూఎస్‌లో తుపాకీ హింస తగ్గినప్పటికీ, ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల కంటే దాదాపు ఏడు రెట్లు ఎక్కువగా ఉంది.

ఇమ్రాన్ సోదరీమణుల అరెస్టు

రావల్పిండీ: జైల్లో ఉన్న పాక్ మాజీ ప్రధాని 72 ఏళ్ల ఇమ్రాన్‌ఖాన్‌ను కలిసేందుకు వెళ్లిన ఆయన సోదరీమణులను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్నారు. ప్రతి మంగళ, గురువారాల్లో కుటుంబీకులు, లాయర్ల బృందం ఆయన్ను కలుస్తారు. గురువారం వెళ్లిన ఇమ్రాన్ సోదరీమణులు అలీమా, ఉజ్మా, నొరీన్‌తో పాటు పీటీఐ పార్టీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. వెనక్కు వెళ్లాలని కోరారు. వారు నిరాకరించడంతో ఘర్షణ నెలకొంది. వారిని అరెస్టు చేసి జైలుకు దూరంగా విడిచిపెట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అడియాలా జైలు బయట పీటీఐ నేతలను అరెస్టు చేయడం ఈ వారంలో ఇది రెండోసారి. వీటిని పార్టీ ఖండించింది. బలమైన ప్రజా ప్రతిస్పందన తప్పదని హెచ్చరించింది. ఇంగ్లండ్‌లో ఉంటున్న తన పిల్లలతో మాట్లాడేందుకు, వైద్య పరీక్షలకు ఇమ్రాన్ పెట్టుకున్న పిటిషన్లను పాక్ కోర్టు ఇటీవలే అనుమతించింది.

నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. మావోయిస్టులు తప్పించుకోగా, నగదు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కంపెనీ–1కు చెందిన సభ్యులు సంచరిస్తున్నారనే సమాచారంతో గురువారం రాత్రి నుంచి బలగాలు కూంబింగ్ సాగిస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరుపుతూ తప్పించుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలో రూ.6.లక్షల నగదు, 11 ల్యాప్‌ట్యాప్‌లు, వాకీటాకీలు, టిఫిన్ బాంబు, ఎలక్ట్రిక్ వైర్ లభ్యమయ్యాయి. తప్పించుకున్న వారి కోసం అదనపు బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేశారు.

ఇలాంటి కేసులు వద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఓ మహిళ తన భర్త బంధువులపై పెట్టిన కట్నం వేధింపుల కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో వారిని అనవసరంగా ఇరికించారని, ఈ కేసును అనుమతించడం విసుగు కలిగించే విచారణకు దారి తీసిందని వ్యాఖ్యానించింది. కట్నం ఆరోపణలపై భర్త బంధువులను లాగే కేసులకు సుప్రీంకోర్టు ఇప్పటికే ముగింపు పలికిందని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. ఈ దంపతులు వివాహ బంధానికి ముగింపు పలికిన మూడేళ్ల ఆ తర్వాత కట్నం వేధింపుల కేసు పెట్టడాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. అదేవిధంగా, భార్యాభర్తలుగా కలిసి జీవించిన సమయంలో ఎటువంటి ఘటనలు చోటుచేసుకోలేదు, నిర్దిష్ట ఆరోపణలూ లేవు. అయినప్పటికీ పిటిషనర్లను అనవసరంగా ఈ కేసులో ఇరికించినట్లు స్పష్టమవుతోందని పేర్కొన్న ధర్మాసనం అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ఈ నెల 16న తీర్పు వెలువరించింది. 2010 జూన్‌లో వివాహం కాగా, అదే ఏడాది అక్టోబర్‌లో భర్తను వదిలి తల్లిదండ్రుల వద్దకు చేరింది. 2012లో వీరికి విడాకులు మంజూరైంది. అయితే, 2015లో తల్లిగారింట్లో ఉంటున్న తన వద్దకు వచ్చిన భర్త కుటుంబసభ్యులు కట్నం కోసం బెదిరింపులకు గురి చేశారంటూ మహిళ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేయాలని ట్రయల్ కోర్టు ఆదేశించింది. అలహాబాద్ హైకోర్టు సైతం ఈ ఆదేశాలను సమర్థించడంతో పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

22 మంది మావోయిస్టుల అరెస్టు

చర్ల/దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మూడు చోట్ల పోలీసులు 22 మంది మావోయిస్టులను శుక్రవారం అరెస్టు చేశారు. ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధి టేకుమెట్ల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు అనుమానాస్పదంగా కనిపించిన ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద టిఫిన్ బాంబు, ఎలక్ట్రిక్ వైర్లు లభ్యమయ్యాయి. తమ నేతల ఆదేశాలతో మందుపాతరను ఏర్పాటు చేసేందుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. అలాగే, జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో మందుగుండు సామగ్రితో వెళ్తున్న ఆరుగురిని, నెల్సానార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో 9 మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంస్కృతంలో మధురా విజయం రాసింది ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

విజయనగర సామ్రాజ్యం

ఆర్థిక వ్యవస్థ

భూమి పన్ను, వివిధ వృత్తి పన్నులు, సామంతులు చెల్లించిన కప్పాలు, శత్రు రాజ్యాల నుంచి దోపిడీ చేసిన సొమ్ము, రాజ ప్రతినిధులు చెల్లించే రాజాభరణాలు, బహుమతులు, విజయనగర సామ్రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరులు. భూమిని నాలుగు రకాలుగా విభజించారు. మాగాణీ పొలాన్ని 'నీరాంబరం', మెట్ట పొలాన్ని 'కాడాంబరం'గా పేర్కొన్నారు. ఈ కాలంలో పన్నులు అధికంగా ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు.

పన్నుల స్వరూపం: పంట పొలం, సారం, దిగుబడుల ఆధారంగా పన్ను మదింపు చేసేవారు. సాధారణంగా ఫలసాయంలో ఆరో వంతును పన్నుగా వసూలు చేసేవారు. భూమిని 'కీసరపాటి గడ'తో కొలిచేవారు. ఆముక్తమాల్యద ప్రకారం రాజుకు లభించే ఆదాయాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఖర్చు చేసేవారు. రాజు దానాలు, రాజు వ్యక్తిగత వ్యయం, గుర్రాల నిర్వహణ, దండయాత్రలు, దేశాభివృద్ధి, రక్షణకు ఆదాయాన్ని ఖర్చు చేసేవారు.

భూమి, వృత్తి, వివాహం, పారిశ్రామిక ఉత్పత్తులపై పన్నులుండేవి. ఒకే స్థలంలో అమ్మకానికి వచ్చే సరకులపై 'స్థలాదాయం' పన్ను, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకుపోయే వస్తువులపై 'మార్గాదాయం' పన్ను, ఇతర రాజ్యాలకు ఎగుమతి చేసే వస్తువులపై 'మామూలాదాయం' పన్ను, నేత మగ్గాలపై 'మగ్గరి' పన్ను ఉండేది. దూదిని ఏకి దారం తీసేవాళ్లు 'పంజుణి సిద్ధాయం' అనే పన్ను చెల్లించేవారు. విజయనగర రాజ్యంలో కొన్ని సీమల్లో పెళ్లి సుంకాలను రద్దు చేసిన మొదటి రాజు తుళువ వీరనరసింహుడు. శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్యమంతటా వివాహ సుంకాలను రద్దు చేశారు. ఇంటిపై 'ఇల్లం', పశువులు మేసే పచ్చిక బయళ్లపై 'పుల్లం', అంగళ్లపై 'మడిగె' లేదా 'అడికాసు' పన్ను, స్థలంపై 'మన', తృణధాన్యాలు, కూరగాయలపై 'మలబ్రమ', కుల తగువుల ద్వారా 'సమయసుంకం' అనే పన్నులు వసూలు చేసేవారు. శ్రీకృష్ణదేవరాయలు వేయించిన కొండవీడు శాసనంలో వివిధ వస్తువులపై విధించిన పన్నుల వివరాలు ఉన్నాయి. వేశ్యలపై పన్ను విధించి దాంతో రక్షక భటులకు జీతాలు చెల్లించేవారని డొమింగోపయస్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. యాచక వృత్తి (బిచ్చగాళ్ల)పై పన్నును 'గణాచారి' పన్ను అని పిలిచేవారు. పుత్రులు లేని కుటుంబీకుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేది. కోటల నిర్వహణకు 'దుర్గనివర్తన', 'దుర్గదణ్ణాయి' అనే పన్నులుండేవి. ఈ పన్నుల వివరాలను రాసేవారిని 'రాయలేఖకులు'గా పిలిచేవారు. వారి సేవలకుగాను రాజులు తగిన హోదా, గౌరవాలు ప్రసాదించారు. భూములు సర్వే చేయడానికి 20 అడుగుల పొడవున్న మానదండాన్ని ఉపయోగించేవారు. వివిధ ఉత్సవాలు, దేవాలయ నిర్మాణాలు, పూజా క్రతువులకు దానాలు, బహుమతులు ఇవ్వడం, వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు అవసరమైన నీటి కాల్వలు, చెరువులు నిర్మించడం లాంటి మంచి పనులు చేసేవారు. సంగీత, సాహిత్య కృత్యాల్లో ప్రావీణ్యం ఉన్న వారిని సముచితంగా గౌరవించేవారు.

న్యాయవ్యవస్థ - శిక్షలు

చక్రవర్తే న్యాయ వ్యవస్థకు ఉన్నతాధికారి. అత్యున్నత న్యాయస్థానం రాజాస్థానం. న్యాయాధీశులను 'ప్రాడ్వివాకులు'గా పిలిచేవారు. సివిల్ నేరాలను ధనోద్భవ, క్రిమినల్ నేరాలను హింసోద్భవ అని పిలిచేవారు. కొన్ని నేరాలకు శిక్షలు కఠినంగా, క్రూరంగా ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు. చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడేవారి కాలు, చెయ్యి నరికేసేవారు. పెద్ద దొంగతనాలకు గొంతు కింద కర్రగుచ్చి వేలాడదీసేవారు. రాజద్రోహం చేసిన వారికి శూలాలతో పొత్తికడుపులో గుచ్చడం లాంటి శిక్షలుండేవి. బ్రాహ్మణులకు మరణశిక్ష అమల్లో లేదు. కానీ కనుగుడ్లు తీయడం, గాడిదలపై ఊరేగించడం లాంటి శిక్షలుండేవి. అట్టడుగు కులాలవారు నేరాలు చేస్తే శిరోముండనం చేసేవారు. అపరాధులను ఏనుగులతో తొక్కించేవారు. అల్ప నేరాలకు పాల్పడిన వారి వీపులపై బండరాళ్లు ఎత్తించేవారు. కింది తీర్పులపై రాజువద్ద పునర్విమర్శ ఉండేది. సత్యప్రమాణం చేయించి శాస్త్రాలు చూసి న్యాయం నిర్ణయించేవారు. గ్రామచావడి, దేవాలయ ప్రాంగణం, ఊరి మధ్య రచ్చబండల వద్ద తీర్పులు చెప్పేవారు.

సామాజిక పరిస్థితులు

అల్లసాని పెద్దన మనుచరిత్ర, విదేశీ యాత్రికుల యాత్రాకథనాలు నాటి సామాజిక పరిస్థితులను వివరిస్తున్నాయి. సమాజంలో వర్ణ వ్యవస్థ, దానికి అనుగుణంగా అనేక కులాలు, ఉపకులాలు ఏర్పడ్డాయి. బ్రాహ్మణాధిక్యత ఉండేది. యజ్ఞాలు, యాగాలు, దానాలు, క్రతువులు విరివిగా చేసేవారు. కవి పండిత సభలు జరిగేవి. యుద్ధాల్లో క్షత్రియులు, వాణిజ్యంలో వైశ్యులు పేరు పొందారు. శూద్రులను తక్కువ కులంగా భావించేవారు. శ్రమశక్తి అంతా వీరిదే. గ్రామాల్లో కుల ప్రాతిపదికన ప్రజలు వేర్వేరుగా నివసించేవారు. మాలలు, మాదిగలను గ్రామాలకు దూరంగా ఉంచేవారు. పాదరక్షలు, చాంతాళ్లు నేయడం, తోలుసంచులు తయారు చేయడం వీరి వృత్తి. విప్రవినోదులు వివిధ వేషాలతో ప్రజలను ఆహ్లాదపరిచేవారు. దేవదాసీలు, వేశ్యావ్యవస్థ, సతీ సహగమనం, ఆత్మార్పణలు, జంతుబలులు లాంటి దురాచారాలు ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు. రాజులు విలాసమైన జీవితం గడిపేవారు. రాజ ప్రసాదానికి అనుకొని 72 కార్యాలయాలు (నియోగాలు) ఉండేవి. యుక్తవయసులో ఉన్న స్త్రీలను రాజుకు రక్షక భటులుగా కూడా నియమించేవారు. కన్యలను ఇతర దేశాల నుంచి కూడా దిగుమతి చేసుకునేవారు. సమాజంలో భోగ స్త్రీలకు గౌరవం ఉండేది. వారు సంగీతం, నాట్యంలో నిష్ణాతులని పయస్ పేర్కొన్నాడు. వివాహాలు ఎనిమిది విధాలుగా జరిగేవి. కట్నాలు, కానుకలుండేవి. పురాణాలు, ఇతిహాసాలు యక్షగానాలు సామాన్య ప్రజల్లో ప్రాచుర్యం పొందాయి. శరన్నవరాత్రులు పదిరోజుల పాటు వైభవంగా జరిగేవి. తొలి విజయనగర రాజులు శైవభక్తులు. తర్వాత రాజులు వైష్ణవ మతాన్ని ఆదరించారు. సంస్కృత నాటకాలు, తెలుగు, కన్నడ యక్షగానాలు, బొమ్మలాటలు, కోడి, గొర్రెపోతు పందేలు నాటి ముఖ్యమైన వినోదాలు. విజయనగర రాజుల కులదైవం విరూపాక్షస్వామి. వీరి రాజ లాంఛనం వరాహం.

శ్రీకృష్ణదేవరాయలు విద్యాగోష్ఠులు జరిపే సభాభవనం పేరు 'భువన విజయం'. ఆయన నివసించే మందిరం 'మలయకూటం'. సాహిత్య సదస్సులో అష్టదిగ్గజాలు విద్వత్తు ప్రదర్శించేవారు. విజయనగరం అత్యంత జన సాంద్రత ఉన్న నగరం. వర్తక వ్యాపారాలకు ప్రధాన కేంద్రం. చైనా నుంచి పట్టు వస్త్రాలు దిగుమతి అయ్యేవని పోర్చుగీసు యాత్రికుడు బార్బోసా పేర్కొన్నాడు. కర్పూరం, చందనం, మిరియాలు, ఏలకులు లాంటి సుగంధ ద్రవ్యాలకు మలబారు తీరం ప్రసిద్ధి చెందింది. గోవా రేవు ద్వారా అరేబియా గుర్రాలు దిగుమతి అయ్యేవి. రాట్నాలపై నూలు వడికేవారు. సాలివారిలో సాలి, పద్మశాలి, పట్టుశాలి, ఆగశాలి లాంటి శాఖలుండేవి. అనంతపురంలోని 'వజ్రకరూర్' వజ్రాలకు ప్రసిద్ధి చెందింది. వస్త్రాలకు నీలి, మంజిష్ఠ, కరక్కాయి, ఇంగిలికం లాంటి రంగులు అద్దేవారు. కంసాలి, కమ్మరి, కుమ్మరి తదితరులు కులవృత్తులపై జీవించేవారు.

సంఘంలో వరహాలు, మాడలు, ఫణాలు, ప్రతాపులు (బంగారు నాణేలు), చిన్నము, తార్ లేదా తారం (వెండి నాణేలు), జితల్ (రాగి నాణేలు) రూపంలో డబ్బు చెలామణి అయ్యేది. ధనాన్ని భూమిలోపల బిందెలలో దాచి పెట్టేవారు. ధాన్యాన్ని సోల, తూము, మానికల్లో కొలిచేవారు. ఈ కాలంలో అందగత్తెల వ్యాపారం కూడా జరిగేది. వీరిని 'చంద్రవణామణులు' అని పిలిచేవారు. వీరిని విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. ప్రజలకు జాతరలు, అలంకరణపై మోజు ఎక్కువ.

బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలను 'బ్రహ్మదేవ గ్రామాలు'గా పిలిచేవారు. వీటిపై పన్ను మినహాయింపు ఉండేది. రాజోద్యోగులు, పండితులు, కవులు, శాస్త్రవేత్తలకు ఇచ్చిన గ్రామాలను 'ఉంబళి గ్రామాలు'గా పిలిచేవారు. నిత్య పూజా పునస్కారాలు, ఉత్సవాల నిర్వహణకు పూర్తిగా పన్నులు మినహాయించి ఇచ్చిన గ్రామాలను 'దేవాదాయ గ్రామాలు'గా గుర్తించేవారు. శైవ, వైష్ణవ మఠాధిపతులకు దానమిచ్చిన గ్రామాలను 'మఠాపుర గ్రామాలు' అని పిలిచేవారు. రాజగ్రామాలను 'భండారవాడ' గ్రామాలని పిలిచేవారు.

సాహిత్యం - కళలు

ఈ యుగంలో తెలుగు, కన్నడ, తమిళ, సంస్కృత భాషల్లో సాహిత్యం వికసించింది. కుమార కంపన భార్య గంగాదేవి సంస్కృతంలో 'మధురావిజయం' రచించింది. తిరుమలాంబిక 'వరదాంబిక పరిణయం', రామభద్రాంబిక 'రఘునాథాభ్యుదయం', రాజనాథ డిండిముడు 'సాళువాభ్యుదయం', రెండో దేవరాయలు బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానం, శ్రీకృష్ణదేవరాయలు 'జాంబవతీ పరిణయం', 'ఉషా పరిణయం', 'మదాలస చరిత్ర', 'ఆముక్తమాల్యద' గ్రంథాలు రచించారు. విద్యారణ్యుడు 'సంగీతసారం', బండారు లక్ష్మీనారాయణ 'సంగీత సూర్యోదయం', నారాయణ తీర్థులు 'కృష్ణలీలా తరంగిణి' రచించారు.

బహమనీ సుల్తానులు

ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేసి, దక్కన్‌లో బహమనీ అమీర్లు క్రీ.శ. 13వ శతాబ్దంలో స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పద్నాలుగు మంది బహమనీ సుల్తాన్లు సుమారు 175 ఏళ్లు దక్కన్‌ను పాలించారు. విజయనగర రాజులు వీరికి సమకాలీకులు. క్రీ.శ. 1347లో దౌలతాబాద్ కేంద్రంగా హసన్ గంగూ అనే అబుల్ ముజాఫర్ సుల్తాన్, అల్లా ఉద్దీన్ హసన్ మహ్మద్‌షా బహమనీ పేరుతో సింహాసనాన్ని అధిష్ఠించి బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడినే అల్లా ఉద్దీన్ బహమనీషా అని కూడా పిలుస్తారు. గుల్బర్గా ఇతడి రాజధాని. ఇతడు తన రాజ్యాన్ని బీరార్ నుంచి కృష్ణానది దక్షిణ ప్రాంతం వరకు, తూర్పు దిశలో వరంగల్, తెలంగాణా ప్రాంతాలు, పశ్చిమ తీరంలో గోవా, దభోల్ ఓడరేవు ప్రాంతాల వరకు విస్తరించాడు. ఇతడికి 'సికిందర్ ఇసానీ' అనే బిరుదు ఉంది. అంటే రెండో అలెగ్జాండర్ అని అర్థం. ఇతడు రాజధాని గుల్బర్గాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు. రాజ్యాన్ని గుల్బర్గా, దౌలతాబాద్, బీదర్, బీరార్ అనే నాలుగు తరాఫ్‌లు(రాష్ట్రాలు)గా విభజించి తరాఫ్‌దార్ల (గవర్నర్ల)ను నియమించాడు. అల్లా ఉద్దీన్ బహమనీ షా మలేరియా జ్వరంతో 1358లో మరణించాడు. ఈ వివరాలు బుర్హన్ - ఎ - మసీర్ గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి.

మహ్మద్‌షా (1358-1377)

ఇతడు అల్లా ఉద్దీన్ బహమనీషా పెద్ద కుమారుడు. దక్షిణ హిందూ పాలకులైన ముసునూరి నాయకులు, విజయనగర రాజులతో నిరంతరం యుద్ధాలు చేశాడు. విజయనగర సంగమ వంశరాజు మొదటి బుక్కరాయలతో ముద్గల్ కోట కోసం యుద్ధం చేశాడు. వరంగల్ కాకతీయ నాయకునిపై దాడి చేశాడు. మహ్మద్ షా తన రాజ్యంలో శాంతి భద్రతలు కాపాడాడు. ఎనిమిది మంది మంత్రులున్న సభ ద్వారా పరిపాలన నిర్వహించేవాడు. షేక్ ఉల్ మషాయు జైనుద్దీన్, ఐనుద్దీన్ లాంటి పండితులు ఉండటం వల్ల ఇతడి ఆస్థానం పండిత కేంద్రంగా ఉండేదని 'బహమనీస్ ఆఫ్ దక్కన్' గ్రంథంలో వివరించారు.

రెండో మహ్మద్‌షా (1377-97)

రెండో మహ్మద్‌షా శాంతి కాముకుడిగా పేరు పొందాడు. విద్యాగోష్ఠులు, విద్వాంసులతో ఎక్కువ కాలం గడిపేవాడు. ప్రసిద్ధ పారశీక కవి హాఫీజ్‌ను తన ఆస్థానానికి ఆహ్వానించాడు. హాఫీజ్‌ను ప్రజలు రెండో అరిస్టాటిల్ (గ్రీకు తత్వవేత్త)గా కీర్తించారు. ఇతడి కాలంలోనే రెండో హరిహరరాయలు అంతర్వేది ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అనేక మసీదులు, పేదల వసతి గృహాలు, పాఠశాలలను రెండో మహ్మద్‌షా నిర్మించాడు. గుల్బర్గా, బీదర్, ఎలిచ్‌పూర్, దౌలతాబాద్‌లో అనాథలకు ఉచిత పాఠశాలలు నిర్మించాడు.

బహమనీ రాజ్యంలో 1387-97 ప్రాంతంలో తీవ్ర క్షామం సంభవించింది. పదివేల ఎద్దులను ఉపయోగించి, మాళ్వా, గుజరాత్ నుంచి ఆహార ధాన్యాలను తెప్పించి తక్కువ ధరలకు అమ్మించాడు. కానీ ఈ పథకాలన్నీ మహ్మదీయులకు మాత్రమే పరిమితమైనట్లు తెలుస్తోంది.

గ్లోబల్ వార్మింగ్‌కు కారణమయ్యే వాయువు?



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో కృత్రిమ దారం ఏది?
   1) పాలిస్టర్ 2) నైలాన్ 3) రేయాన్ 4) పైవన్నీ
2. టెర్లిన్‌ను నూలుతో మిశ్రమం చెందిస్తే ఏర్పడేది ఏది?
   1) టెరిసిల్క్ 2) టెరిఊల్ 3) టెరికాట్ 4) టెఫ్లాన్
3. కిందివాటిలో సహజ దారం కానిది?
   1) నూలు 2) సిల్క్ 3) ఉన్ని 4) నైలాన్
4. నేలబొగ్గు, నీరు, గాలి ముఖ్య పదార్థాలుగా ఉపయోగించి రూపొందించే కృత్రిమ దారం ఏది?
   1) అక్రలిక్ 2) నైలాన్ 3) రేయాన్ 4) టెఫ్లాన్
5. నేలబొగ్గు, గాలి, నీరు, నూనె, సున్నపురాయి నుంచి తయారయ్యే కృత్రిమ ఉన్ని?
   1) అక్రలిక్ 2) రేయాన్ 3) నైలాన్ 4) పాలిస్టర్
6. టెర్లిన్‌ను సిల్క్‌తో మిశ్రమం చెందిస్తే ఏర్పడేది?
   1) టెరికాట్ 2) టెరిసిల్క్ 3) టెరిఊల్ 4) నైలాన్
7. సెల్యూలోజ్‌తో తయారు చేసే కృత్రిమ పట్టుదారం ఏది?
   1) నైలాన్ 2) రేయాన్ 3) అక్రలిక్ 4) పాలిస్టర్
8. టెర్లిన్‌కు మరో పేరేమిటి?
   1) పాలిమర్ 2) పాలిస్టర్ 3) అక్రలిక్ 4) టెఫ్లాన్
9. కిందివాటిలో థెర్మోసెట్టింగ్ ప్లాస్టిక్ ఏది?
   1) బేకలైట్ 2) మెలనిన్ 3) టెఫ్లాన్ 4) 1, 2
10. మానవుడు రూపొందించిన మొదటి ప్లాస్టిక్ ఏది?
    1) టెర్లిన్ 2) పార్కెసిన్ 3) రేయాన్ 4) బేకలైట్
11. కృత్రిమ పట్టు అని దేన్ని అంటారు?
    1) రేయాన్ 2) నైలాన్ 3) డెక్రాన్ 4) ఓర్లాన్
12. కృత్రిమ దారాల్లో నీటిని అధికంగా గ్రహించేది ఏది?
    1) నైలాన్ 2) రేయాన్ 3) ఓర్లాన్ 4) డెక్రాన్
13. దుప్పట్లు, తివాచీలు, బ్యాండేజీలను దేనితో తయారు చేస్తారు?
    1) రేయాన్ 2) నైలాన్ 3) పాలిస్టర్ 4) అక్రలిక్
14. స్వెటర్లు, శాలువాలు, క్రీడా దుస్తులను దేనితో తయారు చేస్తారు?
    1) అక్రలిక్ 2) నైలాన్ 3) రేయాన్ 4) పాలిథీన్
15. స్విచ్‌బోర్డులు, స్విచ్‌లు, ప్లగ్‌లను దేనితో తయారు చేస్తారు?
    1) మెలమిన్ 2) బేకలైట్ 3) అక్రలిక్ 4) రేయాన్
16. కంప్యూటర్, టీవీ, ఎలక్ట్రానిక్ పరికరాల పైభాగాల తయారీలో ఉపయోగించేది?
    1) బేకలైట్ 2) మెలమిన్ 3) రేయాన్ 4) నైలాన్
17. కాంతి, మెరుపును కలిగి ఉండి చెమటను శోషణం చేసుకునేది ఏది?
    1) రేయాన్ 2) నైలాన్ 3) అక్రలిక్ 4) పాలిస్టర్
18. పారాచూట్ల తయారీలోనూ, పర్వతారోహణలో ఉపయోగించే దారం ఏది?
    1) నైలాన్ 2) రేయాన్ 3) పాలిస్టైరీన్ 4) అక్రలిక్
19. కిందివాటిలో థర్మోసెట్టింగ్ ప్లాస్టిక్ కానిది?
    1) టప్పర్‌వేర్ 2) బేకలైట్ 3) మెలిమిన్ 4) పాలిథీన్
20. మొదటి మానవ నిర్మిత ప్లాస్టిక్‌ను సృష్టించిన వారెవరు?
    1) అలెగ్జాండర్ పార్క్స్ 2) హెన్రీపెర్కిన్ 3) ఏస్పిడిన్ 4) నీల్స్‌బోర్
21. చీరలు, కార్పెట్లు, ఫిల్మ్‌లు, తీగలు, ప్లాస్టిక్‌ను దేనితో తయారు చేస్తారు?
    1) అక్రలిక్ 2) రేయాన్ 3) పాలిస్టర్ 4) నైలాన్
22. ప్లాస్టిక్ పరిశ్రమ పితామహుడు ఎవరు?
    1) హెండ్రిక్ బేక్‌లాండ్ 2) హెన్రీ పెర్కిన్ 3) నీల్స్‌బోర్ 4) అలెగ్జాండర్ పార్క్స్
23. కిందివాటిలో ఇనుప తీగ కంటే బలమైన కృత్రిమ దారం ఏది?
    1) నైలాన్ 2) రేయాన్ 3) టెర్లిన్ 4) అక్రలిక్
24. 38 శాతం కార్బన్ ఉన్న నేలబొగ్గును ఏమంటారు?
    1) ఆంథ్రసైట్ బొగ్గు 2) లిగ్నైట్ బొగ్గు 3) బిట్యూమినస్ బొగ్గు 4) సెమీబిట్యూమినస్ బొగ్గు
25. కిందివాటిలో శ్రేష్ఠమైన బొగ్గు ఏది?
    1) లిగ్నైట్ 2) ఆంథ్రసైట్ 3) బొట్యూమినస్ 4) ఏదీకాదు
26. ఆమ్ల వర్షాలకు కారణమయ్యే వాయువులేవి?
    1) SO_2, H_2 2) SO_2, N_2 3) SO_2, NO_2 4) CO_2, O_2
27. నేలబొగ్గు నుంచి కోక్‌ను పొందే ప్రక్రియలో ఉత్పత్తి అయ్యేది?
    1) బయోగ్యాస్ 2) గోబర్ గ్యాస్ 3) కోల్ గ్యాస్ 4) వాటర్ గ్యాస్
28. 159 లీటర్ల ఘన పరిమాణాన్ని ఏమంటారు?
    1) క్వింటాల్ 2) మెట్రిక్ టన్ను 3) బ్యారెల్ 4) క్యారెట్స్
29. భూమిలో ఉన్న జీవ పదార్థం నెమ్మదిగా నేల బొగ్గుగా మారే ప్రక్రియను ఏమంటారు?
    1) కార్బొనైజేషన్ 2) ఫాస్ఫారిజన్స్ 3) డెఫకేషన్ 4) కార్బొనేషన్
30. గ్లోబల్ వార్మింగ్‌కు కారణమయ్యే వాయువు?
    1) SO_2 2) NO_2 3) CO_2 4) CO
31. కిందివాటిలో విషపూరిత వాయువు ఏది?
    1) CO_2 2) CO 3) N_2 4) H_2S
32. ఘన స్థితిలో ఉండే శిలాజ ఇంధనాన్ని ఏమంటారు?
    1) సహజ వాయువు 2) నేలబొగ్గు 3) పెట్రోలియం 4) గోబర్ గ్యాస్
33. కిందివాటిలో బొగ్గు ఉత్పన్నం ఏది?
    1) కోల్ 2) కోల్‌తార్ 3) కోల్‌గ్యాస్ 4) పైవన్నీ
34. శ్వాసక్రియకు సంబంధించిన వ్యాధులకు కారణమయ్యే వాయువు ఏది?
    1) NO_2 2) CO_2 3) SO_2 4) H_2
35. ఏ సూక్ష్మ జీవుల మృత అవశేషాల నుంచి పెట్రోలియం తయారవుతుంది?
    1) రైజోబియం 2) ప్లాంక్టన్ 3) ఈస్ట్ 4) హైడ్రా
36. కిందివాటిలో తరగని శక్తి వనరు ఏది?
    1) సౌరశక్తి 2) జలశక్తి 3) అలల శక్తి 4) పైవన్నీ
37. కిందివాటిలో పెట్రో రసాయన ఉత్పన్నం ఏది?
    1) డిటర్జెంట్లు 2) కృత్రిమ దారాలు 3) ప్లాస్టిక్స్ 4) పైవన్నీ
38. 65% కార్బన్ ఉన్న నేలబొగ్గును ఏమంటారు?
    1) ఆంథ్రసైట్ బొగ్గు 2) లిగ్నైట్ బొగ్గు 3) బిట్యూమినస్ బొగ్గు 4) ఏదీకాదు
39. స్టీల్ మిశ్రమ లోహ సంఘటనం?
    1) Fe + Zn 2) Fe + C 3) Zn + Cu 4) Cu + Sn
40. కిందివాటిలో క్షార ఆక్సైడ్ ఏది?
    1) SO_2 2) CO_2 3) NO_2 4) CuO
41. లోహాలపై ఆమ్లాల చర్య వల్ల ఏ వాయువు వెలువడుతుంది?
    1) O_2 2) CO_2 3) H_2 4) SO_2
42. రేకులుగా సాగే పదార్థ ధర్మాన్ని ఏమంటారు?
    1) తాంతవత 2) స్తరణీయత 3) వాహకత 4) సంయోజకత
43. పదార్థాన్ని సన్నని తీగలుగా మార్చగలిగే ధర్మాన్ని ఏమంటారు?
    1) స్తరణీయత 2) వాహకత 3) తాంతవత 4) నిస్సరణం
44. కిందివాటిలో ఆభరణాల తయారీలో ఉపయోగించే లోహం ఏది?
    1) బంగారం 2) వెండి 3) ప్లాటినం 4) పైవన్నీ
45. ద్యుతి గుణం ఉన్న అలోహం ఏది?
    1) బ్రోమిన్ 2) పాదరసం 3) అయోడిన్ 4) కార్బన్
46. థర్మామీటర్‌లో దేన్ని ఉపయోగిస్తారు?
    1) బ్రోమిన్ 2) అయోడిన్ 3) ఫ్లోరిన్ 4) పాదరసం
47. పెన్సిల్ తయారీలో ఉపయోగించేది?
    1) గ్రాఫైట్ 2) జింక్ 3) టంగ్‌స్టన్ 4) లిథియం
48. ఉల్లిపాయలు, వెల్లుల్లుల్లో ఉండే మూలకం ఏది?
    1) పాదరసం 2) ఫాస్పరస్ 3) సల్ఫర్ 4) కార్బన్
49. ద్రవస్థితిలో ఉండే అలోహం ఏది?
    1) పాదరసం 2) బ్రోమిన్ 3) సీజియం 4) గాలియం
50. సోడియం లోహాన్ని ఎందులో నిల్వ చేస్తారు?
    1) నీరు 2) బెంజీన్ 3) CCl_4 4) కిరోసిన్
51. ఫాస్ఫరస్‌ను ఎందులో నిల్వ చేస్తారు?
    1) బెంజీన్ 2) నీరు 3) కిరోసిన్ 4) ఆల్కహాల్
52. అత్యధిక తాంతవత ఉన్న లోహం ఏది?
    1) రాగి 2) వెండి 3) ప్లాటినం 4) బంగారం
53. శుద్ధిచేసిన కార్బన్‌ను ఏవిధంగా ఉపయోగిస్తారు?
    1) నిర్జలీకరణిగా 2) విరంజనకారిగా 3) ఉత్ప్రేరకంగా 4) ఆక్సిడెంట్‌గా
54. కిందివాటిలో గాలిలో చర్య జరపని లోహం ఏది?
    1) బంగారం 2) ప్లాటినం 3) ఇనుము 4) 1, 2
55. కిందివాటిలో తటస్థ ఆక్సైడ్ ఏది?
    1) CO 2) CO_2 3) SO_2 4) N_2O
56. హెమటైట్ ధాతువు ఫార్ములా?
    1) Fe_3O_4 2) Fe_2O_3 3) $CuSO_4$ 4) $MgSO_4$
57. ప్రకాశవంతమైన ఉపరితలం కలిగి ఉండి కాంతిని పరావర్తనం చేసే ధర్మాన్ని ఏమంటారు?
    1) స్తరణీయత 2) తాంతవత 3) ద్యుతి 4) ఏదీకాదు
58. కిందివాటిలో ఆమ్ల ఆక్సైడ్ ఏది?
    1) CuO 2) ZnO 3) SO_2 4) MgO
59. కిందివాటిలో దృఢమైన అలోహం ఏది?
    1) డైమండ్ 2) గ్రాఫైట్ 3) ఫాస్ఫరస్ 4) సల్ఫర్
60. పెట్రోలియం ఆంశిక స్వేదనంలో ఉత్పన్నమయ్యే పదార్థం ఏది?
    1) పెట్రోల్ 2) డీజిల్ 3) కిరోసిన్ 4) పైవన్నీ

సమాధానాలు

1) 4;	2) 3;	3) 4;	4) 2;	5) 1;
6) 2;	7) 2;	8) 2;	9) 4;	10) 2;
11) 1;	12) 2;	13) 1;	14) 1;	15) 2;
16) 2;	17) 1;	18) 1;	19) 4;	20) 1;
21) 3;	22) 1;	23) 2;	24) 2;	25) 2;
26) 3;	27) 3;	28) 2;	29) 1;	30) 3;
31) 2;	32) 2;	33) 4;	34) 3;	35) 2;
36) 4;	37) 4;	38) 3;	39) 2;	40) 4;
41) 3;	42) 2;	43) 3;	44) 4;	45) 3;
46) 4;	47) 1;	48) 3;	49) 2;	50) 4;
51) 2;	52) 4;	53) 2;	54) 4;	55) 1;
56) 2;	57) 3;	58) 3;	59) 1;	60) 4.

విద్య, ఉద్యోగ సమాచారం

డీసీహెచ్ఎస్, ఏలూరు జిల్లాలో 31 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రులకు సంబంధించి ఒప్పంద, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
- **పోస్టుల వివరాలు:** బయో మెడికల్ ఇంజనీర్-01, ఆడి యోమెట్రీషియన్ /ఆడియోమెట్రిక్ టెక్నీషియన్-05, రేడియోగ్రాఫర్-03, ల్యాబ్ టెక్నీషియన్-01 , థియేటర్ అసిస్టెంట్-04, ఆఫీస్ సబార్డినేట్-01, జనరల్ డ్యూటీ అటెండెంట్స్-11, ప్లంబర్-02, పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్-03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ, ఎంఎల్‌టీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత కోర్సు సర్టిఫికేట్ ఉండాలి.
- **వయసు:** 01.01.2025 నాటికి 42 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు బయో మెడికల్ ఇంజనీరింగ్‌కు రూ.54,060, ఆడియో మెట్రీషియన్, ల్యాబ్ టెక్నీషియన్‌లకు రూ.32,670, రేడియోగ్రాఫర్‌కు రూ.35,570, ఇతర పోస్టులకు రూ.15,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ క్యాంపస్, ఏలూరు డీసీహెచ్ఎస్ ఆఫీస్‌కు స్వయంగా వెళ్లి సమర్పించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 19.04.2025.
- **వెబ్‌సైట్:** https://westgodavari.ap.gov.in/

నిట్ తిరుచిరాపల్లిలో ప్రొఫెసర్ పోస్టులు

తమిళనాడులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుచిరాపల్లి(నిట్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్(గ్రేడ్ 2), అసిస్టెంట్ ప్రొఫెసర్(గ్రేడ్ 1), అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.04.2025.
- **వెబ్‌సైట్:** https://nitt.edu/

తెలుగులో వైజయంతీ విలాసం రాసింది ఎవరు?

కుతుబ్‌షాహీల యుగ విశేషాలు

భాషా సాహిత్యాలు

మహమ్మద్ కులీ కుతుబ్‌షా

ఇబ్రహీం కుతుబ్‌షా తర్వాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడి తల్లి భగీరథి. మహమ్మద్ కులీ తన ప్రేయసి అయిన భాగమతి పేరుమీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. చార్మినార్ లాంటి అనేక కట్టడాలను నిర్మించాడు. ఇతడు మీర్జా మహమ్మద్ అమీన్, ముల్లా మూమిన్, మిసాక్ సుబాజ్ వలి అనే పార్సీ కవులను ఆదరించాడు. వజాహి, గవాస్సీ అనే ప్రముఖ ఉర్దూ కవులకు ఆశ్రయమిచ్చాడు. మహమ్మద్ కులీ స్వయంగా కవి, గ్రంథకర్త. ఫారసీ కవితా సంకలన కర్తయిన అలామ మీర్ మోమిన్ ఇతడి కాలంలో పీష్వా పదవిని అలంకరించాడు. పటమట సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సారంగు తమ్మయ్య, కామారెడ్డిలను కులీ సన్మానించాడు. ఇతడి ఆస్థానంలో గణేశ పండితుడు కూడా ఉండేవాడు.

ఉర్దూ కవుల్లో కులీ ప్రథముడు కాకపోయినా ఆ భాషలోని రచనలు ఒక సంపుటంగా పుస్తక రూపంలో వెలువడటం ఈయనతోనే మొదలైంది. మహమ్మద్ కులీ తొలి ఉర్దూ రాజ కవి. ఇతడు పార్సీ, తెలుగు భాషల్లోనూ కవిత్వం రాశాడని భావిస్తారు. కానీ అవి అలభ్యం. మహమ్మద్ కులీ కవితల సంకలనాన్ని అతడి అల్లుడైన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా 'దివాన్' పేరుతో వెలువరించాడు. ఇతడి కవిత్వం పర్షియన్, భారతీయ సంస్కృతుల సమ్మేళనం. కులీ కవితల్లో తెలుగు పదాలు, ఆచార వ్యవహారాలు, హోళీ, బతుకమ్మ పండుగల ప్రస్తావన ఉంది. అప్పటి వరకూ మత సంబంధంగా ఉన్న ఉర్దూ కవిత్వంలో లౌకిక భావనను ప్రవేశపెట్టిన కవుల్లో కులీ ప్రథముడు. నాటి తెలుగు, ఉర్దూ కవిత్వాల తరహాలోనే ఇతడిది ప్రధానంగా శృంగార కవిత్వం.

సారంగు తమ్మయ్య

తమ్మయ కులీ కుతుబ్‌షాకు ఆప్తుడు. గోల్కొండకు కరణీకం చేసేవాడు. అనేక కావ్యాలను రచించాడు. హరిభక్తి సుధోదయం అనే గ్రంథానికి తమ్మయ్య రాసిన వ్యాఖ్యానంలో భగీరథ పట్టణ ప్రస్తావన ఉంది. ఈ పట్టణమే భాగ్యనగరం (హైదరాబాద్). తమ్మయ్య ముఖ్య రచన 'వైజయంతీ విలాసం'. తెలుగులో వెలువడిన గొప్ప శృంగార కావ్యాల్లో ఇదొకటి. ఇందులో భక్తిని, శృంగారాన్ని మేళవించారు.



నేబతి కృష్ణమంత్రి మహమ్మద్ కులీ ఆస్థాన కవి. కులీకి మంచి స్నేహితుడైన ఇతడు మంత్రిగానూ వ్యవహరించాడు. ఇతడు రాజనీతి రత్నాకరం అనే గ్రంథాన్ని రాశాడు. నాటి రాజకీయ పరిస్థితులు, సాహిత్యం తదితర విషయాల గురించి ఈ గ్రంథం తెలియజేస్తోంది.

దోమకొండ సంస్థానం

దోమకొండ (బిక్కనవోలు, నిజామాబాద్ జిల్లా) సంస్థానాన్ని తెలంగాణలో తొలి సంస్థానంగా భావించవచ్చు. ఈ సంస్థాన మూల పురుషుడు కాచారెడ్డి (1415–35). ఇతడి మునిమనవడైన ఒకటో ఎల్లారెడ్డి (1500–25) కాలం నుంచి ఈ సంస్థానం సాహిత్యాన్ని పోషించింది. బాలభారతం, కిరాతార్జునీయం అనే గ్రంథాలను ఎల్లారెడ్డి అంకితం తీసుకున్నాడు. అనేక మంది కవిపండితుల్ని పోషించాడు. ప్రస్తుతం వారి కావ్యాలేవి లభించడం లేదు. జంగమరెడ్డి, రెండో కామిరెడ్డి, రెండో ఎల్లారెడ్డి, రెండో మల్లారెడ్డి అనే నలుగురు ఇతడి మనవళ్లు. చివరి ముగ్గురు కృతిభర్తలు, కృతికర్తలు. ఈ ముగ్గురూ 16 శతాబ్దం ఉత్తరార్ధానికి చెందిన వారు.

కామిరెడ్డి(1530–1600) తన సహాధ్యాయి అయిన పటమట సోమనాథ సోమయాజిని ఆస్థాన కవిగా నియమించాడు. సోమయాజి 'సూత సంహిత'ను అనువదించి కామిరెడ్డికి అంకితమిచ్చాడు. బ్రహ్మోత్తర ఖండాన్ని కామిరెడ్డి సోదరుడైన రెండో ఎల్లారెడ్డికి అంకితమిచ్చాడు. సోమయాజి గ్రంథాల ద్వారా దోమకొండ సంస్థాన విషయాలు తెలుస్తున్నాయి. రెండో ఎల్లారెడ్డి కృతికర్త కూడా. ఆయన వాసిష్ఠం, లింగపురాణం రచించాడు. కానీ అవి అలభ్యం. కామిరెడ్డి చివరి తమ్ముడైన రెండో మల్లారెడ్డి రాజకవి మల్లారెడ్డిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు ఎన్నో గ్రంథాలు రచించాడు. కానీ ఆయన రాసిన షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం అనే గ్రంథాలు మాత్రమే లభిస్తున్నాయి.

ఉర్దూ భాషకు స్వర్ణయుగం..

పైడిమర్రి వెంకటపతి (1570–1640) అనే కవి కులీకుతుబ్‌షా కాలానికి చెందినవాడు. ఇతడు హైదరాబాద్, బీదర్ పరిసర ప్రాంతాల్లో నివసించాడు. బ్రౌన్, బహుజనపల్లి లాంటి వాళ్లు ఈ కవిని ప్రామాణికుడిగా భావించారు. స్కంధపురాణంలోని 11 శ్లోకాల కథను తనదైన శైలిలో వర్ణించాడు. దీన్ని 'చంద్రాంగద చరిత్ర' అనే రసవత్ప్రబంధంగా మలిచాడు. తన పూర్వీకుల మాదిరిగానే మహమ్మద్ కులీ కుతుబ్‌షా కూడా కవి పండితులను పోషించాడు. ఇతడి ఆస్థాన కవి మీర్ మోమెన్. సయ్యద్ మీర్ కుతుబుద్దీన్, సయ్యద్ కమాలుద్దీన్, మాజ్ సదరానీ తదితర పండితులు ఇతడి ఆస్థానంలో ఉండేవారు.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తర్వాత సుల్తాన్ అబ్దుల్లా కులీ కుతుబ్‌షా రాజయ్యాడు. ఇతడు సంస్కృత 'శుకసప్తతి'ని తోతినామా పేరుతో పార్సీ భాషలోకి అనువాదం చేయించాడు. దాన్నే 'సబ్‌రస్' (కామరూప కళాకథలు) పేరుతో ఉర్దూలోకి అనువదింపజేశాడు. ఇతడు ఉర్దూ భాషకు చాలా సేవ చేశాడు. ఇతడి పాలనా కాలం ఉర్దూ భాషకు స్వర్ణయుగం. ఇతడు కవిపండిత పోషకుడే కాకుండా స్వయంగా కవి. అబ్దుల్లా పేరుతో కవితలు వెలువరించాడు. ఇతడి ఆస్థానంలో అలామీ మీర్ మజీదుద్దీన్, మౌలానా రౌనఖీ మొదలైన ఎనిమిది మంది కవి పండితులుండేవారు. గవాసీ ఇబిన్ నిషాత్ లాంటి గొప్పకవులను ఇతడు ఆదరించాడు. గవాసి 'తోతినామా' అనే కథలు రాశాడు. తబీయ అనే కవి బహురావగుల్ అనే మనోరంజకమైన కథను రాశాడు. అబ్దుల్లా కులీ కుతుబ్‌షా ఆస్థానంలో తులసీమూర్తి లాంటి తెలుగు కవులు కూడా ఉండేవారు. క్షేత్రయ్య ఈ రాజును దర్శించాడు. అబ్దుల్లా పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు.

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

హరివాసర మహాత్మ్యం రాసిన మరింగంటి వెంకట (ప్రథమ) నరసింహాచార్యులు, శశిబిందు చరిత్రం రచయిత చరిగొండ నరసింహకవి, కూర్మ పురాణాన్ని రచించిన రాజలింగ కవి ఈ కాలానికి చెందినవారే. బమ్మెర కేసకవి – మల్లకవి, వజ్రాభ్యుదయాన్ని రాసిన కోననారాయణ, రాజేశ్వర విలాసం రచయిత పిల్లలమర్రి వెంకటపతి, చెన్నబసవ పురాణాన్ని రచించిన గోపతి లింగకవి తదితరులు కూడా ఈ కాలానికి చెందినవారే. ఓరుగల్లుకు చెందిన కాసెసర్వప్ప (1600) ఏకామ్రనాథుడి 'ప్రతాపరుద్ర చరిత్ర'ను అనుసరించి ద్విపదలో 'సిద్దేశ్వర చరిత్ర' రాశాడు. ఈ గ్రంథాన్ని వ్యవహారిక భాషలో రచించాడు.

ఎలకూచి బాలసరస్వతి

తెలంగాణ కుతుబ్‌షాహీల పాలనలో ఉన్నప్పటికీ సరిహద్దు ప్రాంతాలు ఇతర రాజుల చేతులు మారుతూ వచ్చాయి. సురభి మాధవరాయలు విజయనగర అళియరాయల నుంచి జటప్రోలును(కొల్లాపూర్) కానుకగా పొందాడు. తర్వాత అతడి కుమారులు అబ్దుల్లా కుతుబ్‌షా నుంచి సనదు రూపంలో జటప్రోలు సంస్థానాన్ని పొందారు. రేచర్ల పద్మనాయకులైన వీరికి సురభి వంశనామమైంది. ఈ వంశానికి చెందిన సురభి మాధవరాయలు(1620–70) చంద్రికా పరిణయమనే ప్రౌఢ కావ్యాన్ని రచించాడు. సురభి మాధవరాయల ఆస్థానకవి ఎలకూచి బాలసరస్వతి (1570–1650). ఆంధ్రశబ్ద చింతామణి ద్వారా ఇతడి పేరు చర్చనీయాంశమైంది. సంస్కృతంలో రాసిన ఈ తొలి తెలుగు వ్యాకరణ గ్రంథం నన్నయ రచనా? కాదా? బాలసరస్వతే రాసి నన్నయ పేరు పెట్టాడా? అనే విషయాలు చర్చనీయమయ్యాయి. మాధవరాయలతోపాటు ఇతడు కూడా 'చంద్రికా పరిణయం' రాశాడు. కానీ ఈ రెండింటిలో వేర్వేరు కథలున్నాయి. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువదించాడు. మాధవరాయల తండ్రయిన మల్లభూపాలుడికి సుభాషిత రత్నావళిని అంకితం చేశాడు. ఇది తొలి అనువాదం. 'యాదవ రాఘవ పాండవీయం' అనే త్ర్యర్థి కావ్యంతో పాటు మొత్తం పది గ్రంథాలను ఇతడు రచించాడు. ఇతడి గ్రంథాల వల్ల జటప్రోలు, పర్తియాల (జూపల్లి వారు) సంస్థానాల విశేషాలు తెలుస్తున్నాయి.

బాలసరస్వతి ఆంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్య రాసిన కొద్ది కాలానికే కాకునూరి అప్పకవి అదే గ్రంథానికి భాష్యం లాంటి ప్రసిద్ధమైన అప్పకవీయం రాశాడు. అప్పకవి తెలంగాణ వాడేనని బూర్గుల రామకృష్ణారావు నిరూపించారు. అప్పకవీయం లక్షణ గ్రంథమైనా, సందర్భాన్ని బట్టి 'నిజదేశంబుల వేషభాషలపయిన్ని త్యాభిమానస్థులై ప్రజమెచ్చన్' అని ప్రాంతాభిమానాన్ని చాటాడు. సాధ్వీజనధర్మం (ద్విపదకావ్యం), అనంత వ్రతకల్పం(కావ్యం), శ్రీశైలమల్లికార్జునుడి మీద శతకం, అంబికావాదం (యక్షగానం), కవి కల్పకం (లక్షణ గ్రంథం) మొదలైన ఇతర గ్రంథాలు కూడా అప్పకవి రచించాడు. కానీ ఇవి లభ్యం కావడం లేదు.

దేవరకొండ పాలకుడైన పానుగోటి జగన్నాథ రాయలు 'కుముదవల్లీ విలాసం' రచించాడు. ఇందులోని ఇతివృత్తం భక్తరామదాసు జీవితానికి దగ్గరగా ఉంటుంది.

కుతుబ్‌షాహి వంశంలో చివరి రాజులైన అబ్దుల్లా కుతుబ్‌షా (1626–72), అబ్దుల్ హసన్ తానీషా (1672–87) వద్ద అక్కన్న, మాదన్న అధికారులుగా పనిచేశారు. వారి మేనల్లుడైన కంచర్ల గోపన్న (భక్తరామదాసు) భద్రాచలం తహశీల్దార్ అయ్యాడు. తొలి సంకీర్తనాచార్యుల్లో ఒకడిగా రామదాసు ప్రసిద్ధి చెందాడు. ఇతడి జీవితం గురించి యక్షగానం వచ్చింది. దీన్ని బట్టి రామదాసు ఎంత గొప్పవాడో అర్థమవుతుంది. ఇతడి కీర్తనల్లో పాండిత్య ప్రకర్ష ఉండదు. అవి ఆర్తితో, సహజభక్తి భావావేశంతో అప్రయత్నంగా వచ్చాయి. దేశీయ గేయ రీతులను పుణికి పుచ్చుకున్నాయి. ఇతడు రాసిన 'దాశరథి శతకం' కూడా ప్రసిద్ధి చెందింది. భక్తరామదాసు పేరు వినగానే అబుల్ హసన్ తానీషా పేరు స్ఫురిస్తుంది. రామదాసును జైల్లో పెట్టిన నిర్దయుడిగానే ఇతడి గురించి తెలుసు. కానీ ఇతడు రసహృదయం ఉన్న కవి. ఇతడు పార్సీ, తెలుగు, మరాఠీ భాషల్లో కవిత్వం చెప్పేవాడు. తానీషా ఆస్థానంలో లతీఫ్, షాహినూరి, మీర్జాగులాం అలీ లాంటి ప్రసిద్ధ కవులుండేవారు. ఇతడి కాలంలో వజ్జి, గవాసీ తదితర ఉర్దూ కవులు తమ కవిత్వం ద్వారా ఉర్దూ భాషాభివృద్ధికి తోడ్పడ్డారు. ఉర్దూ రాజభాషగా పరిణతి చెందింది. అక్కన్న, మాదన్న, లింగన్నలకు ముఖ్య పదవులిచ్చాడు. పరమత సహనం చూపి ఉదార స్వభావిగా పేరొందాడు.

అష్టదిగ్గజాల్లో ఒకడైన తెనాలి రామలింగడు (కృష్ణుడు) కాకుండా మరో తెనాలి రామలింగకవి (1666–86) ఉన్నాడు. విశ్వ బ్రాహ్మణుడైన ఇతడు అక్కన్న, మాదన్నల వద్ద ఆశ్రయం పొందాడు. ఇతడు ధీరజనమనో విరాజితం (పరిమళ చోళచరిత్ర) అనే కావ్యాన్ని రాశాడు. విశ్వ బ్రాహ్మణులకు జరిగిన అన్యాయాలే ఈ ప్రబంధంలోని కథావస్తువు.

ఇతర కవులు..

పెన్గలూరి వెంకటాద్రి రామోదాహరణం, భువన మోహినీ విలాసం అనే గ్రంథాలను రచించాడు. పదిహేడో శతాబ్దికి చెందిన విశ్వనాథయ్య సిద్దేశ్వర పురాణం అనే ద్విపద రాశాడు. అన్నంభట్టు తర్క సంగ్రహాన్ని, కర్పూరం కృష్ణమాచార్యులు భగవద్గీత ద్విపదను రచించారు. అత్తాను రామానుజాచార్యుడు శ్రీ రుక్మిణీకురవంజి అనే గ్రంథాన్ని రాయగా, పూదూరి కృష్ణయామాత్యుడు భగవద్గీత యథాశ్లోకానువాదం చేశాడు. శ్రీనాథుని వెంకటరామయ్య అశ్వరాయ చరిత్ర రాశాడు. అన్నమయ్య తర్వాత ఎక్కువ కీర్తనలు (3476) రాసిన ముష్టిపల్లి వేంకటభూపాలుడు ఈ కాలానికి చెందినవాడే. లక్ష్మీ శకవి, కాంద్రవేటి రామానుజాచార్యులు, ఎడపాటి ఎర్రన, సింహాద్రి వెంకటాచార్యులు, మరింగంటి వేంకట (ద్వితీయ) నరసింహాచార్యులు (1650–1720), సురభి నర్సింగరావు, బోరవెల్లి కృష్ణప్ప కూడా ఈ కాలానికి చెందిన కవులే. వీరే కాకుండా కుతుబ్‌షాహీల కాలానికి చెందిన ఎంతో మంది కవులు తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు

A domain name ending with "org" is

Bank Exams

COMPUTER AWARENESS

1. What is the shortcut key to show font dialog box in MS Word?
   a) Ctrl + D
   b) Ctrl + Shift + F
   c) Ctrl + Shift + P
   d) All of the above
   e) None of the above
2. How to remove all character formats in MS Word?
   a) Shift + Spacebar
   b) Shift + Enter
   c) Ctrl + Spacebar
   d) Ctrl + Enter
   e) None of the above
3. A(n) ______ is a private corporate network, used exclusively by company employees.
   a) Internet
   b) Local area network
   c) Peer-to-peer
   d) Intranet e) Ethernet
4. When you save a file as a Web page, Word converts the contents of the document into ______.
   a) Java b) Perl
   c) HTML d) Unix
   e) Linux
5. By default, Word automatically formats each heading in a table of contents as _______
   a) Bookmarks
   b) Cross -references
   c) Hyperlinks d) word-fields
   e) HTML rags
6. LAN is an abbreviation for?
   a) Large Access Network
   b) Local Access Network
   c) Large Area Network
   d) Local Area Network
   e) None of the above
7. Which of the following hardware components is the most important to the operation of a database management system?
   a) High-resolution video display
   b) Printer
   c) High speed, large-capacity disk
   d) Plotter
   e) Mouse
8. If you want to group the records in the abc database, you could use the Job code as the _____.
   a) Delete b) Update
   c) Sort Key d) Index
   e) Insert
9. Frames from one LAN can be transmitted to another LAN via the device:
   a) Router b) Bridge
   c) Repeater d) Modem
   e) NetWare
10. How many bits internet address is assigned to each host on a TCP /IP internet which is used in all communications with the host?
    a) 16 - bits b) 32 - bits
    c) 48 - bits d) 64 - bits
    e) None of the above
11. When a hyperlink is created, Word formats the Web address as:
    a) Italicized and coloured red
    b) Italicized and coloured blue
    c) Underlined and coloured red
    d) Underlined and coloured blue
    e) a and b
12. To select a block of text, click at the beginning of the selection, scroll to the end of the selection, position the mouse pointer at the end of the selection, hold down the _____ key, and then click (or drag through the text).
    a) Ctrl b) Alt
    c) Shift d) Tab
    e) None of the above
13. With the _____, Word notifies that a smart tag is available by displaying a smart tag indicator on the screen.
    a) Auto Correct Options and Paste Options
    b) Smart Tag Actions and Copy Actions
    c) Auto Correct Options and Smart Tag Actions
    d) Paste Options and Copy Actions
    e) All the above
14. When the same word is used in multiple locations or a word is used that was not quite appropriate, a thesaurus can be used to look up a (n) _____ or a word similar in meaning.
    a) synonym b) homonym
    c) antonym d) metonym
    e) pynonym
15. Which of the following option in File pull down menu is used to close a MS Word document?
    a) Quit b) Close
    c) Exit d) New
    e) Insert



16. _____ shares characteristics with both hardware and software.
    a) Operating system
    b) Software c) Data
    d) File e) Hard ware
17. Recently deleted files are stored in
    a) Recycle Bin
    b) Desktop
    c) Taskbar
    d) My computer
    e) Documents
18. Which is not a system tool?
    a) Folder b) Backup
    c) Scandisk d) Format
    e) Edge
19. Virtual stores for B2C electronic commerce are also known as:
    a) Auctions
    b) Houses
    c) Web storefronts
    d) Internet buyers
    e) None of the above
20. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction.
    a) B2C b) C2C
    c) G2C d) B2B
    e) B2P
21. This type of electronic commerce involves the sale of a product or service to the general public.
    a) B2C b) B2P
    c) C2C d) B2B
    e) G2C
22. Buying and selling goods over the Internet is called _______
    a) hyper-marketing
    b) cyber-selling
    c) e-commerce
    d) euro-conversion
    e) All of the above
23. Before you submit a contribution to a discussion group, you should first ___
    a) lurk b) signal
    c) queue d) ping
    e) router
24. A popular chat service is called
    a) IM-Chat b) UseNet Chat
    c) Internet Protocol Chat
    d) Internet Relay Chat
    e) None of the above
25. What is the shortcut key to Close Active Document in Microsoft Word?
    a) Ctrl + F4
    b) Shift + F4
    c) Ctrl + Shift + F4
    d) Ctrl + Alt + F4
    e) None of the above
26. Which of the following is not the layer of TCP/IP protocol?
    a) Application Layer
    b) Session Layer
    c) Transport Layer
    d) Internetwork layer
    e) Mac layer
27. What is the name given to the temporary storage area that a web browser uses to store pages and graphics that it has recently opened?
    a) Niche b) Cellar
    c) Webspace d) Cache
    e) Junk
28. IP address is currently
    a) 4 bytes long
    b) available in plenty
    c) 6 bytes long
    d) not assigned as it is all used up
    e) any long
29. A computer on the Internet that hosts data, that can be accessed by web browsers using HTTP is known as:
    a) Web Rack b) Web Space
    c) Web Server
    d) Web Computer
    e) Web client
30. Linux is
    a) A Web Browser
    b) A Web Server
    c) An Operating System
    d) An nonprofit organization
    e) Web site
31. Microsoft Windows is
    a) A Web Browser
    b) A Web Server
    c) An Operating System
    d) A Spreadsheet Package
    e) Package
32. A domain name ending with "org" is
    a) An organization
    b) A commercial website
    c) A network site
    d) A site which has very high traffic
    e) None of the above
33. At which of the following sites would you most probably buy books?
    a) www.hotmail.com
    b) www.amazon.com
    c) www.sun.com
    d) www.msn.com
    e) All of the above
34. Internet requires
    a) An international agreement to connect computers
    b) A local area network
    c) A commonly agreed set of rules to communicate between computers
    d) A world wide web
    e) A LAN
35. The maximum size of a write file is limited to only
    a) Name of the file
    b) Extension of the file
    c) The amount of memory in your computer
    d) All of the above
    e) None of the above
36. Each computer connected to the internet must
    a) be an IBM PC
    b) have a unique IP address
    c) be internet compatible
    d) have a modem connection
    e) be system PC
37. In normal view, automatic page breaks _____.
    a) do not display
    b) display on the screen as a single dotted horizontal line
    c) display on the screen above the header and beneath the footer
    d) display on the screen as a line separated by the words Page Break
    e) display on the screen as a double dotted horizontal line
38. Although it is not shown in normal view, to view a header, click _____ on the menu bar and then click Header and Footer.
    a) View b) Edit
    c) Format d) Tools
    e) References

Answers

1) d; 2) c; 3) d; 4) c; 5) c; 6) d; 7) c; 8) c; 9) b; 10) b; 11) d; 12) a; 13) d; 14) a; 15) b; 16) a; 17) a; 18) a; 19) c; 20) b; 21) a; 22) c; 23) a; 24) d; 25) a; 26) b; 27) d; 28) a; 29) c; 30) c; 31) c; 32) a; 33) b; 34) c; 35) c; 36) b; 37) c; 38) c.